# ద్వాదశాదిత్యులు

(నన్నయ - తిక్కన - సోమన - పోతనలు)

1

భాగము

ప్రణేత

కావ్య స్వరూప సారజ్ఞ - సారప్రకాశ నాభిజ్ఞ

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.

www.advaitavedanta.in

# ద్వాదశాదిత్యులు

(నన్నయ - తిక్కన - సోమన - పోతనలు)

## మొదటి భాగము

ప్రణేత

కావ్య స్వరూప సారజ్ఞ - సారప్రకాశ నాభిజ్ఞ

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావ్వు, M.A.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

| | | |
|---|---|---|
| గ్రంథ నామము | : | ద్వాదశాదిత్యులు |
| ప్రణేత | : | యల్లంరాజు శ్రీనివాసరావు |
| ముద్రణము | : | ప్రథమము |
| ముద్రణ కాలము | : | సర్వధారి - కార్తిక మాసము<br>నవంబరు - 2008 |
| గ్రంథ మూల్యము | : | |
| ప్రతులు | : | 500 |
| డి.టి.పి. | : | రితిక్ ఇమేజస్<br>విజయవాడ - 520 002 |
| ముద్రాపకులు | : | శ్రీ పరమేశ్వరి ప్రెస్<br>విజయవాడ - 2 |
| ప్రాప్తి స్థానము | : | యల్లంరాజు శ్రీనివాసరావు<br>F1, వేంకటసాయి టవర్సు,<br>పాపరాజు వీధి, సత్యనారాయణపురం<br>విజయవాడ - 520 011 |



Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# విషయ సంగ్రహము

1. స్వాగతము .................................................. 4

2. నన్నయ కథా కథనము .................................. 13

3. తిక్కన రసాభ్యుదయము ................................ 77

4. నాచన సోముని నవీన గుణము ........................ 147

5. పోతనామాత్యుని సహజ పాండిత్యము ............... 213

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# అంకితము



పిచ్చయ్యగారు

నిచ్చలు కావ్యజాత కమనీయ కథారస పాత్ర భావనా
భ్యుచ్చయ శోభితం బయిన యుల్లము - ధర్మ పధానుగామియౌ
సచ్చరితంబు - సౌమ్య మృదు సాంత్వన భాషణ భూషణంబులౌ
పిచ్చయగారి కీ కృతిని ప్రీతిగ నిచ్చెద మామగారికిన్

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# స్వాగతము

మన తెనుగు కవులూ - వారి కవితా శిల్పమూ - అనే అంశాన్ని గూర్చి తల స్పర్శిగా చర్చించి దాని సారాన్ని రసజ్ఞులోకాని కందివ్వాలని నాకు మొదటి నుంచీ ఒక పెద్ద కుతూహలం. మొదటి నుంచీ అంటే ఎప్పటి నుంచి అనుకొన్నారు. నేను తెలుగులో M.A. పట్టం పుచ్చుకొని తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నప్పటి నుంచీ. అంటే ఏమన్న మాట. ఇప్పటికి 58 సంవత్సరాల నుంచీ అనుకోండి. అయితే ఇంతకాల మెందుకు తాత్సారం చేశారని మీరడగవచ్చు. కాగితం మీద పెట్టటం కన్నా కాగితాలు తిరగేయటానికే అలవాటు పడి కొంత కాలమూ - అప్పుడప్పుడా కవినీ ఈ కవినీ గూర్చి కొన్ని మంచి విషయాలు చెదరు మదరుగా వ్రాసి అవే నలుగురికీ వినిపిస్తూ కొంత కాలమూ - గడుపుతూ వచ్చాను.

తీరా వారి కావ్యాల మీద ఒక సింహావలోకనం చేద్దామని పట్టు పట్టేసరి కదే మున్నదిది చూడమని అద్వైత వేదాంత శాస్త్ర మొకటి నాదారి కడ్డంగా వచ్చి నిలుచుంది. సబ్రహ్మ విద్యాం సర్వ విద్యా ప్రతిష్ఠామని ముండకోపనిషత్తు వర్ణించినట్టు ఇది గదా అసలు విద్య అంటే - దీనిలోనే అన్ని విద్యలూ కలిసి వస్తాయి గదా - దీన్ని మించిన దేముందని - ఆ మహాసాగరంలో ఈదటంతోనే సరిపోయిందింత కాలమూ.

అప్పటికీ తనివి తీరక తత్త్వసాహిత్యమనే పేరుతో కొన్ని గ్రంథాలూ - సాహిత్య తత్త్వమనే పేర కొన్ని గ్రంథాలూ వ్రాసి అడపా దడపా ప్రచురిస్తూ వచ్చాను. భారత భాగవత రామాయణాదులను తాత్త్విక దృష్టితో ఎంతగానో మథించి వాటి తాత్పర్యం బయట పెట్టాను. మరి కాళిదాస ప్రత్యభిజ్ఞ అనే మిషతో ఆ మహాకవి కవితా హృదయమంతా బాగా లోతుకు దిగి గాలించి సహృదయుల కందించాను. అక్కడికీ తృప్తి లేక అక్కడక్కడా

ఇచ్చిన ఉపన్యాసాలలో ఆకాశవాణీ ప్రసంగాలలో దొరలిన కావ్య విమర్శలను కొన్నింటిని జత చేసి చిత్ర తరంగిణి అని పేరు పెట్టి ఒక చిత్రమైన గ్రంథాన్ని కూడా వెలువరించాను. అది గాక విచిత్ర తరంగిణి అనే పేర మరొక గ్రంథం కూడా వ్రాసి ప్రకటించాను. అందులో కవితా స్వరూపమేమిటో ఇంకా గొప్పగా చెప్పటం జరిగింది.

అయినా ఇవన్నీ ఏదో నోటి తుత్తర కొద్దీ చేసిన అల్పాహారమే గాని కడుపునిండా చేసే విందు భోజనం కాదు. అది సమకూర్చాలనే సంకల్పమెంతైనా ఉంది నాకిప్పటికీ. అయితే వచ్చిన ఇబ్బంది ఏమంటే వేదాంత విజ్ఞాన మడుగడుగునా నన్ను ఏమి చేస్తావులే పొమ్మని వెనక్కు లాగుతున్నది. నన్ను సాధించి నీ జీవితం కడతేర్చుకో – మరేదీ నీ సమస్యకు పరిష్కారం కాదని బెదిరిస్తున్నది. నిజమే. దాని మాట ఆఖరి మాటే. సందేహం లేదనుకోండి. అది నేనెప్పుడూ విస్మరించను. విస్మరించలేను జీవితంలో. నేనే కాదు. ఆ మాటకు వస్తే మానవజన్మ ఎత్తిన ఎవడూ కూడా ఏమరగూడదని నా అభిప్రాయం.

పోతే దాన్ని విస్మరించ కుండా దృష్టిలో ఉంచుకొనే చిరసంచితమైన నా సాహిత్య వాసనకు కూడా బహిర్గత మయ్యే అవకాశం కొంత ఇవ్వాలనిపించి ప్రస్తుత మీ పుస్తక మొక కానుకగా మీ బోటి సహృదయులకు సమర్పించదలచాను. అసలద్వైత మనగానే మన ములిక్కిపడ నక్కరలేదు. అది ఏ విద్యకు గాని కళకు గాని శత్రువు గాదు. మీదు మిక్కిలి అన్ని విద్యలనూ కళలనూ ఆఖరుకు మొత్తం మా నవజీవితాన్నే తనలో కలుపుకొని జీర్ణం చేసుకోగల ఒక మహా విజ్ఞాన సాగరం. కనుక ఋషితుల్యులైన మహాకవుల కవితా శిల్పాన్ని చక్కగా సమీక్షించి దాని అందచందాలను రసజ్ఞ లోకాని కందివ్వటంలో తప్పు లేదు. అపకారకం కాదది. పైగా ఉపకారకమే. ధ్వన్యాలోక కారుడానంద వర్ధనాచార్యుడి లాంటి శివాద్వైతే అన్నాడు **'వినేయ జన హితార్థ మేవ నాటకాది గోష్ఠీ లోకే మునిభిరవ తారితా'** అని. లోకులందరూ తగిన శిక్షణ పొంది మంచి మార్గంలో

నడవటానికే భరతాది మహర్షులు నాటకాది కళల నన్నింటినీ లోకంలో అవతరింప జేశారట. అలాంటప్పుడిదంతా అనాత్మ ప్రపంచం పనికిరాదని త్రోసి పుచ్చటం దేనికి.

అసలా మాటకు వస్తే ఆత్మ చైతన్యమే నానా ముఖాలుగా విస్తరించి ఇన్ని అవతారాలు ధరించి మనకు కనిపిస్తున్నది. ఆ దృష్టితో చూస్తే అంతా బంగారమే. సహృదయులైన వారిలా భావన చేసి సద్యః పరనిర్వృతి నందుకోటానికే శాస్త్రంలాగా సాక్షాత్తుగా కాకపోయినా - కావ్యంలాగా పరోక్షంగా సాధన మవుతున్నదని తేల్చి చెప్పారు. అభిజ్ఞులైన పెద్దలందరూ చేస్తూ వచ్చిన గొప్ప పరిష్కారమిది. వారి దృష్టికి సృష్టి అంతా ఒక మహాకావ్యం. దీన్ని రచించిన మహాకవి ఎవరో గాదు. ఆ పరమాత్మే. ఎందుకు రచించాడిది. ఏమిటి దీని ప్రయోజనమని అడుగుతారా. **'తదస్యరూపం ప్రతిచక్షణాయ'** అని ఉపనిషత్తు చెప్పినట్టు దీని ద్వారా మరలా మనమా పరతత్త్వాన్ని అందుకోటానికే. ఆ నౌక అక్కడి నుంచి ఇక్కడి కెందుకు రావటమంటే ఇక్కడ ఉన్న సాంయాత్రికుల నాతీరం చేరవేయటాని కంటే ఎలా ఉంటుంది. అలాగే ఇదీ.

ఇదంతా క్లుప్తంగా మూడు ముక్కల్లో బోధించారు మన ప్రాచీనులు. సత్యం శివం సుందర మనేవే ఆ మూడూ. ఇవి మూడూ మొదట వేదాంతరంగానికి వర్తించే తరువాత సాహిత్య రంగానికీ వర్తిస్తాయి. ఇందులో సత్యమనేది చెప్పదలచిన విషయం. అది కవి మనసులో సంకల్ప రూపంగా ఉదయిస్తుంది. వాడు మానసికంగా మొదట వేసే ప్రణాళిక అది. ఎవడు వాడు. కవి. ఎవడా కవి. పరమాత్మే మొదటి కవి. **'కవిం పురాణ మను శాసితార'**మని స్మృతి. **'కవిర్మనీషీ పరిభూః స్వయం భూః'** అని దానికి మూలమైన శ్రుతి. **క్రాంత దర్శీ కవిః** అన్నారు. దేశ కాలాలన తిక్రమించి చూచేవాడు గదా కవి. వాడు సర్వజ్ఞుడూ సర్వశక్తీ అయిన పరమాత్మ గాక మరెవ్వడు. కనుక వాడి సంకల్పమే సత్యం. అది వాడు

క్రియారూపంగా ఆవిష్కరిస్తే నామరూపాత్మకమైన ప్రపంచమయింది. అమూర్తమైన సంకల్పమే మూర్తమయింది. అమూర్తంగా ఉన్నంత వరకూ అది సత్యమే గాని సుందరం కాదు. చిత్ర విచిత్రంగా నవ నవోన్మేషంగా భాసించటమే గదా సౌందర్యం. అది పారమేశ్వరమైన శక్తి వ్యక్తమయినప్పుడే దర్శనమిస్తుంది. ఇదే ఆ మహాకవి రచించిన మహాకావ్యం. నిత్య నూతనం. చిత్ర విచిత్రం. ఇందులో పాత్రలు స్త్రీ పురుషాదులైన మనబోటి జీవులం. మన జీవితం కథా వస్తువు. మనకు కలిగే సుఖదుఃఖా ద్యనుభవమే రసభావాలు.

పోతే ఇంత పెద్ద సుందరమైన కావ్యాన్ని ఆ సత్య స్వరూపుడైన ఈశ్వరుడు సృష్టించటంలో ఏమిటి ఉద్దేశం. ప్రయోజనమేమిటి. చెప్పాము గదా **'రసగ్ం హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి'.** దీన్ని నిరంతరాను శీలనం చేస్తూ మనోముకురం బాగా పరిశుద్ధమైతే తద్ద్వారా మరలా రస స్వరూపుడైన ఆ పరమాత్మతో ఏకమై అమరత్వాన్ని పొందటమే. అదే శివమనే మూడవ అంశం. జీవ బ్రహ్మైక్యమే శివం. అదే ప్రయోజనం జీవితానికి. లేకుంటే ఇది శవమే అయిపోతుంది. నిరంతరమూ రాకపోకలు చేస్తూ పోవలసిందే ఈ సంసారంలో. మోక్షం లేదు. కనుక వేదాంత పరంగా చెప్పుకొంటే నిత్యసత్యమైనది పరమాత్మ తత్త్వం. ఆయన తన సంకల్పాని కనుగుణంగా ఒక రూపకల్పన చేసిన ఈ చరాచర సృష్టి ఒక సుందరమైన కావ్యం. పోతే దీని ఆంతర్యమేమిటో మరలా లోతుకు దిగి భావన చేసి ప్రత్యఙ్ముఖంగా ప్రయాణం చేసి సహృదయుడైన మానవుడా మూలతత్త్వాన్ని అనుభవానికి తెచ్చుకోటమే శివం.

సరిగ్గా దీని అడుగు జాడలలోనే పయనిస్తూ వచ్చారు మహాకవులందరూ మొదటి నుంచీ. ఆయన కవులందరికీ మూలపురుషుడైతే వీరందరూ ఆయన కన్న సంతానమే. ఆయన మూలంగా శిక్షణ పొందిన వారే. **అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః – యథాస్మై రోచతే విశ్వం – తథేదం పరివర్తతే'** అని వాక్రుచ్చాడు ధ్వన్యాలోకకారుడు. పరమాత్మ

భౌతికమైన ప్రపంచాన్ని సృష్టిస్తే ఈ కవులనే ప్రజాపతులూ యథాశక్తిగా సృష్టించారొక కావ్య ప్రపంచాన్ని. అది ఆయన సంకల్పాని కనుగుణంగా జరిగితే ఆ సృష్టి – ఈ కావ్య సృష్టి కూడా వీరి అభిరుచులకు తగినట్టు జరుగుతూ వచ్చింది. ఇక్కడ రోచతే అనటంలో సత్యం పరివర్తతే అనటంలో సుందర మనే రెండు భావాలు తొంగి చూస్తున్నాయి. మరి శివమో. అది వాచ్యం కాదు. వ్యంగ్యం. శివ మంటే అనుభవం గదా. అనుభవమేదో గాదు రసాస్వాదం. అది ప్రపంచంలో సుఖదుఃఖ రూపంగా ఏర్పడుతుంది. కావ్య ప్రపంచంలో రెండూ కలిసి లోకోత్తరమైన ఆనందంగానే అనుభవానికి వస్తుంది. కనుకనే అది లౌకికమైతే ఇది అలౌకికం. అది కూడా ద్వంద్వాని కతీతమైన తత్త్వాన్నే అందుకోగలిగితే అలౌకికమే. అప్పుడు ప్రపంచమేమిటి. కావ్య ప్రపంచమేమిటి. అంతా కలిసి రసస్వరూపంగా ఏకమే. అదే అద్వైతానుభవం.

అందుకే నేనిలాటి ఉదాత్తమైన దృష్టి నాలంబనం చేసుకొని ప్రస్తుతమీ కావ్య సమీక్షా సృష్టి కుపక్రమించ వలసి వచ్చింది. రెండూ ఆంతర్యంలో ఒకటే నాకు. తత్త్వ సాహిత్యం – సాహిత్య తత్త్వం. ఒకటి ఆదిత్య మండలమైతే మరొకటి సర్వతో ముఖంగా ప్రసరించే దాని ప్రకాశం. ఆదిత్యుడొకడు గాదు – ద్వాదశా దిత్యులని పేర్కొంటారు పెద్దలు. ఎవరోగా రిక్కడ వారు. నన్నయ మొదలు చిన్నయ వరకు ఒక వరుసలో కనిపిస్తున్న మన ఆంధ్ర మహాకవులు పన్నెండుగురే ద్వాదశాదిత్యులు. ఆదిత్య మండలంలాగే జాజ్వల్యమానంగా వెలిగిపోతున్నారు వారు. దశ దిశలా వారు ప్రసరింపజేసిన కావ్య ప్రకాశ మంతకన్నా వెలిగిపోతూ మన జీవిత మార్గమంతా వెలిగించి మనలను జీవిత గమ్యం వైపు నడుపుతున్నది.

ద్వాదశాదిత్యులనే పేరు పెట్టి ఒక గ్రంథం వ్రాసి ప్రకటిస్తామన్నారే. ఎప్పుడు చేస్తారా పని అని మా మిత్రులూ శిష్యులూ – ఎప్పుడూ నన్ను హెచ్చరిస్తూ ఉంటారు. వారి ఉబలాటం కూడా దీని మూలంగా తీరుతుంది. నా మనసులో గుప్తంగా దాగి ఉన్న సాహిత్య వాసన కూడా దీనితో

క్షాళిత మవుతుందని కూడా సంతోషిస్తాను. ఇలా ఎన్ని కోణాల నుంచి చూచినా మన ఈ వ్యాసంగం సమంజసమే - సంతోషదాయకమే. సందేహం లేదు. ఉపాధ్యాయు లేమిటి - విద్యార్థు లేమిటి. విమర్శశీలురైన పెద్ద లేమిటి - రసజ్ఞులందరూ సంతోషించే విషయం సంతోషదాయకం కాకపోవటమేమిటి - సప్రయోజనం కాకపోవటమేమిటి.

పోతే నాయీ రచనలో నేను పాటించబోయే సూత్రమేమిటో నేను మీకు ముందుగా మనవి చేయవలసి ఉంది. నేనెంచుకొన్న ఈ పన్నెండు గురుకవుల రచనలలో ప్రతి ఒక్క అంశాన్ని పట్టుకొని సాగదీస్తూపోను. వీరందరూ కవులే అయినా - అందరికీ అన్ని రంగాలలో ప్రవేశమున్నా ఒక్కొక్కరి కొక్కొక్క విషయంలో బ్రహ్మాండమైన అభినివేశ ముంటుంది. అందులో అతడు పులి. ఇది ఎలాటిదంటే వైద్యులందరూ వైద్యశాస్త్రంలో పరిజ్ఞాన మున్నవారే. ఆ శాస్త్రంలో ఉన్న అన్ని విషయాలూ అవగత మయ్యే ఉంటాయి ప్రతి వైద్యుడికీ. కాని ఒకడు కన్నూ ఒకడు ముక్కూ - ఒకడు గొంతుకూ - ఒకడు గుండె అనీ - మరొకడు దంతమనీ - ఇంకొకడు చర్మమనీ ప్రత్యేకించి ఒక్కొక్క శరీర భాగంలో కృషి చేసి ఉంటాడు. అందులో మేటి అనిపించుకొంటాడు. మనమతణ్ణి అందులోనే సంప్రదిస్తాం. ప్రయోజనం పొందుతుంటాం.

అలాంటిదే ఈ కవుల విషయం కూడా. నన్నయ తిక్కనాది కవులందరూ మహనీయులే. అందరూ కవితా శిల్పంలో ఆరితేరినవారే. తద్ద్వారా విశ్వశ్రేయస్సు కోరినవారే. కాని వైద్యుల లాగే ఒక్కొక్క రంగంలో ఒక్కొక్క రచయిత కున్న చొరవా చాతుర్యమూ మరొకరి కంతగా కనపడక పోవచ్చు. లేదని గాదు. అంత చూపు పెట్టడు మిగతావాటి మీద. కాబట్టి కవులను గూర్చి చర్చించేటప్పుడే కవి కెందులో ఎంత అభినివేశముందో ఆ అంశాన్నే పట్టుకొని బయటపెట్టటం మంచిది. లాభదాయకం కూడా. ఎవరికెందులో మంచి అభిరుచి సామర్థ్యమూ ఉన్నాయో అది వారికి వారే చెప్పుకొన్న సందర్భాలూ ఉన్నాయి. తతిమా కవులు వారినలాగే

ప్రశంసిస్తూ వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. లోకంలో వారి వారి కవితా గుణాల నలాగే చాటి చెప్పిన చాటువులూ ఉన్నాయి. కాబట్టి ఇది మనమేమీ క్రొత్తగా ఊహించను కూడా అక్కరలేదు. పదిమంది నోటా దొరలిన ఆ మాటలనే పట్టుకొని అవి ఎంతవరకు వారి వ్రాతలలో చోటు చేసుకొన్నాయని లోతుకు దిగి చూస్తే చాలు. వాటి విశ్వరూపం సాక్షాత్కరిస్తుంది. అది నేను చూచి యథాశక్తిగా సహృదయులైన మీకు చూపటమే ఎటు వచ్చీ నేను చేస్తున్న ప్రయత్నం. అలా చేస్తున్నానంటే అది కేవలం **Water Tight compartment** కాదనే సత్యం మరలా మరచిపోరాదు. అక్కడక్కడా సందర్భవశాత్తూ వారిలో మిగతా విశేషాలు కూడా తడవి చూపవలసి ఉంటుంది. లేకుంటే ప్రస్తుతానికి సమగ్రత ఉండబోదు.

అయితే ఒక్కమాట. ఒక్కొక్క రచయితలో ఒక్కొక్కటి అంటే అది ఏకదేశ పరిశీలనమే గాని సర్వాంగ సంగ్రాహకం కాదు గదా. మనమా యనకేమి న్యాయం చేసినట్టని అనుమానం రావచ్చు మీకు. అలాటి అసంతృప్తి చెందనక్కర లేదు మీరు. ఎందుకంటే ఒక్కొక్కరిలో ఒక్కొక్క పోకడ గుర్తించామంటే చివరకన్ని పోకడలూ గుర్తించుకొని సర్వాంగీణంగా ఆకళించుకొన్నట్లే అవుతుంది. ఒక మధుకరం చేస్తున్న పని అదే గదా. అన్ని కుసుమాలలో నుంచీ ఒక్కొక్క బొట్టు మకరందం సేకరించి అది మధువుగా మార్చి ఒకచోట పోగుచేయటమేగా అది చేస్తున్న పని. అలాటి పనే మనది కూడా. కూరా పప్పు పులుసూ - పాయసమూ మంచి పెరుగూ నేయీ - అన్నీ వేసుకొని షడ్రసోపేతంగా భోజనం చేస్తే - ఎలాంటి తృప్తినిస్తుందో - అలాంటి తృప్తినే ఇస్తుంది ఇదీ. అంతేకాదు. ఏమహాకవి ఏ శాఖలో ఎంత అద్భుతమైన పాటవం చూపాడో - ఎంత రసవత్తరంగా వంట చేసి ఆ పదార్థం మననోటి కందించాడో - రుచి

Yallamraju Srinivasa Rao Brahmasri www.advaitavedanta.in

చూచి ఆనందించవచ్చు. అందరూ కలిసి మన ఆంధ్ర సాహిత్య మహాసౌధ నిర్మాణానికెలా సహకరించారో గమనించవచ్చు. భట్టుమూర్తి వర్ణించిన బహుళాంధ్రోక్తి మయ ప్రపంచంలో యథేచ్ఛగా విహరించవచ్చు.

ఇంతకూ ఇదీ నా సంకల్పం. నా సమన్వయం. సహృదయులు గదా మీరందరూ. అభినవ గుప్తులు చెప్పినట్టు వర్ణనీయ తన్మయీ భవన యోగ్యత ఉన్నవారు గదా. అలాటి యోగ్యమైన హృదయంతో విమర్శించి దర్శించండి. మీకే విదితమవుతుంది విషయం. ఒక ప్రక్క ఆరగించబోతూ భోజ్య పదార్థాల రుచులెలాంటివని అడగటం దేనికి. అడుగుతున్నంత వరకూ అనుభవం కాదది. అనుభవానికే వస్తే ఇక అడగడం లేదు. ఆస్వాదిస్తూ పోవటమే. ఇదుగో ఇక ఆలస్యం లేదు. ఇప్పుడే వడ్డన ప్రారంభిస్తున్నాను. సాహితీ క్షుధ ఉన్న వారందరూ ఈ సుధ నాస్వాదించండి. పండితరాయలు వర్ణించిన సుధ ఇది. **'మాధుర్య పరమ సీమా సారస్వత జలధి మథన సంభూతా – పిబతా మనల్ప సుఖదా'** అని కీర్తించిన సుధ. వసుధలోనే లభించే సుధ. స్వర్గంలో సుధ కూడా దీనికి తీసికట్టే నన్నాడాయన. అలాటి సాహిత్య సుధా రసాన్ని మీరు పానం చేసి ఆనందిస్తే అది చూచి నేనూ మనసారా ఆనందిస్తా. కాని ఒక్క షరతున్నది పాఠకుల మీద. అదేమంటే నా సమీక్ష బాగా అర్థం చేసుకోవాలంటే మీకా కవుల కావ్యాల గూర్చి కొంత అవగాహన ఉండాలి. నేను చాలావరకు వాటి నేపథ్యమందిస్తా ననుకోండి. అయినా మీరూ కొంత ఆయా కథా వస్తువులూ – వారి రచనలూ – వారి పద్యాలూ కొంతకు కొంత చదివి తెలుసుకొని ఉండటం మంచిది. అప్పుడు పూర్తిగా గ్రహించి అభినందించ గలుగుతారు మీరు. అది చూచి నేనూ ఆనందించగలను. సెలవా మరి.

**ఇతి**

**విబుధ జన విధేయః**

**శ్రీనివాస నామధేయః**

Yalamanchili Srinivasa Rao
www.andhravedam.in

# నన్నయ కథా కథనము

అనేక పురాణ పుణ్య కథా కథన దక్షుండ - నా వలన నెక్కథ విన వలతు రని సూత మహర్షి శౌనకాదులను ప్రశ్నిస్తాడు నన్నయ భారతంలో. ఇవి సూతుడు మాటాడిన మాట లేనా అని నా కనుమానం. సూతుడే అయితే తిక్కన భారతంలోనూ మాటాడాలి. ఎఱ్ఱాప్రెగడ భారతంలోనూ అలాగే మాటాడాలి. ఒక్క నన్నయ గారి భారతంలోనే ఇలా మాటాడట మేమిటా సూతుడు. నన్నయ ఒక్కడే గాదు. వారు కూడా తెనిగించారు గదా మహాభారతం. మూలంలో లేనివీ తిక్కనాదుల రచనలో లేనివీ నన్నయ భారతంలోనే ఈ మాట లెలా దొర్లాయంటారు. చూడబోతే ఇవి సూతుడు తానుగా అన్న మాటలు గావు. సూతుడి నోట నన్నయ గారు పలికించిన పలుకులు. సందేహం లేదు.

అయినా నేను కథా కథన దక్షుండనని తనను తానే ప్రశంసించు కోటమేమిటి నన్నయ భట్టయినా. నన్నయ భట్టుకది అలవాటే. 'నిత్య

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

**సత్యవచను మత్యమరాధి పాచార్యు నన్ను నన్న పార్యుఁ జూచి'** రాజ రాజ నరేంద్రు డిలా సెలవిచ్చాడని ఆ రాజుగారి మీద నెపం పెట్టి కూడా మాటాడాడాయన. ఇది అహంకారం కాదు. ఆత్మ స్తుతీ కాదు. మహాకవి కుండే ఆత్మ విశ్వాసం. కథ చెప్పటంలో తనకెంత దక్షత ఉందో తెలియని మనబోటి పాఠకులందరికీ తెలియ జెపుతున్నాడు. తప్పు లేదు. కథేమిటి. అది చెప్పటమొక గొప్పేమిటి – అని పెదవి విరుస్తారేమో. కథ చెప్పటం కూడా ఒక కళే. ఒక చాతుర్యమే. ఇంతెందుకు. మామూలుగా మనకు తెలిసిన విషయమే ఒకడు చెప్పిన ట్టొకడు చెప్పలేడు. ఒక్కొక్కడు చెబుతుంటే రోకటి పాటగా విసుగు పుట్టిస్తుంది. ఒకడు చెబితే ముందు వెనుకలు తారుమారవు తుంటాయి. మరొకడు చెబుతాడు గాని అన్ని విషయాలూ కలిసి రావందులో. అలా చెప్పినా చప్పగా ఉంటుందొకడు చెబితే. ఆకర్షకంగా ఉండదు. అందరూ చెప్పేదొకే విషయమైనా ఒకానొకడి నోట వచ్చినప్పుడది ఎంతో చక్కగా రమణీయంగా భాసిస్తుంది. ఇంకా చెబితే వినాలని ఉబలాట పడతాము. కాబట్టి కథ చెప్పట మంటే సామాన్యం కాదు. అదీ ఒక గొప్ప కళే. అందులో నేనందె వేసిన చేయిని. చూడండి నా పాండిత్యమని హెచ్చరిస్తున్నాడేమో మనల నా మహాకవి.

అందుకే ప్రతి ఆశ్వాసారంభంలోనూ అక్కథకుం డక్కథకుండని సూత మహర్షి మీద నెపం పెట్టి మనమెక్కడ మరచి పోతామోనని తన కథా కథన నైపుణ్యాన్ని మాటి మాటికీ గుర్తు చేస్తుంటాడు. అంతే కాదు. సారమతు లైన కవీంద్రు లెవరైనా మొదట సాధించ వలసిన కవితా శిల్ప మదే నన్నట్టు '**ప్రసన్న కథా కలితార్థ యుక్తి**' అనే మాట కూడా ఒకటి

విసురుతాడు మొట్ట మొదటనే. కథ ఎంతో ప్రసన్నంగా సాఫీగా పైకి సాగిపోతుంటే లోపల అన్ని అర్థాలూ ఒక దానితో ఒకటి పొందువడి ఉండాలట. అర్థయుక్తి అంటే పురుషార్థాలను కీర్తించటమని సాంప్రదాయికంగా అర్థం చెప్పవచ్చు ననుకోండి. అంతేగాదా కవి ఉద్దేశించింది. మాట పొందిక అన్నట్టు పూర్వాపరా ర్థాలకూ లేదా ఆయా కధాంశాల కుండే పొందిక అని అంతరార్థం.

ఇదే ఆయన వివక్షిత మయినట్టు మనకా శౌనకాదులు సూతున కిచ్చే సమాధానంలోనే తార్కాణ మవుతుంది. ఎలాటి కథ వినాలను కొంటున్నారని సూతు డడిగితే వారన్న మాట ఏమిటో తెలుసా, **'ఏయది హృద్య - మపూర్వం -బేయది - యెద్దాని వినిన నెఱుక సమగ్రం బై యుండు - నఘనిబర్హణ మేయది - యద్దాని వినగ నిష్టము మాకున్'** - అని కోరుతారు. ఇందులో నాలుగే నాలుగు షరతులు పెట్టారు వారు. తాము వినాలను కొనే కథ మొదట హృద్యంగా ఉండాలట. అంటే మనసుకు హత్తుకొని పోవాలి. మరపునకు రాగూడదు. రెండవది అపూర్వంగా ఉండాలట. ఇంతకు ముందెన్నడూ విన్నది కాగూడదు. అపూర్వమంటే మరొక అర్థం కూడా చెప్పవచ్చు. ముందు బయట పెట్టకుండా కుతూహలం పెంచుతూ పోయి క్రమంగా ఒక్కొక్కటీ బయట పడుతూ రావటం కూడా అపూర్వమే. పోతే మూడవది ఆ కథ వింటే చాలు తెలియ వలసిన సకల విషయాలూ తెలిశాయనే సంతృప్తి నీయాలట. పోతే ఇక చివరి దేమిటంటే - ఇంత కథా ఏదో మీరు చెప్పారు మేమూ ఏదో ఉబుసు పోకకు విన్నామని గాక అఘమనేది నిబర్హణమయి పోవాలి. అంటే ఎలాంటి అస్తిమితమూ

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

కాలుష్యమూ ఉండగూడదు శ్రోతలకు. అదంతా క్షాళితమయి పోవాలి కథా శ్రవణంతో. ఒక గొప్ప ఆదర్శాన్ని గూడా బోధించాలది. సద్యః పరనిర్వృతే గాక ఉపదేశయుజే అని ఆలంకారికులు పేర్కొన్న ఆ రెండవ ప్రయోజనం కూడా సిద్ధించాలంటారు. ఇవి నాలుగూ ఒనగూడినప్పుడే అది కథ. అప్పుడే కథ అనేది కళ అనిపించు కొంటుందని బహుశా శౌనకాదుల ద్వారా మనకు భాసింప జేస్తున్నాడా అనిపిస్తుంది నన్నయ భట్టారకుడు.

ఇదుగో ఇలాటి దృష్టి పెట్టుకొని మనం నన్నయ భట్టు కథా కథన శిల్పమెలాటిదో – అది ఆయన భారతా ఖ్యానంలో ఎలా సాగిందో ఎంత మోతాదులో సాగిందో – స్థాలీపులాకన్యాయంగా తడవి చూద్దాము. అప్పుడది కరతలా మలకంగా ఆకళించు కొన్న వాళ్ల మవుతాము. భారత మంతా తెనిగించ లేదు మహాకవి. అందులో రెండున్నర పర్వాల వరకే కనిపిస్తుందాయన రచన మనకు. తిక్కన మూడు పర్వాలని పేర్కొన్నాడే గాని అది ఎఱ్ఱన నాటి కొక సగం కాల గర్భాన కలిసిపోయి ఉండవచ్చు. అలా కాకుంటే ఎఱ్ఱాప్రెగడ పని గట్టుకొని మిగతా సగం పూరించ నక్కర లేదు. స్యా దేవం – తథాపి మనకా రెండున్నరే చాలు ఆయన కథా కథన కౌశలాన్ని చాటి చెప్పటానికి. సంగ్రహం విస్తరమని గాదు మనం చూడవలసింది. విస్తరంగా వ్రాసినా ఒక్కొక్క రచన మనకు విసుగని పించవచ్చు. మరి సంగ్రహంగా రచించిన దయినా వేరొకటి చాలా రుచిరంగా భాసించ వచ్చు. అలాటి మాధుర్యాన్ని కథా నిర్వహణంలోనే ఎలా అందించాడో చూద్దామా మహాకవి.

వ్యాస శిష్యుడైన వైశం పాయనుడింకా భారత కథ మొదలు పెట్టక ముందే దానికి నాందీ ప్రాయంగా ఒక కథ వర్ణించాడు నన్నయ భట్టు. ఎవడో గాదు కథా నాయకుడు. ఉదంకుడనే బ్రహ్మచారి. పైలుని శిష్యుడు. ఆ పైలుడు కూడా వైశంపాయనుడి లాగా వ్యాసమహర్షి శిష్యుడే. అప్పటికి వేద వ్యాసుని ప్రశిష్యుడన్న మాట ఈ బాల బ్రహ్మచారి. గురుకులంలో చాలా కాలం గురువుగారికి పరిచర్య చేశాడు. ఆయన గారి వల్ల అన్ని విద్యలూ అణిమాది సిద్ధులతో సహా అభ్యసించాడు. గురుదక్షిణ ఇవ్వాలాని గురువుగారి భార్య నియోగిస్తే పౌష్యుడనే రాజు భార్య నడిగి కుండలాలు తీసుకు రావాలని బయలుదేరుతాడు. దారిలో ఒక వృషభ గోమయ భక్షణం చేసి చూడబోతే ఆవిడ కనిపించదు. ఆ రాజు నీవశుచివి కాబట్టి కనపడ లేదని చెబితే కాళ్లూ చేతులూ కడుగుకొని ఆచమించి పోయి చూస్తే కనబడుతుంది. ఆమె తన కుండలాలు తీసి చేతికిస్తూ తక్షకుడు వీటి నపహరిస్తాడేమో వాడు మాయలమారి జాగ్రత్త అని చెప్పి పంపుతుంది. దారిలో ఒక జలాశయం వద్ద వాటి నుంచి అందులో దిగాడో లేదో వాడు నగ్న వేషంలో వచ్చి వాటి నపహరిస్తాడు. వాడితో పాటు ఇతడూ వెళ్లుతాడు పాతాళానికి. వాడక్కడ కనపడకుండా పోతే దిక్కు తోచక చూస్తూంటే అశ్వారూఢుడైన పురుషుడొకడు నీకేమి కావాలని అడుగుతాడు. ఈ నాగజాతినంతా నిర్మూలించాలని కోరితే అలాగైతే ఈ అశ్వ కర్ణంలో ఊదమంటాడు. ఊదేసరికి పొగలూ సెగలూ చెలరేగి పాతాళమంతా కమ్ముకుంటాయి. భయపడిన తక్షణకుడు కుండలాలు తెచ్చి అప్పగిస్తాడు. మూడు రోజులు గడచి నాలుగవ రోజు వచ్చిందే గురుపత్ని పెట్టిన గడువు

దాటు తున్నదే ఎలాగని మరలా మధన పడుతుంటే ఈ గుఱ్ఱమెక్కిపో వెంటనే ఇల్లు చేరగలవని ఆ దివ్య పురుషుడను గ్రహిస్తే తిన్నగా వచ్చి ఇల్లు చేరుతాడు.

ఏమిరా బాబూ ఈ సమీపంలో ఉన్న పట్టణానికే పోయి రావటానికి నీకింత కాలం పట్టిందే అని గురువుగారడిగితే – ఏమి చెప్పమంటా రిలా జరిగిందని తనకు జరిగిందంతా ఏకరువు పెడతాడు. ఆ వరకూ తాను చూచిన అద్భుతాలన్నీ ఏమిటి చెప్పండి నా కర్థం కాలేదని ప్రాధేయ పడతాడు. ఆయన వాటి ఆంతర్యమంతా విప్పి చెప్పి ఇక సుఖంగా వెళ్లి రమ్మని దీవించి పంపుతాడు. అప్పటికీ వీడు సుఖంగా ఉండలేక మరలా పని గట్టుకొని జనమే జయుడనే రాజు దగ్గరికి వెళ్లి తక్షకుడు దుర్మార్గుడు మీతండ్రి గారిని కాటు వేసి నిష్కారణంగా హత మార్చాడు. వాణ్ణీ వాడితో పాటు సర్పజాతి నంతటినీ నీవు సర్పయాగం చేసి భస్మీపటలం చేయమని సలహా ఇస్తాడు.

ఇదీ సంగ్రహంగా చెబితే ఉదంకుడి వృత్తాంతం. కాని ఈ కథ నన్నయగారు చెప్పిన బాణీలో చెబితే ఎంతో కళాకాంతులను సంతరించు కొని కనిపిస్తుంది. ఎన్ని విద్య లభ్యసించినా ఎన్ని మహిమలు సాధించినా – అతడొక చపలచిత్తుడు కోపిష్ఠుడు తొందర మనిషి ఆ ఉదంకుడు. అవి ఉన్నంత వరకూ ఫలితం లేదని గురువుగా రతని కొక పెద్ద పరీక్ష పెట్టాడని పిస్తుంది. అందుకే గురుదక్షిణ తానుగా కోరక తన పత్ని నడగమని ఉంటాడు. మరి ఆవిడ కోరిందేమిటి. ఫలానా రాజు భార్య ధరించే కుండలాలు తనకు తెచ్చి పెట్టమని. ఆమెకూ ఈమెకూ మధ్య

ఏదో లావాదేవీ ఉంటుంది. లేకుంటే ఇలాటి కోరిక కోరబోదు. కనుకనే ఉదంకుడడుగ గానే ఆ రాణి కుండలాలు తీసి అతని చేతిలో పెట్టింది. అవి ఈవిడ నాలుగవ రోజే ధరించాలని ఆవిడకు తెలుసు. అందుకే తాను ధరించే సమయమని తెలిసి కూడా ఇచ్చి పంపింది. తక్షకుడు దొంగిలిస్తాడేమో జాగ్రత్త అని హెచ్చరించిందంటే అది ఆవిడ కెలా తెలుసు. తెలుసుననే అనుకోవాలి మనం. ఇంత తెలిసిన దానికా విషయం తెలియటమేమి ఆశ్చర్యం. పైగా అత డశుచి అయినంత వరకూ కనపడక శుచి అయినప్పుడే దర్శన మిచ్చిందంటే ఎంత జ్ఞాని అయి ఉండాలావిడ.

రాణిగారే అలాంటిదైతే ఇక రాజుగారి సంగతి చెప్పాలా. నా భార్య పవిత్ర పతివ్రత అందుకే అశుచి వైన నీకు కనపడ లేదంటా డుదంకునితో. ఇదంతా ముందుగానే గుర్తించినట్టు కనిపిస్తారా దంపతులిద్దరూ. పైగా కుండలాలు తీసుకొని వెళ్లుతుంటే అయ్యా భోజనం చేసి వెళ్లమని ప్రార్థిస్తాడు. ఆయన క్షత్రియుడు. ఇతడు బ్రాహ్మణుడు. అయినా చేస్తాడు భోజనం. చేస్తూ చేస్తూ అన్నంలో ఒక వెంట్రుక వచ్చిందని చెప్పి నీ వంధుడవై పొమ్మని శాపమిస్తాడా రాజుకు. నా అపరాధం లేకున్నా నన్ను శపించావు నీవు అనపత్యుడవయి పొమ్మని మరలా ఆయన శాప మిస్తాడు. ఉదంకుడు తనకిచ్చిన శాపం పోగొట్టుకోలేక ఆరాజుకు తానిచ్చిన శాపమే వెనక్కు తీసుకోవలసి వచ్చింది. రాజు కంధత్వం పోయింది. అది నన్నయ్య నడిగితే ఉదంకుడికే సంక్రమించిందంటాడేమో కూడా. ఎందుకంటే అపుత్రస్య గతిర్నాస్తి అని వీడి కుత్తమ గతులు లేకుండా

పోయాయి. అంధం తమః ప్రవిశంతి అన్నట్టు ఇక అంధకార బంధురమైన అధో లోకాలే ప్రాప్తి. అదే అంధత్వమా కుఱ్ఱవాడికి.

కనుక నేనేమో గురువు దగ్గర సెలవు తీసుకొని బయలు దేరినప్పటి నుంచీ మరలా గురుకులం చేరే వరకూ అంతా గుడ్డి మాలోకమే అయి పోయిందతని వ్యవహారం. గోమయ భక్షణం చేసి కరచరణాదులు కడుగుకొని ఆచమనం చేయటం మరచి పోయాడు. తనకు ప్రాప్తించిన అణిమాది సిద్ధులు కూడా స్మరణకు రాలేదంటే ఎంత గుడ్డితనమో చూడండి. కాగా ఆ వృషభమేమిటో అశ్వమేమిటో ద్వాదశార చక్రమేమిటో అది త్రిప్పుతున్న వారెవరో – ఏదీ గుర్తించ లేకపోయాడు. అణిమాది మహిమ లేమయ్యాయి. మరలా గురు కులానికి వచ్చి గురువు గారినే అడిగి ఎందుకు తెలుసుకోవలసి వచ్చింది.

అని అడిగితే 'గురుదయ నణిమాదికాష్ట గుణముల తోడన్ – అని పేర్కొన్నాను నేను గురుదయ వల్లనే అవి పని చేస్తాయి లేకుంటే లేదు. శిష్యుడి దురాగ్రహం తొందరపాటు ఆయనకు తెలుసు. అందుకే అవి పని చేయకుండా పరీక్ష పెట్టి చూచాడంటాడు నన్నయ. అదీ మూడు రోజులలో నెగ్గాలతడా పరీక్షలో. నాలుగోరోజు కల్లా వచ్చి తన దగ్గర వాలిపోవాలి. మహిమలా పనిచేయవు. ఎలా రాగలడో చూతామని పరీక్ష. ఈ విషయం ముందు చెప్పడు మహాకవి. ఉదంకుడి స్వగతంలో బయట పెడతాడు. అంతేగాక గురువుగారి కిదంతా ముందు నుంచీ తెలిసే చేశాడనేందుకు తార్కాణగా **'ఈయున్న పౌష్యప్రోలికిఁబోయి కడుం బెద్ద దవ్వు పోయినయ ట్లాత్యాయత విమలతపో మహిమా యిన్ని దినంబు**

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

**లేల మసలితి చెపుమా'** అని ఏమీ ఎఱుగనట్టు మెత్తగా చీవాట్లు పెట్టిస్తాడా గురువు చేత. ఇన్ని గొప్ప మహిమలు సంపాదించావు గదా ఎందుకీ స్వల్ప విషయం సాధించటాని కిన్నాళ్లు పట్టిందని అడగటంలో ఎంతైనా ఉన్నదంత రార్థం. అంటే ఎన్ని మహిలున్నా నీకవి పనిచేయవు. కారణం. నీవు శమదమాది సంపన్నుడవు కావు. కోపతాపాలతో అంధమయి పోయింది నీ బుద్ధి అందుకే ఆ వృషభ మేమిటో ఆ అశ్వమేమిటో ఆ దివ్య పురుషుడెవడో నీకు తెలియలేదు.

కనీసమొక ఆడ కూతురిని కూడా నీవు చూడలేక పోయానంటే ఎంత గుడ్డివాడవు. ఆవిడ కున్న శుచిత్వం కూడా నీకు లేదంటే ఎంత సిగ్గు చేటు. నీలో ఇన్ని పొరబాట్లు పెట్టుకొని ఒక చిన్నపొరబాటు కారాజును శపించానంటే అది ఆయనకు తగులుతుంద నేనా. ఆయన కాదు అంధుడు. చివరకు నీవే రావలసి వచ్చింది అలా కాకుంటే నీకా అద్భుతాలన్నీ ఏమిటో ఎందుకు జరిగాయో మరలా నన్నడిగి ఎందుకు తెలుసుకోవలసి వచ్చింది. గ్రుడ్డితనమే గాక నీతో నీశంస స్వభావమూ - నిష్కారణ కోపమూ కూడా గూడు కట్టుకొన్నాయి. అందుకే తక్షకుడొకడు నీకపకారం చేస్తే నాగ కులమంతా నాకు వశమయ్యే లాగా చూడమని కోరాడా అశ్వారూఢుడైన పురుషుణ్ణి. అంతమందీ నీకు శత్రువులయ్యారా. కనుకనే నీకీ మహిమ లేవీ ఫలించ లేదు. అయినా నీవీ కార్యమీ మాత్రమైనా సాధించగలిగా నంటే - నాకు నీవు చేసిన పరిచర్యా నా పత్ని కోరిన కార్యమెలాగైనా సాధించాలనే పట్టుదలా తప్ప మరేదీ గాదు. గురుకార్య నిరతుడవు కాబట్టి నీకిక నుంచే జరుగుతుందిలే పొమ్మని వీడు కొలుపుతాడు శిష్యుణ్ణి.

అప్పటికీ ఉపశమ బుద్ధి లేక మరలా కొంత కాలానికి జనమే జయుడి దగ్గరికి వెళ్లి అతనికి సర్పయాగ బుద్ధి పుట్టించాడంటే ఆ బ్రహ్మచారి ఎంత ఆగ్రహావేశపరుడో చూడండి. ఇదంతా చిలువలు పలువలు పెట్టి వర్ణిస్తాడా నన్నయ. లేదు. కొంత చెబుతాడు. కొంత చెప్పడు. చెప్పేది రెండు వంతులైతే చెప్పక మభ్యపరిచేది రెండు వంతులు. చెప్పిన దాన్ని బట్టి చెప్పనిదాని నంతా ఊహించి పట్టుకోవాలి భావుకుడు.

లేకపోయినా ఈ గురుపత్ని కా రాజపత్ని కుండలాలు దేనికి. ఆవిడ ధరించటాని కవసరమైనా ఈవిడ అవసరాన్ని తీర్చటాని కవి ఇచ్చి పంపట మేమిటి. ఏరోజు ధరిస్తుందో ముందుగా చెప్పక నాలుగోరోజని తరువాత బయటపెట్టటమేమిటి. ఆ మధ్యలో రాజుగారికీ ఆ కుఱ్ఱవాడికీ ఆ మర్యాద లేమిటి. వెంటనే ఆ ఘర్షణ ఏమిటి. అన్ని విద్యలూ గ్రహించి అన్ని విద్యలూ సాధించి వాడా సర్పానికి జవాబు చెప్పలేక పోవట మేమిటి. మధ్యలో చూచిన ఆ అద్భుతాలన్నీ ఏమిటో గుర్తించ లేక విస్తుపోయి చూడటమేమిటి. గురువుగారి నడిగి ఆయన చెబితే గాని గ్రహించ లేకపోవట మేమిటి.

ఇదంతా సాగదీసి చెబుతూ పోతే ఎంతైనా చెప్పవచ్చు. కాని మహాకవి అలా ఎప్పటికీ చేయడు. ఏది చెప్పాలో ఎక్కడ దాన్ని బయట పెట్టాలో ఆ విద్య ఆయనకే తెలుసు. దానికొక చిన్న మచ్చుతునక చూచామీ ఉదంకుని కథలో. ఎంత విద్యా వంతుడైనా ఎంత మహిమాన్వితుడైనా బుద్ధి మంచిది కాకపోతే ప్రయోజనం లేదు. అలాటి చపల స్వభావంతో ఎవడి కెలాటి కీడు చేయబోయినా అది వాడికి గాదు. తనకే బెడిసి కొడుతుంది. ఒకరికి

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

నూరిపోసి తన కోరిక తీర్చుకోబోయినా అది తీరదు. తీరకపోగా వృధా ప్రయాసే అని ఒక గొప్ప నీతి మనకిందు మూలంగా బోధిస్తున్నాడు మహాకవి. అఘనిబర్హణ మేయది అని గదా అడిగారు శౌనకాదులు. శునక స్వభావమైన శ్రద్ధా గుణమున్న అందరమూ శౌనకాదులమే. అందరమూ ఈ సందేశ మందుకొంటే అఘనిబర్హణానికి నోచుకొన్న వాళ్ళమే కాగలం.

మరొక కథ తడవి చూద్దాం. దేవయాని కథ. శుక్రాచార్యుని కూతురావిడ. రాక్షసుల గురువా శుక్రుడు. యుద్ధంలో మృతులైన వారిని బ్రతికించాలని మృత సంజీవని అనే విద్య దగ్గర పెట్టుకొన్నాడు. దేవతలది కాజేయాలని బృహస్పతి కొడుకు కచుణ్ణి పంపారాయన దగ్గరికి. విద్యాభ్యాసమనే నెపంతో వచ్చాడా బాలుడు. 'నేను బృహస్పతి పుత్రుడనని బాహాటంగానే చెప్పుకొన్నాడు. అలాంటప్పుడతణ్ణి వెనక్కు పంపక ఎందు కొప్పుకున్నాడు శుక్రుడు. రాక్షస గురువు గదా తాను. అయినా అతని 'ప్రియహిత భాషణకూ - నియమవ్రత పాలనకూ ముగ్ధుడయి అంగీకరించాడట. వీణ్ణి పూజిస్తే బృహస్పతినే పూజించినట్టే నని భావించాడట. ఏమిటది. దేవ గురువుతో తనకేమిటీ లావాదేవీ. అది దేవతలకా హితం దానవులకా.

పోతే రాక్షసులా కచుణ్ణి అడవిలో ఒంటరిగా తిరుగుతుంటే పట్టుకొని మట్టు పెడతారు. దివ్య దృష్టితో చూచి శుక్రుడు మృత సంజీవని పంపివాణ్ణి బ్రతికించి మరలా ఆశ్రమానికి చేరుస్తాడు. తనకిష్టమైన శిష్యుణ్ణి నిర్ధాక్షిణ్యంగా చంపితే ఆ రాక్షసులను మందలించక ఉపేక్షించటం

మేమిటాయన. అంతేకాదు. మరలా ఒకమారు వాణ్ణి వధించి ఆ బూడిద మద్యంలో కలిపి గురువు గారి చేతనే తాగిస్తారా రాక్షసులు. అప్పటికీ వాళ్లను శపించ లేదు. సరిగదా రాక్షసులీపని చేయక మరేమి చేస్తారని తానే సమాధాన పడతాడు. మృత సంజీవని కచుడి కుపదేశించి వాడు తన గర్భ నిర్భేదం చేసి బయటికి వస్తే వాడి మూలంగా తాను బ్రతికి బయట పడతాడు.

ఏమిటీ శుక్రాచార్యుడి వ్యవహారం. దీనికి సమాధాన మాయన స్వభావమే నంటాడు భట్టారకుడు. అపూర్వం బేయది అని గదా అడిగారు శౌనకాదులు. అందుకే ముందుగా బయటపెట్టడది. మధ్యలో ఒకచోట దేవయాని తనకు శర్మిష్ఠ చేసిన అవమానాని కలిగి వృషపర్వుని పురంలోనే ఉండను వెళ్లిపోతానని పట్టుపడితే ఇలా అంటాడా పిల్లతో, 'క్రతువులు చేసిన వారి కంటె అక్రోధనుడే యధికుడు. **'అలిగిన నలుగక - యెగ్గుల్ పలికిన మతి వినని యట్లు ప్రతి వచనంబుల్ పలుకక బన్నము వడి యెడఁదలఁపక యున్న తడ సూవె ధర్మజ్ఞు**'డని కూతురికి ధర్మోపదేశం చేస్తాడు. ఇప్పుడర్థ మయిందతడు మొదటి నుంచీ ఎందుకలా ఉపేక్షిస్తూ వచ్చాడో. అంత సహన స్వభావుడు గనుకనే వారు కచ్చెతో కచుణ్ణి చంపినా - చివరకు వాడి బూడిద కలిపి తన చేత సురాపానం చేయించినా ఆగ్రహించ లేదు.

అసలు పోతే పోయాడు వాడి కుత్తమ గతులే వస్తాయని మీదు మిక్కిలి కూతురినే ఓదారుస్తాడు. అయితే ఆ అమ్మాయి కచుణ్ణి మనసారా ప్రేమించింది. అతనికే అపకారం జరిగినా ఓర్చుకోలేదు. మరి ఆ కూతురేది

కోరినా ఈ తండ్రి కాదన లేడు. అది ఎలాటి దైనా నెరవేర్చ వలసిందే. కనుకనే కచుణ్ణి తానంతగా పట్టించు కోకపోయినా కూతురికత డిష్టమని చెప్పి వాడి బాగోగులు చూస్తూ వచ్చాడు. తండ్రి కూతుళ్ల కుండే ఈ అన్యోన్యత దేవతల కెప్పుడో తెలుసు. కనుకనే కచుణ్ణి భూలోకానికి పంపే ముందే **'దుహితృస్నేహంబునం చేసి యద్దేవ యాని పలుకులు శుక్రుం డతి క్రమింపడు. కావున నీ నేర్చు విధంబున దాని చిత్తంబు పడసి శుక్రు నారాధించు'** మని చెప్పి పంపుతారు. శుక్రుడి దుహితృ వాత్సల్య మంతగా టాంటా మయిందన్న మాట. అందుకే తన స్వభావాన్ని బట్టి రాక్షసులను మందలించ లేకపోయాడు. కూతురి మీది వాత్సల్యాన్ని బట్టి కచుణ్ణి ఆపదల నుంచి కాపాడి తుదకు సంజీవనీ విద్యనే అతనికిచ్చి సాదరంగా సాగనంపాడు.

కూతురు తత్క్షణ మా పట్టణం ఖాళీ చేసి పోతానని పట్టుపడితే నీవే నాకు గతి నేనూ నీతోనే వస్తానని అమాయికంగా బయలుదేరి వస్తాడు. అప్పటికీ వృషపర్వుణ్ణి పిలిచి చీవాట్లు పెట్టవచ్చు గదా. ఆపనీ చేయలేదు. అతని కూతురు శర్మిష్ఠ చేసిన దానికి కోపంతో రుసరుస లాడలేదు. ముందు చెప్పినట్టాయన స్వభావంలో లేదది. నన్నయ బహు జాగ్రత్తగా పునాది వేశాడు మొదటనే. పాపం వృషపర్వుడే చారుల వల్ల విషయ మంతా తెలుసుకొని వస్తాడు. వచ్చి యిద్దేవయాని కెద్ది యిష్టంబు - దానిన యిత్తు నడుగుమని ప్రాధేయ పడతాడు. చూడండి చిత్రం. శుక్రుడేమీ నోరు దెరచి మాటాడడు. మౌనంగానే ఉంటాడు. ఆయన

బదులు దేవయానే కలగచేసుకొని శర్మిష్ఠను తనకు దాసిగా ఇవ్వమని కచ్చితంగా అడుగుతుందా రాజును. వృషపర్వుడికీ గురువు గారికీ సాక్షాత్తుగా మాటలే లేవు.

వృషపర్వుడే గాదు. యయాతి విషయం కూడా ఇంతే. అప్పుడప్పుడు వస్తూనే ఉండేవాడా వనానికి వేటాడే నెపంతో. అతని రావటం పోవటం చూస్తూనే ఉన్నారా దేవయానీ శర్మిష్ఠా వారి చెలికత్తెలూ. కాని అతడెవరి వైపూ చూడలేదు. చేయలేదు. తన పాటికి తాను వచ్చిపోతుండే వాడు. శృంగార లోలుడే అయితే దేవయానిని గాకపోయినా శర్మిష్ఠ రాచకన్నె కాబట్టి దుష్యంతుడిలాగా ఎప్పుడో దాన్ని గాంధర్వ వివాహం చేసుకొనే వాడు. చేసుకొన్నా తప్పు పట్టేవాడు కాదు వృషపర్వుడు. సంతోషించే వాడు. కాని అలా ఎందుకు జరగలేదు. శుక్రుడి లాగే అతడి స్వభావమూ చాలా ధర్మబద్ధమైనది. ఇది నన్నయ చాలా వ్యంగ్యంగా సూచిస్తూనే వచ్చాడు. దేవయాని నూతిలో బడి మొరబెడితే వచ్చి దక్షిణ హస్తంతో ఆవిడ చేయి పట్టి బయటికి లాగాడు. వస్త్ర ముందో లేదో కూడా ఆవిడకు. తానూ ఆవిడా తప్ప అక్కడ ఎవరూ లేరా అడవిలో. హస్తగతం చేసుకొన్నా చేసుకోవచ్చు. కాదనే వారు లేరు. ఆ మాటకు వస్తే ఆవిడా కాదనదు. మరెందుకు తొందర పడ లేదా రాజు. తొందర పడే స్వభావం కాదతనిది. ధర్మా ధర్మ పరిజ్ఞాన మున్నవాడు.

తరువాత దేవయాని తన్ను పరిణయ మాడమని బ్రతిమాలినప్పు డాయన ఆడిన మాటలు వినండి. తెలుస్తుంది. '**క్షత్రియ కన్యలను**

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

**బ్రాహ్మణులు వివాహ మాడవచ్చు గాని బ్రాహ్మణ కన్యలను క్షత్రియులు వివాహ మాడరాదు. నీ పలుకులు ధర్మ విరుద్ధములు. సకల ధర్మ రక్షణము చేయవలసిన నేన యిట్టి యధర్మమున కొడంబడిన జగత్ప్రవృత్తి విపరీతంబు గాదే'** అని తెగేసి చెబుతాడు. ఇలాటి ధర్మబుద్ధి ఉన్నవాడు గనుకనే దేవయాని చన విచ్చినా అలా ప్రవర్తించ లేదు. అప్పటికీ ఆవిడ వదలి పెట్టక మా తండ్రి శుక్రుడన్ని ధర్మాలూ తెలిసినవాడు. ఆ మహాత్ముడే వచ్చి ఇది ధర్మ విరుద్ధం కాదని చెబితే వింటారా అని అడుగుతుంది. అంతటి వాడు వచ్చి చెబితే తప్పకుండా పెండ్లాడు తానంటాడు.

మరి శర్మిష్ఠ క్షత్రియ కన్యగదా ఏల మోజుపడ లేదంటే శుక్రుడు తన కూతురిని తప్ప దాని దాసి అయిన శర్మిష్ఠను కన్నెత్తి చూడటం కూడా పనికి రాదన్నాడు కాబట్టి పరిహరించాడు. మోజు లేక కాదు. అప్పటికే ఆవిడతో ఎందుకు రహస్సంగమం చేశాడంటే – ఆవిడ అది కూడా ధర్మమేనని ఎంతో నచ్చ చెప్పి చివరకు వివాహ విషయంలో బొంకినా పరవాలేదని ఎంతో వాపోతే అంగీకరిస్తాడు. తరువాత గుట్టు బయటపడి శుక్రుడు నిలదీసి అడిగితే ఋతుమతి అయిన క్షత్రియ కన్య ప్రార్థిస్తే ఉపేక్షించటం ధర్మం కాదనే భయంతో అలా నడుచుకోవలసి వచ్చిందని ఒడ్డుకుంటాడు. శుక్రుడికి తెలియనిది కాదు. అయినా కూతురి మీది వ్యామోహంతో శాప మిస్తాడు. ఇచ్చినా కుమారుడికి తన వార్ధక్యాన్ని మార్పిడి చేసి వాడి యౌవనం తాను పొందవచ్చునని మరలా అనుగ్రహిస్తాడు. యయాతి ధర్మ బుద్ధీ నిగ్రహమూ ఇలాంటిది.

Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in

ఇది నన్నయ అక్కడక్కడ బయటపెట్టి ముందు ముందు జరిగిన దానికి హేతువు చూపుతూ పోతాడా అని తోస్తుంది. అపూర్వం ఏయది అని గదా అడిగారు శౌనకాదులు. అపూర్వమంటే ఇదే. చివరకు యయాతి తన కొడుకు పూరుడికి చేసిన ధర్మ బోధ చూస్తే మొదటి నుంచీ ఆయన నడత కంతటికీ అద్దం పట్టి చూపుతుందది **'ఎఱుక గలవారి చరితలు గఱచుచు'** అంటాడు. పెద్దలు చెప్పినది చేసినది ప్రమాణమని అర్థం. కనుకనే శుక్రుడిది ధర్మమంటే అలాగేనని దానికి కట్టుబడ్డాడు. **'ధర్మం బెఱుగుచు - నెఱిగిన దానిని మఱవ కనుష్ఠించునది'** అంటాడు. ధర్మం తెలియటమే గాదు. ఆచరణలో చూపాలది. అలాగే గదా చూపాడు. **'ఆశార్థుల వృథ పుచ్చక చేయునది సర్వభూత ప్రీతిన్'** అని కూడా అంటాడు. అదే గదా శర్మిష్ఠ విషయంలో ఋజువయింది. చూడండి. వరుసగా జేసిన ఈ వర్ణనల ద్వారా మొదటి నుంచీ మనం చూస్తూ వచ్చిన ఆరాజు ప్రవర్తన ఎలా తార్కాణ మవుతున్నదో మనకు.

ఇక దేవయాని విషయమంటారా. ప్రతిదీ ధర్మ విరోధమే. సోదరుడి లాంటి కచుణ్ణి ప్రేమించి వాడొప్పు కోకపోతే శాపమిచ్చి వాడి వల్ల ప్రతి శాపం నెత్తిన వేసుకొన్నది. వాడికది తగలక పోయినా తనకు తగిలింది వాడి శాపం. బ్రాహ్మణుడు నీకు భర్త అయ్యే యోగం లేదని వాడు శాపమిస్తే అలాగే జరిగింది. యయాతి అనే క్షత్రియుడే భర్త కావలసి వచ్చింది. దానికి కారణం నీవు ధర్మ విరోధం తల పెట్టావనే మాట ధర్మ విరోధం గనుకనే యయాతిని బలవంతం చేసింది పెండ్లి చేసుకోమని, ఆయన

కాదన్నా తండ్రిని రప్పించి ధర్మవిరోధం కాదని ఆయన చేత చెప్పించి మరీ పెండ్లాడింది. ధర్మబద్ధమైన శర్మిష్ఠా సంగమాన్ని ఓర్వ లేక ప్రతిజ్ఞా భంగమనే నెపంతో పెనిమిటికి తన తండ్రి చేత శాపమిప్పించింది. కానీ అధర్మ మెప్పటికీ అధర్మమే. తాత్కాలికంగా అనుకూలించినా చివరకు మేలు చేయదు. మీదు మిక్కిలి ధార్మికంగా జీవించే వాడికే చేస్తుందనే గొప్ప సత్యం కూడా తార్కాణ మవుతుందీ కథలో.

అంతే మరి. సంజీవని నీకు ఫలించదన్నా ఇతరులకది ఫలిత మిచ్చింది కచుడి ద్వారా. శర్మిష్ఠను భర్త చూడ గూడదని ఆంక్ష పెట్టినా చూడనే చూచాడు. అతని వల్లనే సంతాన మేర్పడింది దానికి. అంతేగాదు. తన పుత్రులు పెడ మొగం పెట్టి రాజ్యాధికారం పోగొట్టుకొన్నా పితృవాక్యం పాటించి దాని కొడుకు పూరుడే రాజ్యానికి వారసుడయ్యాడు. ఇవన్నీ నన్నయ కథా కథన మార్గంలో కనిపించే అందచందాలు. అక్కడక్కడ మేకు బిగించి నట్టు కొన్ని మాటలు బిగించి వాటి ద్వారా ముందు వెనుకలు కలుపుకొంటూ అన్నిటికీ అన్ని సమాధానా లిచ్చి పరిష్కరిస్తూ పోవట మెంత చాతుర్యం.

కాకపోయినా శుక్రుడు దానవులకు గురువు. అతనికి దేవతలంటే పడదు. దేవగురువు బృహస్పతి మాత్రమెలా పడతాడు. పైగా రాక్షసులను బ్రతికించటం కోసమని సాధించాడు మృతసంజీవని. అది కచుడి కిచ్చి పంపటమేమిటి. దాన్ని గొప్పగా భావించట మేమిటి. వృషపర్వుడది ఎప్పుడూ ఆయనను ప్రశ్నించక పోవటమేమిటి. మరి దేవయాని ఏది

కోరితే అది అధర్మమైనా కాదనకుండా జరపట మేమిటి. అసలా దేవయానికా మకురు తనమేమిటి. మొండి పట్టేమిటి. ఏమిటిదంతా. నన్నయ భట్టు వాచా చెప్పడు. వ్యంగ్యంగా సూచిస్తాడు. అదేదో గాదు. దేవతలకు సంజీవని దక్కవలసి ఉంది. అది ఎంత ఇష్టం లేకున్నా అందరూ సహకరించ వలసిందే. శుక్రుడి స్వభావమూ మారవలసిందే. వృషపర్వుడూ మారవలసిందే. అలాగే శర్మిష్ఠ పుత్రుడు పూరుడే సుక్షత్రియుడు. వాడే చేయాలి రాజ్యపాలన. దానికిష్టం లేకపోయినా దేవయాని తలవంచ వలసిందే. శుక్రుడూ అనుమతించ వలసిందే. అసలిదంతా శుక్రుడికి తెలిసే ఉంటుంది కూడా. తెలియక పోతే **'నీ ముదిమి దాల్చిన వాడే రాజ్యాని కర్హుడు వంశకర్త కూడా వాడే'** నని - తానే శాపమిచ్చి తానే యయాతి నిలా దీవిస్తాడా. భవిష్యత్తును ముందుగానే వెల్లడిస్తాడా. భూత భవిష్యత్తులు రెండూ దైవాధీనం. దైవికమైన ఆ ప్రణాళిక త్రికాలజ్ఞులైన మునులకు ముందుగానే కనిపిస్తుంటుంది. అందుకనే వారు దాని కడ్డం పడరు. మీదు మిక్కిలి దాని నడకకు తగినట్టు తాము నడుస్తూ పోతారు. వారి మాటలూ చేతలూ అలాగే సాగుతుంటాయి. కథలో దాగి ఉన్న ఆంతర్యమిది. ఇది ఎలా ధ్వనింప జేస్తున్నాడో చూడండి మహాకవి.

పోతే మరొక కథ విందా మది శకుంతల కథ. శకుంతలా దుష్యంతుల వృత్తాంతం బాగా ప్రసిద్ధమే. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంతో అది దేశవిదేశాలు వ్యాపించింది. అయినా ఐతిహాసికమైన కథలో ఉండే ఉదాత్తతా గాంభీర్యమూ మరెక్కడూ చూడలేమా అనిపిస్తుంది. దుష్యంతుడు పైకి

అలా కనిపించినా నిజానికి సుష్యంతుడే. అది నన్నయ ముందుగానే సూచిస్తాడు మనకు. 'అనంత సత్త్వుడని పేర్కొంటాడు. అది బలమైనా కావచ్చు. సాత్త్విక గుణమైనా కావచ్చు ఆ స్తత్వం. **'సమస్తా శాంత మాతంగ మర్యాదా లంకృత మైన భూవలయ మాత్మాయత్త'** మంటాడతనికి. **'మహోగ్రారణ్య దేశాళితో'** పాలించాడట భూమండల మతడు. అంటే చక్రవర్తి అని వేరే చెప్పనక్కర లేదు. మృగయా వ్యాసక్తుడయి ఎన్నో క్రూర మృగాల నెప్పటి కప్పుడు వధిస్తూ పోయే బలశాలి అని వర్ణిస్తాడు. అంత బల గర్వంతో ఉన్నా మరలా **'ఆది క్షత్ర చరిత్ర'** తప్పకుండా పాలించాడట. అంటే ఎంత వీర్యవంతుడో అంత ధర్మ పరాయణుడు. ఈ లక్షణం మరలా అతని కుమారుడైన భరతుడిలో వ్యక్తమవుతుంది. అది ముందుగానే సూచిస్తాడీ దుష్యంతుని వర్ణనలో మహాకవి.

ఇది మనసులో పెట్టుకొని ఇక చదువుతూ పోతే చాలు కథలో దాగి ఉన్న రహస్యాలన్నీ మనకిట్టే తెలిసిపోతాయి. వేటాడుతూ ఉన్న దుష్యంతుడెంతో భయంకరంగా కనిపిస్తాడు. ఎవరినీ లెక్క చేయని కర్కోటకుడా అనిపిస్తాడు. కాని ఒక్కసారిగా కణ్వాశ్రమం వైపు తిరిగే సరికా పరిసరాలు చూస్తూ అందులో ప్రవేశించే దుష్యంతుడీ దుష్యంతుడేనా అనేంత సాత్త్వికంగా కనిపిస్తాడు. మంత్రులనూ సేనాపతులనూ అందరినీ బయటనే ఉండమని ఆదేశించి తానొక్కడూ లోనికి వెళ్లుతాడు. ఎందుకని. శకుంతల కోసమా. కాదు. శకుంతల అక్కడ ఉంటుందని అతనికే మెఱుక. కణ్వ మహర్షికి నమస్కరించి పోదామని అతని సంకల్పం. కానీ తీరా లోపలికి

వచ్చి చూస్తే మునికి మారుగా ముని కన్యక కనిపించింది. ఎక్కడికి వెళ్లారని అడిగితే ఫలకుసుమాదులను సేకరించటానికని వస్తుంది జవాబు. అతడు దుష్యంతుడని గ్రహించిందట ఆవిడ. ఆవిడ కన్యక అని కూడా గ్రహించాడిత డంటాడు నన్నయ.

మరి ఇద్దరినీ కలపటమెలా. తండ్రిగారు వచ్చే వేళ అయింది. మీరు వచ్చారని తెలిస్తే వెంటనే వస్తారు. ఒక్క క్షణం విశ్రమించి వెళ్ళ మంటుందా పిల్ల. ఈ బాలిక రూపరేఖలు చూస్తే ఈవిడ ఎవరో గాని నాకెందు కింత అనురాగ ముదయిస్తున్నదని ఆశ్చర్య పోతాడా రాజు. నీవెవరవు ఎక్కడి నుంచి వచ్చి చేరావీ ఆశ్రమమని ఉండబట్ట లేక అడుగుతాడు. పైగా మహర్షి నిష్ఠాపరుడు బ్రహ్మచారి గదా నీవాయనకు కూతురెలా అయ్యావని ఆశ్చర్యంగా ప్రశ్నిస్తాడు. ఆవిడ తన జన్మ వృత్తాంతమంతా దాచకుండా బయట పెడుతుంది. తనకెలా తెలిసిందది. ఎవరు చెప్పారు తనకు. తన తండ్రి అక్కడి మహర్షులకు యాదృచ్ఛికంగా చెబుతుంటే విన్నానంటుంది. ఇలా వారి సమాగమానికి కావలసిన పూర్వరంగ మంతా ఏర్పరిచాడు మహాకవి. ఇక సమాగమ మెలాగ. తన కోరిక వెలిబుచ్చాడు దుష్యంతుడు. తనకూ అది ఇష్టమే అయినా తండ్రిగారి అనుమతి తీసుకొందా మంటుందావిడ. ఇది గాంధర్వం. దీనికెవరికి వారే స్వతంత్రులని సర్ది చెబుతాడు దుష్యంతుడు. కామాసక్తిలో కూడా ఎంత ధర్మ దృష్టి ఉందో చూడండి ఇరువురికీ. అది మాటి మాటికీ స్ఫురింప జేస్తూనే ఉంటాడు కవి.

Valluri Bramarasi Srinivasa Rao www.advaitavedanta.in

గాంధర్వమనేది క్షత్రియుల కనుమతమే. కాబట్టి తరువాత తెలిసినా కాదనబోడు కణ్వుడని ఇద్దరికీ ధైర్యం. అలాగే జరిగింది తరువాత. జరిగినదంతా కణ్వుడు దివ్యదృష్టితో తెలుసుకొని అభినందిస్తా డిద్దరినీ, గర్భస్థుడైన శిశువు చక్రవర్తి కాబోతాడు సుమా అని ముందుగానే దీవిస్తాడు. పిమ్మట భరతుడు జన్మించటమూ అక్కడి వన్యమృగాల నన్నింటినీ దమించటమూ - అది చూచి మునులందరూ సర్వదమనుడని అతనికి పేరు పెట్టటమూ గమనిస్తే అంతకు ముందు వర్ణించిన దుష్యంత వర్ణనకు ప్రతిరూపంగా భాసిస్తుంది. మనకలా భాసింప జేస్తాడు వాగను శాసనుడు.

తన తనయుడు చక్రవర్తి అవుతాడనే శకుంతల కంత ధైర్యం. పైగా దుష్యంతుడు తన పరివారాన్ని ఆశ్రమానికి పంపి సగౌరవంగా రాజధానికి తీసుకుపోతానని వాగ్దానం చేశాడు కూడా. అందుకేనేమో కొన్ని సంవత్సరాలు గడచినా కొడుకు బాగా పెరిగి పెద్దవాడయ్యే వరకూ ఆశ్రమంలోనే ఉండిపోయింది. వీడు సమస్త లక్షణ లక్షితుడు రాజ్యపాలన కర్హమైన సమయం వచ్చింది. నీవు భర్త వద్దకు వెళ్లటం సమంజసమని శిష్యులను తోడిచ్చి పంపుతాడు కణ్వుడు. అది ఇంకా కొండంత బలమామెకు. తన కుమారుడు చక్రవర్తి కావాలంటే పతి ఎలాగూ తన్నాదరించక తప్పదు. ఆ ధైర్యంతోనే వెళ్లింది నగరానికి. భర్తను వేడుకొన్నది. అతడు తెలిసి కూడా తెలియనట్టు ప్రవర్తిస్తాడు. అంచెల వారిగా ఆతని ముఖకవళికలు మారుతుంటే వాటినాశ్చర్యంగా గమనిస్తూ ఎక్కడి కక్కడ వ్యాఖ్యానిస్తూ పోవటమెంతో అద్భుతంగా వర్ణిస్తాడు నన్నయ. ఎన్ని ధర్మాలు వల్లిస్తుందో

ఆవిడ లెక్కలేదు. నయాన భయాన చెబుతుంది. మందలిస్తుంది. ఎవరూ చూడలేదనుకోకు. సూర్యచంద్రులూ - పంచభూతాలూ - అన్నీ సాక్షులే. సత్యం కన్నా విలువైనది లేదు. అశ్వమేధాదు లెన్నైనా సత్యంతో సరిగావు. అది తప్పి ప్రవర్తిస్తే దెబ్బ తింటావని బెదిరిస్తుంది. అప్పటికీ నాకు తెలియదు పొమ్మంటాడతను.

ఏమిటీ ఇరువురి వ్యవహారం. ఆవిడకు తెలుసు తన పుత్రుడే చక్రవర్తి అవుతాడు. ఎలాగైనా తన భర్త తన్ను దగ్గర జేర్చుకోక తప్పదని. అందుకే 'పుత్రగాత్ర పరిష్వంగం' చేయి ఇది నీ భోగ భాగ్యాల కంటే విలువైనదని చెప్పి అదీ అతడు పెడ చెవిన బెడితే ఎప్పటికైనా నీవే పిలుస్తావులే నాదేమి పోయిందని ఆస్థానం విడిచి వెనక్కు మరలి పోబోయింది. ఎంత ధైర్యం. ఎంత ఆత్మ విశ్వాసం. ఎలా వచ్చిందావిడకు. మొదటి నుంచీ ఉందావిడకా ధర్మ దీక్ష. దానికనుగుణంగా తనకు దైవం తోడ్పడుతుందనే విశ్వాసమూ ఉంది. పైగా తన కొడుకు చక్రవర్తి అవుతాడని ఇంతమంది పెద్దలు చెబితే అది ఎలా జరగకుండా పోతుంది.

మరి దుష్యంతుడి వ్యవహారమో. మోసం చేయాలనీ మాట తప్పాలనీ లేదతనికీ. ధర్మబద్ధుడే అతడు కూడా. అదీ మొదటి నుంచీ మనకు కనిపిస్తూనే ఉంది. ఎందుకు మరి ఈ నిర్లక్ష్యతా - ఉదాసీనతా. సభాసదుల కెవరికీ తెలియదు గదా తన రహస్య వ్యవహారం. ఉన్నట్టుండి ఒక స్త్రీని తన భార్య అనీ ఆవిడ పుత్రుణ్ణి తన పుత్రుడనీ చెప్పి వాడికి పట్టాభిషేకం చేస్తే అది ప్రజానీకానికి విడ్డూరంగా తోచవచ్చు. అయితే మరి ఒక

ఆడకూతురికి అన్యాయం చేయటం లేదా అని అడిగితే ఆమె ధర్మమే ఆమెను కాపాడుతుంది. అదే చివరికీ సమస్యను పరిష్కరిస్తుంది. అలా జరగకుంటే అప్పుడా లోచిద్దామని అతని భరవసా. అలాగే జరిగింది చివరకు. అందరి బదులూ ఆకాశవాణే బదులు చెప్పింది. జరిగిన ఉదంత మంతా నలుగురికీ చాటి చెప్పి సమస్యను పరిష్కరించింది. దానికీ భయమే. బయట పెట్టక పోతే భర్త వినడు. ఆ భార్య కుఱ్ఱవాణ్ణి తీసుకొని వెళ్లిపోతుంది. భావి చక్రవర్తి ఎవడిక. ఎక్కడి నుంచి వస్తాడు. కణ్వముని మాట ఏమికావాలి. శకుంతల అడిగిన వరమేమి కావాలి. దుష్యంతుడావిడ కిచ్చిన మాట ఎలా ఫలించాలి. ఎవరూ కాకపోయినా చివరకు కణ్వుడే కలుగజేసుకొని అమ్మాయిని వెంట బెట్టుకొని ఆస్థానానికి రాలేడా. నలుగురి ఎదుటా జరిగినదంతా బయటపెట్టి దుష్యంతుణ్ణి కడిగిపారేయడా.

అయితే అలా జరగకూడదు. జరిగితే అంత పెద్ద చక్రవర్తి కవమానం. ప్రజల సమక్షంలోనే పరువు పోతుంది. తాను అబద్ధాల కోరూ కక్కుర్తి మనిషి అని కళంకం తెచ్చుకొంటాడు. అంతేకాదు. శకుంతలకూ అది అవమానమే. తన రహస్యం బయటపడితే. కణ్వుడికీ కూడా అవమానమే. పవిత్రమైన ఆశ్రమంలో తన బోటి మహర్షి సన్నిధిలో ఎండ కన్నెరగ కుండా పెరిగిన పిల్ల ఇంత సాహసం చేసిందంటే. ఏమి మహర్షి ఈయన - ఏమి పెంపక మీయన పెంపకమని గుసగుస లాడరా నలుగురు. కనుక మనుష్యు లెవ్వరూ చేయరాదీ పరిష్కారం. దైవమే చేయాలి. మనుషులు చేస్తే నమ్మవచ్చూ జనం. నమ్మకపోవచ్చు. దైవం చేసిందంటే నమ్మి

తీరుతారు. అదే ఆకాశవాణి. దాని వాణికిక తిరుగులేదు. చిత్రమేమంటే అది శకుంతలకూ తెలుసు. దుష్యంతుడికీ తెలుసు. కణ్వ మహర్షికి బాగా తెలుసు. దివ్య దృష్టితో వారి రహస్య వృత్తాంతమంతా గ్రహించిన వాడికా తరువాత ఏమి జరగబోతుందో ఆమాత్రం గోచరం కాదా. కనుకనే ఎవరికి వారి కంత నిబ్బరం. బరవసా.

అయితే మొదటనే తేల్చి వేయరాదా. ఆకాశవాణి అయినా ఇంత దూరం సాగదీయటం దేనికి. కాలహరణం గదా అని అడిగితే నన్నయ గారిచ్చే సమాధాన మేమిటో తెలుసా. కథా కలితార్థ యుక్తి. అంటే పూర్వాపరాంశాలను కలుపుకోటమే గాదు. అర్థమంటే పురుషార్థం కూడా. అది కామమూ కావచ్చు. ధర్మమూ కావచ్చు. కామ మనుభవించ కూడదని గాదు. ధర్మావిరుద్ధంగా అనుభవించాలది. కనుక ఎక్కడ అది దెబ్బ తింటుందో అక్కడ ధర్మాన్ని స్మరిస్తూ ఉండటం మన కర్తవ్యం. ధర్మాన్ని గుర్తు చేసుకొని కామం వల్ల కలిగే పరాజయాన్ని జయంగా మార్చుకొంటూ పోవాలి. ఇదీ నా ఆశయమంటా డాయన. అందుకే శకుంతల ద్వారా ఆ రాజాస్థానంలో అన్ని ధర్మా లేకరువు పెట్టిస్తాడు. అంతగా ధర్మ శ్రవణ మెప్పుడు చేశారో అప్పుడే ఆకాశవాణీ శ్రవణం కూడా చేయగలిగారు. అంతవరకూ తెమలని సమస్యకు పరిష్కారం కూడా చూడగలిగారు. దానితో ఎవడెందు కలా ప్రవర్తించారో అర్థమయింది. ఏది అలా వారి చేత ప్రవర్తింప జేసిందో కూడా అర్థమయింది.

ఇంత గంభీరమైన భావం దృష్టిలో ఉంచుకొని ఎలా చేశాడో చూడండి ఈ కథా సృష్టి నన్నయ భట్టారకుడు. అంతా చూస్తే ఇది ఒక నాటక మనిపించటం లేదూ. నాటకమే. నాటకమే కాకపోతే దుష్యంతుడు వేటాడి ఆశ్రమ సమీపానికి వస్తుంటే **'అతి రుచిరా గతుండయిన యాతనికి'** లతా లలనలు పుష్పాలనే లాజలు చల్లారని పక్షులు కిల కిలా రావాలతో దీవన లిచ్చాయని వర్ణిస్తాడా కవి. ఇది సరిగ్గా నాటకంలో నాందీ ప్రస్తావనలను తలపించటం లేదూ. సూత్రధారుడు నాంద్యంతంలో సభాసదుల మీద పుష్పాలు చల్లి వెళ్లిపోతాడు. ఇక్కడ పుష్పాలనే లాజలు చల్లారనటంలో శకుంతలా దుష్యంతుల గాంధర్వ వివాహాన్ని ముందుగానే ధ్వనింప జేస్తున్నాడు కవి. బహుశా నాటక బాణీ బాగా నేర్చినట్టున్నాడు నన్నయ్య.

ఇలాటి నాటక శిల్పం మరలా బకాసుర వధలో చాలా చక్కగా ప్రదర్శించాడు. పాండవులెవరికీ అంతు పట్టకుండా మారు వేషాలతో ఏకచక్రపురంలో ఒక బ్రాహ్మణుడి ఇంట నివసిస్తుంటారు. ఉన్నట్టుండి ఆ ఇంటిలో ఒక పెద్ద ఆక్రందనం వినిపిస్తుంది. అదేమిటో ఎందులకో కుంతికి తెలియదు. భీముడి కంతకన్నా తెలియదు. ఎమైనా సరే. తమ కాశ్రయ మిచ్చిన ఆ బ్రాహ్మణుడి నెలాగైనా ఆదుకోవాలని వారికి వచ్చిన ఆపద తీర్చాలని తలపోస్తుంది కుంతి. అది తన కొడుకు భీముడి వల్లనే జరుగుతుందని ఆమె నమ్మకం. కనుక అతనితో ముందుగానే తన నిశ్చయాన్ని వెలిబుచ్చుతుంది. ముందు విషయమేదో తెలుసుకొనిరా అది

ఎంత అసాధ్యమైనా నేను సాధించగల నంటాడు భీముడు. ఇలా రాబోయే బకాసుర వధకు పూర్వరంగ మంతా సిద్ధం చేస్తాడు కవి.

పిమ్మట కుంతి ఆ బ్రాహ్మణుడూ ఆయన కుటుంబ సభ్యులూ ఉన్న చోటికి వచ్చి కొంత దూరాన నిలబడి చూస్తుంటుంది. అప్పుడే కలగజేసుకోదు. అలాంటి సందర్భమూ కాదది. ఎందుకంటే వారొకరిని మార్చి ఒకరు పెద్ద పెట్టున విలపిస్తూ బాధ పడుతున్నారు. అవకాశం లేదు వారితో మాటడటానికి. అది ఎలా ఉందంటే బ్రాహ్మణుడూ ఆయన భార్యా కూతురూ కొడుకూ అందరూ ఆయా వేషాలు వేసుకొని రంగస్థలం మీదికి వచ్చిన పాత్రలుగా కనిపిస్తారు మనకు. వారి మనోవేదనా మాటలూ హావభావాలూ – అన్నీ ఆయా పాత్రల అభినయంగా భాసిస్తుంది. పోతే ఈ ప్రదర్శన అంతా గుడ్లప్పగించి చూస్తున్న ఒక ప్రేక్షకుడిలాగా కనిపిస్తుంది కుంతీదేవి. పోతే భీమసేను డావిడనా నాటకం చూచి రా పొమ్మని పంపిన ఒక నిర్లిప్తుడైన మధ్యస్థుడి లాగా ఉండిపోతాడు.

కుంతి వారితో మాటాడాలని విషయం తెలుసుకోవాలనే వచ్చిం దక్కడికి. కాని వారవకాశ మివ్వటం లేదు. ఎవరికి వారు నేను పోతా నా రాక్షసుడి పాలికి. నేను వాడి కాహార మవుతానని కుమ్ము సుద్దు లాడుతున్నారు. భార్య గుణ గణాలు తడవి ఆమెను పంపట మిష్టం లేక తాను పోతానంటాడు భర్త. భర్త మహత్త్వాన్ని ప్రశంసిస్తూ మీరు వద్దు నేనే వెడతానంటుంది భార్య. మీరెవ్వరూ కాదు. నా వల్ల ప్రయోజనం లేదు. నేను వెడతానంటుంది కూతురు. వారి ఈ సంభాషణ ఎంతో సహజంగా

సాగటమే గాక ఒకరినొకరు మెచ్చుకోటంలో పరస్పరం వారి కున్న అనురాగం భక్తి గౌరవం మొదలైన గొప్ప భావాలెన్నో అభివ్యక్త మవుతాయి. ఆదర్శప్రాయమైన కుటుంబమంటే ఇలాగే గదా ఉండవలసిందనే పవిత్ర భావ మేర్పడుతుంది మనస్సుకు. పోతే వారి మాటల్లో దొర్లిన ధర్మ సూత్రాలు చూస్తే ఇన్నీ అన్నీ గావు. స్మృతికారులు చెప్పిన ధర్మాలన్నీ ఒక్కచోట రాశీభూతమై సాక్షాత్కరిస్తాయి. భట్టారకుడీ ప్రసంగం మూలంగా ఉత్తమ గృహస్థ ధర్మ స్వరూపం బయట పెట్టాలనే నడిపాడా ఈ కథ నిలాగా అనిపిస్తుంది మనకు.

నాటకమంతా ఇలా విస్తుపోయి చూస్తున్నది కుంతి. అవసరం దొరక లేదు పలకరించటానికి. ఉన్నట్టుండి ఒక గమ్మత్తు జరిగింది. బ్రాహ్మణుడూ ఆయన భార్యా కూతురూ – ముగ్గురూ ఎవరికి వారు తమ మనోనిశ్చయం వెళ్లబోసు కొన్న తరువాత అందరికన్నా చిన్న వాడాయన కుమారుడొక కోల చేతబట్టుకొని దాని నాడిస్తూ నన్ను పంపండి నేనా రాక్షసుణ్ణి ముక్కలు ముక్కలు చేసి వస్తానంటాడు. వాడి మాటలకూ చేతలకూ నవ్వు వచ్చి ముగ్గురూ కొంచెం సేపు ఊరట చెంది మౌనంగా ఉండిపోతారు. ఇది నాటకంలో ఒక **Suspense** లాగా తయారయింది. వెంటనే ఇదే అదనని కుంతీదేవి వారి దగ్గరకు వచ్చి అయ్యా! ఏమిటి మీరెందుకిలా బాధ పడుతున్నారని అడిగితే బకాసురుడి వృత్తాంతం బయట పెడతాడా బ్రాహ్మణుడు. అయ్యో! ఇదా మీ సంగతి. ఈ మాత్రానికేనా మీరింత పరితపిస్తున్నారు. మీరెవరూ వెళ్లనక్కర లేదు. మీ కొక్కడైతే

నాకైదుగురున్నారు. వారిలో నేనొకణ్ణి పంపుతా నా అసురుడి కాహారంగా నని హామీ ఇస్తుంది. అయ్యో! మీరు మా కతిథులు. అతిథిని అందులోనూ బ్రాహ్మణుణ్ణి మాకోసం బలిగా పంపట మెంత పాతకమంటా డాయన. అది పాతకమైతే నీవు మాత్రం బ్రాహ్మణుడవు కావా. నీవు బలియై పోతుంటే మేము మాత్రం చూడగలమా – అని అప్పుడు బయట పెడుతుంది తన కుమారుడి బలపరాక్రమాలను. అంతవరకూ ఎవడో బ్రాహ్మణ కుమారుడనే భావిస్తుంటాడా బ్రాహ్మణుడు. కాదు. మావాడి పరాక్రమం మీకు తెలియదు. ఎంతో మంది రాక్షసుల నింతకు ముందే మట్టు పెట్టిన బలశాలి. వీడొక లెక్కగాదని హామీ ఇస్తుంది. ఇదీ ఒక **Suspense**. అది విన్న తరువాత ఒప్పుకొంటాడా గృహస్థు.

భీముడి కంతా తెలిసి కూడా ఏదీ తెలియనట్టు చాటున కూచొని తల్లి వచ్చి తనతో ఏమి మాటాడుతుందో చూతామని ఆలోచిస్తుంటాడు. ఆవిడ వచ్చి ముత్యం వంటి మాట తన చెవిన వేయగానే మహా ఉప్పొంగి పోతాడు. అలాటి సందర్భ మెప్పుడు వస్తుందా – బాణాసురుడిలాగా తన చేతుల తీట ఎప్పుడు తీరుతుందా – అని గదా అతని తహ తహ. అందుకే గదా వారి బాధ ఏమిటో తెలుసుకొని వెంటనే వచ్చి నాకు చెప్పు – అది ఎలాటి అసాధ్యమైన కార్యమైనా సాధించి తీరుతానని తల్లి నక్కడికి పంపాడు. అయితే తల్లి తిరిగివచ్చి అతనికా విషయమేమిటో చెప్పిందని చెప్పడు కవి. పాఠకులూహించు కోవాలది. ఉన్నట్టుండి ధర్మరాజాదులు వస్తారక్కడికి. అంతకు ముందు వారేమయ్యారు. అక్కడ లేరా. ఏదో పనిమీద

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

బయటికి పోయి ఉంటారు. అలా జరిగితేనే అందం కథలో. భీముడూ కుంతీ మాత్ర ముంటేనే స్వారస్యం. రాగానే అతని వాలకం చూచి సందేహించి తల్లి నడిగి విషయం తెలుసుకొంటాడు ధర్మరాజు. తల్లి చెబుతుంది జరిగినదంతా. అయ్యో ఎందుకిలా బరవసా పడ్డావంటే నీకేమీ తెలుసు మనవాడి సంగతి. చిన్నప్పుడే నా చంక నుండి నేలమీద బడి కొండ బండలు నుగ్గు చేసిన బలవంతుడని నచ్చ చెబుతుంది. సరేనని అతను కూడా తమ్ముని నియోగిస్తాడా పనికి. ఆ తల్లి అలా ప్రవర్తించిందంటే దానికెంత పూర్వరంగముందో **Back ground** చూడండి.

ఇంకొక తమాషా ఏమంటే భీముడు బయటికి వచ్చి అక్కడి వాళ్లతో – సరే నేను రాక్షసుణ్ణి చంపటానికి వెళ్లాలి గదా నాకేమి ఆహారం పెడతారో పెట్టండని అడుగుతాడు. ఏమిటర్థం. రాక్షసుడే వాడు. ఈ బ్రాహ్మణుడెంత బలవంతుడని చెప్పినా వాణ్ణి చంపగలడా అని వారి కనుమానం తగలకుండా అడిగిన మాట ఇది. ఇది ఒక కల్పన కవిగారిది. రాక్షసుణ్ణి హతమార్చాలంటే రాక్షసుడిలాగా తిండి తినాలి. అప్పుడే నమ్ముతా రందరూ. వెంటనే తెచ్చి పడేశారు రాసులు రాసు లాహార పదార్థాలు. కుంభకర్ణుడి లాగా అన్నీ వారి సమక్షంలోనే కూచొని ఒక్క క్షణంలో ఆరగించి గట్టున త్రేచాడు. ఇక వారందరికీ నమ్మకమే పని సాధిస్తాడని. బండి మీద అన్నీ అమర్చి పెడితే బయలుదేరాడా కొండదరికి. పిలిచాడు కేక వేసి బకాసురుణ్ణి. వాడు వచ్చే లోపుగా బండి మీద కూచొని బండీ ఎనుబోతులూ మినహా అన్ని పదార్థాలూ గుటకాయ స్వాహా చేస్తున్నాడు. వాడు లేచి వచ్చి తన్ను

తిడుతున్నా కొడుతున్నా మారు మాటాడక తింటూనే ఉన్నాడట. ఏమిటీ దృశ్యం. శ్రవ్యమా దృశ్యమా. నాటక దృశ్యంలాగా కళ్లకు కట్టినట్టు చూపుతున్నాడు నన్నయ మన మనోనేత్రానికి.

సరే తరువాత వృక్షయుద్ధం. ముష్టి యుద్ధం బాహు యుద్ధం. అన్ని యుద్ధాలూ సక్రమంగా జరిగాయి. కటి కంఠ ప్రదేశాలు ఒత్తి పట్టి వాడు రక్తం గ్రక్కుతుంటే పిడికిళ్లతో పొడిచి మొత్తం మీద అంత మొందించాడు. వాడి అరుపులూ బొబ్బలూ విని రాక్షసులంతా పరుగెత్తుకొని వస్తే వారికి వాణ్ణి చూపి ఇక ఎప్పుడూ కీడు తల పెట్టకండీ పట్టణవాసులకు. తలపెట్టారో ఇదే మీకూ గతి అని హెచ్చరిస్తాడు. భయపడి వారందరూ పరారయి పోతారు. అక్కడి కుపశమించక ఆ రాక్షసుడి కళేబర మీడ్చుకొంటూ వస్తాడేక చక్రానికి. పదిమందికీ చూపి చెబుతాడు మౌనంగా తాను చేసిన ఘనకార్యం. నమ్ముతారా లేదా వారు. నమ్మారట. ఏమనో తెలుసా. **'వీడొక మంత్రసిద్ధుడగు విప్రుండ'**ని. మామూలు విప్రుడేమిటి. వాణ్ణి చంపటమేమిటి. మంత్ర తంత్రాదు లెరిగిన వాడైతే వాడికిక ఎదురు లేదు. అగస్త్యాది మహర్షు లలాటి వారేగదా అని వారికి విశ్వాసం. పోతే అలాటి మంత్రసిద్ధుడెలా ఉంటాడో చూతామనే కుతూహలంతో వచ్చి చూచారట వేత్రకీ తీరవాసులు కూడా అక్కడి కని చెప్పి ముగిస్తాడీ కథ మహాకవి. ఎంత లోక ధర్మ మెంత చక్కగా చూపుతున్నదో ఎంత కళాత్మకంగా నడిచిందో చూడండి చిన్న కథే అయినా ఇది.

పోతే ఆదిపర్వంలో ఇంకొక కథ ఉంది మనం చూడవలసింది. సుభద్రార్జునుల కథ. అర్జునుడికి సుభద్ర ముందుగా తెలుసు. సుభద్రకు కూడా తెలుసు అర్జునుడు. ఎటు వచ్చీ నన్నయ భట్టు ముందుగా చెప్పడీ సంగతి మనకు. తీర్థయాత్రకు బయలుదేరు తాడర్జునుడు. అన్ని తీర్థాలు తిరిగి ప్రభాసానికి వస్తాడు. అక్కడికి ద్వారక చేరువే గదా ఒకమారు వెళ్లి తన బావగారిని దర్శించి పోదామని ఆలోచన వస్తుంది. అంతేనా మరేదైనా ఉందా మనసులో. లేకేమి. ఆ వంకతో సుభద్రను కూడా చూడవచ్చునని అతని ఉబలాట మంటాడు నన్నయ. వెంటనే వేషం మార్చి ఒక యతి వేషం ధరించి మనసులో గోవిందుని ధ్యానిస్తూ కూచున్నాడట. ఎందుకని. తాను ఫలానా అని ద్వారకలో ఎవరూ గుర్తించ గూడదు. మామూలుగా అయితే గుర్తించినా ఇబ్బంది లేదు. మామూలుగా లేడు గదా తానిప్పుడు. సుభద్ర కోసమని వచ్చాడు. అది కృష్ణుడి కిష్టమైనా బలరామాదుల కిష్టం లేదు. అయితే యాదవులకు యతీశ్వరులంటే భక్తి. కనుక ఆ వేషంలో అందరూ తన్ను గౌరవిస్తారు. మరి కృష్ణుడో. ఆయన కిష్టమే. పైగా ఆయన ప్రాపకముంటే గాని తన పని నెరవేరదు. అందుకే ఈ వేషం. ఈ ధ్యానం. ధ్యానించాడో లేదో ఎదుట సాక్షాత్కరించాడు కృష్ణ పరమాత్మ.

నిన్ను చూడాలని వచ్చానని అర్జునుడంటే నవ్వాడు. ఏమిటా నవ్వులో ఆంతర్యం. నాకోసమని ఒక నెపం. అసలు '**సుభద్ర యందు బద్ధాను రాగు**'డని అతని ముఖం చూచే గ్రహించాడట కృష్ణుడు. వెంటనే రైవతకాద్రి కతనితో పోయి ఆరాత్రి అక్కడ గడిపి తెల్లవారగానే అర్జునుణ్ణి అక్కడే

ఉండమని ద్వారకకు వెళ్లి రైవతక మహోత్సవం చాటిస్తాడు కృష్ణుడు. అందరూ వస్తా రుత్సవంలో పాల్గొనటానికి. సుభద్ర కూడా వస్తుంది. ప్రణామం చేస్తుందాయనకు మనసులో అర్జునుడే తనకు పెనిమిటి కావాలని. చూడగానే సుభద్ర అని గ్రహించి కామ పరవశుడవుతాడట అర్జునుడు. కృష్ణుడది గమనించి నాకు తెలుసునోయి నీవు సుభద్ర కోసమే వచ్చావని. తొందరపడకు పెద్దలకు చెప్పి మీ పెండ్లి కన్నీ సిద్ధం చేస్తానని ద్వారకకు తోడ్కొని పోతాడు. ధర్మరాజాదుల కర్జునుడు తన వద్ద క్షేమంగా ఉన్నాడని చారముఖంగా వార్త అందజేస్తాడు. ఎంత మెళకువో చూడండి. ఇంతలో బలదేవాదులు వచ్చి యతి అనే భావంతో పూజించి అయ్యా ఈ చాతుర్మాస్యం మీరు మా వీటనే గడపాలని కోరుతారు. కృష్ణుడి ప్రమేయం లేకుండా వారే అతణ్ణి కన్యాపురంలో విడిది చేయించి పరిచర్య కోసమని సుభద్రను వినియోగిస్తారు. ఇంకేమి అర్జునుడి రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే.

కల్పన అయినా ఎంత సహజ సుందరంగా సాగుతున్నదో చూడండి. కృష్ణుడు సత్యా రుక్మిణులకు మాత్రమే. చెవిలో వేస్తాడీ రహస్యం. మరెవ్వరికీ తెలియదట. కృష్ణుడు చెప్పకపోయినా సుభద్రకావిడ అంతరాత్మ చెబుతూనే ఉన్న దాయన యతిగాదు. యతి వేషంలో ఉన్న అర్జునుడని. కారణం నన్నయ్య నడిగితే **అలిలీలకుంతలుడు – హరినీల వర్ణ – దాజాను బాహుడు – నలిన దళాకార నయనుడూ ఉత్తుంగ ఘన విశాలోరస్కుడూ'** అర్జునుడు కాక మరెవ్వడని. ఆమాత్రం పోల్చుకోలేదా సుభద్ర అంటాడు. పోల్చుకొన్న దావిడ. అయినా సంశయం తీర్చుకోవాలని అడుగుతుందతని కనుమానం

తగలకుండా. చాలా చమత్కారంగా. మీరు యాత్రా సందర్భంగా క్షేత్రాలూ పట్టణాలూ రాజవంశాలూ ఎన్నో చూచి ఉంటారు గదా. ఇంద్రప్రస్థం చూచారా. మా అత్త కుంతీదేవిని చూచారా. అని అంటూ అంటూ మహావీరుడర్జున దేమైనా మీకంటబడ్డాడా తీర్థయాత్ర కతడు కూడా వెళ్లాడని విన్నాము. తిరిగి ఇల్లు చేరాడా అని అడగనట్టే అడుగుతుంది. అంతిపురంలోనే కూచొని ఆ కన్నె కెన్ని సంగతులు తెలుసో చూడండి. ఆవిడ మాటలలో తనమీద ఆమె కెంత అనురాగముందో బాగా గ్రహించి ఉంటాడర్జునుడు. ఇక తెర మరుగేల అని నేనే ఆ అర్జునుడనని బయట పడతాడు. పెద్దవాళ్లున్నారు గదా వారే చూస్తారని సిగ్గుతో పరుగెడుతుంది సుభద్ర. అది తెలిసి రుక్మిణీ సత్య లకాయన విషయం మీరు చూడండని నియోగిస్తాడట కృష్ణుడు. ఎంత సుకుమారంగా మలుపు తిప్పుతున్నాడో చూడండి కథా వస్తువును నన్నయ భట్టారకుడు.

ఇంత కన్నా చిత్రమైన మలుపే మంటే బలదేవాదు లెఱుగ కుండా దేవకీ వసుదేవాదుల నందరినీ పిలిచి సభ చేసి వారికీ రహస్యం బయట పెట్టి సుభద్రార్జునుల వివాహం వారికీ మొదటి నుంచీ సమ్మతమే కాబట్టి అందరి చేతా భేషనిపించి - మరి బలరామాదు లెలాగా అని భావించి పశుపతి పుజావ్యాజంతో అంతర్ద్వీపానికి సాగనంపుతాడు వారిని. తానూ వారిలోనే ఉన్నట్టు నటించి ఇంతలో సుభద్ర తన్ను స్మరించగానే వసుదేవాదులను తన పార్టీ వారిని మాత్రమే వెంట బెట్టుకొని ద్వారా వతి చేరుతాడు - అర్జునుడు తన్ను స్మరించగానే. స్వర్గం నుంచి దేవేంద్రాది

పెద్దలందరూ వచ్చి దిగుతారు. ఇరువర్గాల వారూ తారసిల్లి ఎట్టకేలకు చాలా వైభవోపేతంగా పెండ్లి జరుపుతారు. ఇక మీరిక్కడ మసల వద్దు వెంటనే ఇంద్రప్రస్థానికి వెళ్లి పొండని ఒక రథంలో కూచోబెట్టి సాగనంపు తాడు దంపతులను.

అనంతర మిదంతా చారుల వల్ల తెలిసి పోతుంది అంతర్ద్వీప వాసులందరికీ. యాదవ సైన్యమూ పాటికే వెళ్లి అర్జునుణ్ణి ఎదిరించి అతని ధాటికి నిలవలేక వచ్చి బలరామాదులకు మొరబెడతారు. బలరాముడు కొలువు దీర్చి అర్జునుడి ఆట కట్టించి తీరవలసిందేనని యాదవ వీరులు ఊగుతుంటే వారికీ వారించి కృష్ణుడి వైపు చూచి నీకు తెలియకుండానే ఇంత పని జరుగుతుందా అని ప్రశ్నిస్తాడు. దానికేమి అన్నయ్యా! అర్జునుడంటే ఎవడు. మన మరదేగదా. వాడు తన మేనమరదలిని ఇష్టపడి పెండ్లాడి తీసుకొని పోవటంలో తప్పేముంది. దానికి మనం కంగారు పడటం దేనికి. ఇంత సంరంభం దేనికి అని సర్ది చెబుతాడు. ఎంత మనోహరంగా ఉందో చూడండి ఈ సన్నివేశం. దీనిమూలంగా బలరాముడి వంటి మహాబలశాలి రంగంలోనికి రాకుండా తప్పించాడు మహాకవి. తన తమ్ముడు సకలమూ తెలిసినవాడు. అతడు తెలియకుండా చేస్తాడా ఏ పనిగానీ. కాకపోయినా అర్జునుడెవడో పరాయివాడు కాదు గదా. పైగా మన పిల్లే వాణ్ణి ఇష్టపడి చేసుకొన్న దిక మన కెందుకింత సంరంభమని అన్నగారూ ఆయనతో పాటు అక్కడ చేరిన నలుగురూ ఎవరికి వారుపశమించేలా చేయటంలో ఉంది కృష్ణుడి

నేర్పు. కాదు. అలా చేయించటంలో ఉంది కవిగారి నేర్పు. ఒక నాటకంలా జరిగి పోయిందంటే నిజంగా నాటకమే ఇది. జగన్నాటక సూత్రధారి ఆడింది నాటకంగాక మరేమిటి. అలాటి అద్భుతమైన నాటకాన్ని మన కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి చూపుతున్నాడు భట్టారకుడు.

పోతే ఇక సభాపర్వం పర్వమంతా ఒక మహా నాటకం. శ్రవ్యమా దృశ్యమా అది. ఏదీ తేల్చుకోలేని గొప్ప శిల్పం. కథలోనే ఉన్నదలాంటి పట్టు. దాన్ని పట్టుకొని నన్నయభట్టు నడపటంలో ఉన్నదంత కన్నా గొప్ప గుట్టు. మహాభారత కథా వస్తువంతా ఇందులోనే గుప్తమయి ఉన్నదసలు. భారత కథ ఒక వృక్షమైతే సభాపర్వం దానికొక బీజం. బీజమే పెరిగి పెద్దదయి శాఖోపశాఖాత్మకమైన వృక్షంగా మారినట్లు ఇటూ అటూ ప్రసరించినట్లు – పరిసరాల నంతా కమ్ముకొన్నట్లు – సభా పర్వవృత్తాంతం పూర్వోత్తర భారత భూమినంతా కమ్ముకొన్నది. అది ఎలాటిదో ఆ వ్యాప్తి – అందులో నిగూఢంగా దాగి ఉన్న ఆ కళా రహస్య మెలాంటిదో – వ్యాసమహర్షి నడిగితే చెబుతాడు. వ్యాస హృదయ మర్థం చేసుకొన్న వాగను శాసనుణ్ణి అడిగితే చెబుతాడు.

ఆదిపర్వంలోనే సభాపర్వ మారంభ మయిందసలు. సభ అంటే పదిమందీ కలుసుకొనే వ్యవహారమే గదా. ఎవరా పదిమందీ. కౌరవ పాండవ కుమారులే. ఇంకెవరు. మహా అయితే ఇటు వీరికీ అటు వారికీ కోచింగిచ్చే పెద్ద మనుషులు. విదుర భీష్మ ద్రోణ శకుని కర్ణాదులు. అందరి సమక్షంలో అస్త్ర విద్యా ప్రదర్శన జరిగింది. అందులోనే గొడవ

బద్ధారిద్దరూ. యుద్ధమే జరగవలసింది. ఎలాగో నలుగురూ సర్ది చెప్పి అది శీతల సమరంగా తప్పిపోయింది. తప్పటమంటే బాహ్యంలో. అది నివురు గప్పిన నిప్పు. ఆంతర్యంలో రగులుతున్న మంట. ఎప్పుడైనా రావచ్చు నది పైకి. వచ్చింది కూడా ఒక విధంగా. అదే ఖాండవ దహనం. ఆ వనమేదో గాదు. కౌరవ వనమే. అది దహించిన వాడనలుడా. కాదు. పాండవ కోపా నలుడు. చేయించిన వారెవరో గాదు.కృష్ణార్జునులే. అన్యాపదేశంగా ఇది ఆ తరువాత రాబోయే మహాభారత సంగ్రామాన్ని ఎలా ధ్వనింప జేస్తున్నదో భావుకులైన వారూహించు కోవచ్చు. పోతే ఈ ముందు జరుగుతూ వచ్చిన శీతల యుద్ధానికీ **Cold War** తరువాత జరగబోయే ఉష్ణోగ్ర యుద్ధానికి **Hot War** రెండింటికీ సంధాన కరణి ఈ సభాపర్వ వృత్తాంతం. ఇది మనసులో పెట్టుకొనే మహాకవి ఖాండవంలో అర్జునుడు కాపాడిన మయుణ్ణి తప్పించుకొని ఎక్కడికీ పోకుండా వెంట బెట్టుకొని సభాంగణానికి పట్టుకు వచ్చాడు. కృష్ణుడు వాణ్ణి చంపబోయినా అర్జునుడు చంపనీయ లేదు. అది తెలిసి అయితే – ఇది తెలియక. మొత్తం మీద వాడు పెట్టిన పెటకమే ఈ మయసభ. నేను దానవశిల్పిని. మీ ఉపకారానికి ప్రత్యుపకారం చేసి తీరాలి. మీకేమి కావాలో కోరుకోమంటే కృష్ణుడి మొగం చూస్తాడర్జునుడు. ఇక చెప్పాలా. ఆ నాటక సూత్రధారి ప్రణాళిక. అపూర్వమైన ఒక సభా భవనం తయారు చేసి వీరికివ్వమని సలహా ఇస్తాడు.

అలాగే తయారు చేసి తెచ్చి ఇస్తాడా మయుడు. బొట్టు పెట్టినట్టు ఎక్కడి నుంచో ఊడి పడ్డాడు నారదుడు. ఆ సూత్రధారి కాంతరంగికుడైన కార్యదర్శిగదా ఈనారదుడు. ఎంతగానో ప్రశంసించి ఆ సభను – నేనెన్నో సభలు చూచి వచ్చాను గాని ఇలాంటి సభ ఎక్కడా లేదు సుమా. హరిశ్చంద్రాదులున్న ఇంద్ర సభా పనికిరాదు. మీ తండ్రి పాండురాజున్న యమ సభా పనికిరాదని ఒక మాట విసురుతాడు. ధర్మరాజు కది కష్టంగా తోచి మా తండ్రి యమలోకంలో ఉండట మేమిటని అడిగితే చెబుతాడప్పుడు. మీరు రాజసూయమనే యాగం చేశారంటే ఆయనకు ప్రొమోషన్ వచ్చి స్వర్గానికి వెడతాడని. అలాగని మీకు నాద్వారా సందేశం పంపాడని కూడా వినకారు చేస్తాడు. అయితే ఒక ముత్యం వంటి మాట కూడా సెలవిస్తాడు. రాజసూయమే జరిగితే సకల రాజ వంశ ప్రజానీక సంక్షయం కాక తప్పదని.

ఏమిటీ మాట. ఇంత దారుణం జరుగుతుందని తెలిసినప్పుడైనా మానుకోవాలా ధర్మరాజు. అయినా మానడతని మొండి తనమలాంటిది. ధౌమ్యాదులను సంప్రతించి నట్టు కనిపిస్తాడు. అది పై మాట. వారు కాదన లేరు గదా. ఏదో ధార్మికమైన విధానంలో దాన్ని వారు తప్పించ వచ్చుగదా – అని తనకు తానే సమాధానం చెప్పుకొని పూనుకొంటాడు రాజసూయానికి. నలుగురు తమ్ములనూ నాలుగు దిక్కులకూ పంపుతాడు దిగ్విజయం చేసి రమ్మని. ముందుగా కృష్ణుడు భీమార్జునులను వెంట బెట్టుకొని మగధ దేశానికి మారువేషాలతో పోయి భీముడి చేత

Vallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

జరాసంధుడనే వాణ్ణి మట్టు పెట్టిస్తాడు. ఇది ప్రతి పక్షులందరికీ తెలిసి రావాలని ముందుగా చేసిన చాటింపు. శిశుపాలాదుల కది హృదయ కంటకంగానే ఉంది. ఉండాలనే ఈ దండోరా. దిగ్విజయం పూర్తయింది.

రాజసూయ మారంభించాడు ధర్మరాజు. రాజులందరూ వచ్చి కానుకలు చెల్లించారు. అవి స్వీకరించటానికి కర్మం చాలక దుర్యోధనుడే ఉండవలసి వచ్చింది. దుశ్శాసనుడు వంటశాల కధ్యక్షుడట. అంతా అయిన తరువాత అర్ఘ్యమెవరి కివ్వాలని ప్రశ్న వచ్చింది. అంతకు పూర్వమే వచ్చి కూచున్నాడు సభలో నారదుడు. ఆయన ఎదటనే ఆసీనుడయ్యాడు నారద నారదుడు శ్రీకృష్ణుడు. ఇతడు నారాయణుడు గదా '**అఖిల మహీభారా వతారణార్థ మవతరించిన మహానుభావుడి కేమి.** నాకు పుష్కలంగా ఆహారం లభిస్తుందని మనసులోనే ఆనందిస్తాడట నారదుడు. మౌనంగా చూస్తున్నాడట కృష్ణ పరమాత్మ. ఎదురు మళ్ల కూచున్నా ఒకరితో ఒకరు మాటాడటం గాని కనీసం మందహాసం చేయటంగాని లేదంటాడు నన్నయ భట్టు నడిగితే. శిశుపాల వధా రంభానికి ముందు జరిగిన నాందీ ఇది వీరిద్దరి మౌన చర్య.

జరగనే జరిగిందా కొంచెమూ కూడా. ఎవరి కివ్వాలర్ఘ్య మని ధర్మరాజడగటమూ. ఇవ్వబోతే శిశుపాలు డాక్షేపించటమూ. వారందరినీ అనరాని మాటలనటమూ – అది సహించలేక భీము డంత కాకారుడై వాడి మీదికి లేవటమూ – వద్దని భీష్ముడు వారించటమూ – ఒకదాని వెంట వెంట ఒకటి వరుసగా జరిగిపోయాయి. భీముడెందుకు చేయలేదా

పని. చేయలేడా. చేయలేడు వాస్తవంలో. హనుమంతుడు రావణ సంహారమెలా చేయలేదో అలాగే ఇదీ. దానికి కారణం. కృష్ణుడి నోట చెప్పిస్తే స్వారస్యం లేదని తెలుసు మహాకవికి. అది భీష్ముడి నోట పలికిస్తాడు. దానితో శిశుపాలుడి జన్మ రహస్యంతో పాటు మరణ రహస్యం కూడా తెలిసిపోతుంది సభాసదులకు. సభాసదులకా. కాదు. మనబోటి పాఠకులకు, శతాపరాధాలూ సమాప్తం కాగానే కృష్ణుడు తాను చేయబోయే కార్యం సమర్థించుకొంటూ చేసిన చిన్న ప్రసంగమెంతో మధురంగా వర్ణించాడు నన్నయ. భీష్ముడు చెప్పిన అంశాలేవీ దొరలవా ప్రసంగంలో అవి తప్పించి వాడు తమ వంశానికీ తమ వారికీ చేసిన దారుణాలన్నీ పదిమంది సమక్షంలో బయట పెడతాడు. ఇప్పుడే మీరు చూచారు గదా విన్నారు గదా నిష్కారణంగా నన్నెన్ని విధాల దూషించాడో అని అందరి ఆమోదమూ పొందిన వాడిలాగా నటించి చక్రప్రయోగం చేస్తాడు. వాడు పోయినా వాడి తేజస్సు వచ్చి తనలో ప్రవేశించటం నలుగురూ చూస్తారు. దుర్యోధనాదు లందరూ చూడాలనే అలా చేశాడా ఆ మహానుభావు డనిపిస్తుంది. మనకీ ఘట్టం చూస్తే. చూచి బెదరి పోవాలనీ బెదరి ఇక పనికిమాలిన పనులు మానుకోవాలని బాగుపడాలని కావచ్చు ఈ ప్రదర్శన. లేక మీరేమి బాగుపడతారంత యోగ్యతా మీకు చివరకు మీరూ ఇలా పోయేవారే – నావల్ల గాకున్నా నా ప్రోద్బలంతో ఈ అర్జునాదుల వల్లనైనా సర్వనాశనమై పోయే వారేనని భావి వృత్తాంతాన్ని చాటి చెప్పటానికైనా కావచ్చు. ఈ రెండవది జరగటమే తనకు కావలసింది. తన సహాధ్యాయుడు నారద మహర్షికీ కావలసింది.

చూడండి చమత్కారం. ఇదంతా ఇలా జరుగుతున్నంత వరకూ తనకు కావలసిన ఆప్తులు జరాసంధ శిశుపాలు రిలా కృష్ణ పాండవుల చేతిలో నిహతులు కావటం చూస్తూ కూడా పెదవి విప్పలేదు మాట్లాడలేదు దుర్యోధనుడు. వాడే మాటాడకపోతే తమ్ములంత కన్నా పామరులు - వారి కసలే పట్టలేదు. ఇదంతా చూస్తే **Calm before Storm.** తుపాను వచ్చే ముందు ఒక ఘోర నిశ్శబ్దం లాంటిదని తోస్తుంది. మహాకవి కథా నిర్వహణ మలాంటిది. ఇంత బరువూ మనసులో పెట్టుకొని మోస్తూ ఇక మోయలేని పరిస్థితి వచ్చినపుడు బయటపడతాడు దుర్యోధనుడు. పైగా అంతకు ముందే ఒక ఘన కార్యం చేసి వచ్చాడు వాడు హస్తినాపురికి. మయసభ అందరూ చూచారు చేశారు. తమ తమ ఇరవులకు వెళ్లి పోయారు. వీడలా కాక తగుదునమ్మా అని దాని అంద చందాలేమిటో అరసి చూడాలని అక్కడా ఇక్కడా తిరిగి పరాభవం పాలవుతాడు. అది చూచి పాండవులూ ద్రౌపదీ నవ్వుతారు. పైగా కట్టిన పుట్టం తడిసిపోతే కొత్తబట్ట లిచ్చి పంపుతాడు ధర్మరాజు భీముడి ద్వారా. ఇదంతా వాడికి మనసులో మంటలు రేపుతున్నది. అసలు విషయ మిదంతా గాదు. పాండవుల కింత ఐశ్వర్యమేమిటి ఇంతమంది రాజులు వారికి పాదాక్రాంతులు కావట మేమిటి. ఇంద్రుడు చంద్రుడని వారిని పొగడట మేమిటి. ఇది ఏమాత్రమూ భరించ లేని స్వభావమతనిది.

ఇంద్ర ప్రస్థంలో ఉన్నంత వరకూ ఏమీ మాటాడక మానమూ అవమానమూ అన్నీ మౌనంగా భరించి తరువాత హస్తినకు వచ్చివల

పోసుకుంటాడు తన మామ శకునితో. సర్వనాశాయ మాతులః అన్నారు. కురువంశ నాశనానికే గదా వాడు గాంధారం వదలి ఇంత దూరం వచ్చి అక్కడ తిష్ఠ వేసింది. అల్లుడి మాత్సర్యానికి తగినట్టు ఆజ్యం పోశాడు. ఎలాగైనా మీ తండ్రిని ఒప్పించి మాయాద్యూత బలంతో వారి సంపద అంతా కాజేసి నీకప్ప జెబుతానని హామీ ఇస్తాడు. ఇంకేమి. ఇద్దరూ కలిసి గ్రుడ్డి రాజును కలుసుకొంటారు. తానుగా బయటపడడు శకుని. అల్లుణ్ణి ముందుకు తోస్తాడు. వాడు పాండవుల వైభవమూ - తన్మూలంగా తనకు కలిగిన అసూయా తానక్కడ పొందిన పరాభవమూ - వారు చేసిన అపహాసమూ - అంతా ఏకరువు పెట్టి - తన మనోవ్యాధి పోగొట్టక పోతే మరణమే ఇక శరణమని మొర బెడతాడు.

అప్పుడందు కొంటాడు శకుని. ముసలాయనతో అన్నట్టు గాక అల్లుడితో **'నీకెందుకింత వంత నేనుండగా. సుహృద్ద్యూత వ్యాజంతో నీకంతా కట్ట బెడతానని'** అది ముసలాయన మొదట అంగీకరించడు. విదురుణ్ణి సంప్రదిస్తానంటాడు. అయినా మొండి పట్టు వదలక పోతే సరేనని సమ్మతించి ధర్మారాజాదులను హస్తినకు పిలిపిస్తాడు. ఆ సభా భవనంలోనే సమావిష్టులయి అందరూ జూదమాడుతారు. చూడండి. వద్దంటూనే ధృతరాష్ట్రుడనుజ్ఞ ఇస్తాడు. వద్దంటూనే విదురుడు వెళ్లి వాళ్లను తోడ్కొని వస్తాడు. మరి వద్దంటూనే ధర్మరాజు జూదంలోకి దిగుతాడు. ఇంతకన్నా **Irony** ఉందా ఈ కథలో. ఇదేమిటిలా జరగటమని అడిగితే అన్నిటికీ ఒక్కటే జవాబిస్తాడు కవి దైవికం దైవికమని. అందరి చేతా ఆ మాటే

అనిపిస్తూ పోతాడు. నిజమే. ఎంత తెలిసిన వాడైనా చివరకది పెడతల బడుతుంది. మన తెలివే మన తెలివి తక్కువ. ఒక అనర్థం జరగవలసి ఉంటే మన బుద్ధికి మనం చేసేదంతా మంచిగానే తోస్తుంది. అనర్థం జరిగినా కూడా అది మన తెలివి తక్కువ అనుకోము. దైవకృతం మనమేమి చేయగలమని సమాధాన పడతాము.

ఇది అడుగడుగునా జ్ఞాపకం చేస్తాడు కవి తన కథా గమనంలోనే. మానవుడి మనసులో ఉండే ఈ బలహీనతను బయట పెట్టటమే కథలో వర్ణించే అన్ని అంశాలకూ తాత్పర్యమని పిస్తుంది. లేకుంటే జూదమిటు వైపు ఆడటానికి ధర్మరాజు కూచుంటే అటువైపు ఎవడు కూచోవాలి. దుర్యోధనుడు గదా. అలా కాక వాడికి మారుగా శకుని కూచోటమేమిటి. దానికీ ధర్మరాజొప్పుకోట మేమిటి. సుహృద్ద్యూత మన్నందుకు దాన్ని అలాగే చూడక అందులో నిజంగానే తన సర్వస్వాన్ని ఓడిపోవట మేమిటి. చివరకు తన తమ్ములనూ తన్నూ ఓడటమేమిటి. ఓడాడే పో. నీవెందుకు ఓడావు నీకింకా ఒక ధనమున్నది మరచావా అని వారడిగితే నిజమే జ్ఞప్తికి వచ్చిందని చెప్పి పాపమా ఆడకూతురు ద్రౌపదిని కూడా ఒడ్డి ఓడిపోవట మేమిటి. తనదొకడిదేగాదుగా ఆ సొత్తు. తీరా ఆవిడ సభలోకి వచ్చి తానా భర్తా ఎవరు ముందు ఓడారని అడిగితే జవాబు చెప్పక మొగం చాటేయుట మేమిటి. కడకు వికర్ణుడా నలుగురిలో అందరినీ నిలదీసి అడగ వలసింది. అంత చిన్నవాడా అక్కడ తమ కందరికీ ధర్మసూక్ష్మం వివరించ వలసింది. వివరించినా దాన్ని ఎదుర్కొనే ధైర్యమక్కడ భీష్మాదు లెవరికీ

Valluri Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

లేకపోవటమేమిటి. అంత అవమాన మాడ కూతురికి జరుగుతుంటే భీష్మాదులైన పెద్దలేమి చేస్తున్నారు. గాంధారి లాంటి మహాపతివ్రత ఏమి చేస్తున్నది. శిలా విగ్రహాలలాగా నిలబడి చూస్తున్నారా. వినడానికే అసహ్యంగా లేదూ. మానుషమైన సహాయానికి నోచుకోక పోతే చివరకు పరమాత్మా ఆవిడకు రక్షకుడు కావలసి వచ్చింది. అసలా మాటకు వస్తే మానవుణ్ణి మానవుడు నమ్ముకుంటే ఇదే గతి. ఎప్పటికైనా పరమాత్మే మానవుడికి శరణ్యమని చెప్పినట్టు కాలేదా. చిత్రమేమంటే అలాటి అతి మానుషమైన చర్య కృష్ణుని మూర్తి మనకు చూపకుండా ఆయన లీల అని తెలపకుండానే నన్నయ ద్రౌపది శరీరం మీద చీర లొకదాని వెంట ఒకటి ప్రత్యక్ష మవుతున్నాయని దుశ్శాసనుడూడ్చిన వలువలు గుట్టలు గుట్టలు పడిపోతున్నాయని ధ్వనింప జేయట మద్భుతమైన శిల్పం.

అంతేకాదు. అంతా అయిన తరువాత కోడలిని దగ్గరికి పిలిచి ధృతరాష్ట్రుడామెకు వరాలిచ్చే నెపంతో పాండవు లోడిపోయిన వస్తువాహనాదులన్నీ తిరిగి వారి కప్పగించి వారిని దాస్య విముక్తులను చేసి మరలా ఇంద్ర ప్రస్థానికి పంపాడనే వృత్తాంతం వింటుంటే మనకెంతో చిత్త విశ్రాంతి **Relief** నిస్తుంది కథా గమనంలో. వెంటనే ఒక **Irony** కూడా ప్రత్యక్షమవు తుంది దానితోపాటు. మరలా దుర్యోధనుడి పోరు పడలేక ముసలాయన చెప్పి పంపితే - తగుదునమ్మా అని వస్తాడు జూదమాడటాని కాధర్మరాజే. ఈసారి ఏ షరతు పెట్టినా సరేనని కూచుంటాడు. 12 ఏండ్లు అరణ్యవాసానికి 1 సంవత్సర మజ్ఞాత వాసానికీ

దారి తీసినా పరవాలేదు సై అంటాడు. ఏమిటీ విడ్డూరం. ఎంత పిల్ల తరహా వ్యవహారం. తుదకు ఓడనే ఓడిపోయాడు. పోవలసే వచ్చింది వనవాసానికి. తానేగాక తమ్ములనూ భార్యనూ అందరికీ వెంట దీసుకు పోయాడు. ఏదో ఆవిడ పుణ్యమా అని కుంతీదేవి వెళ్లలేదు. అంతవరకూ ధన్యురాలు. మరి పిల్లలేమయ్యారో. ఎక్కడున్నారో తెలియదు. సుభద్ర బహుశా పుట్టిల్లు చేరి ఉంటుంది. ఇంతకూ నన్నయ్యకు లేదు ఇదంతా ఏకరువు పెట్టటానికి. విసుగుగా ఉందేమో వ్యాసుడికి. అంతకన్నా విసుగని పించి ఉంటుంది నన్నయ భట్టుకు.

తెలియక జరిగితే అనుకోవచ్చు. సమాధాన మిచ్చుకోవచ్చు. తెలిసి తెలిసి గోతిలో పడే వ్యవహారానికి సంజాయిషీ ఏమిస్తాము. రాజసూయం చేస్తే ప్రళయమే వస్తుందంటే విన్నాడా ధర్మజుడు. పరోక్షంగా జరిగిన జరాసంధ వధా ప్రత్యక్షంగా జరిగిన శిశుపాల వధా చూచి బుద్ధి తెచ్చుకొన్నాడా దుర్యోధనుడు. పరాభవించినా ఆడ కూతురు దైవబలంతో బయటపడటం చూచి గ్రహించ గలిగాడా. పోతే ఒక మారు వచ్చి దెబ్బ తినటమే తెలివి తక్కువైతే మరలా సిగ్గులేక జూదమాడి చిత్తుగా ఓడి అడవుల పాలయ్యాడే ధర్మరాజు. అతడీ దుర్యోధనుడి కంటే ఏమి మేలు. ఆ ఇద్దరూ రెండు పొట్టేళ్లలాగా తమలో తాము కుమ్ము సుద్దు లాడుతుంటే గుడ్లప్పగించి తమాషా చూచినట్లు చూస్తున్నారే భీష్మ ద్రోణాదులైన పెద్దలు. వారిద్దరూ ఈ బేవకూఫుల కంటే ఏమి మేధావంతులు. వీరందరు నందరే అన్నట్టుంది ఈ వ్యవహారమంతా ఆలోచిస్తే.

Brahmasri Srinivasa Rao
Yalamanchili www.advaitavedanta.in

అందుకేనేమో. దానికి తగినట్టే కథా నిర్మాణం కూడా సాగిస్తూ పోయాడు శబ్ద శాసనుడు. అంతవరకూ ఆదిపర్వంలో ప్రతి చిన్న కథా ప్రతి అంశమూ పట్టి పట్టి చెబుతున్న వాడీ సభా పర్వంలో మొదట మొదట దిగ్విజయాదులను కొంతకు కొంత సాగదీసి వర్ణించినా చివర చివరకు వచ్చేసరి కెవరో తరుముకు వచ్చినట్టు టక టకా వర్ణిస్తూ ఏమి చెబుతావులే పొమ్మని క్లుప్తంగా చెప్పి ముగిస్తాడు. కథా గమనంలోని ఈ వేగం చూస్తే తైత్తిరీయం చెప్పినట్టు **'యాన్యస్మాకం సుచరితాని తానిసేవితవ్యాని – నో ఇతరాణి'** అనే ఉపదేశం గుర్తు వచ్చి ఉంటుంది మహాకవికి. అందుకే అనవసరమని మానేసి ఉంటాడు.

మొత్తం మీద సభాపర్వ వృత్తాంత మొక విధంగా గొప్పది. ఇది పూర్వాపరాలను రెండింటినీ కలిపే ఒక పెద్ద వంతెన. ఆది నుంచీ పాత్రల మనస్సులలో గుప్తంగా ఉన్న వారి వారి స్వభావాలను బయట పెట్టే ఒక **Metal Detecter.** అలాగే రాబోయే మహాసంగ్రామానికి కూడా నాందీ పలుకుతున్నది. అలా కాకుంటే దుర్యోధనుడి తొడలు విరగ గొడతానని – దుశ్శాసనుడి రుధిరపానం చేస్తానని భీముడు చేసిన శపథ మేమయి పోవాలి. అందులో జయ మెవరిది అపజయ మెవరి దని ప్రశ్నే లేదు. మానవులు ప్రతిజ్ఞా వాక్యాలను మించి దైవశక్తి ఒకటి పని చేస్తున్నది. అది నిర్ణయిస్తుందెవరికి విజయమో. అది పాండవులకే సుమా అని ద్రౌపదీ మానసంరక్షణ ముఖంగా దైవమే చాటుతున్నది. ఇంతవరకిలా జరిగిం దిక మీదట ఎలా జరగాలో అదే నిర్ణయిస్తుంది. ఆ దైవ నిర్ణయమెలా

అమలు జరుగుతుందో - పాండవుల కెలా తోడ్పడుతుందో చూడాలనేది కూడా ఒక సస్పెన్సే. ఇదంతా నన్నయగారి కథా కలితార్థ యుక్తే. ఆ యుక్తి కనుగుణంగా సాగిన ఉక్తే. దురోదర వ్యసనమే అన్ని అనర్థాలకూ మూలమనే గాక ఎంత వైభవంగా సాగితే జీవిత మంత పరాభవం చవి చూడవలసిందే మానవుడని ధ్వనింప జేయటం కూడా దాగి ఉన్నదా ఉక్తిలో.

పోతే ఇలాంటి ధర్మజుని జీవితానికి ప్రతిచ్ఛాయ లాంటిదే మరొక మహారాజు జీవితం. ఎవరో గాదాయన నలమహారాజు. సభా పర్వం దాటి అరణ్యంలో ప్రవేశించగానే ప్రత్యక్ష మవుతుందాయన వృత్తాంతం. నలదమయంత్యు పాఖ్యానం భారతంతో మొదలయి నిన్న మొన్నటి నాటకాల వరకూ ఎందరో రచించిన రచనలు విన్నాము చూచాము. చదివాము. ఎన్నో విధాల అసంభవాలు పొందుతూ వచ్చాము. కాని మనం గుర్తించ వలసి దేమంటే అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ కూడా నన్నయగారు చూపిన కథా శిల్పం మిలాటిది మనమెందులోనూ చూడబోము. అది ఒక శ్రవ్య కావ్యమైనదీ తెలియదు. దృశ్య కావ్యమైనదీ తెలియదు. శ్రవ్యంలో దృశ్యమా - దృశ్యంలో శ్రవ్యమా. ఏదైనదీ పోల్చుకో లేదెంతటి మేధావంతుడూ. అలాటి అద్భుతమైన బాణిలో తీర్చిదిద్దాడీ ఘట్టాన్ని నన్నయ భట్టారకుడు.

'**వధూ నాటక సంఘైశ్చ**' అని అయోధ్యలో నాటక సంఘాలున్నాయని నాటకాలలో స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించే వారని వాల్మీకి రామాయణంలో వర్ణించాడు. ఆయన తన రామాయణాన్ని ఒక శ్రవ్య కావ్యంగా రచించినా

Valluri Brahmasri Venkata Srinivasa Rao www.advaitavedanta.in

ఆంతర్యంలో అది ఒక దృశ్య కావ్యమే. మహర్షులే చేయగలరా పని. **'వినేయ జనహితార్థమేవ నాటకాది గోష్ఠీ లోకే మునిభి రవతారితా'** అంటాడు ఆనంద వర్ధనుడు. లోకులకు శిక్షణ ఇవ్వటానికే భరతాది మహర్షులు నాటక వాఙ్మయాన్ని లోకంలోకి తీసుకు వచ్చారట. అప్పుడే తద్వారా మన జీవిత కథ మనకు కండ్లకు కట్టినట్టు కనిపించి మనసుకు హత్తుకుంటుంది. ఋషి వంటి నన్నయ కూడా అలాటి నాటక ధోరణిలోనే నడుపుతూ వచ్చాడు భారత కథను. ముఖ్యంగా ఈ నలోపాఖ్యానాన్ని. వ్యాసుని అడుగుజాడల్లో నడచినట్టే నడుస్తూ అక్కడక్కడ కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని కూడా తలపించే సూక్ష్మాలెన్నో చూపుతూ వచ్చాడు దుష్యంత చరిత్రలో. కాగా ఈ నలోపాఖ్యానంలో అటు విక్రమోర్వశీయాన్ని ఇటు మేఘ సందేశాన్ని కూడా ధ్వనింప జేశాడని పిస్తుంది శబ్దశాసనుడు కొంత లోతుకు దిగి చూస్తే. ఇలాటి తన ద్వంద్వరచనా శిల్పాన్ని సూచన చేశాడా అని కూడా తోస్తుంది మనకు. కద్రూ వినతల వృత్తాంతానికి ముందు చేసిన సముద్ర వర్ణన చూస్తే **'నాటక రంగస్థలంబు నుంబోలె ఘన రసపాత్ర శోభిత రంగ రమ్యంబును'** ఇది శ్రవ్యమనే గాక తన దృశ్య కావ్య రచనా సామర్థ్యానికి కూడా ద్యోతకమైన మాట.

ప్రస్తుత మీ నలోపాఖ్యానంలో ఉభయ రచనా శిల్ప కౌశలమెలా నిర్వహించాడో కవి పరిశీలిద్దాము. నిషధ రాజు కుమారుడు నలుడు. విదర్భ రాజకుమారి దమయంతి. ఆవిడ దముడనే మహర్షి వర ప్రసాదం వల్ల జనించింది భీముడనే రాజన్యుడికి. పోతే వీరసేనుడి కుమారుడు నలుడేమి

తక్కువ వాడు కాదు. **'అజేయమైన తేజస్సుతో ఎల్ల రాజులను జయించి బ్రహ్మణ్యుండయి బ్రహ్మోత్తరంబుగా'** ప్రజాపాలన చేస్తున్న వాడు. నాయికా నాయకులిద్దరినీ ఇలా ప్రవేశ పెట్టి మనకు ముందుగా పరిచయం చేశాడు కవి. అందులోనూ మొదట నలుణ్ణి. తరువాత దమయంతిని. ముఖ్యమైన రెండు పాత్రలనూ రంగస్థలం మీదికి తెచ్చి ప్రదర్శించాడు. నాటక మనుకొంటే పాత్రలు, కావ్యమనుకొంటే నాయికా నాయకులు. సాహిత్య పరి భాషలో చెబితే రెండుచోట్లా ఆలంబన విభావాలు. తాను పోషించ దలచిన రసాని కాలంబనాలు. ఆలంబన మెంత ఉదాత్తమైతే అంత ఉత్కృష్టంగా ప్రతీయ మాన మవుతుంది రసం. రసమే గదా జీవితం సాహిత్యానికి. అది గమనించే కవి నలుణ్ణి సంగ్రహంగా వర్ణించినా సంపూర్ణతనే చూపాడందులో. ఇక ఆ పాత్రలో చెప్పక వదిలేసిన గొప్ప గుణమేదీ మిగలలేదు. ఒకటి తప్ప. అది గుణం గాని గుణం. ఏదో గాదది. **'అనవరతాక్ష ప్రియు'**డట నలుడు. అది ఒక్కటీ చాలు మిగతా గుణాల నన్నిటినీ దెబ్బ తీయటానికి. అలాగే తీసిందది చివరదాకా ఆయన జీవితాన్ని. **ఏకోహి దోషో గుణ సన్నిపాతే నిమజ్జతి'** కాదిక్కడ. ఉన్మజ్జతి. ప్రారబ్ధ కర్మ ఫలానుభవమైన పిమ్మట అప్పుడది కూడ నిమజ్జనమయి ఆయన మరలా పునర్జన్మ ఎత్తినంత విజయం సాధించగలిగాడు. ఎంత భవిష్య ద్వృత్తాంతం దృష్టిలో ఉంచుకొని ఈ పాత్రను మొదటనే ఇంత క్లుప్తంగా సృష్టించాడో చూడండి మహాకవి.

మరి ఆయన అర్ధాంగి దమయంతో. ముగ్గురన్నదమ్ముల తరువాత ఆవిడ. వారి గుణగణాలేవీ చెప్పడు కవి. అనవసరం కథా వస్తువుకు. అవసరం కథా నాయిక గుణాలే. అదినాయకుడి గుణసంపదకు సరితూగాలి. కనుకనే **'అత్యంత కాంతిరూపాభి జాత్య విమల గుణ సమృద్ధి'** వెలిగిపోతున్నదని వర్ణిస్తాడు. రూపమూ - రూపానికి తగిన ఆభిజాత్యమూ. ఇవి రెండూ చెబితే మిగతా వన్నీ చెప్పినట్టే. అందులోనే కలిసి వస్తాయన్నీ. పోతే ఇద్దరి గుణాలూ ఇద్దరి దగ్గర ఎప్పుడూ పొగుడుతూ ఉండేవారట జనులు. ఇక్కడి జనులక్కడికీ అక్కడి జనులిక్కడికీ వస్తూ పోతూ ఉంటే గాని అలా జరగదు. అప్పటికి వీరు వారనే ప్రశ్న లేదు. అందరికీ పరిచితమే వారి గుణగణాలు. కనుక నేనేమో ఒకరి నొకరు కలుసుకోవాలనీ చూడాలనీ తహ తహ. స్త్రీ పురుషులు కాబట్టి అది కామరూపంగా మారటంలో ఆశ్చర్యం లేదు. అప్పుడే మానసికమైన వాంఛకు పరిసమాప్తి. అది ఫలించటానికే వచ్చిందొక దూత హఠాత్తుగా. అదే హంస. పట్టు పడింది నలుడికి. దాని పాటికది రాదు. అతడు పట్టుకొంటే పట్టు పడింది. కనుకనే ఏమి చేస్తాడోనని భయపడింది. అతడు పురుషుడు. క్షత్రియుడు. ఆహారంగా సేవించినా సేవించవచ్చు.

తరువాత జూదంలో ఓటువడి అడవుల పాలయి నప్పుడలాగే చేయబోయాడు. హిరణ్య పక్షములైన పక్షులు కనిపిస్తే పట్టుకొని భక్షించ బోతాడు గదా. కనుక భయపడటంలో ఆశ్చర్యం లేదా హంస. కాని ఇప్పుడలాటి పని చేయడతడు. **'దమయంతీ గుణబద్ధ చేతస్కుడు'**. అంటే

మరొక దృష్టి లేదని అర్థం. అయినా దాని భయం దానిది. వెంటనే **"నీ హృదయేశ్వరి అయిన దమయంతి పాలికింబోయి నీ గుణంబులు దానికి వర్ణించి యక్కన్య యన్యుల నపేక్షింపక నీయంద బద్ధానురాగ**'ను చేస్తానని మనుష్య వాక్యాలతో హామీ ఇస్తుంది. దానికెలా తెలుసు వారి అనురాగం. తెలిసినా మనుష్య భాషలో అది ఎలా మాటాడ గలిగింది. అదే చిత్రం. ఇంకా చిత్రమేమంటే అది దమయంతి దగ్గరికి వెళ్లి మిగతా హంసలను చెలికత్తెలందరూ పట్టుకొంటే తాను కావాలని దమయంతికే పట్టువడి నలుని గుణగణాలావిడకు వర్ణించి చెప్పి 'నీవు నలునకు దేవి వయితేనే తప్ప నీ గుణసంపదకు సాఫల్యం లేదని వాక్రుచ్చటం. ఇక్కడా మానుష భాషే. అక్కడా అదే. ఎలా మాటాడిందని. అసలెలా తెలిసిందా విషయం దానికి. **'దమయంతి దూతయైన కలహంస'** అని ఒక్కమాటలో దాని మర్మం సూచిస్తాడు నన్నయభట్టు. బ్రహ్మ వాహనమయి ఉంటుందది. సృష్టి కర్త అయిన బ్రహ్మే నిర్ణయిస్తా డెవరి జీవిత మెలా మలుపు తిరగాలో వాడేది అనుభవించాలో. ఆయన సంకల్పమే హంస రూపం ధరించి ఒక దేవదూత అయి వచ్చిందా ఇద్దరి వద్దకూ. భాషాధిపతి దూత మరి ఏ భాష మాటాడరాదు. బ్రహ్మ వాహనమే గదా హంస. అదే మనసులో ఉంది నన్నయకు. చిట్టచివర శరదృతువును వర్ణిస్తూ **'మహర్షి మండలోపాసిత రాజహంస గతి భాసి'** అయిన **'అబ్జజయాన'**మని వర్ణించటంలోనే అది ధ్వనింప జేశాడని కూడా అనిపిస్తుంది. ఇంత ఉన్న దంతరార్థ మిందులో.

అయితే ఇంకేమి. తన కూతురి నా మహారాజు కిచ్చి వివాహం చేయవచ్చు గదా భీముడు. చేయవచ్చు. కాని నలుడు సామాన్యుడు కాడు. **'ఎల్ల రాజులను జయించిన అజేయ తేజ స్సంపన్నుడు'.** అలాటి వాడి నెలా రప్పిస్తాడు తన రాజధానికి. అందుకే ఆలోచించి స్వయం వరమేర్పాటు చేశాడు. అలా చేస్తే ఎలాగూ నలుగురితో పాటు నలుడూ వస్తాడు. దమయంతి ఎలాగూ అనురక్తే కాబట్టి అతణ్ణే వరిస్తుంది. వరిస్తే మిగతా రాజులంతా ఆయనకు పాదాక్రాంతులే కాబట్టి నోరెత్తరు. కనుకనే స్వయం వరమొక వ్యాజమని పేర్కొంటాడు కవి. కాని రాజు లెవ్వరూ అడ్డు తగలక పోయినా దేవతలే అడ్డు వచ్చారాయన సంకల్పానికి. మామా అల్లుళ్ల కిద్దరికీ అడ్డు తగిలారు ఇంద్రాది దేవతలు. ఇప్పుడు హంసలు వారే. అది వారిని కలపటానికైతే ఇవి వారిని విడగొట్టడానికి. కాదు తమలో ఒకరిని వరించమని చెబితే నలుడే మంటాడో – అది తెలిసి దమయంతి మనసే మవుతుందో – పరీక్షించటానికి. వారి అనురాగం లోతు చూడటానికి.అది నిఖాల్సయినదే అయితే ఇద్దరినీ కలిపి ఆశీర్వదించటానికి.

అలాగే జరిగింది చివరకు పరిణామం. విజయం సాధించాను గదా అని సంతోషించింది వారి ప్రణయం. అంత అల్ప సంతోషమైతే ఎలాగా మీకు మరొక పరీక్ష పెడుతున్నాను. చేతనైతే ఇందులో గెలవండి చూతామని వారిని పట్టి చూచాడు విధాత. అదే కలి పురుషుడి ఆవేశం నలుడిలో. ఎలా ప్రవేశించాడంత మహాగుణ సంపన్నుడిలో కలి అదే చిత్రం. ఎన్ని సద్గుణాలున్నా ఒక్క వ్యసనముంటే చాలు. అన్నీ తుడుచుకుపోతాయి.

అదే అతనిలో చోటు చేసుకొన్న ద్యూత వ్యసనం. అది ముందు చోటు చేసుకొని కలి పురుషుడికి కూడా చోటు కల్పించింది. బ్రహ్మణ్యుడయి బ్రహ్మోత్తరంగా రాజ్యం చేస్తున్నాడు గదా. వ్యసనపరుడెలా అయ్యాడు నలుడు. అదే దైవికం. దైవికం దైవకృతమనేది నన్నయ మహామంత్రం. ఉదంకుడి కథ దగ్గరి నుంచీ అన్ని కథలూ ఆ మంత్ర శక్తితోనే నడుపుతూ వస్తున్నాడు. మానవుడికి సమస్య తెచ్చిపెట్టేదీ దైవమే దాన్ని పరిష్కరించేదీ దైవమే. ఇందులో దైవబలాన్ని నమ్మక దానికి దూరమైతే జీవితంలో అపజయం. నమ్మి దాని వెలుగులో నడిస్తే అది జీవితానికి జయం. ఇదీ నన్నయ సిద్ధాంతం. మరి దైవమెందుకు ప్రతికూలించట మంటారా. ఏదో ఒక స్ఖాలిత్య ముంటుంది మానవుడిలో. అది సవరించుకో బాగుపడతావని భంగ్యంతరంగా బోధించటమే అది మనకు ప్రతికూలించటం. నూటికి నూరు గుణాలూ ఉండవెవడిలో. ఏదో ఒకటుంటుంది లోపం. అవతార పురుషుడైనా తప్పించుకోలేడిది. ఇక మానవుడెంత. ఇదే ధ్వనింప జేస్తున్నాడు నన్నయ నలుని మాటలలోనే.

ఇంద్రాదులలో ఒకరిని వరించు వారు సకల లోకాధీశులైన దేవతలని నలుడంటే వారు మన కారాధ్యులు గనుకనే నేను వారిని వరించట మపచార మంటుంది దమయంతి. దాని కతడు సమాధానమిస్తూ వారమరులు. నేను మానవుణ్ణి **'వారి పాదర జంబు బోలని వాని నన్ను మనుష్యు సంసారిగోరగ జన్నే** అంటాడు. నిజమే చెప్పాడు నలుడు. దేవతలకే ఉన్నప్పుడు చాపల్యం మానవుడైన తన కుండటంలో

ఆశ్చర్యమేముంది. కనుకనే అతనిలో కలి ప్రవేశించ గలిగాడు. పుష్కరుణ్ణి పురికొల్పాడు. జూద మాడించాడు. ఓడించా దంతవాణ్ణీ. అయితే దైవబలమే మయింది. ఉంది. అది నలుణ్ణి అనుగ్రహించ కుండా పోదెప్పటికైనా. వ్యసన ఫలాన్ని బాగా రుచి చూపి పశ్చాత్తాపంతో పరిశుద్ధుడైతే తరువాత తోడు పడుతుంది. అలాగే రుచి చూచాడు నలుడు. రాజ్యాన్ని కోలుపోయాడు. అడవుల పాలయ్యాడు. తిండికి మొగం వాచాడు. భార్యకు దూరమై పోయాడు. తుదకు వేరొక రాజు దగ్గర వంట వాడయ్యాడు. అంతకన్నా దారుణం తన భార్య ద్వితీయ స్వయం వరాని కారాజుతో పాటు ఆయన రథాన్ని నడుపుతూ తానూ పోవలసి వచ్చింది.

ఏమిటి దంతా. స్వయంకృతమే. అది పామరుడైతే గ్రహించలేడు. పండితుడైతేనే గ్రహించగలడు. నలుడలాంటి వాడు గనుకనే చివరకు దమయంతి అతడు తన భర్త నలుడేనని నిర్ధారణ చేసుకొని వచ్చి విలపిస్తే ఆవిడ నోదారుస్తూ '**కలి సమావిష్ట మతినయి కష్ట వృత్తి నట్టి యిడుమలం బడితి - నేనది మదీయ తపము బలమున నీ దుఃఖదాహమునను నష్టమైపోయె - కలి యిప్డు నన్ను విడిచె**' నంటాడు. అప్పుడు తన్ను ప్రవేశించాడిప్పుడు విడిచి పోయాడని నలుని కెలా తెలిసింది. కంప్యూటరు కూడా చెప్పలేదే. దీనికి జవాబేమిటో తెలుసా. అతని తపోబలమే చెప్పిందతనికి. అది ఇంత కాలమూ కలి ప్రభావం చేత మరుగుపడి పనిచేయలేదు. విదర్భకు వచ్చి మరలా భార్య నెప్పుడు కలిశాడో అప్పుడు తల చూపింది. చూడండి ఈ రహస్య మెంత నేర్పుగా నన్నయగా రెప్పుడు

బయటపెడతాడో. ఉత్తమాధికారి గొప్పతనమే అది. వ్యసనానికి తగిన ఫలమే అనుభవించాడు నలుడు. బాకీ తీర్చాడు ప్రారబ్ధానిది. దానికి తోడు కర్కోటకుడి హామీ ఒకటుంది. దమయంతికి మహర్షు లిచ్చిన అభయ ముద్రా ఒకటుంది. ఇవన్నీ ఫలించాలి గదా ఎప్పుడో ఒకప్పుడు. సమయాని కన్నీ కలిసి వచ్చాయి. తపస్సంపన్నుడు గనుక నెగ్గాడు పరీక్షలో నలుడు.

ఇంతకూ అతడుత్తమాధికారి గనుకనే అంతవరకూ దేవ రహస్యమేమిటో తెలియకపోయినా ఒక కష్టం తనకు సంభవించిన క్షణం నుంచీ అడుగడుగునా పశ్చాత్తాప పడ్డాడు. ఆకలికి తాళలేక పక్షులను పట్టుకోబోతే అవి మేము పక్షులము కాము నీవు జూదమాడిన అక్షముల మని అతని వస్త్రంతో కూడా అదృశ్యమై పోతాయి. పోతే '**ఈ అక్షం బుల దోషంబునంగాకేమి నా కిట్టిదయ్యె**'నని బాధ పడతాడు. '**క్లేశ పరవశయై** అడవిలో తన ప్రక్కనే నిద్ర పోయెడు భార్యను జూచి అంటాడు – **ధరణి రాజ్యంబుతో ధన మెల్ల బరులచే నపహృతం బగుటయు నాప్తమిత్ర బంధు జనంబులు ప్రకృతి జనంబులు విడుచుటయును – మహా విపిన భూమి పత్నితో తన పరిభ్రమించుటయు నప్పుడు తలచి శోకించి** తనవల్ల ఆవిడ దుఃఖంబు నొందెదైవ ఘటనం **జేసి** అని అదంతా దైవకృతమని గుర్తిస్తాడు. కలి ప్రభావ మొక్క పక్క ముందుకు తోస్తుంటే తన సహజ సౌజన్యం వెనక్కు లాగుతుంటే మధనపడి చివరకు కలి ప్రభావమే ప్రబలమై విడిచి పోయాడట ఆవిడను. తరువాత విదర్భలో తన్ను తెలుసుకోటానికి

వచ్చి తన నిర్థాక్షిణ్యాన్ని ఎత్తి పొడిస్తే ఏమి చెప్పమంటా వదంతా దైవ ఘటన అని మాత్రమే సమాధానమిస్తాడు.

ఉత్తమాధికారే అనుకోగలడిలా జీవితంలో ఏది జరిగినా అదంతా దైవ కృతమేనని. మరి మందాధికారి అయితే అలా అనుకోలేడు. తన ప్రభావమే ప్రతి ఒక్కటీ అని విర్రవీగుతాడు. చివరకది వికటిస్తే అప్పుడు తెలుస్తుంది వాడికి. అప్పటికీ తెలుస్తుందని గారంటీ ఇవ్వలేము. అదే పుష్కరుడి విషయంలో ఋజువయింది. వాడెవడో గాదు నలుడికి పినతండ్రి కుమారుడే. కలి నలుణ్ణి దెబ్బ తీయటానికి వాడిలో జేరి జూదమాడించి వాణ్ణి గెలిపించాడు. చివరకు వాణ్ణి విడిచిపోయే సరికి బెంబేలు పడ్డాడు. నలుడు మరలా వాడితోనే జూదమాడి పోయిన తన రాజ్యాన్ని మరలా గెలుచుకొన్న తరువాత ఏమంటాడో తెలుసా అతనితో. **'కలి సంప్రాప్తుడనై బలమతి నీచేతఁ దొల్లి బలవద్ద్యూత చ్ఛల జితుడ నైతి - నదినీబల మని గర్వింప వలదు బలవంతుడవై'** అప్పుడు నీచేతిలో నేనోడి పోయానంటే అది నీబలం కాదు. నాబలహీనత. దానికి కారణం నాలో ప్రవేశించిన కలి పురుషుడు. అని హెచ్చరిస్తాడు. అంతేకాదు. **'నీవు పితృవ్యపుత్త్రుడవు. కావున నిన్నెద్దియుం జేయనోపనని'** దయతో వాణ్ణి విడిచి పెడతాడు. ఈ రహస్య మింతకు పూర్వమెక్కడా కథలో బయటపెట్టక గుంభనగా ఉంచి ఇంత దూరం కథ నడచిన తరువాత ఇప్పుడు బయట పెడతాడు నన్నయ. ఎందుకని.

Brahmasri Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in

ఇక్కడే ఉంది చమత్కారం. ఇది ఒక్కటే ఏమి. ఎన్నో రహస్యాలు ముందు పేర్కొనడు కవి. క్రమంగా బయట పెడుతూ పోతాడు. నాటక మంటే నాటకమే. ఇది కథ గాదు. నాటకమని గదా పేర్కొన్నాము. కవి దీన్ని శ్రవ్యంగా ఎంత భావించాడో దృశ్యంగా అంతకన్నా ఎక్కువ భావించాడీ నలోపాఖ్యానాన్ని. అందుకే ఈ గోపనం **Suspense.** నాటక నిర్మాణంలో ఇది చాలా ముఖ్యం. కావ్యం వరుసగా విషయాలనేకరువు పెట్టటమైతే నాటకమలా కాక సమయోచితంగా వాటి నావిష్కరిస్తూ పోతుంది. అదే అందమిస్తుంది రచనకు. ఈ రచనా శిల్పమెంత గానో అభ్యసించాడు నన్నయ. భాస కాళిదాసాది నాటకాల బాణీ ఎంతగానో జీర్ణించుకొన్న వ్యక్తి. కనుకనే వారి పంథాలో ఆయన ఒక్కొక్క ఘట్టాన్ని వర్ణిస్తుంటే ఒక్కొక్క సీను వస్తూ పోతున్నట్టు కనిపిస్తుంది. కనుల ముందు ఒకటో రెండో పాత్రలు పొడ చూపటం – అవి వాటి సాత్త్విక సంచారి భావాలు ప్రదర్శించటం – ప్రక్కకు పోవటం – అలాగే మరికొన్ని కొత్త పాత్రలు రావటం అభినయించటం తొలగిపోవటం – ఇలా సాగిపోతుంటాయి. అలా సాగిపోయే కొద్దీ పూర్వాపర కథాంశాలొక దాని కొకటి చేరి ఒక గొలుసు కట్టుగా తయారయి ఒక సమస్య రేకెత్తుతూ మరొకటి దానికి సమాధానం చెబుతూ పోతున్నట్టు కనిపిస్తాయి. చివర కన్ని సమస్యలూ కలిసి ఒకేసారి పరిష్కార మయి పోవటం చూపుతాడు కవి. నాటకంలో నిర్వహణ సంధి లాంటిదది.

మీరే చూడండి. మొట్ట మొదట కథ ఎలా ఆరంభమయింది. నలునితో దమయంతితో. అతడొక చోట. ఆమె ఒకచోట. ఇక్కడ ఒక

హంసను పట్టుకొంటూ నలుడు కనిపిస్తాడు. వెంటనే రంగస్థలం మీద కథానాయిక దమయంతి కనిపిస్తుంది. అతడు విడిచిపెట్టిన ఆ హంసనే పట్టుకొని. ఒకరి గుణాలొకరికి వర్ణించి చెప్పి వారి అనురాగాన్ని దృఢతరం చేస్తుందది. ఇదే ఈ హంస అనే దూత ప్రయోజనం. తెరపడి మరలా పైకి లేచింది. లేచేసరికి వెంటనే కనిపిస్తారు మనకంటికి. ఎవరు. అంతరిక్షంలో దేవతలు స్వయం వరానికి వెళ్లుతూ భూమి మీద నలుడు. తమలో ఒకరిని వరించటానికి రాయబారం పంపుతారు దమయంతి దగ్గరికి. అక్కడ హంస దూత అయితే ఇక్కడ నలుడు దూత. అది నలు దమయంతులను కలపటానికైతే ఇక్కడ వారిని విడదీయటానికి యత్నం. శాయశక్తుల ప్రయత్నించాడది నలుడు. కాని దమయంతి మనసు మారలేదు. ఇది మూడవ రంగం.

పోతే నాలుగవ దిక స్వయం వరోత్సవం. దమయంతి ప్రార్థన. ఇంద్రాదుల అనుగ్రహం నలసంవరణం. ఆ తరువాత అయిదవది కలి ప్రవేశం. దేవతలది వినోదార్థమైతే ఇది విషాదార్థం. దంపతుల చిత్తశుద్ధిని పరీక్షించి వారిని కలపటమే దేవతల సంకల్పమైతే వారిని దూరం చేసి వేధించటమే కలి పన్నాగం. కాని ఒక విధంగా చూస్తే అది కూడా దైవం పెట్టిన ఒక దీర్ఘకాల పరీక్షేనా అని తోస్తుంది. జూదమనే దెంత వ్యసనమో ఎలాటి ముప్పు తెచ్చి పెడుతుందో చూచావా దీని మూలంగా ఎన్ని కష్టాలు కొని తెచ్చుకొన్నావో గుర్తించావా. అయినా నీవు సహజంగా గుణవంతుడవు కాబట్టి దాని దోషాన్ని గుర్తించి ఎప్పటికైనా దాన్ని దూరం చేసుకొని జీవితంలో విజయం సాధించగలవని చేసే ఒక గొప్ప ప్రబోధమిది.

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

దాని కనుగుణంగా ప్రతి సన్నివేశమూ ఎక్కడికక్కడ మలుపు తిప్పుతూ ప్రతి మలుపూ వారికొక పాఠం నేర్పుతున్నట్టు మనకు తెలుపుతూ పోతాడు కవి. ఒక గొప్ప నాటక ఫక్కిలో.

ఇలాంటిదే మరి ఒక నాటక ఫక్కిలో నడచిన చిన్న సన్నివేశాన్ని తిలకిద్దాము. అదేదో గాదు. అరణ్యపర్వంలోనే దర్శనమిచ్చే హనుమద్భీమ సంవాదం. హనుమంతు డెప్పటి వాడు. భీము డెప్పటివాడు. ఒకరిది రామాయణ కాలం. మరొకరిది భారతకాలం. రామాయణం త్రేతాయుగం నాటిదైతే భారతం ద్వాపర యుగం నాటిది. త్రేతా యుగం నాటి హనుమంతుడు ద్వాపరం దాకా బ్రతికి ఉన్నాడా. ఉండటమే గాక భారతవీరులలో ఒకడైన భీమసేనుణ్ణి కలుసుకొన్నాడా. వీరిద్దరికీ ఏమిటీ బాదరాయణ సంబంధం. బాదరాయణుడు కల్పించింది గదా. బాదరాయణ సంబంధమే మరి. హనుమంతుడు చిరకాల జీవి. శ్రీరాముడిచ్చిన వరమిది. కనుక ద్వాపరం దాకా జీవించి ఉండటంలో ఆశ్చర్యం లేదు. ఇలాటి వాడే మరొక డున్నాడా మాటకు వస్తే. జాంబవంతుడు. అతడూ త్రేత యుగంవాడే. శ్యమంతక మణి కోసం కృష్ణుడితో రగడ పడ్డాడు. ఎవడో అనుకొన్నాడా యనను చూచి. తరువాత రామవేషంలో కనిపిస్తే తన స్వామేనా అని సమాధాన పడ్డాడు. మణితో పాటు భామా మణిని కూడా సమర్పించి క్షమాపణ చెప్పుకొన్నాడు.

ఇక్కడ అలా కూడా కాదు. కృష్ణుడెవరో తెలుసు హనుమంతుడికి. ఆయన భక్తులనీ తెలుసు భీమాదులు. తెలుసు గనుకనే రామభక్తుడైన తాను కృష్ణ వేషంలో ఉన్న రాముడి భక్తులకు సాయం చేయాలను కొని

ఉంటాడు. అయితే తనకున్నంత భక్తీ శక్తీ వారికీ ఉన్నాయా లేవా పరీక్షించి చూడాలని కుతూహల మాయనకు. ఇదంతా వాచ్యం చేయకుండా వ్యంగ్యంగా సూచించటం నన్నయ కుతూహలం. కాకపోతే సౌగంధిక పుష్పాలు తెచ్చి ఇస్తే బాగుండు నని ద్రౌపది ధర్మారాజును కోరటమేమిటి. అతడే మంటాడో వినకుండానే భీముడవి తేవటానికి తాను బయలు దేరట మేమిటి. దారిలో చెట్లూ చేమలూ విరిచి పారేస్తూ - క్రూర జంతువుల నొక దానిమీద ఒకదాన్ని విసరి వేస్తూ - ఎదురులేని మహావీరుడి లాగా పోయి అక్కడెక్కడో ఉన్న ఒక సరస్సులో స్నానం చేసి బయటికి వచ్చి శంఖ ధ్వానం చేయటమేమిటి. ఏమిటర్థం. ఆ సౌగంధిక వనమెక్కడ ఉందో తనకు తెలియదు గదా. శంఖనాదం చేస్తే అది చెవినబడి ఎవరైనా వచ్చి దాని ఆచూకీ తెలియజేస్తారని.

విన్నాడు హనుమంతుడు. ఎక్కడ. గుహాశయుడై నిద్రిస్తున్నాడట. నిద్ర గాదది. యోగనిద్ర. వినగానే గ్రహించాడట. ఇది తన తమ్ముడు భీమసేనుడి శంఖ ధ్వని అని. ఎవరు చెప్పారాయనకీ రహస్యం. రామభక్తుడూ మహాజ్ఞానీ అయిన ఆయనకు రహస్యమేమిటి. వెంటనే అక్కడ ఉన్న చెట్లనన్నిటినీ అతని దారి కడ్డంగా పడదోసి **లాంగూల లీలాచాలనం** చేశాడట. లీలాచాలనమే తమ్ముడి శంఖారావానికి నూరుమడుగు లెక్కువగా పిక్కటిల్లి నీ నాదమేమిటి నానాదం చూడమని అతణ్ణి హెచ్చరించి నట్టన్నదట. అంతేకాదు. ఎక్కడ చూస్తావు. ఇదుగో ఇక్కడ ఉన్నా నా వద్దకు రమ్మని ఆహ్వానించినట్టుంది. ఆహ్వానిస్తే ఎవరో ఆ మనిషి నెమ్మదిగా వెళ్లి చూచి తెలుసుకోవచ్చు గదా. అతనికి తెలుసునని ఇతనికి తెలియదు.

కనుక దగ్గరికి వెళ్లి **'అతి చపల స్వభావుడూ - అతి కృశ దశన కరజుడూ'** అయిన ఒక ముదుసలి కోతే గదా అనుకొని బెదిరించటాని కొక పెద్ద సింహనాదం చేస్తాడు. చేస్తే అప్పుడే నిద్ర లేచినట్టు నటిస్తూ ఏమి పెద్ద మనిషి వయ్యా ఏదో 'జరారోగ భారంతో పట్టక పట్టక నిద్ర పడితే కరుణ లేకుండా నన్నులికి పడేలా చేస్తావా. మేమంటే తిర్యగ్జంతువులమూ. మాకు తెలియక పోవచ్చు గాని మీరు మానవులు గదా మీకు ధర్మా ధర్మ జ్ఞానం లేకపోవట మేమిటని మందలిస్తాడు. తిర్యగ్జంతువుల మంటూనే ఇది **మనుష్య గోచరము గాని వనము - 'సిద్ధగతి లేని వారి కిట చొర నశక్య'** మంటాడు. ఇదుగో ఈ ఫలాలమృతోప మానములు - ఇవి తిని వెనక్కు వెళ్లమని సలహా ఇస్తాడు. ఇదంతా హనుమంతుడి కెలా తెలుసు. అప్పటికీ తెలుసుకోలేక పోయాడు భీముడు. అంతేకాక తన కులగోత్రాలు ఫలానా అని ఆయన కేకరువు పెడతాడు. ఆయనకు తన సంగతి తెలియనట్టు. పైగా దారి ఇవ్వకపోతే పూర్వం హనుమంతుడి లాగా నిన్నూ ఈ పర్వతాన్ని లంఘించి పోగలనని బెదిరిస్తాడు.

చూడండి. హనుమంతు డంటాడే గాని తన అన్న అని సంబోధించ డతణ్ణి. తెలియని ఏడుపిది. తెలిసి కూడా తెలియ నట్టడుగుతాడు హనుమంతుడు. ఎవడా హనుమంతుడు - ఏమి చేశాడు పూర్వమవి. రామాయణ మంతా ఇక ఏకరువు పెడతాడు భీముడు. అదీ సముద్ర లంఘన వృత్తాంతమే సుమీ. అలా బయటపెట్టి నేనా హనుమంతు నంతటి బల పరాక్రమ సంపన్నుండ నా పరాక్రమం చూస్తావా అనట మింకా

హాస్యాస్పదం. మనకే గాదు. హనుమంతుడికి గూడా అనిపించిందేమో. నవ్వు వచ్చినా పైకి నవ్వక **'అవ్యక్త హాసముఖు'** డయ్యాడంటాడు నన్నయ భట్టు. పైగా తోక దారి కడ్డంగా చాచి **అన్నా నేను ముదిసిన వాడ లేవనోప దాని పాయం ద్రోచి పొమ్మని'** సలహా ఇస్తాడు. ఎలాగో అంత పొగరుబోతు భీముడూ కాలితో త్రోయలేదు. సంతోషించవచ్చు. ధర్మాధర్మాలు తెలిసిన వాడవని ముందుగానే కితాబిచ్చాడు గదా అన్నగారు. కాలు పనికిరాదని సంకోచించాడు కాబోలు. వామకర ముపయోగించాడు. అది పనిచేయక రెండు చేతులతో పట్టి ఎత్తాడు. మొగ్గ తిలబడి సిగ్గుతో తలవంచాడు. కపిరూపం ధరించిన సిద్ధుడవా గంధర్వుడవా దేవ వరుడవా 'అంటాడే గాని కపివరుడైన హనుమంతుడేనని గ్రహించ లేక పోయాడు. త్రేతాయుగం వాడు గదా ద్వాపర యుగాని కెలా బ్రతికి ఉంటాడని భావించవచ్చు. అందుకే తనకు శ్రీరాముడిచ్చిన వరం బయటపెట్టవలసి వచ్చింది హనుమంతుడు. అంతేగాక యుగధర్మాలన్నీ వర్ణించవలసి వచ్చింది. ఇంకొక్క రహస్య మేమంటే భీముడాయన హనుమంతుడని గుర్తించి క్షమాపణ అడిగి కూడా నీ ఆనాటి రూపం చూపమని బ్రతిమాలు తాడు. ఇది కుతూహలం కొద్దీ అడిగినా - ఇతడు నిజంగా హనుమంతుడేనా అని తన అనుమానం తీర్చుకోటానికైనా అడగవచ్చు. భీముడి హృదయమే గాదు కవి హృదయం కూడా ఇదే.

వెంటనే కృష్ణుడి లాగా విశ్వరూపం చూపేసరికి హడలిపోయి ఉపసంహరించమని ప్రాధేయ పడితే ఇదేమి చూచావు. యుద్ధ రంగంలో శత్రువు లెదురైతే దీని కినుమడుగు లవుతుంది నారూపమని ఇంకా హడల

గొడతాడు హనుమంతు డతణ్ణి. తమ్ముణ్ణి పరీక్షించటాని కింకా ఒక మాట అంటాడు. మీకెగ్గొనరించిన ఆ గుడ్డిరాజు సంతానాన్నంతా ఒక్క నిమిషంలో మట్టు పెట్టగలను. నీకు సమ్మతమేనా అని అడుగుతాడు. అయ్యో అంత పనీ చేయగలవాడివే. అయినా నీవు చేయి చేసుకోవలసి నంత విషయమేదీ లేదు. నీ అనుగ్రహ ముంటే మేమే వాళ్లకు జవాబు చెప్పగల మంటాడు భీముడు. చూచారా. హనుమంతుడికి వారి విషయమంతా తెలుసు. నీ అనుగ్రహ మన్నాడు కాబట్టి తమ్ముడలాగే అర్జునుడి రథ పతాక మీద కూచొని మీరు చేసే యుద్ధాన్ని ముచ్చటగా తిలకిస్తానని హామీ ఇస్తాడు. పైగా మనకే మున్నదన్నిటికీ ఆ కృష్ణ పరమాత్మే ఉన్నాడు గదా – ఆయనే చూచుకొంటాడు మీ విషయమంతా. ఆ మాటకు వస్తే త్రేతాయుగంలో మేమాయనకు తోడు పడ్డామని పేరేగాని అపుడు కూడా ఆరాముడే గదా అంతా నిర్వహిస్తూ వచ్చింది. ఆయన అనుగ్రహం వల్లనే మేమూ సముద్ర లంఘన మని లంకా దహనమని యుద్ధమని విజయమని నటిస్తూ వచ్చాము. తదను గ్రహబలం లేకపోతే అపుడు మావల్లా కాదు ఇపుడు మీ వల్లా కాదని అసలు విషయం బయటపెడతాడు. వాచ్యంగా కాదు. వ్యంగ్యంగా. ఎలాగని అడుగుతారేమో. యుగధర్మాలను వర్ణిస్తూ ప్రతి యుగంలోనూ శ్రీమహా విష్ణువే వెనకాల ఉండి నడుపుతుంటాడీ జగద్వ్యవహారమంతా. కృతయుగంలో శుక్ల వర్ణుడుగా – త్రేతలో రక్త వర్ణుడుగా ద్వాపరంలో కృష్ణ వర్ణుడుగా – మరి కలియగంలో శ్వేత వర్ణుడుగా దర్శన మిస్తాడంటాడు. ఆ రక్త వర్ణుడెవడో కాదు. రాముడు. పోతే కృష్ణ వర్ణుడు కృష్ణుడే. కృష్ణుడనే మాట రెండుసార్లు చెప్పిస్తాడు కవి. **'కృష్ణుడయి జగతి రక్షించు'** ననటంలో అర్థం కావటం లేదా మనకు భారత కథా

నాటక సూత్రధారి కృష్ణుడే నని. హనుమంతుడి కంతా తెలుసు. ఆయనకు తెలుసునని నన్నయ భట్టారకునికీ తెలుసు. అదే ధ్వని రూపంగా సూచిస్తున్నాడు పరమ భక్తాగ్రేసరుడైన హనుమంతుడి ప్రసంగంలో.

మొత్తం మీద ఈ ఘట్టమంతా కొనా మొదలు భీమాంజనేయులనే ఇరువురు పాత్రల నాధారం చేసుకొని ఎంత నాటకీయంగా నడిపాడో చూడండి కవి. ఈ ఒక్కటే ఏమి. ఎన్నో ఉన్నాయి ఇలాంటి సన్నివేశాలు ఆయన రచనలో. అన్నీ నన్నయ కథా కథన దక్షత ఎలాంటిదో ఆయన నాటకీయ రచనా పాటవం కూడా అలాంటిదేనని నిరూపిస్తాయి. అసలు నన్నయభట్టు కన్నడ దేశం నుంచి వలస వచ్చిన ఆంధ్ర కవి. కన్నడ భాషా గంధ మక్కడక్కడ గుబాళిస్తూ కూడా ఉంటుంది రచనలో. వర్గువు - ధర్మువు - ఆ య్యవ్వ - కెలసమూ ఇలాంటివి మనకు తర్కాణాలు. అయినా ఆంధ్ర కవిత్వ విశారదుడని కవిబ్రహ్మ చేతనే ప్రశంస లందుకొన్నాడు. ఆయన ఆంధ్ర భారతానువాదానికి శ్రీకారం చుట్టే నాటికే పంప కవి కన్నడ భారతం తయారయి ఉంది. అది నన్నయ చూచాడు చదివాడు జీర్ణించుకొన్నాడు. చెప్ప వచ్చేదేమంటే దాని ప్రభావం పడ్డ దాయనమీద. అది చంపూ ప్రబంధం. చంపువంటే గద్య పద్యాత్మకంగా సాగే రచన. అందుకే తెలుగులో కూడా తానా మార్గంలోనే కేవల పద్యకావ్యంగా అందులోనూ ఏకచ్ఛందో రూపంగా గాక పద్య గద్యాత్మకంగా పద్యాలలో కూడా అనేక వృత్తాలలో రచన సాగించాడు. అంతే కాదు. చంపూ కావ్యాలలో ఒక గొప్ప గుణమున్నది. ఎంత విస్తారంగా ఉన్న కథనైనా సంగ్రహంగా చెబుతూ పోతారా కవులు. అలా క్లుప్తంగా సాగిన రచనలోనే దాని వైపుల్యాన్నంతా సూచించగలరు. అది బాగా పట్టుకొన్నడా

పద్ధతి నన్నయభట్టు. అంతేగాక భాసకాళి దాసాది నాటక కవుల బాణీ కూడా తోడయింది దానికి. నాటకాలలో ఎంత కథనైనా సంగ్రహించి చెప్పగలరా కవులు. అంకాలలో బాహాటంగా పైకి వర్ణిస్తారు. ప్రవేశ విష్కంభాదులలో చెప్పక వదిలేసిన భాగాలు పాత్రల సంవాదం ద్వారా సూచన చేస్తూ పోతారు. అంతా కలుపుకొని చూస్తే మొత్తం కథ అంతా మనకా కళింతకు వస్తుంది. ఇలాటి కళ బాగా అలవడింది నన్నయకు. అందుకే తరుచుగా ఒక మాట విసురుతుంటాడు భారతంలో. మితహిత సత్య వాక్య అని. మితంగా చెప్పాలి విషయమేదైనా. హితంగానూ ఉండాలది. పైగా అది అఘనిబర్హణం కూడా కావాలి. **'ఘన దురితాను బంధకలి కాలజ దోషతుషార సంహతిన్ తన యుదయ ప్రభావమున దవ్వుగఁ జోపు'** తుందట భారతం. అది నలచరిత్రలో తార్కాణ చేసి చూపాడు మనకు. కలి దోష నిబర్హణమే అఘనిబర్హణం. ఇదీ భారత సంహిత ముఖ్య ప్రయోజనం. అది గమనించి దాని కభిముఖంగా కథ నడుపుతూ పోవటమే నన్నయ వాంఛించినది. అలా నడపటంలో సంక్షిప్తంగా నాటకీయంగా నడపట మాయన దక్షత. నాటకీయ మన్నందుకు నన్నయ నడపిన ప్రతి సన్నివేశానికీ ముందు రెండు మూడు పద్యాలు నాందీ పద్యాలలాగే రచించి ఆ వాతావరణంలో ప్రవేశ పెడతాడు పాత్రలను. కద్రూ వినతల ఘట్టమేమిటి. శాకుంతల మేమిటి. ఇంకొక టేమిటి. అన్నిటిలో చూడవచ్చునిది. అది **మితహిత సత్య వాక్య**మని పేర్కొనటంలో ఒకటీ - **ఘనరస పాత్ర శోభిత రంగ రమ్య**మనే మాటలో ఒకటీ - ధ్వనింప జేయుట మింకా గొప్ప చాతుర్యం. దీనితో నన్నయ గారికి వీడ్కోలిచ్చి మనమాయన దగ్గర సెలవు తీసుకొందాం.

# తిక్కన రసాభ్యుదయము

**'ఘనరస పాత్ర శోభిత రంగ రమ్య'ంబని** అన్నాడో లేదో నన్నయ భట్టు - నా అన్నయ్య నన్నయ్యే సూచించాడు - నేనిక ఎలా వదలి పెడతా నన్నట్టు - ఆ రసాన్ని ఆ పాత్రలోనే నింపి పట్టుకు వచ్చాడు మహాకవి తిక్కనామాత్యుడు. తెచ్చి సరాసరి భారతరంగం లోనే దాన్ని ఘనంగా నలుగురికీ చూపి రసజ్ఞ శేఖరులైన ప్రేక్షకులందరి చేతా భేష్ భేష్ అనిపించు కొన్నాడు. ఆ **'అమృతాన్ని కర్ణపుటంబుల నారఁ గ్రోలి ఆంధ్రావళి మోదముం బొరయు నట్లుగ'** అని కేవలం మాట సామెతగా చెప్పిందే ఆయన. అది ఉపలక్షణంగా తీసుకొంటే కవి బ్రహ్మ మనసులో ఉన్న ఆంధ్రావళి ప్రపంచ వ్యాప్తమైన మహాంధ్రావళి. ప్రపంచ తెలుగు మహాసభ అన్నట్టు ప్రపంచాంధ్రావళి అని చెప్పుకోవాలి అర్థం. కారణం ఆయన గారు పాత్రలలో నింపి తెచ్చి మనకు పంచి పెట్టిన రసమలాంటిది కాబట్టి. పాత్ర అంటే ఒకటి గాదు. రెండు గాదు. పిపీలికాది బ్రహ్మ పర్యంత మెందరు జీవులున్నారో అందరూ. రసమన్నా ఒకటి గాదు.

Yalamanchili Brahmanna Srinivasa Rao
www.advaitavedanta.in

వారి వారి కెన్ని మనోభావాలున్నాయో ఎన్ని అనుభవాలున్నాయో అన్నీ. ఇంత విశాలమైన దాయన రసపాత్ర శోభితమైన రంగం. బ్రహ్మాండమైన రంగస్థలమది. నన్నయ గారు సముద్రంలోనే నాటక రంగాన్ని దర్శిస్తే తిక్కనగారు సాక్షాత్తూ విరాటుడి నర్తనశాలకే తెచ్చిదాన్ని ప్రదర్శిస్తాడు. **'అభ్యసించితి శైశవ మాది గాగ - సద్భావా శ్రయములు - తజ్జన్య రసాశ్రయములు నైన యభినయంబు లెఱుగుదున్'** అని విరాటుని కొలువు కూటంలో చాటి చెప్పింది బృహన్నల కాదేమో. ఆ వేషంలో మఱుగుపడి మాటాడుతున్న కవి బ్రహ్మేనని నా అనుమానం. పైగా అంటాడా బృహన్నల – **'చతురతా విహీనములనైన శ్రమము** చేయింతునని. అన్ని రసభావాలనూ అభినయించి చూపగలడట. అలాటి పరిజ్ఞానం లేనివారినైనా శిక్షణ ఇచ్చి దారిలో పెట్టగలడట.

పోతే బృహన్నల వేషం వదిలేసి తానే మాటాడినా అలాగే మాటాడుతాడు తిక్కయజ్వ. స్వప్నంలో కనిపించాడట ఆయనకు హరిహర నాథుడు. కవిబ్రహ్మ కిష్ట దైవతం. ఎలా ఉన్నదా విగ్రహం **'కరుణా రసము పొంగి తొరిగెడు చాడ్పున శశిరేఖ నమృతంబు జాలు వాఱ.** మొట్ట మొదట ఆ దేవతలో కనిపించిందాయన కరుణారస వర్షం. అంతే కాక ఆయనను నిలదీసి అడుగుతాడీ భక్తుడు చనవు కొద్దీ. **కింకాల కూటః కిమువా యశోదా స్తన్యం తవస్వాదు వద ప్రభోమే'.** హాలాహల విష రసమా లేక యశోదా స్తన్య రసమా – ఏ రసం స్వామీ నీకిష్టమని. సంస్కృతంలో అడిగినా తెలుగులో అడిగినా రసాన్నే కలవరిస్తాడు కవి. అలాటి వాడు **'మహాకవిత్వ దీక్షా విధింబూని'** భారతామృతాన్ని మనకు ప్రసాదిస్తున్నాడంటే

ఎంతటి రసార్ణవ సుధాకరుడయి ఉండాలో చూడండి ఆ మహనీయుడు. రస పోషణమే ధ్యేయం తిక్కనగారికి. ఒక తిక్కనకే గాదు. కవిశబ్ద వాచ్యు డెవడికైనా ఉండవలసిన దృష్టి అదే. **'రస ప్రలుబ్ధధియః'** అని **సాధ్యోహిరసో యథాయథం కవిభిః** - అని నన్నయ గారే సిఫారసు చేశాడు గదా కవులందరికీ. రసమే ఆత్మ కావ్యానికి. కథ దానికి శరీరమైతే పాత్రలా శరీర ధారులైన స్త్రీ పురుషులు. పోతే చిత్ర విచిత్రమైన వారి మనోభావాలే కావ్యంలో విభావాను భావాదులు. శరీర మనః ప్రాణాదులన్నీ ఆత్మ కాలంబన మైనట్టే రసానికి కేవల మాలంబనాలే కథా పాత్ర భావ చేష్టాదులు. ఇది ఎంతగా తడవి చూడాలో అంతగా చూచాడు మహాకవి.

కనుకనే మహాభారత మనగానే అది ఒక మహాకావ్యంలాగా కనిపించిందాయన దృష్టికి. దాని కర్త అయిన వేదవ్యాసు డాయనకు భవ్య కవితా విష్టుడయి కనిపించాడు. అలాగే తానూ రసభావా విష్టుడయి రచన సాగించా లనుకొన్నాడు. అందుకే నేమో **'హృదయాహ్లాది చతుర్థ మూర్జిత కథో పేతంబు నానారసా భ్యుదయోల్లాసి విరాట పర్వమట యుద్యోగాదులుం గూడగా పదునేను'** పర్వాల భారత కథ తెనుంగులో చెబుతానంటాడు. పదిహేను పర్వాలలో విరాటోద్యోగాలు రావా. అవి మాత్రమే ప్రత్యేకించి పేర్కొనటం దేనికి. పైగా ఉద్యోగం కన్నా చతుర్థమైన విరాటమే మేలట. కారణం ఊర్జిత కథోపేతమట. అంతేకాదు. నానా రసాభ్యుదయోల్లాసి కూడా. ఉద్యోగం కాదా. అది కూడా. అందుకే రెండూ చెప్పి ఆదులంటాడు. విరాటమే ఉద్దేశిస్తే కవి విరాటాదులనే అనాలి గాని అలా కాక ఉద్యోగం కూడా చెప్పి ఆ తరువాత ఆదులన్నాడంటే ఏమిటి

ఉద్దేశం. ఎంతైనా ఉంది రహస్యమిందులో. అసలు భారత కథ కంతా కేంద్ర స్థానమేదా అని గ్రద్ద చూపుతో చూచాడు సోమయాజి. చూస్తే ఆయనకు వెంటనే దర్శన మిచ్చింది విరాటం. ఆ వెంటనే ఉద్యోగం. అవి రెండూ రైలు ఇంజను లైతే మిగతా పదహారు పదహారు రైలు బోగీలు. ఊర్జిత మైన కథా ఆ రెండింటిలోనే – నానా రసాలూ ఆ రెంటిలోనే రాశీ భూతమయి కనిపించా యాయనకు. మిగతా వాటి అనుయాయులన్నిటికీ ఆ ఊర్జితత్వాన్నే ఆ రసాభ్యుదయాన్నే పంచుతూ తమతో పాటు నడుపుతూ పోతాయవి. ఎక్కడెక్కడ ఏ పర్వానికే సన్నివేశాని కెంతెంత పంచి పెట్టాలో అంతంత పంచి భారత సంహిత అంతా కలిసి ఒకే ఒక అఖండరస క్షీరసాగరంలాగా ముందు వెనుకలు సమన్వయించి చూపటంలోనే ఉంది కవిబ్రహ్మ నిర్మాణ మార్మికత. ఇది గమనించే అన్నాడేమో కవిసార్వభౌముడు **'వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసాభ్యుచిత బంధ ముగ నొక్కొక్క** మాటనే మట. తిక్కన అనగానే శ్రీనాధునికి రసాభ్యుదయమే జ్ఞప్తికి వచ్చింది. అంతే కాదు. కావ్యబంధం రసోచితంగానే సాగాలి. రస పారవశ్యంలో పడిపోయి ఔచిత్యం దెబ్బ తినగూడదు. అలా పాటించిన వాడే కవిబ్రహ్మ అని ఇందులో ఇమిడిన అంతరార్థం. నన్నయను కూడా ఇలాగే కీర్తించాడు శ్రీనాధుడు **'భాషింతు నన్నయ భట్టు మార్గంబున ఉభయ వాక్ప్రౌఢి నొక్కొక్క మాటు'** అని. ఉభయ వాక్కంటే సంస్కృతాంధ్రాలూ మార్గదేశి దృశ్య శ్రవ్యాలనే రెండు బాణీలలోనూ ప్రౌఢుడని కూడా అర్థమే.

ఇంతకూ సోమయాజి కాయన ఇచ్చిన కితాబు చాలా ఘనమైనది. రసం కావ్యాని కాత్మ అని గదా పేర్కొన్నారు. ఆత్మ ఎలా సర్వవ్యాపకమో

అలా కావ్య శరీరం యావత్తూ వ్యాపించింది రసం. మిగతా కథా పాత్రలూ వర్ణనలూ అన్నీ దాని కుపకరించే సామగ్రే. అలాటి రసాభ్యుదయాన్నే ధ్యేయంగా పెట్టుకొన్నాడంటే మహాకవి - ఆయనకు మహాభారతమంతా రసమయంగా భాసించిందను కోండి. అదీ ఒకటి గాదు. నానారసాలతో కూడిన ఒక రసాయనం. దానితో ఊర్జిత మయింది కథా శరీరమంతా. కాగా శరీరానికి హృదయం లాగా దీనికీ ఒక కేంద్ర బిందువును పట్టుకొన్నాడు కవి. అదేదో గాదు. విరాట పర్వం. విరాడ్రూపమైన ఈ బ్రహ్మాండాని కంతా మానవ శరీర మొక క్షుద్ర బ్రహ్మాండమని వేదాంతులు వర్ణించినట్టు విరాట పర్వాన్నే ఆయన ఒక పరిచ్ఛిన్నమైన భారతం లాగా భావించాడు. భారత కథ పూర్వాపరాలన్నీ అందులోనే దర్శన మిచ్చాయాయన లోతైన దృష్టికి. మహాభారత కథ కంతటికీ విరాట పర్వమొక కొలికి పూస. నాటకంలో పతాకా స్థానం లాంటిది. మొత్తం కథా వస్తువంతా ఒక బీజంలో వృక్షంలాగా అందులోనే నిక్షిప్తమయి ఉంది. ఇది ఒక విశేషం. ఇంకొక విశేషమేమంటే అంతకు ముందు జరిగిన కథాంశాలైతే నేమి తరువాత జరగబోయేవైతే నేమి అందులోనే చమత్కారంగా ధ్వనింప జేశాడు వేదవ్యాసుడు. మహర్షి నిర్మాణంలో దాగి ఉన్న ఈ కళా రహస్యాన్ని దుర్బిణీ వేసి చూచి దాన్ని భేదించ గలిగాడు అపర వ్యాసుడు తిక్కన. అందుకే ఆయన దాని నంతగా వన్నె చిన్నెలతో తీర్చిదిద్దటాని కెంతగానో శ్రద్ధ చూపవలసి వచ్చింది. ఇది చక్కగా గ్రహించ లేకనే చాలామంది తెలిసీ తెలియని విమర్శకులు తిక్కన చాదస్తం కాకపోతే ఈ పర్వమొక్కటీ మరీ ఎందుకింతగా సాగదీస్తూ వ్రాశాడు. అనవసరం గదా. ఒక పెద్ద ఇతిహాసంలో

దీనికింత ప్రాధాన్యమిచ్చి ఇక్కడే చతికిలపడ్డాడని ఆక్షేపిస్తూ వచ్చారు. కాని లోతుకు దిగి పైన చెప్పిన రెండు రహస్యాలూ గ్రహించ గలిగితే కవిబ్రహ్మ సృష్టి ఎంత సముచితమో స్పష్టమవుతుంది.

విరాటపర్వంలోనే భారత కథ అంతా ఎలా కలిసి వస్తుందని గదా మొదటి ప్రశ్న. భారత కథలో ఎన్ని సన్నివేశాలున్నవో - ఎంతమంది పాత్ర లున్నారో వారి పరస్పర సంబంధా లెలాంటివో అన్నిటినీ సమగ్రంగా ప్రతిఫలింప జేస్తున్న ఒక గొప్ప దర్పణమిది. అన్ని పర్వాలూ కలిసి ఒక బింబ మనుకొంటే దానికొక ప్రతిబింబమీ పర్వం. దుర్యోధనుడి వంటివాడే కీచకుడు. వాడికున్నట్టే వీడికీ ఉన్నారు సోదరులు నూరుగురు. అందరూ విరాటుడి బలగం. విరాటు డెవరో గాదు. ధృతరాష్ట్రుడే. వాడెంత అశక్తుడో వీడూ అంతే అశక్తుడు. ఇరువురికీ ఇతరులంటే గౌరవమైతే ఉంది గాని స్వకీయుల మీద అభిమానమంత కన్నా ప్రబలమయి ప్రాణం తీసింది. పాండవులు తండ్రిని కోలుపోయి ధృతరాష్ట్రుని పాలబడ్డట్టే - జూదంలో తమ సర్వస్వాన్నీ కోలుపోయి విరాటుడి పాల జేరారు. అక్కడ దుర్యోధనాదుల దుశ్చేష్టితాలకు లోనయి ఏకచక్ర పురంలో అజ్ఞాత వాసం చేసినట్టే ఇక్కడా చేశారు అజ్ఞాత వాసం. అక్కడ ద్రౌపదిని సభాముఖంగా పరాభవించటానికి దుర్యోధనుడు యత్నించి నట్టే ఇక్కడ కీచకుడు విరాటుడి కొలువు వారందరూ చూస్తుండగానే ఆవిడను పట్టుకోటానికి సాహసించాడు. వాడి ప్రయత్న మక్కడ దైవశక్తి చేత విఫలమైనట్టే వీడిదీ ఇక్కడ దైవికంగానే వమ్మయి పోయింది. ముఖ్యంగా ద్రౌపది మూలంగానే అక్కడా ఇక్కడా ముప్పు సంభవించింది పాండవులకు. ప్రతిజ్ఞా రూపంగానైనా భీముడే అక్కడ

నోరు చేసుకోవలసి వచ్చింది. ఇక్కడ ఆ భీముడే నోరు గాక చేయి చేసుకోవలసి వచ్చింది. అంటే అక్కడ వాడి అంతు చూస్తానన్నాడు. ఇక్కడ వీడి అంతు చూడనే చూచాడు.

ఇలా ఆది సభా పర్వాల కథా భాగమంతా ఈ పర్వంలో మన కద్దంలో లాగా కనిపిస్తుంది. అలాగే అరణ్య పర్వవృత్తాంతం కూడా చాలా నిగూఢంగా స్ఫురిస్తున్నది. అరణ్యంలో మృగాలను వేటాడటం - భీముడాయా రాక్షసుల నుక్కడ గించటం - అర్జునుడు స్వర్గానికి వెళ్లి అప్సరసల ఆటపాటలు చూచి వినోదించటం - ధర్మజుడు మార్కండేయాది మునులతో సద్గోష్ఠి సలపటం - ఇవి గదా ముఖ్యాంశాలక్కడ. అవన్నీ మరలా మనకీ పర్వంలో దర్శన మిస్తాయి. మృగాలనిక్కడా భీముడు పట్టి వధిస్తాడు. రాక్షసుల లాంటి మల్లులతో పోరాడి ఎందరినో మట్టు పెడతాడు. మరి అర్జునుడైతే స్వర్గంలో అప్సరో నృత్తాలను తిలకించి నట్టే నర్తన శాలలో పడుచు కన్నెల కాట పాటలు నేర్పి వారాడుతూ పాడుతూ ఉంటే ఆనందిస్తాడు. పోతే సన్న్యాసి వేషంలో ధర్మరాజు విరాటుడితో నిత్యమూ సుభాషిత గోష్ఠితోనే కాలం గడుపుతూ వచ్చాడు.

ఇలా పూర్వకథా భాగాన్నంతా మరలా మనస్ఫురణకు తెస్తుందీ పర్వం. అంతేకాదు. పూర్వభాగాన్ని స్ఫురింప జేసి నట్టే ఉత్తర భాగంలో రాబోయే కథాంశాలన్నింటినీ పరామర్శించటం కూడా చూడవచ్చు మన మిందులో. అదెలాగంటే గోగ్రహణం జరిగింది విరాట పర్వంలో. అది చేసింది దుర్యోధనాదులు - దుర్యోధనుడు చేసిన గోగ్రహణమేదో గాదు.

భూగ్రహణమే. గోవంటే భూమి అని కూడా అర్థమే గదా. పాండవుల కొక అంగుళం కూడా పంచి ఇవ్వక మొత్తం భూమండల మంతా నాదేనని పంతగించటమే అతడు చేసిన గోగ్రహణం. అయితే పాండవు లూరక చూస్తూ కూచోలేదు. ఎలాగైనా విడిపించాలి దాన్ని. అందుకు యుద్ధమే శరణ్యం. అందులోనూ అర్జునుడి వల్లనే విజయం చేకూరాలి. రాబోయే యుద్ధ షట్కంలో మనం చూడబోయే విషయమంతా ఇదే. దాని కోసం నలుగురూ సమావేశం కావటమూ - ఏమి చేయాలా అని చర్చించటమూ - ఉద్యోగ పర్వంలో చూచే ఉదంతం. సరిగా ఈ విషయాలు రెండూ దాఖలా అవుతాయి విరాటంలో. గోగ్రహణ వార్త రాగానే అంతా కలిసి కర్తవ్యాన్ని చర్చిస్తారు. దక్షిణ యాత్రకు మిగతా వారందరూ వెళ్లినా ప్రధానమైన ఉత్తర యాత్ర కొక్క అర్జునుడే వెళ్ల వలసిన వాడయ్యాడు. కౌరవ సైన్యమంతా చాలావరకక్కడే సమావేశమయి ఉంది. వారందరిమీదా చేయి చేసుకొని ఒకే ఒక సమ్మోహనాస్త్రంతో అందరినీ నిద్ర పుచ్చాడు. ఇవి తరువాత ఒక్క పాశుపతాస్త్రంతోనే అన్ని అక్షౌహిణులకూ జవాబు చెప్పగల భావి భారత యుద్ధం గుర్తుకు తెస్తుంది.

ఇంకొక విషయం. భీష్మ ద్రోణులు దుర్యోధనునికి తెలియకుండా తమలో తాము మంతనాలు చేయటం - అర్జునుడి విషయంలో ఎనలేని అభిమానం చూపటం - ఆలోచిస్తే ఇది కూడా రాబోయే వృత్తాంతాన్ని మనసుకు తేకపోదు. అలాగే గదా తన పరాజయ రహస్యం భీష్ముడు పాండవులకు రహస్యంగా బయటపెడితే - ధర్మజుని అంత వాడు అబద్ధమాడుతాడా - తప్పకుండా కొడుకు మరణించే ఉంటాడని ప్రాణాలు

విడిచాడు ద్రోణుడు. పోతే భీముడు కీచకుణ్ణి వాడి సోదరులైన ఉప కీచకులతో పాటు అందరినీ వధించటం గమనిస్తే – రాబోయే కౌరవ సంహార మంతా కండ్లకు కట్టినట్టు స్ఫురిస్తుంది. కౌరవులు నూరుగురినీ మట్టు పెట్టిన వాడు పాండవులలో ఒక్క భీముడే గదా. అలాగే చీకట్లో ఎవరికీ తెలియకుండా రహస్యంగా అందరినీ చిత్రవధ చేయటం కూడా ఒక భావ్యర్థ సూచనే. తరువాత సౌప్తిక పర్వంలో అలాగే చేయబోతా డశ్వత్థామ. రాత్రికి రాత్రే అందరూ గాఢనిద్ర పోతుండగా ఒక్కొక్కణ్ణీ నిద్రలేపి ఆయుధం చేతికిచ్చి మరీ చావ మోదాడు పాండవ సైనికుల నందరినీ. ఇక్కడ భీముడి వ్యవహారమైతే అక్కడ అశ్వత్థామది. అంతమాత్రమే. వ్యక్తులను వదిలేస్తే రెండు చర్యలూ సమానమే. పోతే సుదేష్ణాదుల విలాపం విరాట పర్వంలో కీచకాదులు మరణిస్తే ఎలా జరిగిందో – అలాగే స్త్రీ పర్వంలో కురువీరు లందరూ మరణిస్తే గాంధారీ ప్రభృతులందరూ చేసిన ఆక్రందన కూడా జరిగింది. ఇది దానికి సూచకమే. ఈ దురంతం చూస్తే ఆ జరగబోయే దురంతం తప్పకుండా మనసుకు వస్తుంది భావుకుడికి.

అంతేకాదు. యుద్ధానంతరం విజయ సుఖమందరూ అనుభవిస్తున్నా ధర్మరాజుకు మాత్రం కత్తివాటు వేస్తే నెత్తురు చుక్క లేదు. ఇంతమంది పోయిన తరువాత నాకెందుకీ రాజ్యమని పెడ మొగం పెట్టుకొంటాడు. సరిగా ఇది విరాటంలో ఉత్తరుణ్ణి కాకుండా బృహన్నలను పొగుడు తున్నాడని విరాటుడు సారె విసిరితే దెబ్బ తగిలి తమ్ముల వైపు చూడలేక కంకభట్టు వేషంలో ధర్మరాజు మొగం చాటేసుకోటానికి ప్రతిరూపంగా కనిపిస్తుంది. ఆ పిమ్మట ధర్మజుడు విరాటుని సింహాసన మారోహించటం తమ్ములు

చుట్టూ వచ్చి నిలబడటం చూస్తే యుద్ధానంతరం జరగబోయే పట్టాభిషేక మహోత్సవాన్నే స్ఫురింప జేస్తుంది. అంతే కాదు. అభిమన్యుడికి ఉత్తరనిచ్చి వివాహం చేయటం కూడా సాభిప్రాయమే. వివాహ ఫలం సంతానమే గదా. వివాహితులైన ఇద్దరూ తీరిపోయి వారి సంతానమైన పరీక్షిత్తే చివరకు తండ్రి తాతలకు మారుగా పరిపాలకుడవు తాడని - పాండవులందరూ అతనికే రాజ్య భారమప్పగించి మహాప్రస్థానం చేసి అడవులకు వెళ్లిపోగలరని దూరంగా ఈ ఘట్టం మనకు ద్యోతనం చేస్తున్నది. ఇంకా ఒకరహస్యం కూడా గమనించవచ్చు మనం. విరాట పర్వంలో ఎక్కడా కృష్ణుడు గానీ - యాదవులు గానీ దర్శన మీయరు. మహా అయితే మేనల్లుడి. వివాహంలో దృశ్యాదృశ్యంగా. తరువాత ఉద్యోగ పర్వంలోనే కనిపిస్తారు. అంతకుముందూ ఆ తరువాతా వారి జాడా అంతగా కనిపించదు. దీన్ని బట్టి పాండవ నిర్యాణానికి ముందే యాదవకుల నిర్యాణం జరగ బోతుందనే మౌసల పర్వ వృత్తాంతానికిది వ్యంజకమా అని తోస్తుంది నాకు.

ఈవిధంగా తరచి చూస్తే మహాభారత రచనా ప్రణాళిక కంతటికీ విరాట పర్వ కథా వస్తు వొక నిలువు టద్దంలాగా భాసిస్తుంది. ఇందులోనే పూర్వాపరాంశాలన్నీ చమత్కారంగా ప్రతిఫలింప జేశాడు వేదవ్యాసుడు. ఆ వ్యాస మహర్షి హృదయాన్ని ఎప్పుడో గుర్తించాడు కవిబ్రహ్మ. గుర్తించి అక్కడా ఇక్కడా విప్రకీర్ణంగా దొరలిన భావాల నన్నిటినీ సేకరించి వాటిలో ఒలికిన రసభావాల నన్నిటినీ ఇందులో ఒక చోటనే సందర్భోచితంగా కుమ్మరించాడా అనిపిస్తుంది. ముందు వర్ణించి నట్టు కథా సన్నివేశాలన్నీ ఇందులోనే సూక్ష్మంగా దాగి ఉన్నాయి కాబట్టి ఏ రసాన్ని పోషించ దలచినా

ఇందులో ఆస్కారమున్నది. సర్వ సమర్థుడైన కవి ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తన కవితా శిల్పాన్నంతా ప్రదర్శించ గలడు. అందులోనూ **'శిల్పమునం బారగుడ** నని ఆత్మ విశ్వాసంతో చెప్పుకొన్న తిక్కన మనీషి ప్రదర్శించటంలో ఆశ్చర్యమేముంది. అనల్పమైన ఆ శిల్ప సంపద ఎలాంటిదో అది ఆయన తన అమలోదాత్త మనీషతో ఎలా ప్రదర్శించాడో మనం సాంగోపాంగంగా పరిశీలించ వలసి ఉంది. ఇందులో రస చర్చ చేస్తున్నప్పుడు భావ చర్చ కూడా కలిసి వస్తుంటుంది. **న భావ హీనోస్తి రసో - నరసో భావ వర్జితః** అని ఆలంకారికుల సిద్ధాంతం. ఘనీభవిస్తే భావం. అది ద్రవీభవిస్తే రసం. రతి భావమైతే శృంగారం రసం. శోకం భావమైతే కరుణం రసం.

అసలు రహస్యమేమంటే కావ్యంలో కథా పాత్రలూ - వారి మాటలూ చేష్టలూ ఆయా సన్నివేశాలూ - అని పేరేగాని అంతా రసమయమే. ఎందుకంటే అవన్నీ రసానికి సామగ్రే గనుక. వాటి పాటికవి స్వతంత్రంగా లేవు. అన్నీ రసం కోసమే ఉన్నాయి. విభావ భావానుభవ సంచారి సామగ్రీ సముల్లాసితః స్థాయీ భావోరసః అని పరిష్కారం చేశారు పెద్దలు. విభావ మంటే ఆలంబనం కావచ్చు. ఉద్దీపనం కావచ్చు. ఆలంబన మేదో గాదు. స్త్రీ పురుషాది పాత్రలే. ఉద్దీపన మాయా సంఘటనలు. పోతే అనుభావాలనేవి ఆయా పాత్రల మాటలూ చేష్టలూ. ఇక సంచారి భావాలంటారా. వారి మనస్సులలో ఎప్పటికప్పుడు ఉదయించే నానా విధములైన ఆలోచనలూ అనుభూతులూ. ఇదంతా రసస్ఫూర్తికి తోడ్పడే సామగ్రేనని తీర్మానించి నప్పుడిక కావ్యంలో ఏమి మిగిలింది నీకు. అన్నీ

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

రసమనే విపణి వీధిలో పెట్టి విక్రయించే సరకూ సరంజామే. కనుక ఒక మహాకవి చేసిన రసపోషణ గూర్చి చర్చిస్తున్నా మంటే ఆ కవి కావ్యమా మూలాగ్రమూ పరిశీలిస్తున్నా మన్న మాటే.

విరాటమే భారత వృత్త కేంద్రమని గదా పేర్కొన్నాము. పైగా నానా రసాభ్యుదయోల్లాసి అని గదా కవి వాచ్యంగానే చెప్పాడు. అంచేత అన్ని రస భావాలకూ అక్కడే ఉదాహరణలు దొరికి తీరాలి. ఆలంకారికులు ప్రసిద్ధంగా పేర్కొన్న కావ్యరసాలు తొమ్మిది. అవి అందరికీ తెలిసినవే. శృంగార వీరకరుణాదులు. ప్రతి ఒక్కటీ కొట్ట వచ్చినట్టు దర్శనమిస్తుంది మనకీ పర్వంలో. **'వలలుండెక్కడఁ జూచె నొండెడ న సేవ్య క్ష్మాజముల్ పుట్టవే'** అని వలలుడికి సలహా ఇచ్చే ధర్మారాజు మాటలలో శాంతం. కీచకుడి చేత భంగపడిన సైరంధ్రి విలాప వాక్యాలలో కరుణం. ఆ దృశ్యాన్ని చూస్తూ నిలుచున్న భీముని వర్ణించటంలో వీరరౌద్రాలు. కీచక వధలో బీభత్సం – ఉత్తరుడి ప్రసంగంలో హాస్యం. అతడు కురు సైన్యాన్ని చూచి హడలి పోవటంలో భయానకం. దుర్యోధనుడి సభావ ర్ణనలో ధర్మజుడు విరాటుని సింహాసన మెక్కి నలుగురూ అతణ్ణి చుట్టూ చేరి సేవించే ఘట్టంలో అద్భుతం. దక్షిణోత్తర గోగ్రహణ సందర్భంలో అర్జునుడు కౌరవులతో చేసిన యుద్ధంలో వీరం – చివర కుత్తరాభిమన్యు వివాహ ఘట్టంలో శృంగారం విశృంఖలంగా సాగాయి. ఇందులో కల్పనే అక్కర లేదు. కథా సన్నివేశాలే అవకాశమిస్తాయి. ఏమాత్రం తెలివి తేటలూ నేర్పున్న కళాకారుడైనా అది పుచ్చుకొని బ్రహ్మాండంగా తీర్చి దిద్దవచ్చు. భేషనిపించు కోవచ్చు. అలాంటి అవకాశాన్ని అద్భుతంగా పట్టుకొని అనన్యా దృశంగా

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

నిర్వహించాడు కుండలీంద్రుడు. ఆయా రసాలనూ వాటికి దోహదం చేసే పాత్రల హావభావాలనూ చూపటం గాని - వాటిని సజీవంగా మన ముందు నిలపటాని కెన్నుకొన్న పద్య గద్య రచనా సామగ్రి గాని అమోఘం. అవిస్మరణీయం కవి బ్రహ్మది. పద్యాలవి పద్యాలు గావు. రత్నాలు ముత్యాలు మణులు మాణిక్యాలు.

నానాత్వమనేది అన్నిరసాలనూ పోషించటంలోనే గాదు. ఒక్కొక్క రసంలో ఎంత లోతుందో ఎంత వైవిధ్యముందో నిరూపించటంలో కూడా కనిపిస్తుంది కవిబ్రహ్మ కౌశలం. ఇంతెందుకు. దుర్యోధన సభా వర్ణన పద్యమే తీసుకొని చూడండి. ఎలా నడుస్తుందో పద్యం. దాని గాంభీర్యం.

**మౌళి స్రక్సంగ రంగ న్మధుకర పటలీ మానసా కృష్టి విద్యా**
**శాలిస్ఫారాబ్జ రేఖాంజలి పుట ఘటనా చారుఫాల స్థల క్ష్మా**
**పాలశ్రేణీ విశాలాంబక కుముదవనీ బాంధవ శ్రేణిరమ్య**
**శ్రీలీలా గాఢ కాంతి స్మిత రుచి వదన స్ఫీతు - నాగేంద్ర కేతున్.**

ఇది ఒక అద్భుత రసాన్ని చిలకరించే ఒక అద్భుతమైన వర్ణన. హస్తినలో కొలువు తీరి ఉన్న దుర్యోధన సార్వభౌముణ్ణి వర్ణిస్తున్నాడు మహాకవి. తిక్కన దుర్యోధనుణ్ణి మనకు పరిచయం చేయుట మిదే మొదటిసారి. ఆయన చూచిన దుర్యోధనుడెలాటి వాడో అతని హుందా తనమెలాటిందో ఈ పద్యాన్ని అడిగితే కండ్లకు కట్టినట్లు బయట పెడుతుంది. దుర్యోధనుడిలో అన్నిటి కన్నా ప్రధానంగా పైకి వచ్చి కనిపించే గుణాలు రెండే రెండు. అభిమానమూ, ఐశ్వర్యమూ. అందరికీ నేను మిన్నగా

బ్రతకాలనీ అందరూ వచ్చి నాకు పాదాక్రాంతులయి నా చుట్టూ చేరాలనీ – ఇవే అతనికి బలంగా పట్టుకొన్న భావాలు. ఇదే మొదటి నుంచీ చివరిదాకా అతని జీవితాన్ని నడుపుతూ వచ్చాయి. వీటి మూలంగానే అతడు జీవితంలో పైకి వచ్చాడు. వీటివల్లనే చివరకు పాతాళానికే పడిపోయాడు. సరిగా ఇదే వర్ణిస్తాడీ పద్యంలో తిక్కన. ఎలాగంటారు.

రాజులందరూ అతని పాదాలకు వరుసగా వచ్చి మొక్కుబళ్లు చెల్లించి వెళ్లుతున్నారట. అలా మ్రొక్కుతున్నప్పుడు వారు చేతులు జోడిస్తే అవి ముకుళించిన పద్మాలలాగా కనిపిస్తున్నాయి. నిజంగా పద్మాలేమోనని తుమ్మెదలు వాటి మీదికి పోయి వాలుతున్నాయట. అది చూచి ఆశ్చర్యంతో కనులు పెద్దవి చేసి చూస్తూ ఆనందిస్తున్నారట రారాజు బాంధవులందరూ. వారి కండ్లు వికసించిన కలువలలాగా కనిపించాయట. పోతే ఇక దుర్యోధనుడి ముఖమో. అది చంద్రబింబంలాగా వెలిగిపోతున్నదట. అలా వెలిగిపోతుంటే దానిలో చిగురించిన చిరునవ్వు అది వెదజల్లే వెన్నెల లాగా దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నదట. దానితో ఆ మనిషి రెండింతలుగా పెరిగి పోయినట్టు భాసిస్తున్నాడట. కాగా వెనకాల అంతకన్నా ఎత్తుగా ఆయన గారి నాగకేతనం దర్శనమిస్తున్న దందరికీ. ఇదీ ఈ పద్యం వల్ల మనం గ్రహించే భావం. ఇది మామూలుగానే ఎంతో బాగుంది. కాని ఇంకా ఓపిక తెచ్చుకొని మనం లోతుకు దిగి చూచామంటే చాలు. మహాకవి ఇందులో ఎంత మర్మం పెట్టి మాటాడుతున్నాడా అని నిజంగానే మన మద్భుత రసా విష్టులమయి పోక తప్పదు.

భారత కథలో దుర్యోధనుడి జీవితమంతా భాసింప జేశాడు సభా వర్ణన వ్యాజంతో మహాకవి. అతడు రారాజు. అభిమానధనుడు. దర్జాగా బ్రతికిన వాడు మొదటి నుంచీ. ఎప్పుడూ సింహాసన మధిష్ఠించి ఏకచ్ఛత్రంగా సామ్రాజ్యాన్ని పాలించాలనే అతని ఉబలాటం. పదిమందీ తనకు పాదాక్రాంతులు కావాలనే. ఆ పాదాక్రాంతులైన సామంతరాజు లెవరో కారు. పాండవులే. జూదంలో తమ సర్వస్వాన్నీ ఓడిపోయి చేతులు జోడించుకొని కట్టుబట్టలతో నిలబడిపోయారు. అదే అంజలి పుట ఘటన అంటే. ఆ ఘటనకు కూడా కారణం ఘటనా ఘటన కోవిదుడైన శకుని మాయో పాయమే. అది అమాయికుడైన ధర్మరాజు మనసు నాకర్షించింది. మానసా కృష్టి విద్య ఇదే. అలా రాజ్యం కోలుపోయి ధర్మ జాదు లడవుల పాలయి – తమవాడు రాజ్యం చేస్తుంటే చుట్టూ చేరి ఓం భాయిలు పడుతున్న కర్ణ శకుని దుశ్శాసనాదులే పద్యంలో వర్ణించిన బాంధవ శ్రేణి. ఆనందంతో విప్పారిన వారి ముఖాలే విశాలాంబక కుముదవని. అలాంటి వారి కధీన మయ్యాడా సుయోధనుడని సూచించటమే బాంధవాయత్తుడనే మాట. వారితో కలిసి మెలిసి రాజ్య భోగా లనుభవించటమే అతని ముఖచంద్ర శ్రీలీలా గాఢ కాంతి. అలాటి ముఖ వికాసమే అతడు కాంక్షించినది.

కాని ఏమి సుఖం. అన్యాయార్జితమైన దెంతో కాలం నిలవదు. ఎప్పటికైనా దెబ్బ తగిలి తీరుతుంది. వినిపాతం తప్పదని చెప్పటానికే చివర నాగేంద్ర కేతువని ప్రయోగించటంలో ధ్వనిస్తున్నది. నాగేంద్ర మంటే సర్పం. అదే ధ్వజ చిహ్నం దుర్యోధనుడికి. ఇది పై అర్థం. అంతరార్థ మిక్కడ సర్పమంటే రాహువు. కేతువంటే కేతు గ్రహమే. రాహుకేతువు లిద్దరూ

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ప్రక్కనే పొంచి ఉన్నారు. చంద్రుడికి ముప్పు తప్పదు. మ్రింగేశాడంటే చంద్రుడితో పాటు వెన్నెల కూడా రూపరేఖలు లేకుండా మాసిపోతుంది. అంటే ఏమన్న మాట. దుర్యోధను డెంత ఐశ్వర్య మనుభవించినా అది తాత్కాలికమే. అతని స్వభావం సర్పంలాగా విషపూరితం. తన్మూలంగా బలవద్విరోధం కొని తెచ్చుకొంటాడు. శత్రువులని వారితో యుద్ధమని పేరేగాని చివరకు తన దుష్ట స్వభావమే తన్ను కాటు వేసి చంపుతుంది. దానితో తన ఉత్సాహమంతా ఒక్కసారిగా నీరుగారి పోతుంది. తన్నాశ్రయించు కొని బ్రతికే బాంధవుల బ్రతుకు కూడా బండలవుతుందని బ్రహ్మాండమైన భావ్యర్థ సూచన కూడా గుప్తమయి ఉందీ మాటలో. మొత్తం మీద ఇది ఒక్కటే ఒక పద్యమైనా భారత కథా ప్రారంభమూ పర్యవసానమూ రెండింటి నడుమా నడచిన వ్యవహారమూ అంతా ఎంత భంగ్యంతరంగా ధ్వనింప జేస్తున్నదో చూడండి. రసధ్వని ఎంత మనోహరంగా భాసిస్తున్నదో చూడండి.

పోతే గాంభీర్యమే గాక ఎంతో వైచిత్రి కూడా ప్రదర్శిస్తాడీ మహాకవి. ఒక రసాన్ని పోషించేటపుడు కూడా ఎన్నో ఛాయలూ స్థాయిలూ గోచరిస్తాయందులో. దేనికది క్రొత్తగా ప్రదర్శిస్తున్నాడా అని భ్రాంతి గొలుపుతుంది. ఇది మరి ఒక కవిలో ఎక్కడా కానరాని అంశం. చూడండి. ద్రౌపదీ గతమైన కరుణ రసం ఒక్కొక్కచోట ఒక్కొక్క భంగిమలో కనిపిస్తుంటుంది. **'దప్పి జనించె వ్రేళుల పుటంబులు పొక్కఁదొడంగె'** అనే పద్యంలో ఆవిడ దూరప్రయాణం చేయలేక బాధపడటం దగ్గరి నుంచీ **'ఆనత వైరి యోజయ'**

అనే పద్యంలో చివర ఆవిడ మరణ భయంతో చేసిన ఆక్రందన దాకా గమనిస్తే ఎన్ని పోకడలు పోయిందో ఈ రస ప్రవాహం ఆశ్చర్యం గొలుపుతుంది రసజ్ఞుడికి. ఇలాటి వైవిధ్యం చూస్తే నాకు త్యాగరాజస్వామి కీర్తనలు గుర్తుకు వస్తాయి. ఒక రాగంలో పదికీర్తనలు కడితే ఆ మహానుభావు డొక్కొక్క రాగంలో ఒక్కొక్క కీర్తన కట్టినట్టుగా తోస్తుంది. ప్రక్కల నిలబడి అని ఒక కీర్తన. చక్కని రాజ మార్గమని ఇంకొక కీర్తన. రెండూ ఖరహరప్రియే. కాని వాటి ఎత్తుగడ వేరు. నడక వేరు. అలాగే కవిబ్రహ్మ పద్యరచనా కౌశలం కూడా. ఆయన త్యాగబ్రహ్మ. ఈయన కవిబ్రహ్మ. అది సంగీత సృష్టి అయితే ఇది సాహిత్య సృష్టి. తేడా ఏముంది.

పోతే మరొక్క విశేషమేమంటే ఒక రసంలో వేరొక రసాన్ని జోడించటం. వీలయితే ఆ రెండింటిలో మరొక దాన్ని కూడా మిళితం చేయగలడు సోమయాజి. ఇది సంగీతంలో రాగమాలికలాగా ఒక అపూర్వమైన శోభ నిస్తుంది రచనకు. అంతేకాదు. రాగమాలికలో లేని విశేషమొకటి ఉంది ఇందులో. రాగమాలికలో ఒకదాని కొకటి సరిపడే రాగాలే కూర్చవలసి ఉంటుంది. సజాతీయమైతేనే గాని విజాతీయమైతే అంత బాగుండదు. ఇక్కడ అలా కాదు. పరస్పర విజాతీయ భావాలు కూడా కూర్చగలడు మహాకవి. కూర్చి మెప్పించ గలడు కూడా. **'వనితా యేనొక, పల్కు పల్కెద'** అని కీచకుడు తన అప్ప సుదేష్ణతో ఆడిన మాటలలో శృంగారంతో వీరరసం చేయి కలుపుతుంది. **'దేవి తృష దీర్చ'** నని కీచకుడు సైరంధ్రితో అన్న మాటలలో శృంగారంతో పాటు హాస్యం దోబూచు

లాడుతుంది. **'నన్నటు లాడురాత్మ సదనంబు నకున్'** అని వాపోయిన సైరంధ్రి స్వగతంలో కోపమూ ధైర్యమూ జతగా నడుస్తాయి. **'నీవింత యలుగ నేటికి'** అనే ద్రౌపది వాక్యంలో ధైర్యంలో హాస్యం తొంగి చూస్తుంది. **'నను ముట్టి నీవు వెండియు వని తలతో'** నని స్త్రీ వేషంలో ఉన్న భీముడు కీచకుడితో చేసిన ప్రసంగంలో వీరమే కాదు. హాస్యరసం కూడా స్ఫురిస్తుంటుంది. ఇలా ఎన్నైనా చూపవచ్చు ఉదాహరణలు.

ఇంకా ఒక గొప్ప విశేషముంది తిక్కన రసపోషణలో. ఒక సందర్భంలో ఒక పాత్ర రసావేశంతో పలికిన పలుకులే వేరొక సందర్భంలో కూడా పలుకుతుంది. కాని మొదట పొందినది సహజమైన ఆవేశమైతే తరువాతది ఆరోపించుకొన్నది. లేదా దాని ననుకరించిన ఆవేశం. ఇది ఒక చమత్కారమైన శిల్పం. చూడండి. **'దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర - ద్గర్వాంధ ప్రతి వీర నిర్మథన విద్యా పారగుల్మత్పతుల్ - గీర్వాణాకృతు లేవు రిప్లు నిను దోర్లీ లన్వెసన్ గిట్టి గంధర్వుల్మానము ప్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా'** అనే పద్యం మొదట కీచకుడు తన్ను ఒంటరిగా చూచి బలవంతం చేయబోయిన ఘట్టంలో వాణ్ణి బెదిరిస్తూ ఆవిడ చెప్పినది. అదే పద్యం తరువాత తన వల్లభుడైన భీమసేనుణ్ణి వంటశాలలో రాత్రి మరలా ఒంటరిగా కలుసుకొన్నప్పుడావిడే చెప్పింది. అయితే అప్పుడు తాను కీచకుణ్ణి చూచి పొందిన వీరావేశ మిప్పుడు లేదు. లేకున్నా దాన్ని తాత్కాలికంగా అనుకరిస్తూ జరిగిన సంఘటన మరలా ఏకరువు పెడుతూ ఉంది. కాబట్టి దాన్నే మరొకసారి

పరామర్శించ వలసి వచ్చింది. కనుకనే పద్యం తూచా తప్పకుండా మక్కీకి మక్కీ పునరుక్తం చేశాడు మహాకవి. చూడబోతే ఇందులో ఒక లోతైన భావం కూడా ఇమిడి ఉంది.

భీముణ్ణి సైరంధ్రి నీవేమీ చేయలేక నిర్వీర్యుడ వయ్యావని నిష్ఠూర మాడితే - అతడు నీవూ వాడూ ఏమి మాటాడుకొన్నారో నాకేమి తెలుసునంటాడు. దాని కావిడ సమాధానమిస్తూ నీవు కానకుండా నేనేమీ కాని పని చేయలేదు సుమా. వాడితో లాలూచీ పడలేదు - నేను వాడితో అప్పుడన్న మాట ఇదే సుమా - అని దాచకుండా అప్పుడే మాట అన్నదో అదే ఇప్పుడూ అన్నదని అర్థం చేసుకోవాలి మనం. దీనివల్ల ఆమె చిత్తశుద్ధి ఇలాటిదని భర్త దగ్గర ఋజువు చేయటానికే కవి ఈ పద్యాన్ని పునరుక్తి చేశా డనిపిస్తుంది. ఎంత గొప్ప శిల్పమో చూడండి ఇది. మొత్తం మీద చెప్పిన పద్యమక్కడా ఇక్కడా ఒకటే అయినా మొదటిసారి చదివితే సహృదయుడికి కలిగే అనుభూతి వేరు. తరువాత కలిగే అనుభూతి వేరు. సన్నివేశాన్ని బట్టి మారుతుంది రసానుభూతి. శ్రీనాథుడు పేర్కొన్న రసాభ్యుచిత బంధ మిదేనేమో.

ఇలాటిదే మరొకటుంది. **'ఘనతరకోప వేగమునఁ గన్నుల నిప్పులు రాల నంగము - ల్గనలంగ సాంద్ర ఘర్మ సలిలమ్ములు గ్రమ్మ నితాంత దంత పీడన రట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త నర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధ మూర్తియై'** అని ఒక పద్యం. ఇది కీచకుడు సభాసదు లందరి సమక్షంలో ద్రౌపది నవమానిస్తుండగా చూచిన

భీమసేనుడి కోపోద్రేకాన్ని వర్ణిస్తూ చెప్పినది. భార్య పరాభవాన్ని చూచిన భర్తకు కలిగే కోపావేశాన్ని కన్నులకు కట్టినట్టు చూపుతుందీ పద్యం. పోతే ఇలాటిదే ఇంకొక పద్యం కనిపిస్తుంది మనకు విరాట పర్వంలో. అది కూడా ఇలాగే నడుస్తుంది. **'ఘనతర కోప వేగమునఁ గంపము నొందు నిజాంగ కంబులన్ - తన ధృతి పెంపు సొంప చలితంబులఁ జేయ సమీరు కూర్మి నందనుడు తదీయ చేష్టలును తద్వచనంబుల చొప్పు నేర్పడం గను మతి నూరకుండె నవికార నిగూఢ నిజప్రకారుడై'.** పై పద్యానికి ప్రతిబింబం లాగా కనిపిస్తుంది. అదీ చంపకమే. ఇదీ చంపకమే. దాని ఎత్తు గడా దీని ఎత్తు గడా ఒకటే. కొన్ని పదాలూ సమాసాలూ అలాగే దొర్లాయి. భావం కూడా చాలావరకు సరిపోతుంది. రెండూ కీచకుణ్ణి చూచి భీముడికి కలిగిన ఆవేశాన్నే వర్ణిస్తాయి. అయితే కనుగొని కోపవేగమున అనే మొదటి పద్యం భార్య భంగపాటు కండ్లార చూచి భరించలేని దశను వర్ణిస్తుంది. కాబట్టి అందులో ఉండే పదబంధం సమాసాడంబరం రచనా ధోరణి మనకు ఓజోగుణాన్ని ఆవిష్కరిస్తుంది. కాగా ఇది కీచకుణ్ణి తరువాత నర్తనశాలలో రహస్యంగా ఏకాంతంలో కలుసుకున్న సందర్భంలో వర్ణించింది. భార్య నవమానిస్తున్నప్పుడు పొందిన ఆగ్రహ మాపాటికి చల్లబడింది. ఇప్పుడు తనకు వాడిపైన ఆగ్రహ మెంత ఉన్నా అది మనసులోనే నిగూఢంగా ఉండాలి. వాణ్ణి చంపటానికి చేసే ప్రయత్నం కాబట్టి వెంటనే తాను బయట పడగూడదు. కనుకనే పద్యం కూడా దాని కనుగుణంగా అంత ఉద్ధృతంగా గాక అంత

సౌమ్యంగానూ కాక మధ్యస్థంగా సాగిపోయింది. 'నిగూఢ నిజ ప్రకారుడై' అనే మాటలో కవే దాన్ని ధ్వనింప జేస్తున్నాడు. భావ గోపన మంటారు దీన్ని ఆలంకారికులు.

ఇలాంటి భావా విష్కరణమూ భావ గోపనమూ రెండింటికీ అద్దం పట్టే మరొకటి కూడా మనం తడవి చూడవచ్చు. **'సింగం బున్న గుహా నికేతమునకున్ శీఘ్రంబున న్వచ్చు మాతం గంబుం బురుడించుచున్ పవన పుత్ర స్వీకృతంబైన యా రంగా గారము సేర వచ్చి మదిలో రాగంబు ఘూలార్ణిల్ల - నింతి గాముండిట దేడె యింత కని యుద్వృత్తాంగ జోన్మాదుడై.** ఇది భీముడు మారువేషంలో ముందుగా వచ్చి రంగా గారంలో ఉండగా - కీచకు డక్కడికి తానూ వచ్చినప్పుడు చెప్పిన పద్యం. దీనికి ప్రతిబింబ ప్రాయంగా **'సింగం బాకటితో గుహాంతర మునం జేద్పాటు మైనుండి - మాతంగస్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చు నోజం - గాంతార నివాస ఖిన్నమతి నస్మత్సేనపై వీడె వచ్చెం - గుంతీ సుత మధ్యముండు సమర్థస్థే మాభిరా మాకృతిన్'** అని సాగిన మరొక పద్యం. తరువాత బృహన్నలా వేషంలో ఉన్న అర్జునుడు శత్రుసేనల మీదికి లంఘించేటపుడు చెప్పినదది. రెండింటి ఎత్తుగడలూ పదాలూ భావాలూ చాలావరకూ సరిపోతాయి. ఒకటి కీచకుడు చావటానికి వచ్చిన దృశ్యాన్ని వర్ణిస్తే - ఇంకొకటి అర్జునుడు శత్రువులను చంపటానికి పూనుకొన్న దృశ్యాన్ని చూపుతుంది. కనుకనే మొదటిది కొంత శిథిలంగా నడిస్తే రెండవది సాటోపంగా సాగిపోతుంది. అక్కడ సింగం దగ్గరికి మాతంగం తెలియక

వస్తే ఇక్కడ మాతంగాల మీదికి సింగం తెలిసి దూకబోతున్నది. అది గుహలో ఉన్న సింహమైతే ఇది గుహ బయటికి వచ్చిన సింహం. ఇక్కడ ఉన్న విజృంభణ అక్కడ ఎలా ఉంటుంది. గుహలో ఉన్న సింహం కనపడనట్టే నర్తనశాలలో కనపడకుండా ఉన్న సింహమా భీముడక్కడ. కనుకనే తదనుగుణంగా భావం కూడా గుప్త మక్కడ. కనపడే సింహమక్కడ అర్జునుడు. కనుక భావ మాడంబరంగా ఆవిష్కృత మయింది. చూడండి. సందర్భాన్ని బట్టి రచనా భేదమెంత హృదయా హ్లాదాన్ని కలిగిస్తున్నదో.

పద్యాల నిలా బింబ ప్రతిబింబ రూపంగా మలచి చూపటం కుండలీంద్రుని కొక సరదా. ఇది కేవలమూ వినోదం కోసమే గాక ఏదో ఒక గొప్ప ప్రయోజనాన్ని ఉద్దేశించి చేస్తాడు మహాకవి. శిల్పమునం బారగుడ నని స్వయంగానే చెప్పుకొన్నాడు గదా. అలాంటప్పుడా చేయటంలో ఆశ్చర్యమేముంది. **'భవదాజ్ఞా దృఢ బంధ సంయమిత శుంభ ద్వేగమై కాకనా - దవలీలన్ మన యర్జున ద్విపము క్రోధావేశ దుర్దాంత దర్ప విలాసోద్భట భంగి నేపడరి కౌరవ్యాంబుజ శ్రేణిఁ జిక్కు వడం జేయదె యొక్క వ్రేల్మిడిన నీకున్ వేడ్క సంధిల్లగన్'**. ఇది విరాట పర్వం మొదట్లోనే మనకు దర్శన మిస్తుందీ పద్యం. ఇంకా పాండవు లజ్ఞాత వాసానికి బయలుదేరుతున్నారు. విరాట నగర మింకా చేరలేదు. ధర్మజుడు మనమీ అజ్ఞాత వాసమెలా చేస్తామో ఎవరి కంటా బడకుండా కాలమెలా గడపగలమో నని విచారిస్తుంటే భీముడాయనతో అనే మాటలివి. సరిగా ఇలాంటి పద్యమే మరొకటి మనకు తరువాత ఉద్యోగ పర్వంలో

సాక్షాత్కరిస్తుంది. **'బలమత్తాకృతి యైన భీముడను శుంభత్కుంభి సంరంభమున్ - నిలిపెన్ నాడును నంకుశంబయి - తుది న్నేడుందదు ద్రేకమున్ - మలఁగం జేయ న జాత శత్రుని కృపా మౌగ్ధ్యంబె చాలంగ వారల కేలానయు విక్రమోచిత విచార క్లేశముల్ సంజయా'.** ఇది సంజయుడు రాయబారం వచ్చి తిరిగి హస్తినకు వెళ్లిపోతుంటే అర్జునుడు సంజయునితో ఆడిన మాట. దానికీ దీనికీ ఎంత దూరముందో చూడండి. అయినా ఒక ఆంతరంగికమైన సంబంధముంది రెండింటికీ. మొదటిది భీముడర్జునుడి పరాక్రమాన్ని వర్ణిస్తూ చెబితే - రెండవది అర్జునుడు భీముడి బలపరాక్రమాలను వర్ణిస్తూ చెప్పింది. అన్నదమ్ముల కొకరి మీద ఒకరి కుండే అభిమానం. ఒకరి శక్తి మీద ఒకరి కున్న విశ్వాసం ఎలాంటిదో ఇందులో వాచ్యంగా వ్యంగ్యంగా కూడా బయటపెడుతున్నాడు కవి. అంతేకాదు. ఇంత పరాక్రమ వంతులై కూడా ఇరువురూ తమ అన్నగారి ఆజ్ఞకెలా కట్టుబడతారో ఆయనగారంటే ఎంత గౌరవమో - ఎలా జవదాటరో - అది కూడా ఎంతో గొప్పగా చాటి చెబుతున్నాడీ వర్ణన ద్వారా.

చూడండి ఇక్కడ చమత్కారం. భీముడర్జునుణ్ణి మత్తేభ మంటే అర్జునుడు భీముణ్ణి మత్తేభ మంటాడు. మొత్తాని కిద్దరూ మత్తేభాలే. ఇభ మైతే కొంత మాట వింటుందేమో గాని మత్తేభమే మాత్రమూ వినదు. అయినా ఇక్కడ మావడి వాడెవడో గాదు. ధర్మరాజు. మత్తేభాల కుండే బల పరాక్రమాలు మావంతుడికి లేనట్టే ధర్మజుడికి లేకపోవచ్చు. కాని

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

వాటి రెండింటినీ అదుపులో పెట్టే ఓర్పూ నేర్పూ కావలసి నంత ఉందీ మావటికి. కనుకనే చివరదాకా ఈ మత్తేభాలు రెంటినీ జాగ్రత్తగా నడుపుతూ వచ్చాడు. ఆయన ఆ మత్తేభాలను నడిపితే తదనుగుణంగా కవిగారు తానూ ఈ రెండు మత్తేభాలనూ నడుపుతూ రావట మింకా సొగసుగా కనిపిస్తుంది రసజ్ఞులకు.

పోతే ఇంకొక విశేషం ఒక రసాన్ని అనుకరించటం. అప్పటికప్పుడు రసోత్పాదకమైన సన్నివేశమేదీ లేకపోయినా – ఉంటే ఎలా ఉంటుందో భావించి దాన్ని అభినయించి చూపుతుం దొక్కొక్క పాత్ర. అలాటి సందర్భాన్ని కూడా అతిలోకంగా వర్ణిస్తాడు తిక్కన సోమయాజి. ఉదాహరణకు భీముడు కీచకుణ్ణి సంహరించే ముందొక రిహార్సలు చేస్తాడు. ఇది నిజంగా ఒక నాటక ప్రదర్శనానికి పూర్వం జరిగే రిహార్సలే సందేహం లేదు. ద్రౌపది ఎదుట తాను చేయబోయే పరాక్రమ చర్యనంతా నటించి చూపుతాడు భీముడు. '**నాకు పరమోత్సాహంబు సంధిల్ల దుస్సాధంబైన విరుద్ధ కార్యమిటులా సన్నంబుగా సంఘటింతే – ధర్మాత్మజు డాత్మ మెచ్చ పగ సాధింపంగం గాన్పల్పమే -వెఱవక సంకేతించిన తెఱగున నయ్యేడకు నరుగు దెంచునొకో – కొందఱఁ దెచ్చునొకో – వెడగై యతి మురి వెలిఁ బుచ్చు నొకొ రహస్యం బెల్లన్ – అట్టిద యేల చేయు హృదయంబున నెక్కడి శంక వానికిన్ – వచ్చు మదాంధ వృత్తి నని వారణ నొక్కడు నాట్య శాలకుంజొచ్చు నవశ్యమున్ వెదకి చూచి ననుంగని యప్డు సంగరం – బిచ్చు న సంశయం బది – బలియుండా సొబగుండు నన్నరసి నీచందంబు**

**గాకున్న నాకులతం బొందెడు – నప్టు మండపము సంక్షోభంబుగా లేతుఁ గట్టలు కన్ ఎతిగి పిఱసనిన వెసఁబైకుఱుకుదు – వెఱచఱవం బొదువుదు – బతి పతి సేయుదు నీదు పూన్కి పారం బెయిదన్. నన్ను గొంత కినియింప నోపెడు చందమైన వినుము. అవనీ చక్రము సంచలింపగ దివం బల్లాడ – క్రోధము కృతార్థత్వమ్ము నొందించి చిత్రవధ ప్రౌఢి వహింతు సూతునకు రౌద్రం బేర్పడం జొచ్చెదన్'.**

ఇది నిజంగా వీరమా హాస్యమా రౌద్రమా ఏ రసమో మనం చెప్పలేము. లేదా ఆలంకారికులు వర్ణించిన భావశబలత అయినా కావచ్చు. మొత్తం మీద రాబోయే వీరరౌద్ర భయానక బీభత్సాలను ముందుగా అభినయించి చూపే రసానుకరణమిది. ఎంతో అద్భుతంగా చిత్రించి చూపాడు కవి. అసలు రసపోషణ అంతా ఒక ఎత్తు. ఆ రసాన్ని భావుకుడి హృదయంలో హత్తు కొల్పటానికి కవి కూర్చే సామగ్రి ఒక ఎత్తు. ఈ సామగ్రి పద్యరచన దగ్గరి నుంచి కవి ఎన్నుకొనే భావాల వరకూ ఉంటుంది. పద్య రచన అంటే సామాన్యమైన విషయం కాదు. అది ఒక గొప్పకళ. అందరికీ పట్టు పడదది. శిల్పమునం బారగుడైన తిక్క యజ్వలాంటి మహాకవులకే దక్కిన సొత్తు. ఏ రసానికే పద్యం వ్రాయాలో ఆయనకు తెలుసు. అది ఎలా ఆరంభించాలో – ఎంత ఎత్తుకు తీసుకెళ్లాలో ఎన్ని మలుపులు తిప్పాలో – చివరకెలా సమాప్తం చేయాలో – ఇదంతా తిక్కనకు తెలిసినట్టు మరే తెలుగు కవికీ తెలియదంటే అతిశయోక్తి కాదు.

రసానుగుణంగా ఛందస్సు నెన్ను కోవాలని కూడా ఒక మాట ఉంది. ఇది అక్షరాలా పాటించ నక్కర లేదు గాని సాధారణంగా వీర రౌద్రరసాలను వ్యక్తం చేయటానికి శార్దూల మత్తేభాలూ – స్రగ్ధరలూ వాడటం తిక్కన కలవాటు. అలాగే నీతులూ ధర్మాలూ బోధించే శాంత రసాని కనుగుణంగా కంద పద్యాలూ గీతులూ నెలదులూ కూర్చటం కూడా ఆయన కలవాటే'. సింగం బాకటితో – దుర్వారోద్యమ – గాండీవజ్యారవం బుత్కటమయి – ఇలాటి ఘట్టాలలో ఇది బాగా వ్యక్తమవుతుంది.

అంతేకాదు. విరాటుడి పుత్రులు యుద్ధానికి బయలుదేరేటపుడు వరుసగా వృత్తాలు ప్రయోగిస్తాడు కవి. అవి చదువుతుంటే ఒకణ్ణి మార్చి ఒకడు కదనుదొక్కుతూ ముందుకు సాగిపోతున్న అనుభూతి నిస్తుంది. ఉత్తరుడే కౌరవులను జయించి వచ్చాడతని గెల్పుటుత్స వాన్ని ఆడంబరంగా జరపాలంటూ విరాటుడు చెప్పిన **'వీటన్ వీధుల నెల్ల నేనుగులపై విస్ఫార ఘంటా ధ్వనిం జాటంబంపుడు పేర్మినుత్తరు జయాశ్చర్యంబనే** పద్య మెంత దర్పంగా దర్జాగా నడుపుతాడో చూడండి కవి. అసలు తిక్కన ఛందస్సులను రసానురూపంగా ఎన్నుకొంటాడనే విషయం స్త్రీ పర్వంలో ఋజువయి నట్టుగా మరెక్కడా కాలేదు. ముందుగా యుద్ధ భూమిని నాలుగు పద్యాల్లో వర్ణిస్తాడు కవి. అవి నాలుగూ లయగ్రాహి వృత్తాలే. మాటి మాటికీ అనుప్రాస చెవిన బడుతుంటే ఆ భయానకమైన దృశ్యాన్నే అలా కన్నార్పకుండా మాటి మాటికీ దర్శిస్తూ

నిలబడి పోవలసిందే మనం. అందులోనూ ఒక పద్యం నడచిన ట్లొకటి నడవదు. నాలుగూ యుద్ధ భయానక దృశ్యాన్ని నాలుగు భంగిమలలో చిత్ర విచిత్రంగా తెచ్చి మనకు చూపుతాయి. ఇది ఒక వైచిత్రి. పోతే ఇక స్త్రీల ఆక్రందనా వారు చేసిన విలాపనా వర్ణించి చెప్పటాని కెన్ని ఛందస్సులను పట్టుకు వస్తాడో చెప్పలేము. ఇది ఒక నూతనమైన ప్రయోగం. కేవలం నిరర్థకంగా చేసిన ప్రయోగం కూడా కాదిది. చాలా సాభిప్రాయం. స్త్రీల విలాపాలలో సహజంగా ఉండే వైవిధ్యాన్ని ప్రదర్శించటానికే ఈ ఛందో వైవిధ్యం. అప్పుడే లోక సహజంగా కూడా ఉంటుందది. దీన్ని బట్టి ఛందః ప్రస్తారంలో కూడా రసాభ్యుచిత బంధం కవి బ్రహ్మ ఎలా పాటించి చూపగలడో అందులో ఎంత పాటవముందో ఆయనకు సహృదయుల కనుభవైక సంవేద్యం.

అంతేకాదు. తాను తీసుకొన్న ఆయా ఛందస్సుల నెలా రసభావాను గుణంగా నడపాలో కూడా తెలుసు కవి బ్రహ్మకు. ఇది ఒక అనంతమైన శిల్ప సముద్రం. చూడండి. పుత్ర వాత్సల్యంతో కుంతీదేవి కోడలు ద్రౌపదితో మాటాడేటప్పుడు పద్యమెలా నడుపుతాడో కవి. **'కడు పసిబిడ్డ వీడొకటి గాదవు నా నెఱగండు – ముంద తెయ్యడ నొకపాటె ఱుంగడెద యెంతయుఁగోమల – మెప్పుడైన నేఁ గుడువగఁ బిల్తుఁ గాని తనకుం గల యాకటి ప్రొద్దెఱుంగఁ డీ కొడుకిటు పోకకున్ మనసు గుందెడు – నిన్నని యూఱడిల్లెడున్.'** ఇందులో సమాసాలు లేవు. అన్ని పొడి పొడి

మాటలు. అవీ చాలావఱ కచ్చతెనుఁగు పదాలే. పదబంధంలో దార్ఢ్యం లేదు. శిథిల బంధమిది. ఎక్కడి కక్కడ చిన్న చిన్న వాక్యాలు. పైగా డకార ప్రాచుర్య మెక్కువగా కనిపిస్తుంది. ఇది కన్నతల్లి వాత్సల్య భావం గదా. దాన్ని బయట పెట్టే ఆవిడ గుండె దడ దడ అయినా కావచ్చు. శరీరం గడ గడ అయినా కావచ్చు. రసస్ఫూర్తి కనుకూలమైన ప్రసాద గుణం కొట్ట వచ్చినట్టు కనిపిస్తుంది. తల్లి తన కొడుకు పడబోయే బాధ మనసుకు తెచ్చుకొని మాట్లాడే టపుడలాగే నడుస్తుంది వ్యవహారం. డగ్గుత్తికలో అనే మాటలెలా ఉంటాయి. మాట మాటకూ కన్నీరు పెడుతూనో – గొంతు పెగలక ఆగి ఆగి మాటాడుతూనో సాగుతున్నదీ పద్యం నడక చూస్తే.

పోతే దుర్వారోద్య మ లాంటి పద్యమూ – భీష్మద్రోణ కృపాది లాంటి పద్యమూ చూడండి ఎంత పకడ్బందీగా నడుస్తాయో. వీర భయానకాది రసాల కనుగుణంగా సాగుతుందా రచన. అందులోనూ భీష్మ ద్రోణ పద్యమొక ఎత్తు. దుర్వారోద్యమ పద్యమొక ఎత్తు. ఒకటి భయపడుతూ నడచిన పద్యమైతే – ఇంకొకటి భయపెడుతూ నడచింది. ఉత్తరుడు కురుసైన్యాన్ని చూచి హడలి పోయినప్పుడు వర్ణించిన పద్యం గదా అది. కనుకనే భయానక మది. మరి కీచకుణ్ణి బెదరించటాని సైరంధ్రి అన్న మాటలు గనుక అది వీర రసాన్ని స్ఫురింప జేసే పద్యం. భీష్మ ద్రోణలో నాలుగే సమాసాలు. అన్నీ వచ్చీ పోయి ఒకే కొలతలో ఉన్నాయి.

చూడండి. '**భీష్మ ద్రోణ కృపాది ధ్వన్వి నికరాభీ లంబు - దుర్యోధన గ్రీష్మా దిత్య పటుప్రతాపవిసరాకీర్ణంబు - శస్త్రాస్త్ర జా లోష్మ స్ఫార చతుర్విధో జ్జ్వల బలాత్యుగ్రంబు - దగ్రధ్వజా ర్చిష్మ త్త్వాకలితంబు - సైన్యమిది యేఁ జేరంగ శక్తుండనే**' అంటాడు ఉత్తరుడు. అతడి భయాన్ని వర్ణించే ఈ నాలుగు సమాసాలూ భయాన్నే మూటగట్టి మనకందిస్తున్నాయి. నాలుగూ చేసే పని ఒకటే గనుక ఒకటే కొలత. మొదటిది ముప్పాతిక పాదందాకా నడచి అక్కడికి విఱుగుతుంది. రెండవది అక్కడి నుంచి ఆ పాతికను కలుపుకొని రెండవ పాదం ముప్పాతిక దాకా ప్రసరిస్తుంది. చివర దాకా ఇదే వరస. ఇలా ఒకటి మరొక దాని కందిస్తూ మజిలీలుగా సాగిపోవట మొక అందం. ఉత్తరుడికి తెరలు తెరలుగా ఉదయించే భీతావహాన్ని చిత్రిస్తుందీ విరుపులతో కూడిన పద్య రచన. చివర కిది నేఁ జేరంగ శక్తుండనే అని పలకటం - అలా అంటూ అంటూ అతడు రథం మీద చతికిలబడి పోవటాన్ని కూడా ధ్వనింపఁజేస్తుంది.

పోతే దుర్వారోద్యమలో రెండవ పాదంలో చాలా దూరమొక సమాసం గుక్క తిప్పుకోకుండా నడపి తరువాత మత్ప్రతుల్ - అని ఒక చిన్న మాట ప్రయోగిస్తాడు కవి. అక్కడ తన పతుల సామర్థ్యమెలాటిదో చూపి వాణ్ణి బెదిరించటానికే దీర్ఘమైన ఆ సమాస సంఘటన. ఇకవాడు చేయబోయే కార్యమేదో చెప్పటానికి '**గిట్టి ముట్టి - మానము ప్రాణ**'మని రెండు జంట మాటలు ప్రయోగిస్తాడు. అవి వెంట వెంట ప్రయోగించటం చూస్తుంటే

Vallamraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

ఆ గంధర్వుల లాఘవమూ - సంరంభమూ హృదయానికి వెంటనే హత్తుకొని పోతాయి. అసలు ప్రాసాక్షరాన్ని ఎన్నుకోవటంలో కూడా కవి ప్రౌఢి కనిపిస్తుంది. భీష్మ ద్రోణలో ష్మ అనే ప్రాస ఉచ్చరించేటపుడు ఉత్తరుడి భయాందోళన లుట్టి పడతాయి. ష్మ ఉష్ణత్వాన్ని పుట్టిస్తుంది పెదవుల కదలికలో. అదే అక్కడ జరిగిన వ్యవహారం. అలాగే దుర్వారోద్యమలో ర్వా అనే సంయుక్తాక్షరం సైరంధ్రి పండ్లూ పెదవులూ నొక్కి పట్టి కచ్చెగా చేయి పైకెత్తి కీచకుణ్ణి బెదిరించి మాటాడుతున్న దృశ్యాన్ని బయట పెడుతుంది.

పోతే ఉద్యోగ పర్వంలో ఒక పద్యమిలాగే నడుస్తుంది. భీష్మ ద్రోణలో ఎలాటి విరుపులో అలాటి విరుపులే అక్కడా. కాని ఇక్కడ ఉత్తరుడు భయపడుతూ చెబుతున్న దయితే - అక్కడ ధర్మరాజు సంజయుణ్ణి హడల గొడుతూ హెచ్చరించిన పద్యం. చాలా అద్భుతమైన రచన అది. **'గాండీవ జ్యా రవం బుత్కటమయి పెలుచం గ్రమ్మినన్ - భీము బాహా దండం బేపారి శుంభ ద్గద జడియుచు రౌద్రంబుగా దోచినన్ - వేదండ ద్వంద్వంబు మాడ్కిందఱిమి కవలు మాద్యద్గతిన్ దాకినన్ - చాకుండం బోకుండఁ గౌరవ్యులకు వశమె - బిట్టులిక్కి మూర్ఛిల్ల కుండన్'** - ఇలాటి పద్య రచన సాహిత్య రంగంలో ఎక్కడో గాని మనకు పొడకట్టదు. అంత అపురూపమైన శైలి ఇది. ఇందులో విశేషమేమంటే ఇది ధర్మరాజు సంజయుణ్ణీ వాడి ద్వారా కౌరవవీరు లందరినీ హెచ్చరిస్తూ చెప్పిన పద్యం. మేమేదో లే

పొమ్మని వారిని ప్రాధేయ పడే కొద్దీ వారు మమ్ములను చవటలుగా భావిస్తున్నారు. సాత్త్వికంగా ఉన్నంత వరకే సాత్త్వికులం మేము. వారు మా సాత్త్విక స్వభావ మర్థం చేసుకోక పెడసరాన పడ్డారంటే మేము వారికెలా బుద్ధి చెప్పాలో అలా కూడా చెప్పగలం తెలుసా నీకు. నీవు వాళ్ల పక్షంలో అంత వారున్నా రింత వారున్నారని మమ్ము భయపెట్ట జూస్తున్నావు. అందరికీ జవాబు చెప్పగలరు మా తమ్ములు - అని చెబుతూ అది ఎలాటి జవాబో బయట పెడుతున్నాడు ధర్మజుడు.

గాండీవ అని ప్రారంభించి మూర్ఛిల్ల కుండన్ అని అంత మవుతున్నది పద్యం. స్రగ్ధర ఇది. వీరరౌద్రాదులకు పెట్టిన పేరు. అర్జునుడి గాండీవ జ్యారవం కొంతవరకు సాగింది మొదటి పాదంలో. అది భీముడి గదా ఘూతాని కవకాశమిస్తే అది సాగుతూ పోయింది రెండవ పాదం కొంతదాకా. ఆ తరువాత నకుల సహదేవులనే మత్తేభాలను రెండింటినీ పురికొలిపి ఊరకుంటే ఆ రెండు మదగజాలూ తరిమి కొడితే చూడండి ఇక దాని పరిణామ మెలాంటిదో. కౌరవులు చావక పోరాదు. ప్రాణం పోవక పోరాదట. అదీ కాకుంటే కనీసం మూర్ఛ అయినా రాకుండా పోరాదట. ఎంత ఘూటైన భావమో చూడండి. దాని ఘూటుకు దగిన ఎంత దీటైన రచనో చూడండి. వరుసగా అర్జునుడూ భీముడూ నకుల సహదేవులూ అన్నదమ్ములందరూ ఒకరి వెనుక ఒకరు వచ్చి కౌరవ సైన్యం మీద విరుచుకు పడుతున్నట్టే తోస్తుంది పద్యం చదువుతుంటే. పాదం చివరదాకా నడవదే భావం. అది ముగియరా దక్కడికి. అది ముగిసే లోపలే మరొకటందు కోవాలి దాన్ని. భావ గమన మెలాంటిదో పద్య గమన మలాంటి దయి కూచుంది.

అంతేకాదు. భావావేశంలో ఉండే గమనాన్ని బట్టి పద్యగమనాన్ని పాటించడంలో కవి బ్రహ్మకున్న నేర్పు అనన్యాదృశం. చూడండి. ఇంతకు పూర్వ ముదాహరించిన **'భవదాజ్ఞా దృఢ బంధ'** అనే పద్యంలో మొదట సమాస మారోహణ మార్గంలో నడుస్తుంది. అది కూడా చాలా దట్టమైన కూర్పు. ఇది ఏనుగులాంటి అర్జునుని దృఢ పరాక్రమమూ అగ్రజుని ఆజ్ఞకు లోనయి మెలగటమూ సూచిస్తుంది. తరువాత నాడవవీలన్ మన యర్జున ద్విప' మనటంలో బంధం కొంత సడలింది. ఆ తరువాత మరలా దాని క్రోధాన్ని వర్ణించేటపుడు క్రోధావేశ దుర్దాంత దర్ప విలాసోద్భట **'భంగి'** అని ఒక దీర్ఘమైన సమాసం వచ్చి చోటు చేసుకొన్నది. **కౌరవ్యాంబుజ 'శ్రేణి'** అనటంలో అల్లి బిల్లిగా అల్లుకొన్న తామర కొలనును ప్రదర్శిస్తుంది. **'సిక్కువడంజేయదె'** దగ్గరి నుంచి మరలా శిథిల బంధం. 'సిక్కువడ ఒక్కవ్రేల్మిడి' కకార ద్విత్వం రెండు మార్లు ఆవృత్తమయి నిజంగా ఆ కొలను చిక్కుపడటాన్నే చూపుతుంది. అక్కడి ప్రాసస్థానంలో పద మిక్కడికి విరగటం కూడా దీనికి ద్యోతకమే. పోతే **'మౌళి స్రక్సంగ'** పద్యంలో చివర దాకా నాలుగు పాదాలూ ఒకే ఒక సమాసంతో నడపి చివరకు స్ఫీతు – నాగేంద్ర కేతు అనేచోట సమాసాన్ని అంతం చేసి ఒక చిన్న సమాసాన్ని తునక లాగా దాని కతికించాడు మహాకవి. అలా పొడిగించడంలో ఇలా అతికించటంలో ఏమిటి కవి హృదయం. దుర్యోధనుడి ఐశ్వర్యమెంత గొప్పదో ప్రదర్శించటానికి అతిదీర్ఘమైన సమాసం. కడపటికది ఎలా హఠాత్తుగా అంతరించి పోతుందో తెలపటానికా విరుపక్కడ. మరి దానికి హేతువేమిటో తెలపటానికే ఆ కేతువనే అతుకు.

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

ఇలా ఎంతైనా ఉంది రసానుగుణమైన పద్య రచనా శిల్పం తిక్కనలో. ఇంకా ఒక గొప్ప గుణం కూడా కనిపిస్తుంది మనకు తరచి చూస్తే. ఒక రస ముదయించేటపుడూ - అది బలం పుంజుకొనేటపుడూ - పుంజుకొని అది పెరిగి పెరిగి విజృంభించేటపుడూ - అంతకంతకు దాని పెరుగుదలతో పాటు పద్యాలు కూడా పెరుగుతూ పోతాయి. భీముడు కీచకుడి దౌర్జన్యం తిలకిస్తూ కోపోద్రేకం పొందుతున్నప్పుడు రచించిన పద్యాలే దీనికి ప్రబలమైన తార్కాణం. మొదట కందం - తరువాత చంపకం - ఆవల సీస పద్యం రచిస్తూ పోతాడు కవి. మీరే చూడండి.

**తానును నన్నయు నయ్యా**
**స్థానంబున నుండి పవన తనయుఁ డసహ్యం**
**బైన మనోవల్లభ యవ**
**మానమునా సింహ బలుని మదజృంభణమున్**

**కనుగొని కోప వేగమునఁ గన్నుల నిప్పులు రాలనంగము**
**ల్గనలఁగ సాంద్రఘర్మ సలిలమ్ములు గ్రమ్మ - నితాంత దంత పీ**
**డనరట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త న**
**ర్తన ఘటనా ప్రకార భయద స్ఫురణా పరిణద్ధ మూర్తియై**

**నేలయు నింగియుఁ దాళము ల్గావించి**
**యేపున రేఁగి వాయించి యాడ**
**కుల పర్వతంబులు గూల్చి యొండొంటితో**

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

దాకంగ వీకమ్మైఁదన్ని యాడ
నేడు సాగరములు నిక్కడక్కడఁబెట్టి
పలుచని రొంపి మ్రైఁ గలయ నలఁద
దిక్కులు నాలుగు నొక్క చోటికి ఁ దెచ్చి
పిసికి పిండలి చేసి పిడుచ గొనఁగ
మిగిలి బ్రహ్మాండ భాండంబు పగుల వ్రేయ
నప్పళించుచుఁ బ్రళయ కాలానలమున
గండరించిన రూపంబు కరణి భీముఁ
డతి భయంకరా కారత నతిశయిల్లె

ఇవి మూడు వరసగా చదువుతుంటే భీమగతమైన కోపం మొదట మెల్ల మెల్లగా అంకురించి తరువాత క్రమంగా పుష్పించి చివరకు ఫలించి దాని ఘాటు నలుగడలా క్రమ్ముకొనే దృశ్యం కండ్లకు కడుతుంది. కోప మక్కడ పెరిగే కొద్దీ దాని విజృంభణాన్ని ఆవిష్కరించే ఛందస్సు కూడా పెరుగుతూ కందం చంపకంగా అది పెరిగి సీసంగా మారిపోతున్న దృశ్యం కూడా నేత్రోత్సవం చేస్తుంది. అంతే కాదు. కోపరస మాగకుండా కట్టలు తెంచుకొని ప్రవహిస్తున్నట్టే వాక్యం కూడా ఏ పద్యాని కాపద్యంతో ఆగకుండా చివరి పద్యం చివరి మాట దాకా సాగుతూ పోయి అక్కడి కాగిపోతుంది దాని ప్రయాణం. భావమాగితే గదా వాక్య మాగవలసింది. భావ మెందు కాగదు. ఆవేశం చల్లారక. అవిచ్ఛిన్నంగా కలిగే ఆ ఆవేశాన్ని వ్యక్తం చేయాలంటే ఇలాగే సాగాలి వాక్య నిర్మాణం.

Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

ఇంకా ఒక కళా రహస్యముంది ఇందులో. రెండవ పద్యమే చూడండి. ఎంత ప్రౌఢమైన గమనమో అది. కనుగొని అనే మాటతో మొదలయి అంత కంతకు పెరుగుతూ పోతున్న ధోరణి అక్కడి కక్కడే గోచరిస్తుంది. ఘర్మ సలిలమ్ములు గ్రమ్మ అనటంలో చెమట పట్టి ఒంటి కతుక్కు పోవటమూ – నితాంత దంత పీడన రటదాస్య అన్నపుడు పండ్లు గీటటమూ. వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త నర్తన అనే మాటలలో నిజంగానే భీముడి కనుబొమలు కోపోద్రేకంతో పైకీ కిందికీ కదులుతూ నాట్యం చేయటమూ – స్ఫురణా పరిణద్ధ అనటంలో ముందుకూ వెనక్కూ కోపంతో ఊగిపోవటమూ – కనపడటంలేదా మీకు. సహృదయుల కిది నిజంగా అతిలోకమైన రసానుభూతిని ప్రసాదించే పద్య శిల్పం. ఇంత కన్నా కవి చాతుర్య మేమంటే చంపకంలో సమాస నిర్మాణంతో కలిగించిన రౌద్ర రసానుభూతిని మనకు తరువాత రచించిన సీసంలో మామూలు పొడి మాటలతో అంతకన్నా ఎక్కువ మోతాదులో అందజేయటం. పంచిపెట్టటం. అక్కడ శబ్ద విన్యాస సాహాయ్యం తీసుకొంటే కవి – ఇక్కడ కేవలం భావ విన్యాస బలంతో మనకది ప్రసాదించట మెంతైనా ఆశ్చర్యకరం.

పద్య రచన కన్నా గొప్పదప్పటికి భావరచన. పద్యాన్ని భావం కాదు. భావాన్ని పద్య మనుసరించాలి. దీన్ని గూర్చి తిక్కన విషయంలో ఎంతైనా చెప్పవచ్చు. ఇంతెందుకు. పయి మూడు పద్యాలలో ఆయన వర్ణించిన భావాలే చాలు. వీటి నాలంకారికుల భాషలో అనుభావాలూ సంచారి భావాలూ అంటారు. ఒక కోప వర్ణన కెంత సామగ్రి కావాలో అంతా

ఉన్నదక్కడ. కనుబొమ లాడించటం - పండ్లు కొఱకటం - పెదవులు కఱవటం - కండ్లు మండి పోవటం - ఒళ్లంతా చెమట పట్టటం - ఇంతే కాదు. ఆవేశంతో ముందుకూ వెనక్కూ ఊగుతున్న విగ్రహం కూడా చూపుతున్నాడు మహాకవి. పోతే నేలా నింగీ తాళాలుగా చేసి వాయించటం - సముద్రా లేడూ ఇంకించి వాటి అడుగున ఉన్న పంకం దేహమంతా పులుముకోటం - ఇలాంటి భావాలు ఎంత సహజమైనవో అంత అతిలోక మైనవి. ఒక మానవుడికి కలిగిన కోపోద్రేకాన్ని ఇంత కంటే గొప్పగా సమగ్రంగా ఎవరూ చూపలేరు. ఆఖరు కన్నీ వివరంగా వర్ణించి ఇక వర్ణించ లేక కుండలీంద్రుడు కూడా ఒక మాట అంటాడు. ప్రలయ కాలా నలమున గండరించిన రూపమట భీముడు. ఆపాద మస్తకమూ అగ్ని జ్వాలలతో మలచి పోతబోసిన విగ్రహమని వర్ణించట మింత వరకూ చేసిన వర్ణన కంతటికీ ముక్తాయింపా అని తోస్తుంది.

ఇంకొక ఉదాహరణ ఇస్తాను చూడండి. ఉత్తర కుమారు డొక్కసారిగా కౌరవ సైన్యాన్ని చూడగానే బెదరి పోయి గడ గడ వడకి పోయే దృశ్యమెంత సహజ సుందరంగా వర్ణించాడో కవి. అది రౌద్రరస వర్ణన అయితే ఇది కరుణ భయానక రసభరితమైన చిత్రణ, **'వెల వెలఁబాఱుచు వెగడొందు - పెదవులు దడుపుచు నెంత యుఁదల్ల డిల్లు**

**జల్లన నంగంబు లెల్లనిండఁ జెమర్చు**

**పదములు కరములు గుదియ వడకు**

**హృదయంబు తట తట నదరంగఁ బెలుకుఱు** ఇలా నడుస్తూ పోతుంది పద్యం. ఇంతకన్నా భయమనే భావాన్ని ఏ కవీ చిత్రించ లేదు. వాడి భయమెంత దూరం పోయిందంటే **'నిష్కళత శుద్ధ హేమంబు - నిర్మలోజ్జ్వలాష్ట వైడూర్యములు - తురగాఢ్య రథము - కరటి దశకంబు - నొక యూరు - పురము సొచ్చినపుడ యిచ్చెద నీకను - నార్తుఁ డగుచు'** ప్రాణాలతో నన్ను మా ఊరు చేర్చావంటే చూడు నీకు వజ్ర వైడూర్యాలూ - వెండి బంగారాలూ - అన్నీ నేను కానుకగా సమర్పించు కొంటా నంటాడు. లంచమిస్తా నంటాడు చివరకు. వాడి ఆరాటం చూడండి ఎలా ఉందో. అది వర్ణించటంలో కరుణ భయానకాలతో హాస్యాన్ని కూడా ఎలా మిళితం చేసి చూపుతున్నాడో చూడండి సోమయాజి.

భావాన్ని పొడిగించట మన్నానే ఇంతకు ముందు. భావం పెరుగుతూ పోయే కొద్దీ పాత్రల నోట వచ్చే మాటలు కూడా పెరుగుతూ పోతాయి. ఈ విద్య తిక్కనకు తెలిసిన ట్టెవరికీ తెలియదు. దీనికొక మచ్చు తునక ఇస్తాను చూడండి. **'ఆనత వైరియోజయ - మహాద్భుత విక్రమ యోజయంత - దుర్మాన విఘూర్ణ మానరిపు మర్దన యో విజయాభిధాన - తేజో నిహతాహిత ప్రకట శూర గుణ ప్రతిభాస యోజయత్సేన - విరోధి బాహుబల జృంభణ భంజన యోజయ ద్బలా'** - ఇది సైరంధ్రిని ఉపకీచకులు తమ అన్న శవంతో కట్టి శ్మశానికి తీసుకెళ్లుతున్న ఘట్టంలో ఆవిడ తన భర్తలను గంధర్వుల పేర్లతో పిలుస్తూ వెళ్లిపోతున్న సందర్భంలో కవి వర్ణించిన పద్యం. జయ - జయంత - విజయ - జయత్సేన -

జయద్బల – అని ఆ గంధర్వుల పేర్లు. ఊరక గంధర్వు లైదుగురున్నారనే గాని వారెక్కడ ఉన్నారో వారి నామధేయా లేమిటో చెప్పలేదింత వరకూ కవి. ద్రౌపది చేసిన ఆక్రందనలో అవసర మేర్పడి ఇప్పుడు వాటిని బయట పెడుతున్నాడు. ఇందులో ఆమె ఓఓ అని కేకలు పెట్టటమూ వారి పేర్లు వరుసగా పిలుస్తూ పోవటమే గాదు. అంతకు మించిన రచనా శిల్ప మేమంటే శిబికను వారు మోసుకుపోతున్నారు గదా. అది దూరం పోయే కొద్దీ అంతకంత కామె ఆక్రందన ఎక్కువగా చేయవలసి వస్తున్నది. అందుకే వారిని గూర్చి చేస్తున్న సంబోధన కూడా అంతకంతకు దీర్ఘంగా సాగుతూ పోతున్నది. మొదటిది చిన్నది – రెండవది పెద్దది. మూడవది మరి కొంచెం పెద్దది. అక్షరాలంత కంతకూ ఎక్కువ సంఖ్యలో కనడపడుతాయి. పద్యం చదివే తీరులో చదవండి. మీకే అర్థమవుతుంది. ఇంకా అర్థం కాకపోతే భాగవతం గజేంద్ర మోక్షంలో గజేంద్రుడి మొర ఆలకించండి. అది చెబుతుంది. ఓ కమలాప్తయో వరద అనే పద్యం ఇలాంటిదే. అక్కడా ఓఓ అని కేక పెట్టటమే. అయితే అందులో ఈ శిల్పం లేదు. అక్కడ కవి ఇలా వ్రాయాలని ఉద్దేశించ లేదు. ఉద్దేశిస్తే వ్రాయగలవాడే. కాని ఆయన దృష్టి వేరు. ఈయన దృష్టి వేరు. ఇది ప్రయత్న పూర్వకంగా చేసిన రచన.

ఇంకొక్కటి ఉదాహరిస్తాను చిత్తగించండి. అది ఉద్యోగ పర్వంలో దొరలిన పద్యం. కృష్ణుడు కౌరవుల వద్దకు రాయబారం పోతూ అక్కడ నన్నేమి మాటాడ మంటారు మీ అభిప్రాయ మేమిటని పాండవులనూ ద్రౌపదినీ వేర్వేరుగా అడుగుతాడు. అప్పుడు ద్రౌపది తన మనసులోని అక్కసునంతా వెళ్ళ గక్కి కండ్ల నీరు పెట్టుకొంటే చూచి శ్రీకృష్ణుడన్న మాటలివి.

**'యమమహిష ఘంటికా నాదము విన౿గౌతూహలంబు దళుకొత్తెడు చిత్తములు గల కౌరవుల - కిష్టములగునే సంధి కార్య శాంతి వచనముల్'**
దుర్యోధనాదు లతి మూర్ఖ స్వభావులు - తన మాట లెలాగూ వారు వినిపించు కోరు. అవి వారి చెవులకు శూలాయ మానాలు. ఎటు చూచినా భారత యుద్ధం తప్పదు. అందులో దుశ్శాసనుడు చిత్రవధ పాలవుతాడు. దుర్యోధనుడు తొడలు విఱిగి నేల కొఱుగుతాడు. అదే గదా ద్రౌపదికి కావలసింది. అలాటి దారుణమైన పరిణామం కండ్లార గాంచితే గాని ఆవిడ ఉడుకు చల్లారదు. మరి సంధి ప్రయత్నం సఫలమైతే ఇది ఎలా సంభవం. సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడికది తెలియక పోలేదు. కనుకనే అంటున్నాడు. ఏమని. ఆ కౌరవ పాంసనులు నా శాంతి వచనా లెందుకు వింటారు. ఎంత చెడ్డా అవి వారికి చచ్చు పుచ్చు మాటలే గదా. నిత్యోల్లాస శీలురైన వారి మనస్సుల కవి ఉత్సాహ మెలా గొలుపగలవు. అలాటి కౌతూహలమే వారికి కలగాలంటే అంతకన్నా ఆడంబరంగా వినిపించే రణరణ ధ్వనులు వేరే ఉన్నాయి. అవి ఏవో గావు. యముని వాహనమైన దున్నపోతు మెడలో గట్టిన ఘంటానాదమే సుమా - అది వినాలని ఎంతో వేడుకతో చెవులు రిక్కించుకొని దిక్కులు చూచేవారికి నాశాంతి వాక్యాలెలా చెవిన బడుతాయంటాడు పరమాత్మ

ఏమిటీ మాటల కర్థం. ఆ కౌరవాధము లెట్లాగూ అంతా కట్ట గట్టుకొని చావగోరుతున్నారు గాని బ్రతకాలనే ఆశ ఒక్కరికీ లేదు. అంత మొండితనమున్న వాళ్లకు నా మాట లెలా నచ్చుతాయి. కయ్యానికే కాలు

దువ్వి చివర కందరూ యుద్ధమనే అగ్నికుండంలో మిడతలలాగే పడి మాడిపోగలరు. దానితో నీ ప్రతికార వాంఛ కూడా అప్రయత్నంగా నెరవేరగలదు. నీవు కోరుతున్నదీ అదే గదా. అని ఇంత అంతరార్ధ మున్నది ఇందులో. అంతేగాదు. దుష్టశిక్షణ శిష్ట రక్షణ ధర్మ సంస్థాపన గావించక పోతే నేను లోకంలో అవతరించి ఏమి ప్రయోజనమనే ఒక మహార్ధం కూడా తొంగి చూస్తున్నది.

ఇంత లోతైన భావమున్న ఈ పద్యానికి కవి సంతరించిన రచన చూడిండి. ఎంత సౌందర్యాన్ని చిందుతున్నదో, 'యమ మహిష అనే మాట మొదలుకొని కౌరవులనే మాట వరకూ మూడున్నర చరణాలు కేవల మారోహణ మార్గంలో నడిస్తే – తతిమ్మా ఆ కొంచెమూ అవరోహణలో నడుస్తున్నది పద్యం. మొదట చెప్పిన భావం రౌద్ర బీభత్స భయానకాల నుద్యోతనం చేయాలి కాబట్టి అది ఆరోహణాత్మకమే కావలసి ఉంది. పైగా యమ మహిష అన్నప్పుడెక్కడో ఊర్ధ్వ లోకాలకు సంబంధించిన వ్యవహారం గదా అది. అంచేత తదనుసారిగా రచన ఊర్ధ్వముఖంగానే పయనించట మెంతైనా శోభావహం. అలాగే రెండవది శమప్రధానమైన భావం కాబట్టి అది అవరోహణలో నడవటమే అందం. పైగా ఎక్కడో విను వీధులలో గాదు. భూమి మీద హస్తినాపురంలో కౌరవుల సభలో తానాడ వలసిన మాట అది. కనుక పద్య మలాగే నడవటం సముచితం. ఇక్కడ మరి ఒక రమ్యత ఏమంటే పద్య మెత్తుగడ సమాస జటిలంగా ప్రారంభమయింది. తరువాత కొన్ని తడిపొడి తెలుగు మాటలతో సాగింది.

అలా సాగినా సంస్కృత సమాసంతో చేయి కలిసి అవి కూడా ఊర్ధ్వాభిముఖంగా పయనించటమే వింత. మరి అలాటి పొడి మాటలే అయినా ఇష్టములగునే దగ్గరి మంచి నడకలో ఒక నడలిక ఏర్పడి అది నిమ్నాభిముఖంగా సాగట మింకా చిత్రం. పద ప్రయోగం కూడా ఎంతో అభిప్రాయ గర్భంగా కనిపిస్తుంది. ఘంటికా నాద మొకటైతే శాంత వచనాలు మరొకటి. నాదానికుండే ప్రచండత వచనాని కెక్కడిది. పైగా అర్థం లేనిది నాదమైతే అర్థప్రకాశక మైనది వచనం. అయినా అర్థ రహితమైన నాద మార్భాటంగా చెవుల బడుతుంటే ఇవి దాని అనురణనంలో ఆగి పోవలసిందే. అందుకే అది ఊర్ధ్వగామి అయితే ఇది అధోగామి. అది మూడున్నర పాదం దీర్ఘంగా సాగితే ఇది ఒక పాదంలోనే తల దాచుకొన్నది. ఇలా భావన చేసే కొద్దీ బయట పడతాయి ఎన్నో కళా రహస్యాలు.

ఏ రసానికైనా ఆలంబనం పాత్రలే నని గదా పేర్కొన్నా మింతకు ముందు. పాత్ర లెలాటి వారో వారి స్వభావ మెలాటిదో - ఎప్పుడెప్పుడు వారి తత్త్వ మెలా మారుతూ పోతుందో - ఆయా సందర్భాల ఒత్తిడికి లోనయి వారెలా ప్రవర్తిస్తారో - ఎలా భావిస్తారో ఎలా మాటాడుతారో - ఎలా వ్యవహరిస్తారో - ఆ సూక్ష్మాలన్నీ ఎక్కడి కక్కడ వారి జీవితాలలో చొచ్చి చూచి వాటన్నిటినీ చిలువలు పలువలు పెట్టి వర్ణిస్తూ పోవటం తిక్కన గారికి వెన్నతో బెట్టిన విద్య. మరి రసాభ్యుదయ మాయన ధ్యేయ మైనప్పుడు దానికి తగిన సామగ్రి అంతా ఆయన ఖజానాలో ఉండవలసిందే గదా. అది ఒక అక్షరమా పదమా వాక్యమా ప్రకరణమా అని ప్రశ్నే

లేదు. రసమనేది కావ్య శరీరమంతా వ్యాపించి ఉన్నపుడు దాన్ని అభివ్యక్తం చేయటానికన్నీ తోడ్పడవలసిందే. అవి ఎంత బలంగా కనిపిస్తే రసస్ఫూర్తి అంత బలంగా అనుభవానికి వస్తుంది. అందుకే అక్షరం మొదలు కథా వస్తువు వరకూ అన్నిటి మీదా దృష్టి ఉండాలి కవికి. అయితే వాటి కోసం గాదు. వీటి సహకారంతో రసమనే వంటకం తయారు చేయటానికి. సహృదయులకు వడ్డించి వారి మెప్పు పొందటానికి. ఇలాటి సర్వతో ముఖమైన దృష్టి కవిబ్రహ్మ కెంత ఉండాలో అంతగా ఉంది.

భావ గోపన మని ఇంతకు ముందొక మాట విసిరాను. అది విస్మరించ లేదు గదా మీరు. మనం మరచినా మహాకవి గుర్తు చేయగలడు. చూడండి ఈ వర్ణన.

**'ముదమున నెలమి సొంపొదవి నెమ్మొగమున**
**దోఁపంగ వచ్చినఁ ద్రోచి త్రోచి**
**లలి నుల్ల సిల్లుచు లలిత లోచన దీప్తు**
**లడర నుంకించిన నాగి యాఁగి**
**సంతసంబున బాలిశములగు చెయ్వులు**
**తొడరఁజూచినఁ జేయ కుడిగి యుడిగి**
**మనమున నుబ్బుమై మాట నాలుకకు రా**
**గడఁగిన నాడక కడగి కడపి**

**ధీరయై యిట్లు సమ్మద పూరమునకు -గఱువతన మను బలితంపుఁ గట్ట వెట్టి వెలఁది యెఱుఁగని యది వోలె వికృతి లేక - యల్ల నెప్పటి యట్టుల నరుగుటయును** ఇది కీచకునితో సహా ఉపకీచకులందరూ తన

నాథుని చేతిలో మ్రందిన తరువాత పితృవణం నుంచి ఒంటిగా సైరంధ్రి విరాట నగరానికి మరలి వచ్చి రాజ వీధిలో తిరుగుతున్న దృశ్యాన్ని వర్ణిస్తున్న పద్యం. అంత పని జరిగినా ఏమీ జరగనట్టు అభినయిస్తూ వస్తున్నదావిడ. మనసులో ఎంతో ఉల్లాసమున్నా అది మనసులోనే. కళ్లలో ఎంత కళ ఉన్నా కళ్లలోనే. శరీర మెంత ఉప్పొంగుతున్నా అది అక్కడే. నాలుక దాటి మాట రాబోతున్నా అది అందులోనే అణచుకొంటూ వస్తున్నది. ఏది ఎంత ఉల్బణంగా పైకి పొంగుతున్నా ఆ ప్రవాహానికి ధైర్యమనే కట్ట వేసి అక్కడికే ఆపివేస్తున్నదట. చూడండి కవికున్న లోకజ్ఞత. మానవ మనస్తత్వ పరిశీలన. ఇదే భావ గోపనమంటే. లోపల అనుభవమూ పైకి అభినయమూ – సరిగా ఇదే మాయా ప్రవరుడు వరూధిని తన దగ్గరకు వస్తుంటే పెద్దన గారు మనుచరిత్రలో అనుకరిస్తూ ఒక చక్కని పద్యంలో వర్ణిస్తాడు. **'కొనసాగి కామినీ గోష్ఠిఁ బ్రౌఢములైన యుదుటు చూపుల తెప్ప తుదల నాఁచి'** అనే పద్య మందులో చూడండి. మీకే తెలుస్తుంది. దీనికది ప్రతిబింబం. ఇదీ సీసమే. అదీ సీసమే. సీసంలో సీసాన్ని కరిగించి పోశాడు కవి. ఇది ఆడదాని భావ గోపనమైతే అది మగవాడిది. అంతే తేడా.

పోతే భావ శబలత అని ఒక మాట చెబుతారు ఆలంకారికులు. శబలత అంటే పరిపరి విధాల మారి పోవటమని అర్థం. అది వారు ఒకే వ్యక్తి కొకా నొక సందర్భంలో కలిగే అనేక చిత్త వృత్తులని అక్కడికే పరిమితం చేసి పేర్కొంటారు. అదీ కాదన లేము. కాళిదాసు విక్రమోర్వశీయంలో పురూరవుడి విరహ వర్ణన అదే. అదీ కాక ఇంకా దాన్ని పొడిగించి

చెప్పుకోవచ్చు. అలా చెప్పుకొంటే ఒక వ్యక్తి ఒక సందర్భంలోనే కాదు. ఒకే వ్యక్తి ఆయా సన్నివేశా లెదురయినప్పుడు వాటి కనుగుణంగా ఆయా రూపాలలో ఎలా మారిపోతాడో అలా మారుతున్నప్పుడు వారి భావాలూ చేష్టలూ ఎలా మారుతూ పోతాయో అది కూడా శబలత క్రిందికే తీసుకోవచ్చు. ఇలాంటిదే ధ్వన్యాలోక కారుడు చక్కగా గుర్తించి తన గ్రంథంలో సోదాహరణంగా నిరూపించాడు. కుమార సంభవంలో అమ్మవారు ఎక్కడెక్కడ ఎన్ని భంగిమలలో ప్రత్యక్షమయిందో - అవన్నీ మహాకవి కాళిదాసు ఎలా చిత్రించాడో వర్ణిస్తూ వస్తాడు. బాల్యంలో ఒక భంగిమ - యౌవనా విర్భావంలో ఒకటి - పతి పరిచర్యలో ఒక విశేషం. తపశ్చర్యంలో ఒక వేషం. వివాహో త్సవంలో ఒక హోయలు - దంపతుల విహార యాత్రలో ఒక విలాసం. ఒక దృశ్యం పోయి మరొక దృశ్యం చూస్తున్నట్టు ప్రదర్శించాడు. ప్రస్తుత మీ కళా సూత్రాన్నే మహాకవి తిక్కనలో కూడా చక్కగా అన్వయించి చూడవచ్చు. చూస్తే అది ఒక నాటకమే. ఒక రంగు రంగుల హరివిల్లే.

ఒక ద్రౌపదినే చూడండి. సైరంధ్రీ వేషంలో మత్స్యపురం ప్రవేశించినపు డొక వేషం - కీచకుడి వ్యవహారంలో ఒక తీరు - భీముడితో వంటశాలలో సంప్రతించే టపుడొక వ్యవహారం - ఉపకీచకులు తీసుకెళ్లే టపుడొక రీతి - బృహన్నల నుత్తరుడికి సిఫారసు చేసేటపుడొక బాణీ. చివర రాయబారం వెళ్లు తున్న కృష్ణస్వామితో తన ఆవేదన వెళ్లబోసుకోటంలో ఒక ధోరణి. ఎక్కడి కక్కడ వేషం మార్చుకొంటూ కనిపిస్తుంది. ఒకచోట

విధేయత. ఒకచోట పరిచర్య. ఒకచోట బెదిరింపు. ఒకచోట కరుణ. ఒకచోట ఆక్రందన. మరలా ఉల్లాసం – అందులో కప్పిపుచ్చుకునే ప్రయత్నం. ఇంకొక మాటు అఘాయిత్యం. ఆక్రోశం. ఎన్ని హావభావాలతో బయటపెడతాడో చూడండి ఆ పాత్రను కవి. అసలొక భీమ పాత్రనే చూడండి. భార్య భంగపాటును చూచే భీముడు వేరు. నర్తన శాలలో ఆషామాషీగా సంభాషించే భీముడు వేరు. రాయబారం సీనులో భీముడు వేరు. భీముడు హాస్యంగా మాటాడుతాడంటే నమ్ముతారా మీరు. అలాటి సందర్భం రావాలే గాని మాటాడుతాడు. **'నాపోల్కి యాడు దానిని వెదకి యు నీకుఁబడ యవచ్చునె – నా యొడలు చేర్చినప్పుడ నీయెడ లెట్లగునొ దానినీ వెతిగెదు – నను ముట్టి నీవు వెండియు వనితల సంగతికి c బోవు వాఁడనె'** ఎంత హాస్యరస మొలికిస్తున్నాడో ఈ మాటలలో.

ఇలాగే కరుణ రస ముట్టి పడే మాటలు వినండి. ఉద్యోగ పర్వంలో **'అన్నదమ్ములమై యుండి యకట మనల – నొరులు తల యెత్తి చూడ నొండొరుల తోడ బెనగ నేటికి – పెద్ద వారి బుద్ధి విని పంచి కుడుచుట పొసఁగ దొక్కొ** – అని సుయోధనాదులకు హితవు చెప్పమంటాడు. **'వెఱ పెట్టిదియొ యొఱుఁగని నీ కెవ్వరొకో యింత. పితికి తనము గఱపిన వారని'** కృష్ణుడు రెచ్చగొడితే దానికి మరలా **'దరహసిత వదనుడై భీముడాయనతో ఏమంటాడో తెలుసా. బంటుతనంబు మాటలకు బాఱకు – పాండు నృపాలు పాలు గైకొంటయ చాలు నన్న నృపకుంజరు పల్కుల కడ్డ మాడరా కుంట'** అలాగన్నానే గాని **'మిన్ను నేలయు తిరుగఁబడినా**

**'ముంజేతు లొడ్డి పోవంగఁ ద్రోతు'** నీకు తెలుసు గదా నా పరాక్రమ మంటాడు. అంతేకాదు. నేనూ అర్జునుడూ కలిసి యుద్ధానికి సిద్ధమైతే నీతోడు కూడా మాకు కావాలయ్యా అని కృష్ణుడు నర్మగర్భంగా మాటాడితే ఓహో అలాగా **'ఏమీ పార్థుడు నీవు దండి మగలై యీ వచ్చు కౌరవ్య సంగ్రామక్షో భము బాహు లొడ్డి దీర్పం బెద్ద మిట్టెక్కి మిమ్మె మెల్లన్ వెఱగంది చూచెద**మని తానూ ఆయనతో నర్మగర్భంగానే మాటాడుతాడు. అయినా ఏమిటా ఈ ధూర్త గోపాలుడు నన్నింత చులకన చేసి మాటాడుతున్నాడే అని మరలా రోషం వచ్చిందో ఏమో **'కయ్యమె గల్గి నట్లయిన గంధ గజ ప్రకరంబు కుంభముల్ వ్రయ్యఁ - దురంగ పంక్తులు ధరంబడఁ దేరిగముల్బడ ల్వడన్ - డయ్యమి కీవు వెక్కస పడన్ గద పండువు సేయఁ గోరు నా దయ్యము నెత్తి కోలు తుది దాకుట గాదె భుజంగ భంజనా'** అని భీకరంగా పలికితే ఆ జగన్నాటక సూత్రధారి **'చెప్పినంతకు మిగులంగ జేయుదు - కడింది మగండవు లేవోయి'** నాకు తెలియదా నీ బల పరాక్రమాలని కితాబిస్తాడు. ఎంత రసోత్తరంగా నడుపుతాడో చూడండి మహాకవి. రంగుల రాట్నంలో తిప్పినట్టు పాత్రల నాయా సందర్భాల కనుగుణంగా ఎలాగంటే అలా తిప్పుతూ మనబోటి పాఠకులను ప్రేక్షకులను జేసి ఒక నాటకం చూపినట్టే చూపుతూ పోతాడు. ఇలా ఎన్నో ఇవ్వవచ్చు ఉదాహరణలు. ఇదంతా భావ శబలత కిందికే వస్తుంది.

పాత్రలే గదా అసలు రసాని కాట పట్టు. ఆలంబన విభావమని పేరు చక్కగానే పెట్టారా లంకారికులు. లోకంలో కూడా రసమనేది రసమే.

దాని కాలంబన మేమిటి. పాత్రే గదా. పాత్ర లేకుండా ఒక పాయసం లాంటి దెలా ఆస్వాదించగలం. కావ్యంలో కూడా ఇంతే. అందుకే శృంగారాదులను రసాలన్నారు. అవి అనుభవించే స్త్రీ పురుషులను పాత్రలన్నారు. పోతే వాటిని వివిధ రూపాలలో ప్రదర్శించటాని కాయా సన్నివేశాలున్నాయే అవి ఉద్దీపనాలు. ఈ మాత్రం పోగు చేసుకొంటే చాలు. సమర్ధుడైన కవి అయితే వాటి మీద ఎంతైనా సాము చేయవచ్చు. చిత్ర విచిత్రమైన హావభావాలెన్నైనా చూపవచ్చు. కవి అలా చూపుతూ ప్రేక్షకులంగా మనం వాటిని తిలకిస్తూ పోతే శరీరాలతో పాటు హృదయాలు కూడా పులకించ కేమవుతాయి. అలాటి రసానుభూతిని కలిగించటంలో కవిబ్రహ్మ అందె వేసిన చేయి.

అసలు కధ చెప్పటం కాదు ముఖ్యం. కధ కావ్యానికి శరీరం మాత్రమే. రసమే దానికి ప్రాణం. ప్రాణం లేని శరీరం దేనికి. అది వట్టి కళేబరం ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే. దానికి జీవితాన్ని ప్రసాదించేది రసమే. అందుకే **'కావ్యస్యాత్మా ధ్వనిః'** అని ఆనంద వర్ధనుడందులో కూడా వస్త్వలంకార ధ్వనుల కంటే ప్రధానమైనది రసధ్వని అని చాటుతాడు. మిగతా సామగ్రి అంతా ప్రాణమైతే రసం ప్రాణ స్య ప్రాణం. అవి సత్యమైతే ఇది సత్యస్య సత్యం. ఇది ఉంటేనే అవి. మొత్తం కావ్య శరీరమంతా వ్యాపించింది రస ధ్వని అయితే కథా పాత్ర తత్త ద్భావ సామగ్రి అంతా దాని కధీనమై దాని చెప్పు చేతలలో మెలగుతూ దాని సమగ్రతకు తోడ్పడటానికే ఉంది. ఇది ఆనంద వర్ధనాదులైన ఆలంకారికు లందరూ

చాటి చెప్పిన వాస్తవం. వారు సాహిత్యంలో అద్వైతాన్ని అద్వైతంలో సాహిత్యాన్ని చూడగల సవ్యసాచులు. రసాన్ని ఆత్మస్థానంలో నిలిపి దానికే పట్టాభిషేకం చేశారు వారు. తిక్కన గారి నాటికి వారి రస సిద్ధాంతం దేశంలో బాగా ప్రచారంలో ఉంది. నన్నయ నాటికే ఉందసలు. **సావాగ్య రసవృత్తిః – సాధ్యోహి రసోయధా యథం కవిభిః** అని ఆయన కవి లోకానికి చాటడంతే ఎంత కథ ఉండాలో చూడండి దాని వెనకాల. అదంతా బాగా జీర్ణించు కొన్నవాడు తిక్కన.

ఆనంద వర్ధను డింకా ఒక మాట అన్నాడు ధ్వన్యాలోకంలో. రస పోషణ ఎక్కడ చేయవలసి వస్తే అక్కడ కవి మిగతా కావ్యాంగాలన్నీ దానికి పరివార దేవతలుగా భావించి దానినే ప్రధాన దేవతగా ఆరాధిస్తూ పోవాలి చివరదాకా. కేవల మితివృత్త నిర్వాహణ మాత్రాన్నే సాఫల్యం లేదు కావ్య జీవితానికి. రసమే జీవితం. అలాగని దాని కవకాశం లేని చోట కావాలని తెచ్చి పెట్టుకొని రసాన్ని ఒలకబోసే సంరంభం కూడా పనికిరాదని హెచ్చరిస్తాడు కూడా. అలాటి సందర్భాలలో శాస్త్రబోధకే ప్రాధాన్యమివ్వాలి. అదే మార్గదర్శకం జీవితానికి. **సద్యః పర నిర్వృతయే. కాంతా సమ్మిత తయోపదేశయుజే** అన్న మమ్మటుడి మాట ఇక్కడ చరితార్థ మవుతుంది. రసాస్వాదం చేసే ఘట్టాలలో ఆహ్లాదం. ధర్మోపదేశం వింటున్న ఘట్టాలలో విజ్ఞానం. రెండూ అందజేస్తూ పోవాలి కవి అయినవాడు. అందుకో గలిగి ఉండాలి సహృదయు డయినవాడు.

కాగా ఇలాటి కావ్య నిర్మాణ సూత్రాల నన్నింటినీ బాగా ఆకళించు కొని ఒక అనర్ఘమైన ధనంలాగా తన హృదయ భండారంలో దాచుకొన్న

మహా ధనవంతుడు సోమయాజి. వ్యాసుడెంతో తిక్కన అంతే. అందుకే నేమో **భవ్య కవితా వేశుడని విజ్ఞాన సంపద్విఖ్యాతుడని** రెండు విధాల కీర్తించాడాయన కృష్ణ ద్వైపాయనుణ్ణి. ద్వైపాయనుడనే మాటలోనే ఉన్నదా ధ్వని. అది ఉభయ కవి మిత్రుడికే తెలుసు ఆ రహస్యం. ఆనందా భినవ గుప్తులు కూడా ఒక మాట అన్నారు భారతాన్ని గురించి. శాస్త్ర కావ్య చ్ఛాయాన్వయి అట మహాభారతం. శాస్త్ర వాసనలూ ఉన్నాయందులో. కావ్య వాసనలూ ఉన్నాయి. అక్కడక్కడ రెండూ గుబాళిస్తుంటాయట. అటగాదు. నిశితమైన దృష్టితో చూస్తే చాలు. పాఠకుడికి రెండూ ప్రత్యక్ష మవుతాయి. రెండింటినీ యధావకాశంగా నడుపుతూ రచన సాగించాడు వ్యాస భగవానుడు. మరి ఆ వ్యాస మహర్షి హృదయాన్ని పట్టుకొన్న ప్రజ్ఞావంతుడు గనుక తిక్కమనీషి కూడా ఆ బాటలోనే సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాడు తన భారత భారతిని. అందుకే విరాట ఉద్యోగ పర్వాలలో కథా వస్తువూ పాత్రలూ వారి భావాలూ అనుభవాలూ క్రిక్కిరిసి ఉన్నచోట్లనైతే నేమి - తరువాత యుద్ధ షట్కంలో వీర రౌద్ర భయానక దృశ్యాలు విలయ తాండవం చేసే పట్లలో నైతేనేమి ఆ ఆరు పర్వాలూ తత్తద్రసభావ బంధురంగా సాగించాడు రచన.

ఇదంతా కావ్యక్షేత్రమైతే - ఆ తరువాత వచ్చే శాంతి సప్తక మంతా చాలావరకూ శాస్త్రక్షేత్రం. ఇది బాగా గ్రహించినవాడు తిక్కన. అందుకే ఈ ధాటి అందులో చూపదలచు కోలేదు. అక్కడ తన రచన మరొక బాణిలోకి మార్చుకొని సాదాసీదాగా మనకు కబుర్లు చెబుతూ పోతాడు. అవి చదివే

పాఠకుడి కంతకు ముందు విరాటోద్యోగాలూ యుద్ధ పర్వాలూ వ్రాసిన తిక్కనేనా ఈ భాగాలు వ్రాస్తున్న తిక్కన గారని చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఆందోళన కూడా చెందవచ్చు వివేచన లేకపోతే. రచనా రహస్యం తెలిసినవాడు ఉలిక్కి పడనక్కర లేదు. రెండూ జోడు గుఱ్ఱాల ఫక్కీలో నడపగల సవ్యసాచి మహాకవి అని సంతోషిస్తాడు. ధ్వని సంప్రదాయం బాగా జీర్ణించు కొన్నవాడు కాబట్టి ఎక్కడ ఎలాటి మార్గం తొక్కాలో ఎక్కడ ఎలాటి మలుపు తిరగాలో - ఎక్కడ పరుగెత్తాలో - ఎక్కడ నడవాలో - ఎక్కడ ప్రాకుతూ పోవాలో - ఎక్కడ ఎగురుతూ పోవాలో - అన్ని భంగిమలలో ప్రయాణం చేశాడాయన. మనలను కూడా చేయి పట్టుకొని అలాగే తీసుకెళ్లాడు. ఇలాటి క్షణ క్షణ వేషధారణా - క్షణ క్షణ వేష పరివర్తనా ఈ మహాకవిలో కనిపించి నట్టెక్కడా కనిపించదు. ఇది గుర్తించే అని ఉంటాడు బహుశా ఎఱ్ఱా ప్రెగడ **తనకా వించిన సృష్టి తక్కొరుల చేతం గాదునా** అని. కాకపోయినా బ్రహ్మ సృష్టి మరొకరి కెలా సాధ్యం. కవి బ్రహ్మ సృష్టి కూడా అంతే. అది జగన్నాటకమైతే ఇది కావ్య జగన్నాటకం.

నిజంగా నాటకమే అనుకోవచ్చు ఆయన కావ్య నిర్మాణం. ఒక నాటకంలో ఆయా దృశ్యాలెలా మారుతూ పోతాయో - ఏ దృశ్యంలో ఎన్ని పాత్రలు ప్రవేశిస్తాయో. వారి పరస్పర సంభాషణలూ హావభావాలూ ఎలా ఎప్పటికప్పుడు మారిపోతుంటాయో - గుడ్లప్పగించి చూడవలసిందే. ఏదో రోకటి పాటగా కథ చెబుతున్నాడని పించదు. శ్రవ్యంగా కథ చెవిన బడుతుంటుందొక పక్క. దృశ్యంగా అదే కంటబడుతుంటుంది మరొక

పక్క. ఉభయ కావ్య ప్రౌఢిc బాటించు శిల్పమంటే అసలిదేనేమో. శ్రవ్యానికి దగిన వర్ణనా Narration దృశ్యానికి తగిన సంవాదం Dialogue రెండింటిలో సిద్ధహస్తుడు మహాకవి. ఇలాటి గొప్ప అనుభూతి మనమెక్కడ బడితే అక్కడే పొందవచ్చు కవి బ్రహ్మ సృష్టిలో. మహాకవి రచన అంతా దీని కుదాహరణే. అంతా చూసి చెప్పట మసంభవం కాబట్టి మచ్చు తునకగా రెండు మూడు సన్నివేశాలు మీ ముందు బెడతాను. చిత్తగించండి.

ఉత్తర గోగ్రహణం జరుగుతున్న దొక పక్క – పరుగెత్తుతూ వచ్చాడు గవాధ్యక్షు డొకడు నగరానికి. ఉత్తర కుమారు డొక్కడే ఉన్నాడప్పుడక్కడ. కుమారా **'ధరణీ చక్రము తల్లడిల్ల'**, కురుసైన్యం వచ్చి విడిసింది. ఎడలేదు. వెంటనే **తేరు పూన్పcబంపు – తను త్రాణ బాణ తూణీరాదుల గూర్చ బంపు'** నిన్ను మీ తండ్రి విరాటుడు సభలో అంత వాడింత వాడని నలుగురి ఎదుటా ప్రశంసిస్తుండేవాడు. దానికిప్పుడు అవసర మేర్పడింది. కానిమ్మని కాంతా జన మధ్యంలో ప్రస్తావిస్తాడు. వెంటనే దర్పోద్ధతితో పాటు సంగ్రామ కౌతుకం కూడా తోడయి **'ఎత్తునc గొందు కౌరవుల నెల్లను – గోవులందెత్తు** కాని తగిన సారథి లేడే ఏమి చేయాలబ్బా – ఎక్కడైనా ఉంటే వెతికి తీసుకురండి. నన్ను చూచారంటే భీష్మద్రోణాది వీరు లందరూ పార్థుడే వచ్చాడని భావించరా – వారిని జయించి పసులందేక పోతే మర్యాద ఏముంది. అని భీకరాలు పలుకుతుంటే ద్రౌపది అక్కడే ఉండి వింటుంది. ఆ ప్రగల్భాలు విని **'సామర్షా పహాస తరళ హృదయ'** అయిందట. అతనితో ఏమి మాటాడకుండా వెంటనే పోయి అర్జునుడికా ఉదంత మందిస్తుంది.

అప్పటి కజ్ఞాత వత్సరం కూడా ముగిసి పోయిందని గుర్తించి అతడావిడతో నీవు పోయి అతనితో చెప్పు. మన బృహన్నలకు సారథ్యం చేసే సామర్థ్యముంది. ఇంతకు ముందు ఖాండవ దహనం చేసినప్పుడర్జునుడి కితడే తేరు గడపాడు. ఇంకా చాలా సందర్భాలలో ఆయనకు సహాయ పడ్డాడు. అతని సహాయ ముంటే నీవు కూడా ఈ కురు సైన్యాన్ని జయించ గలవు - అని సిఫారసు చేయి. అక్కడ ఎవరేమి అడ్డు చెప్పినా అన్నిటికీ అన్నీ చెప్పి మొత్తం మీద నన్ను పిలిపించే ఏర్పాటు చేయమంటాడు. ఆవిడ అక్కడికి వెంటనే వెళ్ల కుండా ఉత్తర ఉన్నచోటికి వెళ్లుతుంది. అమ్మాయీ నీ అన్న సారథి కోసం వెతుకుతున్నాడు. ఎక్కడా ఎవరు దొరకలేదు. నాకు తెలిసిన విషయం చెప్పాలి గదా. మన బృహన్నల అంటే మీ గురువున్నాడే దానికి తగినవాడు. అర్జునుడంత వాడికే సారథ్యం చేసిన అనుభవజ్ఞుడు. పాపం మీ అన్నకీ విషయం తెలియదు కాబట్టి నీవు నాతో వస్తే ఇద్దరమూ వెళ్లి చెబుదామని ఆ పిల్ల కంటిస్తుంది. అది బృహన్నలకు శిష్యురాలే గదా. కనుక వెంటనే ఇద్దరూ పోయి మాటాడుతారు.

అది విని అయ్యో సైరంధ్రీ! పేడి మొహమే నేను చూడనే - అతణ్ణి సారథిగా ఎలా చేసుకొని పోగలనని పరిహసిస్తాడు. పైగా వచ్చిందా కురుబలం. దానిమీద చేయి చేసుకోవలసిందా నేను. అలాంటివారు బృహన్నల సారథి అయితే నలుగురూ నవ్వి పోరా అంటాడు. కౌరవసైన్య మేమిటయ్యా మూడు లోకా లెత్తి వచ్చినా జంకదు బృహన్నల. పేడి వీడేమిటను కొంటున్నావా. అది కేవలం కారణ జన్మమై వచ్చిన తను

Yallamraju Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

వికారం. అందులో దాగి ఉన్న వీరగుణం నాకు బాగా తెలుసునని నచ్చ జెబుతుంది సైరంధ్రి. విన్నాడుత్తరుడు. 'మనమురియాడుతూ'నే ఉంది. అయినా ఇంకొక సారధి ఎవడూ లేడేమి చేస్తాడు. 'బృహన్నలను పిలువంబనుచుట కొడంబడిన పలుకు పలికాడట. ఎగిరి గంతేసి ఉత్తర నేనే పోయి పిలుచుకొని వస్తానని సైరంధ్రికి చెప్పి వెంటనే నర్తన శాల కరిగి సవినయంగా గురువు గారికి నమస్కరించి 'మా అన్నయ్య సారధి మొన్ననే ఒక యుద్ధంలో దైవికంగా మరణించాడు. మరొకణ్ణి పెట్టుకోటాని కిష్టం లేదాయనకు. ఇప్పుడా ఉన్నట్టుండాయనకు కౌరవులతో యుద్ధం చేయవలసి వచ్చింది. తగిన సారధి ఎవడా అని చూస్తుంటే మీ విషయం సైరంధ్రి ఆయనకు సూచించింది. దానికి ప్రియంబంది మీ వద్ద నాకు చనవుండటం వల్ల మిమ్ము తోడ్తేర నన్ను బంపాడు. ఎలాగైనా తోడ్కొని వస్తానని మాట కూడా ఇచ్చి వచ్చాను. నా మాట త్రోసి పుచ్చక సారధ్యం చేయటాని కెలాగైనా సమ్మతించండి. దీనివల్ల మీకు పేరు వస్తుందని ప్రాధేయ పడుతుంది. అది విని బృహన్నల నవ్వుతూ అయ్యో అలాగా సారధ్యం చేసే నేర్పు నాకేముంది. అయినా నీమాటకు నేను వెరుస్తానమ్మాయీ. ఒక సారధ్యమేమిటి నీకోసమెంత దుష్కరమైనా చేయక తప్పదు మరి. సరే పోదాము రమ్మని బయలుదేరు తారిద్దరూ.

ఎదురుగా వస్తున్న బృహన్నలను చూచాడో లేదో 'కురుబలంతో నాకు యుద్ధం. నీవు నాకు రథం నడపాలి. రారా. ఆలస్యం చేయకు. కవచం ధరించి రథ మెక్కు. తప్పదు నీకు. నీబీరమూలావూ వెరవూ సైరంధ్రి

మాకు చెప్పింది సుమా అంటాడు. అయ్యో ఆటో పాటో ఉంటే పిలిపించు నాయనా. సంగరమెక్కడ. సారథ్య మెక్కడ. మరెవరినైనా చూడరాదా అని అతడు. అదేమిటయ్యా – ఇంతకు ముందర్జునుడికి సారథ్యం చేసిన వాడ విప్పుడు వెనక్కు తగ్గుతా మేమిటి. ఇంకేమీ మాటడకు. రమ్మని ఇతడు. అతని మాటకు వెరచి నట్టు నటిస్తూ అంగీకరిస్తాడు అర్జునుడు. వెంటనే ఒక మంచి తను త్రాణం తెప్పించి ధరించమంటే అరవరలుగా ధరించి అక్కడి అబలా జనాన్ని నవ్విస్తాడు. ఉత్తరుడు దిగివచ్చి తానే ధరింప జేస్తాడు. **'హయములఁబూన్పుము – రయమున సిడమెత్తు మిపుడరా వలయును గోవులఁదోడ్కొని'** అని తొందర జేస్తాడు. ఏమో తెచ్చే వాడిలాగా. 'అనిన **నీవేమి పనిచిన నట్ల సేయవలయు – నీవున్న యెడ నుండ వలయు నీవు సన్నదెసఁ జనవలయు. నా శక్తి యెఱిఁగి పంచి కడిమిమై పగఱ గెలుమని** నర్మగర్భంగా సమాధాన మిస్తాడతనికి. పిమ్మట రథానికి **'జవనాశ్వములను బూన్చి పంచానన కేతు' వెత్తుతాడు. అది** చూచి అంగనా జనమంతా మీరు కురువీరులను గెలిచి వారి తలపాగలలో చిత్రవర్ణములైన వాటిని బొమ్మ పొత్తికలకు తెండీ' అని కోరుతారు. **'బృహన్నల వేషంలో ఉన్న అర్జునుడిట్లను జనపాలక నందనుండు జయలక్ష్మిం జేకొనునటె చీరలు దెచ్చుట పనియే యటు సూడు డెల్ల భంగులఁ దెత్తున్'** అని సాభిప్రాయంగా మాటాడుతాడు. అంటే అర్థం. వాడేమి తెస్తాడు వాడి మొహం వాడు గెలిచేది వట్టిదే. తెచ్చేది వట్టిదే. నేనే తెచ్చి ఇస్తాలెండి అదేమి భాగ్యమని భావం.

చూడండి. ఇది చాలా చిన్న ఘట్టం. ఇందులో ఉత్తరు డొకడు. సైరంధ్రి ఒకతి. ఉత్తర ఒకతి. బృహన్నల ఒకడు. ఉత్తరలోనయిన

కన్యకలొకరు. ఇందరున్నారు పాత్రలు. వారి వారి భావాలూ మాటలూ చేష్టలూ - ఒకరితో ఒకరు వ్యవహరించే తీరూ ఎంత సహజంగా ఎంత సుందరంగా ఎంత లౌకికంగా ఎన్ని పోకడలతో వర్ణిస్తూ పోయాడో చూడండి మహాకవి. ప్రతి పాత్రా ఒకదాని కొకటి విలక్షణం. ఒక రూహించిందొక రూహించరు. ఒకరు మాటాడి నట్లొకరు మాటాడరు. ఒకరు నడచినట్లొకరు నడుచుకోరు. సైరంధ్రీ ఉత్తరుడూ మాటాడిన మాటలుత్తర బృహన్నలతో మాటాడదు. ఉత్తరా సైరంధ్రీ తనతో ఆడిన మాటలు బృహన్నల ఉత్తరుడితో ఆడదు. అంతా మన కుటుంబ వ్యవహారాన్ని తీసుకొని ఎంత నాటకీయంగా మలచి చూపుతున్నాడో మహాకవి - స్వానుభవైక వేద్యమిది సహృదయు లందరికీ.

పోతే మరొక ఘట్టం పట్టి చూతాము. దక్షిణ గోగ్రహణం ఉత్తర గోగ్రహణం - రెండూ ముగిశాయి. స్తిమిత పడ్డారందరూ. ఇక ఏ సమస్యా లేదప్పటికి. ఉన్న సమస్య ఒక్కటే. అది పాండవులజ్ఞాత వాసం నుంచి బయట పడటం. అదీ పడకుండా పోలేదు. కౌరవ వీరులకు బయటపడ్డారు. లేకుంటే దుర్యోధను డూరకుంటాడా. మరలా అరణ్య వాసానికి పంపి ఉండడా వారిని. అలాగే విరాటుని కుమారు డుత్తరుడికీ తెలిసి పోయింది వారెవరో గారు పాండవులేనని. అయితే అర్జునుడప్పుడే బయటపెట్ట వద్దన్నాడు కాబట్టి నోరు మెదప లేదతడు. పోతే ఎవరికి బయట పడాలి వారిక. విరాటటుడికి. వాని బంధుకోటికి. పరివారానికే. లేకుంటే అతడు వారినింకా కంకభట్టని వలలుడని సర్వసామాన్యమైన

దృష్టితోనే చూస్తుంటాడు. పైగా అంతకు ముందుగానే తానుత్తరుణ్ణి పొగడితే ధర్మరాజతడు బృహన్నల తోడ్పాటుతో గెలిచాడు గాని లేకుంటే అతడేమి గెలవ గలడని తేలబలికి అతని చేత సారె వ్రేటు కూడా తినవలసి వచ్చింది. ఇంకా బయట పడకపోతే ఏమి ప్రమాదమైనా ముంచుకు రావచ్చు. కాబట్టి తమ తమ స్వరూపాలతో ప్రకటం కావటమే మంచిది. చిత్ర మేమంటే అజ్ఞాత కాలం ముగిసినా వారి మారువేషా లలాగే నిలిచి ఉండటం. అవి వారు సంకల్పిస్తేనే గాని తొలగిపోవు. నాటి రాత్రి ఏమి సంకల్పించారో ఏమో. చెప్పడు కవి. తెల్లవారగానే అందరూ కూడబలుకు కొని వచ్చి విరాటుడి కొలువు కూటంలో ధర్మజుడాయన సింహాసన మెక్కి కూచుంటే సముచితాసన ముల మీద భీమార్జునాదులు నలుగురూ ఆసీనులయ్యారట. తెలుపులగు చీరలు పూతలు పువ్వులు అలంకరించుకొని రాజతనయానుగు ణోజ్జ్వల మాననీయ వేషాలు ధరించారట గూడా. దాన్నిబట్టే తెలుసుకోవచ్చు వారు యధాపూర్వంగా తమ తమ ఆకారాలు ధరించి వచ్చారని.

కాని విరాటుడి కర్థం కాకపోవట మాశ్చర్యం. అతడూ **'తొడి పూసి కట్టే'** వచ్చాడు. ఉత్తరుడితో సహా వచ్చాడు. చూడగానే విస్మితుడయి దాన్ని తన 'కెల్లిదముగా' భావించాడట. ఇదియేమి కంక నా గద్దియపై పదిలముగా కూచున్నావు. పైగా నన్ను చూచి కూడా దిగెవంత అహంకార మని మందలిస్తాడు. ధర్మారాజు మాటాడడు. మందహాసం చేస్తూ అతని బదులర్జునుడంటాడు. **'నడదీవియలు సేసె నగరికి మాణిక్యమకుట**

**దీప్తులతోడి మనుజ పతుల – తగు నాజ్ఞ సూయాణముగ నొనరించె మంచిగ నేల నాలుగు చెఱగులకును. పాండురాజు దుగ్ధపయో నిధి రాజు ధర్మరాజు సుమ్ము మత్స్యావనీ రమణ యితడు.** ఎవరను కొన్నా వంటాడు. అలాంటి మహనీయుడీ **'చిఱుత గద్దియకుండగడే'** అని గద్దిస్తాడు. వినగానే విస్మయమూ సంశయమూ రెండూ పెనగొన్నాయట విరాటుడి మనసులో. అలాగైతే మిగతా భీమార్జునులూ పాంచాలి ఎక్కడ అని ప్రశ్నిస్తాడు. చెబుతా డర్జునుడు వరుసగా వారి పేర్లు. వలలుడే భీముడు. దామ గ్రంధి నకులుడు. తంత్రీపాలుడు సహదేవుడు. సైరంధ్రీ వేషంలో ఉన్న మాలినే ద్రౌపది అని. అంతా విని ఏది నిర్ధారణ చేసుకోలేక తికమక పడుతున్న విరాటుడి కతని కుమారు డుత్తరుడు కలగ జేసుకొని అర్జునుణ్ణి అతనికి చూపి ఈ మహాత్ముడు చెప్పవద్దంటే నేను నీకు చెప్పలేదు. అతనెవడో ఒక దేవత నన్ను కాపాడాడని మాత్రమే చెప్పాను. ఈయనే ఆ దేవత. యుద్ధంలో నా పరువూ ప్రాణమూ నిలబెట్టిన అర్జును డితడేనని బయటపెట్టే సరికిక బాగా రూఢి అయిందా రాజుకు. వెంటనే లేచి వచ్చి అర్జునుణ్ణి కౌగిలించు కొన్నాడు. ఆ పిమ్మట **'వినయంబు మిగుల కుంతీ తనయాగ్రజు పాద పీఠతలమున ఫాలంబును బొందఁ జాగి మ్రొక్కియతని కౌఁగిలి పడశాడట.** చూడండి. అర్జునుణ్ణి తాను కౌగిలించుకొంటాడు. ధర్మరాజు తనకు పెద్దవాడు గనుక వచ్చి సాష్టాంగ పడతాడు. అతడే లేవనెత్తి ఇతణ్ణి కౌగిలిస్తాడు. ఆ తరువాత **'భీముని కవలను ప్రీతి నలుమడింప ఆలింగనం చేశాడట'** శరీర మానందంతో పులకితమై ధర్మరాజు మొగం మీదనే చూపు నిలిపి

అలాగే నిలబడిపోతాడు. కొంతసేపటికి తేరుకొని సుదేష్ణకు కబురు పంపి సైరంధ్రిని తగినవిధంగా గౌరవించమని తెలియజేస్తాడు.

అర్జునుడు మీవల్ల అజ్ఞాత వాసం గడచి బయటపడ్డామని ఒడ్డుకొంటుంటే అదేమిటయ్యా నేనేమి పరాయివాడనా మీరిలా సుఖంగా గడపి బయట పడటం మా కానంద దాయకం గదా అంటాడు. ధర్మరాజును చూచి అయ్యా మీదే ఈ రాజ్యం. మీరు దీన్ని మాతో పాటు ఏలు కొమ్మంటాడు. మనకొక రాజ్యమంటూ ఉందా అదంతా వీరి చలవే గదా అంటాడుత్తరుడు. వీరి విషయంలో మనం మర్యాదగా నడుచుకోక ఎంతో అపచారం చేశాము. వీరికెంత ఇచ్చినా అది వీరిదే మనది గాదు. కాబట్టి మనదైన కానుక ఒకటి వీరి కివ్వటం సముచితం. ఉత్తరను పిలిపించ మంటాడు. వెంటనే ఉత్తరను సపరివారంగా పిలిపిస్తాడు విరాటుడు. ఆవిడ రాగానే ధర్మజునికి తానూ వారూ సవినయంగా ప్రణమిల్లి ఈ పిల్ల నర్జునుడిని చేసుకొమ్మని ప్రార్థిస్తాడాయనను. ధర్మజుడేమీ పలకడు. అర్జునుడి మొగం చూస్తాడు. అతడిది పాడిగాదు. నాకొడు కభిమన్యుడికి చేసుకొంటా నంటాడు. అర్జునుడు నాకు వియ్యమని పించుకోటం కన్నా అదృష్ట మేముంది. ఏదయినా అగ్రజుడెలా నిర్ణయిస్తే అదే మనకు కార్యమంటాడు. అప్పుడు నోరు దెరచి మాటాడుతాడు ధర్మరాజు. అంతవరకూ అర్జునుడూ ఉత్తరుడూ విరాటుడి మధ్యనే జరుగుతుంటుంది సంభాషణ. వారు తమలో తాము మాటాడట మెంత ఉచితమో – ఆయన మాటాడకుండా మౌనంగా గమనిస్తూ ఉండట మంత కన్నా సముచితం.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitaveda.in

మనస్తత్వ వేత్తలలో అగ్రగణ్యుడైన కవి గాని ఈ సన్నివేశాన్ని ఇలా నడపలేదు. నాటక కళా పారంగతుడు గాని దీన్ని ఎక్కడి కక్కడ ఇన్ని మలుపులు తిప్పి చూపలేదు.

ఆ తరువాత ధర్మజు డందరికీ ఆహ్వానాలు పంపండి. ఇంకేమి అర్జుడన్నాడు గదా. కానీ ఉత్తరాభిమన్యుల పెండ్లి కన్ని ఏర్పాట్లు చేయండని గ్రీను సిగ్నలిస్తాడు. అనంతరం వారూ వీరూ రావటమూ ముఖ్యంగా బలరామకృష్ణాది యాదవ వీరులంతా తరలి రావటమూ కనుల పండువుగా జరుగుతుంది. కృష్ణుడు ద్రౌపదికి కానుక లందిస్తాడు. పాండవులకూ అవీ ఇవీ ఇస్తాడు. ఆ వల చూడండి. మూడు పూవులూ ఆరు కాయలుగా జరుగుతుంది వివాహోత్సవం. ఇంత జరిగింది గదా. కృష్ణుడెక్కడా నోరు దెరచి మాటాడి నట్టే లేదు. అంతా మూగ సినిమా. ధర్మజుడు విరటుడి మధ్య సైగలే. విరటుడు కృష్ణుడి మధ్య మౌనమే. కల్యాణోత్సవ మంతా ముగిసిన వెనుక తీరికగా విరాటుడి కొలువు కూటం చేరి అక్కడ సభాసదు లందరూ సమావేశమైతే ఇక ప్రారంభిస్తాడు కృష్ణుడిక మీదట జరగవలసిందేమిటో ఆలోచించండని. ఒక విద్యావంతుడూ లోకజ్ఞుడూ ఇంగితజ్ఞుడూ అయిన విప్రుని దూతగా పంపి వీరి సగపాలు వీరికిచ్చే విధంగా మాటాడి రావలసి ఉంటుందని సలహా ఇస్తాడు. దానికి బలరాముడు బాగుందని అభినందిస్తూనే కౌరవ పక్షపాతంతో ఏదో ఆడబోతాడు. సాత్యకి దానికాక్షేపణ తెలుపుతాడు. అది సమర్థిస్తాడు ద్రుపదుడు. ఇలా సాగిపోతుంది వారి చర్చ.

Yallamraju Srinivasa Rao Brahmasri www.advaitavedanta.in

ఇంతకూ చెప్ప వచ్చేదేమంటే ఇది చిన్న సన్నివేశమే అయినా వరుసగా చదువుతూ పోతుంటే ఒక రసవంతమైన నాటకం లాగా ఒక దాని తరువాత ఒకటి దృశ్యాలు మారుతూ పోవటమూ - అందులో ఆయా పాత్ర లొకరితో ఒకరు మౌనంగా కొందరు - మితంగా కొందరు- హితంగా కొందరూ దీర్ఘంగా కొందరూ - సంభాషణ సాగిస్తూ పోవటమూ - అందులో ఏ వ్యక్తి మౌనం వహించాలో ఎప్పుడు మాటాడాలో ఎంతవరకు మాటాడాలో - పిన్నలు పెద్దల పెద్దరిక మెలా దక్కించాలో - వారెలా దక్కించు కోవాలో గమనిస్తూ పోతే ఎంత లోకజ్ఞత - ఎంత స్వాభావికత - ఎంత మనోజ్ఞత - చెప్పనలవి గాదు. ముఖ్యంగా ధర్మజ కృష్ణులెంత హుందాగా కనపడతారో అద్భుతంగా తోస్తుంది.

ఇక ఉద్యోగ పర్వంలో ప్రవేశించామా. అదేముంది ఇది చూడమనే లాగా నడుస్తుంది. సంజయ రాయబారమేమి - కృష్ణరాయబారమేమి ఒక్కొక్కరి ఆలోచన లేమి - మాటలేమి - ఒండొరుల పట్ల వారి వ్యవహారమేమి. మన చుట్టపక్కాలందరూ ఒకచోట చేరి కార్యాలూ కరావత్తులలో ఒకరితో ఒకరెలా మాటాడుతుంటారో ప్రవర్తిస్తుంటారో అచ్చు అలాగే కండ్లకు కట్టినట్టు అనిపిస్తుంది. మనస్సులకు గట్టిగా హత్తుకొని పోతుంది. ధృతరాష్ట్రుడి నక్కజిత్తులూ దుర్యోధనుడి పెడసరమూ - ధర్మజుని శాంత శూరతా - భీమాదుల వినయోద్ధత తా - ద్రౌపది అఘాయిత్యమూ - కుంతి నిర్వేదమూ - కర్ణుని స్వామి భక్తీ - ఔదార్యమూ - సద సద్వివేక శీలతా - ఏమి చెప్పమంటారు. అంతా ఒక మహా నాటకం. మహేంద్ర

జాలం. ఒకరు చెప్పటం కాదు. ఎవరికి వారనుభవించ వలసింది. ఒక పాట కచ్చేరి వర్ణించటానికీ ఆకర్ణించటానికీ ఎంత అంతరమంటుందో అంతే ఇదీ. ఉదాత్తమైన కళ ఎప్పుడూ మాటలతో విమర్శించేది కాదు మనసుతో దర్శించేది. అసలక్కడ ఏది చదువుతుంటే దానితో తన్మయత్వం – ఏవ్యక్తి వ్యవహారం గమనిస్తుంటే దానితో తాదాత్మ్యం. ఏ భావ మాలకిస్తే దానితో ఏకీభావం. పొందకుండా ఉండలేదు భావుకుడి మనసు. అక్కడి నుంచి దాన్ని ముందుకు లాక్కొని పోవటం కష్ట సాధ్యం.

అసలీ విరాటోద్యోగాలే కాదు. కవిగారు 'విరాట పర్వమట యుద్యోగాదులుం గూడగా' అన్నాడు గదా అని. అదే మహాభారత మనుకొంటే ఎలాగా. తిక్కన పదిహేను పర్వాలూ పదిహేను రసగుళికలే. విరాటోద్యోగాలు వాటికి బాట వేశాయి. ఆ బాటలో రసజ్ఞుడైన వాడు ముందుకు సాగిపోవాలే గాని అక్కడే కూచోరాదు. ఉద్యోగం ముగిసి యుద్ధ షట్కంలో ప్రవేశిస్తే చాలు. ఇక హస్తినాపురమే మయిందో మత్స్యపుర మేమయిందో పాంచాల పురమేమయిందో – ద్వారకా నగరమే మయిందో అన్నీ ఖాళీ అయి ఒకానొక కురుక్షేత్రమే అన్ని వర్గాల వారితో క్రిక్కిరిసి ప్రత్యక్ష మవుతుంది. భీష్ముడేమిటి – ద్రోణుడేమిటి కర్ణ శల్యులేమిటి – కడకు రారాజని పించుకొన్న సుయోధను డేమిటి. గ్రీష్మాదిత్యుడి లాగా ఒక్కొక్క వీరుడే తనకుమారు లేదన్నట్టు రణరంగంలో విజృంభించటమూ – విచ్చలు విరిగి పడిపోవటమూ. దూరాన నిలబడి చూచే సంజయుడికే గాదు. దాని కతి దూరాన ఇక్కడెక్కడో బ్రతుకుతున్న మనబోటి

సంజయులకు కూడా తిక్కన భాషలో చెబితే మనస్సుకు కూడా వ్రేగనిపిస్తుంది. ఎక్కడికక్కడ ఆహా ఎంత పరాక్రమం. అంత పరాక్రమమూ అయ్యో చివరకేమయి పోయింది. పురుషకార మెంత పుష్కలం. దైవఘటన దానికన్నా ఎంత బలీయం. ఇలా మన మనస్సాగరంలో ఎన్నెన్ని భావతరంగాలో ఎంత ఊగిసలాటలో చెప్పలేము. అంతా అయి దుర్యోధనుడు నేల కొరిగి ఆడే మాటలూ – కృష్ణుడాడే నిష్ఠూరాలూ – వింటుంటే అయ్యో అని మనసు కరిగిపోతుంది. కృష్ణుడూ ధర్మజుడూ అతణ్ణి ఎత్తి పొడుస్తుంటే ఇంకా బాధ గొలుపుతుంది. స్త్రీల ఆక్రందన ధ్వని వింటుంటే హృదయం బ్రద్దలవుతుంది. అసలా యుద్ధ భూమిని వరసగా నాలుగు లయ విభాతి వృత్తాలతో కవి వర్ణించిన వర్ణనకు మనసు వికలంగాక తప్పదు. ఇదంతా చివర కిందుకేనా ఇదే నా దేనికైనా పర్యవసానమని వైరాగ్యం చెప్పకుండానే కలుగుతుంది.

యుద్ధ షట్కమిలా ఉంటే ఇక శాంతి సప్తకం మాటేమి టంటారు. శాంతి మొదలు స్వర్గారోహణం దాకా ఆ ఏడు పర్వాలూ ఏడు గుఱ్ఱాల లాగా విను వీధిలో పరుగెడుతున్నట్టే తోస్తుంది. ధ్వన్యాలోకంలో ఒక మాట అన్నాడా నంద వర్ధనుడు. కవులందకీ శిరోధార్యమది. చిరస్మరణీయం, ఎక్కడ రసస్ఫూర్తి కవకాశమో అక్కడ గాఢంగా సాగాలి రచన. అలాంటి వ్యవహార మెక్కడ లేదో అక్కడ అంత చిక్కణంగా కాక శిథిలంగా సాగాలట బంధం. ఇదీ వారి సిద్ధాంతం. చెప్పాను గదా భారతం కేవలం కావ్యమూ గాదు. కేవలం శాస్త్రమూ గాదు. కావ్యశాస్త్ర చ్ఛాయాన్వయి. కాబట్టి ఎంత

శక్తి ఉన్నా కవి పిడుగుకూ బియ్యానికీ ఒకే మంత్రమని కూచోరాదు. సందర్భాన్ని బట్టి కళ్లెం బిగిస్తూ సడలిస్తూ పోవాలి. అలాటి సమయోచిత పరిజ్ఞాన మెంతగా ఉండాలో అంత పుష్కలంగా ఉన్నవాడు సోమయాజి. కనుకనే విరాటోద్యోగాలు కావ్యమర్యాదలో రసోల్బణంగా సాగించాడు రచన. యుద్ధ షట్కం వీర రౌద్ర భయానక బీభత్స రస బంధురంగా చిత్ర విచిత్ర భంగిమలలో సాగించాడు. పోతే ఇక శాంతి సప్తకమంటారా. తాపీగా సాఫీగా సాగాలి రచన. ఆ వీర శృంగార కరుణాది రసోల్బణతా లేదు. దానికి తగిన వస్తు సామగ్రీ లేదు. మరి ఇక్కడ ఉన్నదేమిటి. యుద్ధానికి ముందున్న సంరంభమూ - యుద్ధ మధ్యంలో ఉన్న ఉద్ధృతత్వమూ - రెండూ విషాదాంతంగా ముగిసిపోయి చివరకా వేడి అంతా చల్లబడి పోయింది. పొంగంతా కుంగిపోయింది. అందుకే శాంతి అన్నారు. అప్పుడు కావలసిందిక బాహాబాహి కచాకచి గాదు. వాకోవాక రూపమైన ధర్మబోధ. అధ్యాత్మ బోధ. ఇలాటి అను శాసనం జరిగితే గాని మనోరూపమైన అశ్వాన్ని మేధనం చేయలేదు మానవుడు. ఆశ్రమ వాసాన్ని కోరలేదు. చివరకు మహాప్రస్థానం చేసి స్వర్గారూఢుడు కాలేదు.

అంచేత ఆ స్తిమిత గంభీరమైన భావాని కను రూపమైన రచనే కావాలిక్కడ. అది గమనించి అలాగే నడుపుతూ వచ్చాడు మహాకవి. కవిగా దిక్కడ ఆయన ఋషి. ధర్మాలు బోధించే చోట అది శాస్త్రంగాని కావ్యం గాదు. గద్యమెంతో పద్యమంత ఇక్కడ. ఊరక ఛందోబద్ధంగా నడుస్తుంది పద్యమంత మాత్రమే. పద్యమైనా ఒకటే. అది గద్యమైనా ఒకటే.

ధర్మశాస్త్రంలో సూత్రాలలాగా కనిపిస్తాయి వాక్యాలు. ఆ మాటకు వస్తే ఉద్యోగ పర్వంలో గాని యుద్ధషట్కంలో గాని ఎక్కడైనా కథ గాక నీతులూ ధర్మాలూ చెప్పేటపుడు తిక్కన రచనా ధోరణి చూడండి మీరు. సూత్రప్రాయంగానే సాగుతుంటుంది. అవి పద్యాలా ధర్మ సూత్రాలా. తేడా తెలియదు మనకు. గొప్ప గొప్ప సుభాషితాలు వింటుంటే జీవితాంతమూ మనసులో హత్తుకు పోయి అవే చాలు మనకు. రస స్ఫోరకాలు. చూడండి. ఉద్యోగంలో విదురనీతు లెలాంటివి. వాటి దగ్గర ఏ కావ్యమూ పనికి రాదు. కావ్యమా అది శాస్త్రమా. ఏదను కొంటే అది. **'కోపము నుబ్బును గర్వము - కాపురుష గుణంబులండ్రు' పురుషుండు రెండు దెఱగుల ధరనుత్తముఁ డనఁగ బరగు - అరిది విలుకాని యుజ్జ్వల శరమొక్కని నొంచు తప్పి చనినంజను - ఒకటి గాని రెంటి నిశ్చల యుక్తిఁజేర్చి - మూటి నాల్గింట కడు వశ్యములుగఁజేసి** - ఇలాటి వెన్నని ఉదాహరించ మంటారు. అన్నీ మణులూ మాణిక్యాలే. ఇలాటి నీతులు బోధిస్తున్నప్పుడు తిక్కన చాలా వరకు కంద పద్యాలో తేటగీతులో ఆట వెలదులో ప్రయోగించట మాయన కలవాటు. సంస్కృతంలో అనుష్టుప్పుల లాంటివవి. ఆయన కందాలు రసవన్మాకందాలు. కవి చౌడప్ప చెప్పినట్టు కందానికి మూలకందం తిక్కనామాత్యుడే. అందులో ఏ ప్రబంధ కవీ తీసికట్టే. ఏ సందర్భంలోనైనా సరే కందమనే సరి కాయన రచన నల్లేరు మీద బండి లాగా సాగిపోతుంది. ఇలాటి వింకా ఒక వంద వ్రాసినా బాగుండు ననిపిస్తుంది.

కాగా ఇలాటి ధర్మాలకూ నీతులకూ నిధులూ నిక్షేపాలను కోవచ్చు శాంత్యాను శాసనిక పర్వాలు. అక్కడ తిక్కన గారి భారతం కావ్యం గాదు. ఒక ప్రామాణికమైన శాస్త్ర గ్రంథం. అందులోనూ ఆయా ధర్మాలను నిరూపించే ఆ ఖ్యాయికలూ ఐతిహ్యాలూ ఉంటాయి - పదిలంగా మన హృదయాలలో దాచుకోవలసినవి. ఒక నాడీ జంఘుని వృత్తాంతమే గాదు. గృధ్ర జంబు కోపాఖ్యానమే గాదు. లుబ్ధకపోతో పాఖ్యానమే గాదు. సౌపర్ణో పాఖ్యానమే గాదు. ఎన్నని చెప్పమంటారు. ఎక్కడి కక్కడ కండ్లకు కట్టినట్టు నడుస్తుంది. అది జీవితమా కథా అని భ్రాంతి గొలుపుతుంది. కాకున్నా జంతువుల మీదా పక్షుల మీదా వృక్షాల మీదా నెపం పెట్టి వాటినీ మానవులనూ కలిపి ఒకగాట గట్టి వాటి జీవితాల ద్వారా మానవ జీవితాలకు జ్ఞానోపదేశం చేయటానికి పాటు పడ్డారంటే ఆ వ్యాసుడే వ్యాసుడు. ఆ వ్యాస హృదయం పట్టుకొన్న అపర వ్యాసుడు తిక్కనే తిక్కన. కపోతో పాఖ్యానంలో **"పక్షి గురువై సంధించె సద్బోధమున్"** అన్న తిక్కన్న మాట ఎప్పుడు స్మరించినా చెవులలో రింగుమని మోగటమే గాక హృదయంద్ర వించి పోతుంది.

సమర్థుడైన కవి చిత్రిస్తే అసలవి పక్షులూ పశువులుగా కనిపించవు. మనుషులే ఒకరితో ఒకరు తమ భావాలు అనుభవాలు పంచుకొని మాటాడుకొంటున్నారా అనిపిస్తుంది. **'అమ్మేను లేకున్న నిమ్మేని కలిమి నిరర్థక'**మని కపోత మంటున్న దంటే అవి కపోత మనే మాటలా. ఉత్తమ దాంపత్య సౌహార్ద మెంతగా తొంగి చూస్తున్నదో ఆ మాటలో. **'ఓయన్న**

**దస్సి వాడవు మాయింటికి విందవైతి'** అని బోయనది పలకరిస్తుంటే ఎంత అమాయికత్వ మెంత నిష్కల్మషత్వం. మానవులలోనే ఉంటే ఆగుణ మెంత గౌరవం మన జాతికి. **'తినుడు తినకు డొండేమైనను జేయుడు – వీని నేల నాముందటికిం గొని తెచ్చితి'**రని నాడీ జంఘుని మిత్రుడు మిత్ర ద్రోహి అయిన విప్రుని కళేబరాన్ని తనకు చూపితే ఏవగించుకొని అన్నమాట ఎంత నిర్వేదాన్ని వెళ్లగ్రక్కుతున్నదో గదా. ఇలాగే పాండవులొకప్పుడు కృష్ణుణ్ణి బట్టుకొని స్వామీ – **'మాకీ పుట్టువు నను పాండు క్ష్మాపాలుడు నిన్ను జూపి చనియె మహాత్మా'** అన్నమాట గాని – **'చిరకాలంబు వారన్నట్టు వీరు గొడ్డు వోయిరి గాక వీరివలన వారికేమి ఫలించిన'**దని కృష్ణుడు సంజయునితో అన్న మాట గాని – తలచుకొంటే ఒళ్లు జలదరిస్తుంది. అంతే గాదు. **వలలుండెక్కడఁ జూచె నొండెడ నసేవ్య క్ష్మాజము ల్పుట్టవే – వంట కట్టియలకై ఖండింపగా నేటికిన్ – చిరుత గద్దియ కుం దగడే నరాధిపా – తిండిపోత నీకు భండనం బేటికి –** ఇలాంటి మాటలు వందలు వేలు ఆయా సందర్భాలలో ఆయా పాత్రల నోట పలికించినవి ఎంత మరచి పోదామన్నా మరచిపోలేము.

అసలొక రహస్యముంది కవిబ్రహ్మ రచనలో. అవి మాటలా వాక్యాలా పద్యమా గద్యమా అని గాదు. పద్యం గద్యంగా నడుస్తుంది. గద్యం పద్యంగా నడుస్తుంది. వాక్యమెంత పొడవుండాలో ఎక్కడికి తెగాలో – ఎన్ని విరుపులు విరగాలో ఎన్ని మలుపులు తిరగాలో అనిర్వచనీయ మనన్యా దృశమైన శిల్పమది. ఒక్క ఆయనకే దక్కిన సొత్తు. ఒక్క సీస పద్యమే తీసుకొని

చూడండి. **నడదీవియలు సేసె నగరికి మాణిక్య మకుట దీప్తులంతోడి మనుజ పతుల - ఎవ్వని వాకిట నిభమద పంకంబు -** ఇవి ఎలా ఉన్నాయిా సీసాలు. **'ఈ వెంౘ్రుకలు వట్టి యాడ్చిన యా చేయి** - అనేది ఎలా ఉంది. ఒక పాదం తెగటం తెగక పోవట మనేది ఆ కవి ఆలోచనను బట్టి ఉంటుంది. ఆవేశం తెగితే తెగుతుంది. తెగకుంటే ఆగదు సాగుతుంది. తిక్కనగారికి తెలిసినట్టీ మర్మ మెవరికీ తెలియదు. రాజ మార్గంలో తిరగ గలడు. సందు గొందులలో వెళ్లి పోగలడు. సంస్కృతమా తెలుగా అని గాదు. రెండూ తెగదెంపులూ చేసుకొంటాయి. మరలా చెట్ట పట్టాలు పట్టుకొని సాగిపోతాయి. అంతవరకూ తడిపొడిగా సాగుతుంది పద్యం. ఉన్నట్టుండి దీర్ఘంగా సాగిపోతుంది. మాటలు హ్రస్వంగా కనిపిస్తాయి. అవే సమాసంగా మారుతాయి. మరలా సళ్లు బారుతాయి. సాఫీగా నడవమంటే నడుస్తాయి. విరిగి పొమ్మంటే విరిగి తునకలవుతాయి. చెప్పాము గదా. ఒక సీసమే ఎన్ని పోకడలు పోతుందో. శ్రీనాధుని బాణీలో నడచిన సీసాలున్నాయి. సోముని మార్గంలో నడచిన వున్నాయి. నన్నయ పంథాలో సాగిన వున్నాయి. అదీ ఇదీ గాక తన ధోరణిలోనే సాగిన వున్నాయి. ఒక్క సీస మేమిటి. కంద మేమిటి. చంపక మేమిటి. - ఉత్పల మేమిటి. ఏదైనా ఆయన భావ వేగానికి దాసోహమని దాన్ని అనుసరించి పోవలసిందే. తమ పాటికి తాము సాగిపోరాదు.

తిక్కన ఒక గొప్ప భావకవి. అంటే ఆయా రస భావాలే నడుపుతూ పోతా యాయన మనసును. అది ఆయన మాటను. ఆమాట పద్యాన్ని.

Yallamraju Srinivasa Rao www.advaitaveda.in

ఆ పద్యం తన నడకను. ఇలా సాగిపోతుందా ప్రయాణం. అది ఎలా సాగాలా ప్రయాణం. సాఫీగానా – మందకొడిగానా – వేగంగానా – అతి వేగంగానా – ఒయ్యారంగానా – వంకరగానా – డొంక తిరుగుడు గానా – ఊగుతూనా – పడుతూ లేస్తూనా – గంతు లేస్తూనా – కుంటుతూనా – ప్రాకుతూనా – ఏమో చెప్పలేము. ముందుగా ఊహించనూ లేము. ఆయన చెబితే విన వలసిందే – వ్రాసి చూపితే కనవలసిందే. లోకంలో ఎందరు వ్యక్తులున్నారో – ఎన్ని మనస్తత్వాలున్నాయో – ఎన్ని ప్రసంగాలున్నాయో – రాగద్వేషాదులైన ఎన్ని ద్వంద్వాలున్నవో – అందులోనూ ఎన్ని చిత్ర విచిత్రమైన పోకడలున్నవో – భారవి చెప్పినట్టు **'విచిత్ర రూపాఃఖలు చిత్తవృత్తయః** నానా విధములైన వృత్తులనూ వాటి లో తులనూ తలస్పర్శిగా తడవి చూచిన రచన అది. ఎత్తులూ లోతులూ రెండూ చూచిన రచన. ఆలంకారికులు వర్ణించిన విభావాను భావ సంచార్యాదు లన్నిటికీ ఉదాహరణలు చూడవచ్చు కవిబ్రహ్మ సృష్టిలో. వ్యక్తిగతమైన సమాజగతమైన జీవితమంతా అన్ని కోణాల నుంచీ పోగు చేసి అందులో గుప్తంగా ప్రకటంగా మనం గ్రహించగల అన్ని రస భావాలనూ కూడ గట్టి ఒకచోట రాశిగా బోసి అందులో ఏ సన్నివేశాని కెంత పంచి పెట్టాలో అంత ప్రసాదాన్ని పంచి పెడుతూ వచ్చాడు మహాకవి.

ఇలాంటి ప్రసాద వినియోగ మొక్క భారత రచనలోనే గాదు. అంతకు ముందు యౌవనంలోనే ఒక రచన చేసిన అనుభవ మున్నది తిక్కనకు. అది ఏదో గాదు. నిర్వచనోత్తర రామాయణం. – ఇది భారతమైతే అది

రామాయణం. ఇది గద్య పద్యాత్మకమైతే అది కేవల పద్మాత్మకం. అందులోనూ అసలు మహాకవి ప్రతిభా పాటవం చాలా వరకుదర్శన మిస్తుంది మనకు. భారత రచనలో ఇంకా శాస్త్ర భాగాలున్నాయి. కనుక అంతగా విజృంభించ లేకపోయాడు కవి. అక్కడ అలా కాదు. శాస్త్ర వాసన చాలా తక్కువ. నూటికి 10 15 వంతులుంటే ఉండవచ్చు. మిగతా భాగమంతా కావ్యవాసనా వాసితమే. అంచేత ఒక చక్కని ప్రబంధంగానే తీర్చిదిద్దాడు. నవరసాలనూ బ్రహ్మాండంగా పోషిస్తూ వచ్చాడు. అందులో రావణుడి ఔద్ధత్యం – అంతకన్నా వాలి కార్త వీర్యుల విజృంభణా – కుబేరు డెంతగానో హితోపదేశం చేయటం – అది లెక్క చేయక పోవటం – చివర సీతారాముల శృంగారం – సీతాపరి త్యాగం – ఇలాటి ఘట్టాలు కవి ఎలా పోషిస్తూ వచ్చాడో చదివి ఆనందించ వలసిందే సహృదయులు. ఒకరి కొకరు చెప్పుకోవలసినవి గావు. ముఖ్యంగా సీతారాముల వన విహారాది వర్ణన ప్రబంధ కవుల ఏ వర్ణనకూ తీసిపోదు సరిగదా వారంతా కవి బ్రహ్మను చూచి నేర్చుకోవచ్చు. సీతా పరిత్యాగ ఘట్టం చూస్తే కంకంటి పాపరాజు మరలా ఎందుకా ఇంకొక ఉత్తర రామాయణం వ్రాశా డనవసరంగా అని తోస్తుంది. నేలమీద బడి పొర్లి పొర్లి ఏడవదు సీత. అంతకన్నా వెలితిగా కనిపించడు రాముడు. వారి గూఢ ప్రవర్తనలోనే ఎంతో గాఢమైన రసానుభూతి కలుగుతుంది పాఠకులకు. రామ నిర్యాణంతో గాక ఆదర్శప్రాయమైన రామరాజ్య వర్ణనతో తన కావ్యాన్ని సమాప్తం చేయటమూ మహాకవి ఔచిత్య పాలన ఎంత గొప్పదో

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

చిరస్మరణీయం. **'సుతులఁగొని యాడు - విద్వత్ర్పతతి ను పోషించు - భూమి ప్రజనరయు - మహాక్రతువు లొనరించు - గురు దైవత పూజలు సేయు - సాధువర్గము బ్రోచున్'** - ఈ షడంగ పాలనను మించిన రాజ్య పాలన ఏముందిక. అది రామరాజ్యంలో దర్శించి దానినే మనుమ సిద్ధికి కూడా రహస్యంగా ఉపదేశించి ఉంటాడా రాజగురువు. రాజులకే గాదు. కవిరాజులకు కూడా గురువే ఆ మహానుభావుడు. కవితా రాజ్యంలో ఆయన విశ్వరూపం చూస్తుంటే ఎఱ్ఱాప్రెగడ ఆయనగారికిచ్చిన కితాబు కిక జవాబు లేదనట మక్షరాలా సత్యం. నిజంగానే తిక్కన కావించిన సృష్టి తక్కొరుల చేతఁగాదు. **'నవరస రుచిరాం నిర్మితి మాద ధతీ భారతీ కవేర్జయతి'** అన్న కావ్య ప్రకాశోక్తి కవిబ్రహ్మకే వర్తిస్తుందని ఘంటా పథంగా చాట వచ్చు రసజ్ఞ పాఠకలోకం.

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# నాచన సోముని - నవీన గుణము

తిక్కన సోమయాజి అయిన తరువాత వెంటనే పేర్కొన వలసినవాడు నాచన సోమనాథుడు. ఇది మనం చెప్పటమే గాదు. ఆయనే స్వయంగా చెప్పుకొన్నాడు తన గద్యలో. 'ఇది శ్రీమదుభయ కవి మిత్ర కొమ్మనా మాత్య పుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన మహాభారత రచనా నంతరంబున - సకల భాషా భూషణ సాహిత్య రసపోషణ సంవిధాన చక్రవర్తి సంపూర్ణ కీర్తి నవీన గుణ సనాథ నాచన సోమనాథ ప్రణీతంబైన యుత్తర హరివంశ'మని ఇలా నడుస్తుందా గద్య. ఇది ఏమిటీ గద్య. ఇలాటి చిత్రమైన గద్యమరి ఏ కవి కావ్యంలోనైనా చూచామా. లేదు. దీన్నిబట్టి చూస్తే మనకీ మహాకవికి తిక్కన సోమయాజి అంటే ఎంత గొప్పగౌరవమో తెలుస్తుంది. ఆయన తరువాత అంత మహాకవి తానొక్కడేనని ఆత్మ విశ్వాసంతో లోకానికి చాటుతున్నాడా అనిపిస్తుంది. అంతేగాక తనకు సమకాలికుడైన ఎఱ్ఱాప్రెగడ కలా చెప్పుకొనే అధికారం లేదని ధ్వనింప జేస్తున్నాడా అని కూడా భాసిస్తుంది.

ఏదైనా కావచ్చు. కాని తిక్కన పేరు అదే పనిగా స్మరించాడంటే ఏమిటాయన మనసులో ఉన్న ఉద్దేశం. నన్నడిగితే సోమయాజి నడపిన రాయబారాలూ - యుద్ధ వర్ణనలూ- పాత్రల సంభాషణలూ సన్నివేశ కల్పనలూ - ఇలాంటి హంగులన్నీ సోమనాథుని దృష్టి నెంతో ఆకర్షించి ఉంటాయి. అదంతా మనసులో ముద్రితమై అతని నోట ఇలా పలికించి ఉంటాయి. అంతేగాక తిక్కన హరి హరనాథ భక్తుడు. ఆ స్వామికే తన మహాభారతాన్ని అంకితం చేసినవాడు. సరిగా సోమనాథుడు కూడా మరలా హరి హరనాథుణ్ణే ఇష్టదైవతంగా భావంచి ఆరాధించినవాడు. ఆయనకే తన కావ్యమంకితం చేశాడు. కనుక ఇది గూడా ఒక కారణం కావచ్చు ఉభయ కవిమిత్రునితో తన కున్న మైత్రికి.

అంతా బాగానే ఉంది. కాని సోమయాజి రసపోషణ తరువాత రసపోషణ ఏమిటి. సంవిధాన కల్పన తరువాత కల్పన ఏమిటి. రాయబారాలూ రణరంగ వర్ణనలూ తరువాత అలాటి వర్ణన మేమిటి. ఎంత గొప్పగా వర్ణిస్తే మాత్ర మందులో గతార్థమయి పోవా. పోతాయి సందేహంలేదు. అది గ్రహించని వాడు కాదు సోమనాథుడు. అందుకే అంతకన్నా విలక్షణమైన పంథా ఏమిటా అని ఆలోచించి అది తొక్కుతూ పోయాడు. తొక్కుతూ పోయాడంటే ఏదో తొక్కాలి గదా అని తొక్కటం కూడా గాదు. అలాగైతే మనకెప్పుడూ అలవాటు లేని వేషం వేసి అంతకన్నా అలవాటు లేని ప్రసంగం చేసి నట్టవుతుంది. దానివల్ల ఒకరి మెప్పు దేవుడెఱుగు. దెప్పుకొని తెచ్చుకొని పరిహాసం పాలవుతాడు మానవుడు. అంత అమాయికుడూ అవివేకీ గాదు సోమనాథుడు. సర్వజ్ఞుడని

చిన్నయసూరి వంటి లాక్షణికుడి చేతనే పొగడ్తనందు కొన్న ప్రతిభావంతుడెలా భ్రాంతుడవుతాడు. సర్వమూ తెలిసిన వాడయినా ఒకానొక కవి కొకానొక రంగంలో ఉంటుంది బ్రహ్మాండమైన అభినివేశం. అది నేను పోద్ఘాతంలోనే మనవి చేశాను. అలాటి అభినివేశం మన సోమనాధుని కున్నది నవీన గుణ సంపదలో. అది తన కావ్యమూ మూలాగ్రమూ వెదజల్లి ఆ రంగునీళ్ళలో అభిషేకించి కావ్యసుందరి నొక అపూర్వ స్వప్న సుందరిగా సహృదయ లోకానికి ప్రదర్శించాడు మహాకవి.

**'ధనదాంతః పురతారహారములు యాదః పాల బాలా ఘన**
**స్తన కాశ్మీరము - ధర్మరాట్కుల వధూ సంవ్యాన కౌశేయమున్**
**దను జాధీశ పురావరోధదయితా ధమ్మిల్ల మాల్యంబులున్**
**కినుకం దెచ్చి ఘటింపఁజూచు - జయలక్ష్మి నిత్యనే పథ్యమున్'**

దిక్పాలకు లందరినీ జయించి వారి అంతఃపుర కాంతల ముత్యాలహారాలూ కుంకుమ లేపమూ పట్టు పయ్యెదలూ - ధమ్మిల్ల మాల్యాలూ హరించి తెచ్చి తన విజయలక్ష్మి నలంకరించి వినూత్నంగా చూచి సంతోషించినది నరకుడు గాదు. ఆ నేపథ్యంలో దాగి మనతో దాగుడు మూత లాడుతున్నది నాచన సోముడే. ఆ జయలక్ష్మి కవి కవితా జయలక్ష్మే. ఆ అలంకారాలన్నీ కవి తన కవితా కన్యకు చేసి మనకు చూపుతున్న అపూర్వమైన అలంకరణమే.

సోమనాధుడు ఎన్ని రచనలు చేశాడో చేయలేదో మనకు తెలియదు. అతడు చేసి మన చేతికి వచ్చింది మాత్రమొక్క ఉత్తర హరివంశమనే

Brahmasri Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in

ప్రబంధమే. సంస్కృత హరివంశమున కిది అనువాదమైనా కావచ్చు. అనుసరణమైనా కావచ్చు. మొత్తం మీద పురాణాన్ని సర్వాంగ సుందరమైన కావ్యంగా మార్చాడు కవి. అందులోనూ పూర్వ హరివంశం జోలికి పోలేదు. అది కూడా వ్రాశాడో లేదో తెలియదు. బహుశా తన గురువు పూర్వ రామాయణం వ్రాయక ఉత్తర రామాయణం రచించబట్టే - తానూ ఆయన అడుగు జాడలోనే ఉత్తర హరివంశమే రచించి ఉండవచ్చు. **'హరివంశ ప్రథమ కథాంతరమునఁ గల వింత లెల్లఁదప్పక మదిలో దిరమయ్యెఁగదా మీదట నరవర యే కథలొకో వినంబ్రియ'** మని వైశంపాయనుడు జనమేజయుని అడగటంలోనే తెలిసిపోతున్న దసలు పూర్వభాగం కవి రచించలేదని. పోతే ఇక మనకు లభించిన ఈ ఉత్తర హరివంశ కావ్యమే కవి కవితా కౌశలాని కంతటికీ ఒక మాణిక్య దర్పణం కావలసి ఉన్నది. ఏమిటా కౌశలం. మిగతా కవుల కెవరికీ లేని ఆ గుణ మేమిటి - అందులో కవిగారు ప్రదర్శించిన నవీనత ఏమిటని ఇప్పుడు ప్రశ్న.

గుణమనేది పారిభాషికంగా చెప్పవచ్చు. మామూలుగా చెప్పినా చెప్పవచ్చు. మొత్తం మీద నన్నయగారికి కథా కథనంలో ఎంత దక్షత ఉందో తిక్కన గారికి రసభావాది పోషణలో ఎంత సామర్థ్యముందో దానికి దీటైన ప్రతిభా పాటవ ముంది సోమనాథునికి గుణ సంప త్ప్రదర్శనంలో. ఆలంకారికులు పది కావ్య గుణాలను పరిగణించారు. అవన్నీ శబ్దానికి పుష్టినిస్తే ఆ శబ్ద సంఘటనకు రీతి **Style** అని పేరు పెట్టారు. శబ్దానికి సంబంధించినది రీతి అయితే అర్థానికి సంబంధించినది వృత్తి **Tone**

అన్నారువారు. ఈ వృత్తి అనండి రీతి అనండి. ఇవి ఎంత చక్కగా నిర్వహిస్తే అంతగా ఆయా రసభావాలకు పుష్టి చేకూరుతుందని వారి సిద్ధాంతం. ఇందులో వైదర్భీ పాంచాలీ గౌడీ అనేవి రీతులైతే – కైశికీ ఆరభటీ భారతీ సాత్వతీ అనేవి నాలుగూ వృత్తులని పేర్కొంటారు కావ్య మీమాంసకులు. వీటన్నిటికీ ఎక్కడికక్కడ ఉదాహరణలు కూడా ఇచ్చి లక్ష్యలక్షణ సమన్వయం చేసి చూపుతారు.

సోమనాథుని విషయంలో ఇలాటి శ్రమ ఏమాత్రమూ అక్కర లేదు ఆలంకారికులకు. ఎవరికేది కావలిస్తే దాని నందివ్వ గలడా మహాకవి. ఎన్నో అంగళ్ళు తిరగనక్కర లేదు. చాలా పెద్ద అంగడి ఆయన గారిది. ఆ ఒక్క అంగడిలోనే మన కన్ని సరకులూ దొరుకుతాయి. అన్ని గుణాలకూ రీతులకూ వృత్తులకూ ఆలవాలమది. గుణ సనాథుడు గదా అతడు. ఏది లభించదు. పది గుణాలని గదా పేర్కొన్నాము. ఏమిటా పది. శ్లేష – ప్రసాదము – సమత – మాధుర్యము – సౌకుమార్యము – అర్థ వ్యక్తి – కాంతి – ఉదాత్తత – ఓజస్సు – సుశబ్దత. పది అని పేరే గాని ఇవన్నీ మూడు గుణాలలో చేరిపోతాయి. అవి ఏవోగావు. ప్రసాదమూ మాధుర్యమూ ఓజస్సు. అందులోనూ ప్రసాదమనే గుణమొకటి ఉంటే చాలు. మిగతా వాటన్నిటికీ జవాబు చెప్పగల దంటారు అభిజ్ఞులు. **'తత్ర ప్రసాద స్సర్వ రససాధారణ స్సర్వ రచనా సాధారణోగుణః'** – అన్ని రసాలను అన్ని రచనలనూ వ్యాపించి వాటికి ప్రాణం పోసే గుణమట ప్రసాదమనేది. **Clarity of Thought and clarity of expression.** భావ వైశద్యమూ భాషా వైశద్యమే ప్రసాదమంటే. అది ఒకచోట సుకుమారంగా నడుస్తుంది.

మరొకచోట ఉల్బణంగా నడుస్తుంది. ఇంకొక చోట మధ్యస్థంగా నడుస్తుంది భావవేగాన్ని తీవ్రతనూ బట్టి ఉంటుంది దాని నడక. అలా దాన్ని ఎలా గంటే అలా నడపటంలో సోముడు అందె వేసిన చేయి. ఇంతకూ ప్రసాదమే సుకుమారంగా నడిస్తే మాధుర్యార్థ వ్యక్తి సమతాది గుణాత్మకం. ఉద్ధతంగా నడిస్తే ఓజః కాంత్యౌదార్యాది గుణాత్మకంగా భాసిస్తుంది. మొదటిది వైదర్భీ రీతి అయితే రెండవది గౌడీ రీతి. రీతి వృత్తి అని పేరే గాని సహృదయుడి అనుభవానికి వచ్చేటపుడు ఇది శాబ్దికమూ అది ఆర్థికమూ అని తేడా కనపడదు. కారణం శబ్దాన్ని విడిచి అర్థం లేదు. అర్థాన్ని విడిచి శబ్దం లేదు. అంచేత శైలి అనేది సౌమ్యమూ ప్రౌఢమూ - ఇంతవరకే విభజించి చెప్పుకొంటే చాలు. అదే రీతి. అదే వృత్తి. ఆ రెండింటిలోనే యథాసంభవంగా మిగతా గుణాలన్నీ కలిసివస్తాయి. రెండింటినీ కొనా మొదలు వ్యాపించి ప్రసాద మెలాగూ ఉండనే ఉంటుంది. ఈ క్రింది పద్యాలు చూడండి. మీకే తెలిసి పోతుంది. మొదట ప్రసాదమనేదెలా ఉంటుందో ఈ పద్యాన్ని అడిగి తెలుసుకోండి. చెబుతుంది మీకు.

**'ఓపార్థ నిన్ను నమ్మితి - పాపని రక్షింప కిట్ల పార్థుడవైతే**
**నాపాలి పారిజాతము - గోపాలక చక్రవర్తిఁగొనిరానైతి న్'**

ఇది ఒక బ్రాహ్మణుడు తన పిల్లల నర్జునుడు ప్రతిజ్ఞ చేసి కూడా కాపాడ లేకపోతే అతణ్ణి నిష్ఠుర మాడే సందర్భం లోని పద్యం. ప్రతిపదం చెప్పకుండానే ఎలా చక్కగా అర్థమయి పోతున్నదో చూడండి. ఇదీ ప్రసాద గుణమంటే. ఇది మనసులో పెట్టుకొని ఇక చూస్తూ పొండి.

**'కలు(ద్రావంబని పూని యాదవులు ఖడ్గా ఖడ్గి వాదింతురే**
**కలఁగంబాఱుట గాక - పంతమునకుం గంసారి సైరించినన్**
**కలనం బ్రాణము తోన పట్టువడు నింకన్ సాత్యకిన్ గిత్యకిన్**
**జలభద్రున్ గిలభద్రు నాయెదురఁ జెప్పం జొప్పుదప్పుం జుమీ'**

ఇది జనార్ధనునికి హంసడిభకు లిచ్చిన జవాబు. జనార్దనుడనే బ్రాహ్మణుడు అంతకు ముందు వారికి హితం చెబుతూ యాదవులు సామాన్యులు గారు వారితో జగడం పెట్టుకోవద్దు బలరామ సాత్యకి ప్రభృతులు మహాపరాక్రమవంతులని వారిని హెచ్చరిస్తాడు. ఏమని.

**నిలువం జాలుదురే రణాంగణములో నీలాంబరాడంబరో**
**జ్జ్వల వేషంబు - హలాహల స్థల హల వ్యాపార దోస్సారమున్**
**ప్రలయాంభోధర సోదరా రవము నొప్పన్ దర్పమేర్పాటుగా**
**బలభద్రుండతి రౌద్రుండై కదిసినం బ్రత్యర్థి భూపాలకుల్'.**

ఇందులో చూడండి. వీరరౌద్ర రసాలుట్టి పడుతున్నాయి. దానికి పోషకమైన రీతి చూడండి. అది గౌడి. ఇక ఓజః కౌంత్యోదార్యాది గుణాలన్నీ ఇందులోనే తాండవిస్తున్నాయి. ఇది శబ్దాన్ని బట్టి చెబితే ఇక అర్థాన్ని బట్టి ఇందులోనే ఆరభటీ వృత్తి కూడా చోటు చేసుకొన్నదని చెప్పుకోవచ్చు. ప్రతి వీరులను తక్కువగా అంచనా వేయవద్దని వారికి భయం తోచేలాగా చెప్పిన పద్యం కాబట్టి ఆ భావానికి తగినట్టే నడుపుతున్నాడు సోమనాథుడు.

మరి మనమింతకు ముందుదాహరించిన పద్యమో. అది దీనికి జవాబుగా చెప్పినది. జనార్దనా నీవెందుకింత భయపడుతూ మమ్ము

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

భయపెడుతున్నావు. బ్రాహ్మణుడవు గాన నీవు భయపడటం సహజమే. కాని మేము క్షత్రియులం. అలా భయపడే బాపతుగాదంటూ అతడు వారిని పైకెత్తి చూపితే వీరు వాళ్లను చాలా తేలికగా తీసిపారేస్తూ చెప్పిన మాట ఎలా ఉండాలో అలా నడచిన పద్యమిది. అందుకే ఇది గాఢ బంధమైతే అది శిథిల బంధం. సంస్కృత సమాసాలతో ఆడంబరంగా ఇది నడిస్తే - పొడిపొడి మాటలతో అది నడుస్తుంది. నడచిందంటే కవి అలా నడిపితే నడచింది. పద్యం దేముంది. దాని నడక ఏముంది. అది ఒక బస్సులాంటిది. కారులాంటిది. డ్రైవరు లాంటి వాడు కవి. వాడెలా తిప్పితే అలా తిరుగుతుంది. ఎలా పోనిస్తే అలా పోతుంది. ఎటువచ్చీ చోదనా పాటవం ఉండాలి కవికి. అది బ్రహ్మాండంగా ఉన్నావాడు సోమన్న. చూచారు గదా రెండు పద్యాల పోకడలో ఎంత తేడా ఉన్నదో. అది వైదర్భీ రీతి - కైశికీ వృత్తి అయితే ఇది గౌడీ రీతి - ఆరభటీ వృత్తి పుడికి పుచ్చుకొన్న పద్యాలు. మరి ప్రసాదాని కెందులోనూ కొఱత లేదు. మిగతా అర్థవ్యక్త్యాది గుణాలు పిలిస్తే పలుకుతున్నాయి.

మరి ఇలా సంఘటనాత్మకంగానే గాక విడివిడిగా చూచినా ఏ గుణానికా గుణం కొట్టవచ్చినట్టు కనపడే పద్యాలేవైనా ఉదాహరించ వచ్చు సోమనాథుని రచనలో. మొదట ప్రసాద గుణమే పట్టుకొని చూతాము.

**అవె సుత్రామ రథంబు - లల్లవె కుబేరా నేకపశ్రేణుల**
**ల్లవె వార్ధీంద్రు తురంగమంబు లవె ప్రేతాధీశు వీరావళుల్**
**దవులం బాటినఁ దోడి తెచ్చిరనిలో దైతేయు - లే సొమ్ము లిం**
**దువిదా నీకుఁ బ్రియంబు చేకొనుము నీయుల్లంబు తెల్లంబుగన్'**

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఎంత ప్రసన్నంగా నడుస్తున్నదో చూడండి ఈ పద్యం. ఏ మాట కామాట ఏ భావాని కాభావం విశదంగా ఎక్కడికక్కడ విరుగుతూ ఎవరూ అదేపనిగా అర్థం చెప్పనవసరం లేకుండానే ఏ కొంచెం భాషా జ్ఞానమున్నా చాలు. దానిపాటికదే తేటతెల్లంగా బోధపడుతున్నది. ఇక ఓజో గుణానికీ ఎక్కడబడితే అక్కడే ఉదాహరణలు చూపవచ్చు.

**"సత్రాజి త్తనయా కరాంతర ధనుర్జ్యారావ - మైరావతీ**
**సూత్రా నర్గళ నిర్గత స్తనితమై సుత్రామ చాప ప్రభా**
**పాత్ర భ్రూలతికా విలాసముల కొప్పం - గప్పు శార్ఙ్గంబుము**
**కృత్త్రిక్రూర మహాశను ల్దనుజరా డ్గాత్రంబు గోత్రంబుగన్'**

ఇది ఓజో గుణ ప్రధానమైన రచన. ఎంత ఉల్బణంగా కనపడుతున్నదో చూడండి ఆ గుణ మిందులో. సత్యభామ యుద్ధమెంత ఉల్బణంగా సాగిందో అంత ఉల్బణంగా సాగిందిదీ. ఆవిడ ధనుర్జ్యారావమూ - దానితో పాటు చాప ప్రభలూ - బాణ పరంపరలనే అశని పాతాలూ - నరకుడి గాత్రమనే గోత్రం మీద పడేటపుడా మాత్రం తీవ్రతా ఔద్ధత్యం చూపకపోతే ఎలాగా మహాకవి రచన.

పోతే ఔదార్యమనే గుణాని కొక పద్య ముదాహరించ మంటారా.

**'తండ్రులు మీరు - మీకు నయతత్త్వముఁజెప్పెద మన్న - మమ్మునే**
**మంద్రు జనంబు - లూఱడు బృహస్పతి మీయెడ - నేను లేనిచో**
**వెండ్రుక యంత మోసమును వేచి దురంబున కెత్తి వచ్చు నా**
**పౌండ్రుఁడు - వానిచేత మన బంధులు చిక్కక యుండఁగావుఁడీ'**

చూడండి ఈ పద్యం. ఇది కైలాస యాత్రకు వెళ్ళే ముందు సందు చూచి పౌండ్రక వాసుదేవుడెక్కడ వచ్చి యాదవుల మీద పడతాడో నని తన వారిని నలుగురినీ అప్రమత్తంగా ఉండమని కృష్ణుడు హెచ్చరిస్తున్న సందర్భం. ఉద్ధవాచార్యుడు బలరామాదుల లాంటివాడు కాదు. అందరికీ గురుస్థాన మాయన. అలాంటివాడితో మాటాడే తీరు చూడండి. ఎంత వినయంతో గౌరవంతో మాటాడుతున్నాడో కృష్ణుడు. మీకు నేను నీతి బోధించట మేమిటి హాస్యాస్పదం. బృహస్పతి లాంటివాడే మీకు సాటిరాడు. అయితే నా పరోక్షంలో పౌండ్రకుడు దండెత్తి రావచ్చు. దయ ఉంచి మనవాళ్ళను వాడు పట్టుకుపోతాడేమో అలా జరగకుండా చూడగోరుతా నంటాడు. బలరామాదుల కంటే బలవంతుడా ఆ గురువుగారు. కాని గురువుకిచ్చే మర్యాద చూడండి. ఎంత మనోరంజకంగా వర్ణించి చూపుతున్నాడో దీని ద్వారా మహాకవి. ఇంతకన్నా ఉదాత్తతా గుణానికి వేరే ఉదాహరణ అక్కర లేదు.

పోతే శ్లేష అని ఒక గుణమున్నది. శ్లేష అంటే శబ్ద శ్లేష అర్థ శ్లేష - సభంగ మభంగమని గాదిక్కడ అర్థం. అలాంటి శ్లేష చూడాలంటే చాలా ఉన్నాయి నాచనలో. వాటిని గూర్చి తరువాత చర్చిద్దాము. ఇక్కడ శ్లేష అనేది అలంకారం గాదు. కావ్య గుణం. మాట లెక్కడా బెసక కుండా గొలుసు కట్టుగా ఒకే మాట లాగా నడుస్తూ పోతే దానికి శ్లేష అని పేరు. ఇలాంటివి కుప్ప తెప్పలు హరివంశంలో. మచ్చుకు ఒకటి చూడండి.

**చూడంబోదు గజాపనీత కట ఖర్జూ ఘూర్జ ఖర్జూరలీ**
**లాడోలా సుఖలేఖ లోక మహిళా లంకార హారక్షణ**
**క్రీడా తారకితాంతరాళ తరళ శ్రీకంఠ కంఠ ప్రభా**
**చూడా చంద్ర కళాకిలాసము - సతీశుద్ధాంత కైలాసమున్' -**

కైలాస వర్ణన ఇది. మత్తేభాలు ఒంటి తీట పోగట్టుకోటానికి భూర్జ ఖర్జూరాది వృక్షాలకు శరీరాలు రాచుకొంటుంటే – ఆ వృక్షాల కొమ్మల కుయ్యాలలు కట్టుకొని దేవతా స్త్రీ లూగుతుంటే – వారి మెడలోని ముత్యాల దండలు ఆకాశంలో నక్షత్రాలుగా వెలిగిపోతుంటే – వాటి నడుమ పరమేశ్వరుడి జటా జూట చంద్రరేఖ దాని మీద పడ్డ కంఠనైల్యం ఒక నాయకమణిలాగా భాసిస్తుంటే – ఒకదాని కొకటి లింకు తెగకుండా భావమెలా సాగుతున్నదో – ఆ లింకు వదలకుండా పట్టుగా నడుస్తున్నది సమాసం. ఎక్కడా సడలటం లేదు సరిగదా యమకం అను ప్రాస చూడండి. ఒకదాని చేయి ఒకటి పట్టుకొని ఎంత ఒయ్యారంగా సాగిపోతున్నాయో. శ్లేష అంటే శ్లేషే. కలిసి మెలిసి పోవటమనేగా ఆమాట కర్థం. ఇక మాధుర్యమనే గుణం చూపమంటారా. ఈ పద్యాన్ని అడగండి చూపుతుంది.

**'అరవింద నయన శరముల – సరవిందన యనువు చూపఁ జాపము గుడుసై పరివేషము గల చంద్రుని – సరివేషము దాల్చె– మొగము జగము నుతింపన్ –'** పృథక్పదత్వమే మాధుర్యమని ఆలంకారికుల మాట. అలా చూచినా ఇందులో ఏ మాట కా మాట ఎలా విడివిడిగా కనిపిస్తూన్నాయో చూడండి. అలా కాక అక్షర మాధుర్యం చూచినా రదనగప అనే అక్షరాలు సరిగమ పద అనే స్వరాల లాగా మాటి మాటికీ చెవిన బడుతూ మాధుర్యాన్ని చిలుకుతూనే ఉన్నాయి.

ఇంకొక గుణ ముదాహరించి విరమిస్తాను. అది సమాధి అనే గుణం. సమాధి అంటే ఇది సవికల్ప నిర్వికల్పాది సమాధులు గుర్తు

రాగూడదు మనకు. కావ్య పరిభాష ఇది. సమాధి అంటే పద్యం ఆరోహణా వరోహణాత్మకంగా నడుస్తూ పోవటం. ఈ పద్యం  నడక గమనించండి.
**'మధు మథన క్రోధానల - మధికముగా  మండ నూఁదు నవ్వెంగలికిన్ విధియలుగకమును - మృత్యు - క్షుధార్తి వివృతాస్య పదవి కోఁఅయలుగదే'**
అని రుద్ధు డున్నట్టుండి హఠాత్తుగా అదృశ్యమయ్యాడు ద్వారకలో. చిత్రలేఖ అనే ఉష చెలికత్తె వాణ్ణి ఎత్తుకుపోయింది. అది తెలియక ద్వారకాపుర వాసులందరూ గగ్గోలు పడుతుంటారు. అందులో ముఖ్యంగా మహిళా జనమిలా వాపోతున్నారు. ఎవడో వాడా దుర్మార్గుడు  సాక్షాత్తూ శ్రీకృష్ణుని ముద్దుల మనుమణ్ణే అపహరించాడు. కృష్ణుడంటే మధుమథనుడు మధుసూదనుడని తెలియదేమో. ఆయన కోపమనే అగ్నిని పొగ గొట్టం పెట్టి ఊదుతున్నాడా వెఱ్ఱివాడు. ఆయన అలగక ముందే విధి అలగదా. అంతకుముందే  మృత్యు దేవత నోరు దెఱిస్తే ఆ నోటిలో ఉన్న కోఱ అలగదా అంటారు వారు. ఇందులో పద్యం నడక చూడండి. మొదటి రెండు పాదాలూ పైస్థాయికి  వెళ్లుతున్నట్టు ఆరోహణ మార్గంలో నడిస్తే క్రింది రెండూ అవరోహణలో నడుస్తున్నాయి. మరి కోపమంత కంత కెక్కువయినట్టు చూపాలి గదా. అలాంటప్పుడు పూర్వార్ధ మారోహణ ఉత్తరార్ధ మవరోహణలో నడవవటమేమి ఔచిత్యం. నిజమే. కాని ఇక్కడ ముగ్గురున్నారు కోపపడే వాళ్ళు. ఒకరు కృష్ణుడు. మరొకరు దైవం. ఇంకొకటి మృత్యువు. కృష్ణుడి తరువాతనే వారిద్దరూ. కృష్ణుడు త్తరు విస్తేనే దైవ మైనా మృత్యువైనా తమ విధులు నెరవేర్చవలసింది. మధు మథనుడాయన. ఆయన కెవరి సహాయమూ అక్కరలేదు. మీదు మిక్కిలి ఆయన సంకల్పాని

కనుగుణంగా నడుస్తుంది విధి. దాని ననుసరించి పోతుంది మృత్యువు. అందుకే మొదటి దారోహణం. రెండవది అవరోహణం. ఇదీ ఔచిత్యమిక్కడ. ఇలాంటిదే ఇంకొక్కటి రుచి చూడండి.

**'కలరా యింతకుముందు యాదవులచే గప్పంబు దెప్పింపంగాఁ**

**గలరా రాజులు'** - ఇది కృష్ణుడు హంసడింభకుల మాటల కుద్రిక్తుడయి అన్న మాట. కనుక ఆరోహణ. **'గాజులుందొడవుగాఁ గల్పించిరా - కాకులం గలకంఠంబులఁ జేసినా కటకటా గౌరీశ్వరుండు'** ఇది వారి అవివేకాన్ని తలచుకొని ఆడిన మాటలు. అందుకే అవరోహణ. **'ఏమిగాఁగలవారో ఇట మీఁద హంస డిభకు ల్గర్వాంధకారంబునన్'** ఇవి వారి భావి వృత్తాంతాన్ని తలపోసి సానుభూతితో ఆడే మాటలు. ఇది ఇంకా అవరోహణాత్మకం. అంత కంత కెంత అందంగా ఔచిత్య బంధురంగా నడుస్తుందో చూడండి రచన.

సరే మంచిదే. ఇంతవరకూ సోముని గుణ సనాధత్వమేమిటో ఎలాంటిదో సోదాహరణంగా నిరూపించాము. అయితే ఇది గుణ సనాధత్వమేగాని అతడు పేర్కొన్న నవీన గుణసనాధత్వం కాదు. గుణాలనేవి పారిభాషికంగా చెప్పుకొనే మాధుర్య సౌకుమార్యాది కావ్యగుణాలే అయితే అవి అంతో ఇంతో మిగతా కవుల కావ్యాల్లో కూడా దొరుకుతాయి మనకు. అసలు నన్నయ తిక్కనాదుల రచనలలోనే ఎన్నో అలాంటి గుణాల కుదాహరణలు కుప్పతెప్పలుగా లభిస్తాయి. అలాగే చూపాము కూడా ఇంతకు పూర్వం. పోతే ఇక సోమన తరువాత వచ్చిన శ్రీనాధ పోతనాది

కవులలోనా. ఎంతో పుష్కలంగా లభిస్తాయవి. అలాంటప్పుడు సోముడొక్కడే గుణసనాథుడని పేర్కొనటమేమి బాగు. అయితే అందరూ గుణసనాథులే గదా అని ఆశంక ఏర్పడవచ్చు. కనుకనే గుణ శబ్దాన్ని కావ్యగుణమని పారిభాషికంగా మాత్రమే భావించ రాదు మనం. అల పారిభాషికంగా తీసుకొని చూచినా ఎంతో మంది కవుల రచనల కన్నా చాలా గొప్పగా విలక్షణంగా కనిపిస్తాడు సోమనాథుడని రసజ్ఞులు గ్రహించాలనటానికే ముందు కావ్య గుణాలను ప్రస్తావించాము.

పోతే ప్రస్తుతం మరొక దృక్పథంతో చూచి వ్యాఖ్యానించ బోతున్నాము గుణమనే మాట. ఇప్పుడిది పారిభాషికం గాదు. సోముని రచనలో మాత్రమే మనం చూడగల ఒక విశిష్టత. లేదా విలక్షణత. ఇది మాత్రం మరి ఏ కవిలోనూ కానరాదు. అనన్య సాధారణమైనది. అపూర్వమూ అనుత్తరమూ అయిన గుణంగనుక నవీనమైన గుణమది. దీనిమూలంగానే నవీన గుణ సనాథుడని కీర్తింపబడుతున్నాడు సోమనాథుడు. ఈ నవీనత అసాధారణ భావనా సామర్థ్యమైనా కావచ్చు. భావా విష్కరణానుగుణ పద్య రచనా ధూర్వహత్వమైనా కావచ్చు. చిత్ర విచిత్ర పద విన్యాస పాటవమైనా కావచ్చు. అలంకార వైచిత్రి అయినా కావచ్చు. శబ్దార్థాది లక్షణ సమ్మేళనమైనా కావచ్చు. సంస్కృతాంధ్ర పృథక్కరణ మి శ్రీకరణమైనా కావచ్చు. నానావిధ గద్య రచనా నైపుణ్యం కావచ్చు. నానాశాస్త్రార్థ పరిజ్ఞానం కావచ్చు. వివిధ లోక వృత్త పరిశీలనా పాటవం కావచ్చు. తత్తత్ప్రకరణోచిత భాషా ప్రయోగ దాక్షిణ్యం కావచ్చు. బహువిధ లోకోక్తి ప్రకటీకరణ ప్రాగల్భ్యం కావచ్చు.

ఏద్దైనా కావచ్చు. ఎందులోనైనా అతనికి సాటి లేదు. శ్రీనాధుడన్నట్లు కవి కులాదృష్టాధ్వ గమనా ధ్వనీనుడతడు. ఏ కవికీ అంతుపట్టని వినువీధులలో విహరిస్తుంటాడు. అది ఎలాంటిదో ఒక్కొక్కటీ తడవి చూదాము.

మొదట ఆయన అతిలోకమైన భావనాశక్తి. **శక్తిర్నిపుణతా లోక శాస్త్ర కావ్యాద్యవేక్షణాత్తని** ఆలంకారికుల సూక్తి. శక్తి అంటే అపూర్వ వస్తు నిర్మాణ క్షమమైన దృష్టి. అన్నిటికన్నా గొప్ప గుణమది మహాకవికి. ఆ తరువాత వ్యుత్పత్తి. ఆ పిమ్మట అభ్యాస మన్నారు. ఇలాటి శక్తి అనండి ప్రతిభ అనండి. ఎంత కావాలో అంత కనిపిస్తుంది సోమనలో. చూడండి. మనం మొట్టమొదట ఉదాహరించిన పద్యమే ఎంత అద్భుతమైనదో. ధనదాంతః పుర అనే పద్యమే పరిశీలించండి. నిత్యమూ రోజుకొక క్రొత్త రీతిలో అలంకరిస్తూ ఉన్నాడట నరకాసురుడు. ఎవరిని. తన జయలక్ష్మిని. జయలక్ష్మి అనేది అమూర్తం. అది ఒక స్త్రీ గాదు. స్త్రీగా భావిస్తున్నాడు కవి. ఒక స్త్రీ ఎప్పటికప్పుడు తన శరీరాన్ని ముస్తాబు చేసుకొని ఎలా అందంగా కనిపిస్తుందో అంత అందంగా స్త్రీ గాని స్త్రీ ఆతని జయలక్ష్మి గోచరిస్తున్నది. మరి దానికి వేషభాషలో. వాటికేమి కొరత. దిక్పాలకుల స్త్రీలున్నారుగా. వారిలో ఒక్కొక్కరి వస్త్ర మాల్యభూషణాదులే ఆవిడ భూషణాది వేషాలు. జయలక్ష్మి గదా ఆవిడ. వారి భర్తలైన దిక్పాలురు తన చేతిలో ఓడిపోతే వారి స్త్రీ లందరూ తనకు వశమే. వారి ఆభరణాదులన్నీ యధేచ్ఛగా తెచ్చుకోవచ్చు. తన జయలక్ష్మిని వాటితో అలంకరించి ఆనందించవచ్చు ఆ రాక్షసరాజు. చూడండి రాజుల విజయాన్ని ఎంతోమంది కవులు వర్ణించారు. ఇంత మనోజ్ఞమైన వర్ణన ఎక్కడైనా చూచారా.

Brahmasri Vallamaraju Srinivasa Rao www.advaitavedanta.in

ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు కృష్ణ భగవానుడికి. అప్పుడా పరమేశ్వరుని రూపమాయన కెలా కనిపించిందో తెలుసా. ఒక పారిజాత వృక్షమేనట ఆ ఈశ్వరుడు. వృక్షమైతే మరి చిగుళ్ళేవి పూలేవి పూదేనె మకరందమేది. పండ్లు ఫలాలేవి అని అడుగుతారా. నాచన సప్లయి చేస్తాడు చూడండి.

**'లలిత విద్రుమలతా లావణ్య మగు జటా జూటంబు - చిగురాకు జొంపం - సాంద్ర తారక విలాసం బగు పురుహూత పురపురంధ్రుల నేస పూవులు**

**విశదకాదంబినీ విభ్రమంబగు వియత్సింధుతోయమే పూవుఁదేనె**

**తరుణ భాను సమంచితంబగు నుష్ణీష ఫణి ఫణామణి కోటి ఫలము'లట**

పోతే ఆ పరమేశ్వరుడి జడలలో క్రొన్నెల ఏదో తెలుసా. ఆ జడలు తొలుకారు మెఱుగుల తోట అనుకొంటే ఆ తోటలో ఆడే రాయంచ. మెడలోని పాపసరిగ ఏదో గాదు. ఇరుల బండారంపుటింటికిఁబెట్టిన బొందు మల్లెల కోట. చీకటే ఒక భాండాగారము. దాని చుట్టూ ఒక బొందు మల్లెలతో నిర్మించిన కోటా. ఏమిటీ భావన. ఇదే ఇలా ఉంటే చూడండి ఆయన తొడలకు చుట్టిన పొడలతోలెలా ఉందో. బలుమంచు గంబాలఁ బలసి రాఁజుట్టిన క్రొత్త మంజిడి అట. మంచు స్తంభాలెక్కడైనా ఉన్నాయా వాటి చుట్టూ ఒక రంగు రంగుల చీర చుట్టారా. ఉంటాయి చుట్టారు. ఎక్కడ. సోమనాధుని భావనా జగత్తులో. మరి దీన్ని మించి మరో భావన ఏమిటో

తెలుసా. ఆయన మేనికి పూసుకొన్న వెలిమిడి పూత. అది విభూతి గాదు. **పాల పెన్నురువు గుబ్బలి మీఁద నెలకొన్న నిండు వెన్నెల ముగ్గు.** పాలనురు వెంత పోగయితే ఒక కొండగా తయారవుతుంది. అలాటి కొండ మీద పండు వెన్నెల కాంతులే వారూ వీరూ పెట్టిన ముగ్గులట. శివుని శరీరము అసలు తెలుపు. దానిమీద పూసుకున్న విభూతి రేఖలంత కన్నా తెలుపు. తెలుపు మీద తెలుపు. అది తెల్లని పాల నురుగు మీద వెన్నెల రేఖలా. ఏమి భావన ఇది.

పోతే ఘంటా కర్ణుడనే దానవ భక్తుడికి కృష్ణ పరమాత్మ దర్శనమిస్తే ఎలా ఉన్నదో ఆ విగ్రహం చూస్తారా. చూడండి ఒకమారు. **'పుండరీకములతోఁబురుడించు కన్నులఁ గారుణ్యమను తేనె గడలు కొనఁగ** పుండరీకాక్షుడు గదా ఆయన. కనులు పుండరీకాలైతే తృప్తి లేదు కవికి. అందులో తేనె కూడా ఉండాలి. అది ఆ దేవుడి కరుణా రసం, **మందార శాఖతో మలయఁజాలెడు కేలఁబాంచ జన్యంబను పండు మెఱయ'** ఆ దేవుడి చేయి ఒక కల్పవృక్ష శాఖ అయితే తృప్తి లేదు మరలా. దాని చివర పాంచజన్య మనే పండు కూడా ఉండి తీరాలి. ఇలా అంతా వర్ణించి ఆ విగ్రహం మాటాడుతుంటే ఏమంటాడో తెలుసా. **'అమృత ధారా ధరము మాటలాడినట్టు'న్నదట.** ఇంతెందుకు. జనార్దన భక్తుడు జనార్దన స్వామి నెప్పుడెప్పుడు చూస్తానా అని ఉబలాట పడుతూ ఆ స్వామి స్వరూపాన్ని మనసులో ఊహించుకొంటూంటేనే ఎలా కనిపిస్తున్నదో తెలుసా ఆ రూపం. ముందా రూపాన్ని సోమనాథుడు తాను చూచి మనకు చూపుతున్నాడా

అనిపిస్తుంది. **'వెలిదమ్ములో లేత వెన్నెలో యమృతమో - కన్నులో చియనవ్వా కని కరంబొ-గ గనమో చుక్కలో గ్రహరాజ బింబమో పక్షంబొ మౌక్తికా వళియొ మణియొ - తరగలో ఫేనమో తరణి మండలమొ - హస్తములొ శంఖంబొ సుదర్శనంబొ - తలిరులో కరికరంబులొ కుంకుమ ప్రభో - పదములో యూరులో పచ్చఁబట్టొ.** చూపినా తేల్చుకోలేమది ఏమిటో. కనిపించీ కనిపించని రూపమది. అనిర్వచనీయం గదా భగవత్తత్త్వం. ఎవరెలా ఊహిస్తే వారి కలాగే దర్శనమిస్తుంది.

ఇంకా ఒక భావం చూపమంటారా ఎంత లోకోత్తరమో. ఎంత అద్భుత రసోత్పాదకమో. హంస డిభకుల మీదికి దండయాత్ర వెళ్లుతున్నాడు కృష్ణస్వామి తనమందీ మార్బలంతో. తన రాకను సూచిస్తూ పాంచజన్యమనే శంఖమూదాడు. దాని మ్రోత కేమయిందో తెలుసా మీకు.

**'వడకు పన్నగరాజు పడగల మీఁద సర్వం సహాకాంత పేరణము సూప - నుబ్బుత లూగెడు నుదయాస్త గిరులతో - నాకాశలక్ష్మి కోలాట మాడఁ - దెరలెత్తి సప్త సాగరములు ఁబొరలంగ - వరుణుండు గొండిలి పరిఢవింప - మొకముల చాయ వేఱొక చందముగ నిల్పి కమల సంభవుడు ప్రేంఖణ మొనర్ప -** నలుగురూ నాలుగు రకాలైన నృత్యాలు చేయవలసి వచ్చిందట ఆ శబ్దానికి. ఆదిశేషుని పడగలు వణికిపోతుంటే వాటిమీద ఉన్న భూదేవి పేరణమనే నాట్యం చేస్తున్నది అది ఇప్పటి **Shake Dance** వంటిదనుకోండి. తూర్పు పడమర కొండలు రెండూ ముందుకూ వెనక్కూ ఊగుతుంటే వాటితో ఆకాశలక్ష్మి మార్చి మార్చి కోలాట మాడుతున్నది.

ఇది మీకందరికీ తెలిసినదే. సప్త సముద్రాలూ పొంగి పొర్లుతుంటే వరుణ దేవుడు గొండ్లి సలుపుతున్నాడు. అంటే గెంతుతూ వేస్తూ చేసే నాట్యమది. అలాగే బ్రహ్మదేవుడు తన వశంలో లేకుండా నాలుగు ముఖాలు నలువైపులా తిరుగుతుంటే ప్రేంఖణ మనే నృత్యం చేస్తున్నట్టున్నదట. నలువైపులా తిరిగి చేసే నృత్యమది. ఇలా నలుదెఱంగుల నృత్యాలనూ వర్ణించి మరలా ఏమంటున్నాడో తెలుసా మన సోమనాధుడు. **'మంగలము లోని ప్రేలాల మాడ్కిఁజుక్క లిక్కడక్కడఁబడ'** నంటాడు. ఆకాశమనేది నల్లని ఒక ఇనుప బాణలి లాంటి దనుకొంటే అందులో చెక్కినట్టున్న నక్షత్రాలన్నీ చెదరి నలుదెసలా పడుతుంటే ఎలా ఉందట. ఆ బాణలిలో పోసి వేయించే ప్రేలాల గింజలు చెల్లా చెదరయి పడుతున్నట్టున్నదట. ఏమి కల్పన ఇది. ఏమి భావన. ఎక్కడైనా చూచారా ఇలాటి ఊహ. ఇదే నాచన నవీనత.

పోతే భావా విష్కరణలో అతనికున్న చాతుర్యమూ చమత్కారమూ కొంచెం తరచి చూతాము. అందులోనూ ఎంతో క్రొత్త పోకడలు పోతాడు కవి. మచ్చుతునకల లాంటివి కొన్ని చూపుతాను చూడండి. పార్వతీ పరమేశ్వరు లుద్యానవన విహారం చేస్తున్నారు. వారితో పాటు అప్సరః స్త్రీలున్నారు. దైత్యస్త్రీలూ ఉన్నారు. ఈశ్వరుడి భక్తుడే గదా బాణాసురుడు. అంచేత దానవ కన్యకలు కూడా పాల్గొన్నారా మహోత్సవంలో. బాణుడి కూతురుష కూడా వారితో పాటు విహరిస్తున్నది. అప్పుడొక వింత జరిగింది. పార్వతి ఒక కమలాన్ని చేతబట్టుకొని వాసన చూస్తున్నది. మామూలు విషయమది. కాని ఆ దృశ్యమెలా కనిపించిందో తెలుసా సోమనాధునికి.

ఎలా కనిపించిందో ఆయనే దాన్ని ఆవిష్కరిస్తున్నాడు వినండి. కాదు. చూడండి. **"కరసరసిరుహంబున - నొక సరసిరుహంబమర వదన సరసీరుహముం బరిమళ వశమున మోపుచు - ధరణీ ధరకన్య దొంతి తామర చూపెన్"** సరసిరుహమంటే తామర. చేతులూ తామరలే. చేతిలో ఉన్న పుష్పమూ తామరే. అది నాసిక దాకా తెచ్చి వాసన చూచే ముఖమూ తామరే. ఒక తామర మీద ఒక తామర దాని మీద మరొక ముఖమనే తామర. ఎలా ఉన్నాయవి. ఒకదాని మీద ఒకటి అమర్చినట్టున్నాయి. అది ఎలా ఉన్నదంటే అమ్మవారు నలుగురికీ ఒక దొంతి తామర చూపుతున్నది అనిపిస్తున్నదట.

విరహానలంతో ముప్పిరి గొన్న అప్పువ్వు బోడి ఉష తనలో తానే మంటున్నదో విన్నారా. **'తలపునకుఁ జిక్కనుండెడి తలపు లేదట'**, **'లజ్జఁ బోఁద్రోవ లజ్జకు లజ్జ లేద'**ట. అంతే కాదు **'అకటకటా కటాక్ష ముల కందియు నందక'** పోయాడట ఆ అనిరుద్ధ కుమారుడు. **'అకటకటాకటాక్ష'** అని ఉచ్చరిస్తుంటేనే కంటి చూపు అతణ్ణి పట్టుకోవాలని ముందుకు సాగుతున్నట్టు - ఎంత దూరం చూపు సారించినా ప్రయోజనం లేనట్టూ ఎలా చూపుతున్నాడో చూడండి ఆవిడ పడే ఆరాటం మహాకవి. అర్జునుడు తన సతి గర్భాన్ని కాపాడుతానని కూడా ఆ పని చేయలేకపోతే ఆ విప్రుడేమన్నాడో తెలుసా. **'నీవేమి సేయు దీ గాండీవము నీకిచ్చి యిమ్ముడెప్పరమైనన్ లావు గలదంచుఁ బలికిన పావకు చేఁగాదె కోలుపడితిఁగుమారున్'** ఇంతకూ అర్జునుడు కాదట తన్ను మోసం చేసింది. అగ్ని దేవుడట. అతడేగదా అర్జునుడికి గాండీవ మిచ్చి ఎలాటి

ఉపద్రవానికైనా ఇది జవాబు చెప్పగలదని హామీ ఇచ్చాడు. పార్థుడేమి చేస్తాడు పాపం. అది ఉండి కూడా అపార్థుడయ్యాడు. ఎంత చమత్కార ముందో చూడండి మాటలో.

శ్రీకృష్ణుడు బదరికా వనం చేరవచ్చినప్పు డక్కడి మున్యాశ్రమాలెలా ఉన్నాయో వర్ణిస్తున్నాడు కవి. మామూలుగా ఆశ్రమాలెప్పుడూ ప్రశాంతంగా నిర్మలంగా ఉండటం సహజం. అంతే గాక సహజ వైరంతో పరస్పరం కలహించే జంతుజాలం కూడా అక్కడ అన్యోన్యమైత్రి కలిగి సాత్త్వికంగా కనిపిస్తాయని వర్ణిస్తారు కవులందరూ. కాని సోమన అలా వర్ణించడు. అతని ఆవిష్కరించే మార్గమే వేరు. ఎలాగో తెలుసా. '**పవన వేగ విశీర్ణ పాద పాగ్రంబుల - జడియ కుండఁగ బట్టు సామజములు - పూజార్థ నియమిత పుష్ప వాటికలపై మధుకరంబులఁదోలు మర్కటములు - నవభృధ స్నాన పర్యంత నిర్మలతకై కాసారములఁగాచు కాసరములు - నిజ నిజోట జభాగ నీవారసీమలు - సొరకకావలి యుండు సూకరములు గలిగి కంస వైరి కన్నుల పండు వయిందట**' ఆశ్రమం. ఆయనకే గాదు. మనకూ కన్నుల పండువుగా కనిపిస్తున్నదా ఆశ్రమం. చెట్లు విరిచి పడగొట్టే ఏనుగులు కూడా అక్కడ గాలికి చెట్లు పడకుండా పట్టుకొంటున్నాయి. పుష్పాలను త్రుంచి పారేసే మర్కటాలు కూడా అలా త్రుంచకుండా తేనె త్రాగిపోయే మధుపాలను దరిదాపులకు రాకుండా పారద్రోలు తున్నాయి. మరి మహర్షులు అవబృథ స్నానం చేసేవరకూ కాసారాలు కలుషితం చేసే కాసరాలు కూడా కలుషితం కాకుండా చూస్తున్నాయి. నీవార ధాన్యాలంటే చాపలం చూపే సూకరాలు కూడా అక్కడ ప్రవేశించకుండా

కాపాడుతున్నాయి. మృగాల సాత్త్విక భావం చూచారా. అవి ఒండొంటితో పోరాడక పోవటమే గాదు. అన్నీ కలిసి మహర్షుల సేవ ఎలా చేస్తున్నాయో కవి వర్ణిస్తుంటే ఇంతకన్నా సాత్త్విక భావావిష్కరణ మెక్కడ చూడగలమో చెప్పండి.

ఇక బదరికాశ్రమ వాసులైన తాపసు లాపురుషోత్తమునితో చేసే సంభాషణ చూడండి. ఎంత అవిస్మరణీయమో.

**'ఆకాశగంగ నీయడుగునఁ బొడమె నీ కిట్లర్ఘ్యపాద్యంబు లిచ్చుటెంత నిఖిలంబు రక్షింప నీరజోగుణమూర్తి పని - నీకుఁగుశల సంప్రశ్న మెంత కమలంబు నీనాభిగన్నది నీకిట్లు - పుష్పాంతరంబుల పూజ యెంత యమృతంబు నీ చేతనమరులు గుడిచిరి - నీకు వన్యాహార నియతి యెంత. యెంచ మా భక్తి యెంత - మా యెఱుక యెంత - మాతపో బలమెంత మా మనికి యెంత'** ఎంత అద్భుతంగా ఆవిష్కరించారో చూడండి తమ భక్తి భావ మామహర్షులు. కాదు కాదు వారి ముఖతః మహర్షి లాంటి కవి. ఇక్కడ స్వారస్య మేమంటే జలంతో గదా చేస్తారు అర్ఘ్యపాద్యాదులు. సాక్షాత్తు గంగాజలమే విష్ణుపాదం నుంచి ప్రభవించినప్పుడిక ఆయన కర్ఘ్యపాద్య జలమేమిటి. కమల మాయననాభి నుంచి జన్మిస్తే ఇక మరి ఆయనకే కమలాలు సమర్పించాలి. అమృతమే ఆ మహాత్ముడు దేవతలకు పంచి పెడితే ఆయినకు ఆ ఫలాలూ ఈ ఫలాలూ ఆహారంగా నివేదించట మేమిటి. భక్తితో జ్ఞానంతో చేశారంటారా. ఆ జ్ఞానమెంత భక్తి ఎంత. అదీ ఆయన ప్రసాదమే గదా. ఎంత అతిలోకమైన ఆత్మ నివేదనో చూడండి పరమాత్మకీ భావం.

ఇంకొక సందర్భ ముదాహరిస్తాను చూడండి. ఎంత సుందరంగా ఉందో. **కుజము కుంజరముచేఁగూలునో కూలదో– కూలు కుంజరము నీకుజము గూల్చె – ప్రాను పేరేటిచే మడుగునో మడుగదో – మడుగు పేరేటి నీ ప్రాను మడచె – కాలునో యొకని చేఁగాలదో సాలంబు – కాలు నీ సాలంబు గాల్చె నొకని – దునియునో పరశుచే దునియదో వృక్షంబు – తునియు నీవృక్షంబు దుని వెంఁబరశు వనుచు దమలోనచర్చించు నమరవరులని** వర్ణిస్తాడు సోమనాధుడు తన ఇష్ట దైవతమైన సోమనాధుని. అది ఏమిటో తెల్చుకోలేక మహర్షులే తమలో తాము చర్చించుకొంటున్నారట. ఎందుకని. అది ఒక వృక్షమా లేక వృక్ష రూపంగా అవతరించిన పరమేశ్వరుడా. వృక్షమైతే ఏనుగుల ధాటికి తట్టుకోలేదు. నదీ ప్రవాహానికి నిలవలేదు. ఎవడైనా కాలిస్తే కాలిపోతుంది. గొడ్డలితో కొడితే విరిగి నేల కొఱుగుతుంది. అలా జరగటం లేదిక్కడ. ఈ వృక్షమే ఒక ఏనుగును కూల్చి వేసింది. ఒక మడుగును మడిచి పారేసింది. ఒక మనిషి నమాంతంగా కాల్చి వేసింది. ఒక పరశువునే ముక్కలు చేసి ఒక ముక్క చేతబట్టుకొన్నది. మామూలు వృక్షం చేసే పనా ఇది. సాక్షాత్తూ ఇది మహేశ్వరుడనే వృక్షమే అయి ఉండాలి. చూడండి ఈశ్వరుడికి గజాసుర భంజనుడని పేరు. గంగాధరుడని పేరు. మన్మథదమనుడని పేరు. ఖండ పరశుడని పేరు. పౌరాణికమైన ఆ భావాలన్నీ ఎంత వ్యంగ్యంగా ఈ వర్ణనలో ధ్వనింప జేస్తున్నాడో చూడండి మహాకవి. ఎంత చమత్కారకంగా ఆవిష్కరిస్తున్నాడో పరిశీలించండి.

అంతేగాదు. ఇంకా ఇందులో ఒక గంభీరమైన భావం ఇమిడి ఉంది. అదేమిటంటే కాలు నీసాలంబు కాల్చెనొకని అనేచోట సాలమే స్వయంగా కాలుతున్నదసలు, తానే కాలుతూ మరొకని కాల్చటమాశ్చర్యం. కాలేదెప్పుడైనా కాలుస్తుందా. కాలట మేమిటది. ఈశ్వరుడు కాలుతున్న వృక్షం గదా. అంటే ఫాలనేత్రు డాయన. ఎప్పుడూ మండిపోతుంటాడు - ఫాలనేత్రాగ్ని జ్వాల వెళ్ళగ్రక్కుతూ. అంచేత కాలుతున్న వృక్షమట ఈశ్వరుడు. అలా తాను కాలుతూ కూడా మన్మథుణ్ణి కాల్చుట మాశ్చర్యమంటాడు కవి. అలాగే తునియునీ వృక్షమట ఈశ్వరుడు. తాను తునిగిపోతూ తన్ను తుంచబోయే పరశువును తుంచాడంటే అదీ ఆశ్చర్యమే. తాను తునిగి పోవట మేమిటంటారా. అష్టమూర్తి గదా ఆయన. ఆయన శరీర మప్పటికి ఆకాశ వాయ్వాది రూపాలుగా ఎనిమిది ఖండాల యిందని గదా అర్థం. అలా అష్టధా విభక్తమయి కూడా తన్ను విభక్తుణ్ణి చేయబోయే పరశువును ఖండ ఖండాలు చేసి ఖండ పరశు డయ్యాడంటే అదీ ఆశ్చర్యమే. ఫాలలోచనుడు ఖండ పరశుడూ అష్టమూర్తీ అనే భావాలనెలా చమత్కారంగా సూచిస్తున్నదో చూడండి ఈ వర్ణన.

పోతే విలక్షణ పద బంధాలూ - లాక్షణి కార్థ ద్యోత నాలూ. ఇది ఒక కళ ఒక శిల్పం. కవికి వివక్షితమైన భావమొకటి ఉంటే అది సూటిగా వాచ్యంగా గాక భంగ్యంతరంగా ఆవిష్కరిస్తాడు. సూటిగా చెప్పటం కంటే చాలా ఘాటుగా ఉంటుందలా చెబితే. దీనినే ఆలంకారికుల భాషలో అర్థాంతర సంక్రమిత మని అత్యంత తిరస్కృత మనీ ధ్వని భేదాలుగా పరిగణిస్తారు. **'నిఃశ్వాసాంధ ఇవాదర్శః చంద్రమాన ప్రకాశతే'** అంటాడు

Valluri Brahmaji Srinivasa Rao
www.advaitavedanta.in

వాల్మీకి. నిట్టూర్పు గాలికి బూజర అయిపోతే అద్దం గుడ్డిదయిందట. అద్దానికి గుడ్డితనమేమిటి. అంటే అందులో ఏదీ కనపడదని భావం. అంధమనే శబ్దానికి మామూలుగా చెప్పుకొనే అర్థం కాక మరొక అర్థం చెప్పుకోవాలి. అలాగే **'యానిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ'** అని వ్యాసభట్టారకుని ప్రయోగం. నిశ అంటే అక్కడ రాత్రి అని గాదు. అగమ్య గోచరమైన పరమాత్మతత్త్వమని అర్థం చెప్పారు భగవత్పాదులు. అక్కడ అత్యంత మూ తిరస్కృత మయింది ఆ శబ్దాని కర్థం. ఇలాంటి అర్థాంతర ప్రయోగాలు కవి చేస్తున్నప్పుడు మామూలుగా చెబుతున్నప్పటి కంటే ఎంతో మనోహరంగా భాసిస్తాయి. ఇందులో గొప్ప దిట్ట మన సోమనాధుడు.

చూడండి. **"అరచందురు డెందములోఁ జొరఁబాటి వడంకు తోఁక చుక్కయ పోలెన్ నరకుండేసిన బాణము - హరినిటల తటంబు సోఁకి యల్లల నాడెన్** - అని వర్ణిస్తా డొకచోట. నరకాసురుడు బాణం ప్రయోగించాడు స్వామి వారి మీద. అది సరిగా వచ్చి ఆయన నుదుటి మీద పడ్డది. పడి వేగమాగక చలిస్తున్నది. అది ఎలా ఉందంటే అర్థచంద్రుడి బింబం మీద ఒక తోకచుక్క పడి ఇటూ అటూ కదులుతున్న దృశ్యాన్ని మనసుకు తెస్తున్నది. ఇక్కడ చందురుని డెందమనట మొక అందమిస్తున్నది. చంద్రబింబం జడం. దానికి డెందమేమిటి. అందులోనూ ఫాలంతో పోలిక కాబట్టి అర్థచంద్రుడు. దాని కేంద్రమే దాని హృదయం. కేంద్ర మనకుండా డెందమనటంలో సౌందర్యముట్టి పడుతున్నది. అలాగే వణకటమనే మాట కూడా అందంగా ప్రయోగించాడు కవి. అది చేతన ధర్మమా వణకటం.

అచేతనమైతే చలనమనాలి. అయినా చేతన ధర్మాలైన ఆ మాటలు రెండూ ప్రయోగించటం కవి ప్రౌఢోక్తికి తార్కాణాలు. అలాగే బాణాలు. **గేదంగి రేకుల కన్న దమ్ము లట. విరవాదులకు విందులట. క్రొవ్విరుల వంగడములట. సంపగి బంతికొనల జోపాపలట.** ఎంత చిత్రంగా ఉన్నాయో చూడండి మాటలు.

పోతే భూదేవి తన తనయుడు నరకుణ్ణి కోల్పోయి కృష్ణుడి దగ్గరికి వస్తుంటే **వగపు చిత్తరువో కళవళముకరువొ** అంటాడు కవి. దుఃఖంలో తయారయిన బొమ్మ - కలవరపాటు కరడు గట్టిన విగ్రహమా ఆవిడ. అలాగే విప్రకుమారులను కాపాడలేక ఖిన్నుడయి తిరిగివచ్చే అర్జునుడెలా ఉన్నాడో తెలుసా. అతని **మడుంగగు మనసు మాయ.** మనసు ఒక వస్త్రంలాగా మాసి పోయిందట. **వల్గ దరి వర్గ హయఖుర ఫల్గువుగానీక మనసు పదిలము** చేశాడట తపశ్చర్య పూనిన చక్రాయుధుడు. అరిషడ్వర్గ మాఱు గుఱ్ఱాలను కొంటే వాటి డెక్కల తాకిడికి మామూలు మానవుడి మనసైతే త్రొక్కుడు పడుతుంది. కాని ఇక్కడ పరమాత్మగదా. అవి ఎంత తొక్కినా చెక్కు చెదరలేదు మనసు. ఎంత గంభీరమైన భావమెంత చక్కగా చెబుతున్నాయో మాటలు. శివకేశవు లిద్దరూ ఎవరో తెలుసా సోముని దృష్టిలో. జమిలి వేల్పుట. ఎంతో చక్కని ప్రయోగం. ఇప్పటి **Duet** యుగళ గీతమనే మాటలాగా ముచ్చట గొలుపుతున్నది. **"మునినాథా నిఖిలంబు నీకు హృదయాంభోజాత గంధంబు - తో పని యర్ధంబులు లేవు - యాదవుండను మానింపక వాసుదేవుడని మిథ్యాగర్వ రథ్యా విడంబనుడైనన్"** అని కృష్ణుని హేళన చేస్తూ మాటాడుతాడు పౌండ్రకుడు నారదునితో.

అన్ని రకాల వార్తలూ ఆ మహర్షి హృదయమనే కమలంలోనే ఉన్న గంధమట. మరి తనకు ప్రతిగా మరొక వాసుదేవుడున్నాడంటే – అది మిథ్యాగర్వమనే రథ్యలో తిరుగతున్న అవివేకి అట. ఏమి చిత్రంగా ఉందో చూడండి ఈ ప్రయోగం. అంతేగాదు శాపాస్త్రుడంటాడు నారదుణ్ణి. శాపాస్త్రుడనే మాట ఎంత విలక్షణ ప్రయోగం. వాడా తరువాత యుద్ధ భూమిలో బలరాముడితో తలపడుతుంటే కృష్ణుడంటాడు **'రణ సంరంభము మాన్పనేమిటికనా రానిమ్ము రానిమ్ము – నీ గాలికిం దృణమీతండు'.** బలరాముడి గాలికి వాడొక గడ్డి పోచ అట. ఎంత నిర్లక్ష్యతను చూపే మాట ఇది. ఇంకా వాడితో కృష్ణుడనే మాట ఏమిటో తెలుసా. **'బెండు కంటె లావు గలదని వింటిమి. లజ్జ కండ యొడలఁగలదేని'** నాతో పోరాడమంటాడు. హంస డిభకుల కనుచితంగా వరాలిచ్చి **'కాకులం గల కంఠంబులఁజేశాడు గౌరీశ్వరుడంటాడు కృష్ణుడు.** ఇదెంత బాగుందో చూడండి ఈ ప్రయోగం. మురారి విరోధులం బట్టి **'పువ్వునుండొడిమయు'** చూపుతానంటాడు డిభకునితో సాత్యకి. అంటే అర్థం శిరస్సులను మొండాన్ని వేరు చేస్తానని భావం.

బాణాసురుడు ఘోరమైన తపస్సు చేస్తాడీశ్వరుణ్ణి గూర్చి. శివుడు ప్రత్యక్షమవుతాడు. బాణుడు భక్తి పారవశ్యంతో స్తుతిస్తాడాయనను. ఏమని. **ఒరసిరి నిన్ను తర్కనికషోపల ధారల వన్నెగానరంటాడు.** పరమేశ్వరుణ్ణి బంగారాన్ని ఒరువు పెట్టినట్టు తర్కమనే గీటురాయి మీద గీచి చూచారట చాలామంది. అయినా వన్నె కాన రాలేదట. పోతే **కలగని వారు నిన్ను మదికౌఁగిట నెత్తెడు** వారంటాడు. మనసనేదే కౌగిలి. అందులోనైతే చేరిపోతాడట పరమాత్మ. ఏమి శిల్పమిది.

ఇలాంటి పదవాక్య ప్రయోగంలోనే పద బంధాలూ రూపకాద్య లంకారచ్ఛాయలూ ఎన్నని చెప్పమంటారు. **మింట మంటలం బూచిన బాణజాల మట.** బాణా లెక్కడైనా మంటలనే పూవులు పూస్తాయా. పూస్తాయి. నాచన కవితా గృహాంగణంలో. **పూర్వసు పర్వ పురాణ గర్వమున్ వేచిన చందమట.** గర్వాన్ని ఎక్కడైనా బాణలిలో వేయించినట్లు వేయిస్తారా. సోమన అయితే వేయిస్తాడది కూడా. మరి పండిన సంతస మట బాణుడిది. **ఒండు తలపోతలు లేతలట దుర్వాసుడికి.** ఇలాంటి వింకా ఎన్నో వింత వింత పలుకు బళ్లు. ఇదంతా చూస్తుంటే ఉప్పర వీధి రథంబు తోలుతూ పోతున్నట్టాయన వర్ణించింది మకరపతాకుడైన మదనుణ్ణి గాదు. చమత్కార రస మాధుర్యాన్ని తాను చవిచూచి మనబోటి రసజ్ఞులకు చవిచూపే తన్ను తానే. తన కవితా రథంలోనే కూచొని తానే ఆ విను వీధిలో తిరుగుతూ ఉండవచ్చు బహుశా.

మనమింతవరకూ సోమనాథుని లాక్షణి కార్ధ పదప్రయోగాలూ - రూపకాద్యలంకారచ్ఛాయలూ - ఇలాంటివి మాత్రమే చెప్పుకొన్నాము. ఇది కేవలం పలహారం మాత్రమే మనకు. పోతే ఇక కేవల మాయన ప్రయోగించిన అలంకారాలే రుచి చూడబోతున్నాము. అవి పలహారమైతే ఇది మనకాయన వడ్డించే షడ్రసోపేతమైన మృష్టాన్న భోజనం. మరీ తృప్తినిస్తుంది మనకిది. ఇవి ఆలంకారాలనే గాక ఆలంకారికులు చిత్రమని కూడా పేర్కొంటారు. చిత్రమంటే కావ్యభాషలో అలంకారమే. చిత్ర కవిత్వమంటే అలంకార ప్రధానమైన కవిత్వం. చిత్ర మీమాంసా అని అప్పయ్య దీక్షితుల వారి అలంకార గ్రంథమే ఒకటున్నది. **అలంకరోతీతి**

**అలంకారః** తగినంత నగిషీ చేసి చూపేదేదో అది అలంకారమనే మాటకర్థం. అలాగే రంగు రంగుల ఆకారాలతో మన ఎదుట నిలిపి చూపేదేదో అది చిత్రం. ఏమిటా చూడవలసినవి. శబ్దం. అర్థం. శబ్దార్థాలేగా కావ్యమంటే. కాని మామూలు శబ్దార్థాలు కావు. **అదోషౌ సగుణౌ సాలంకారౌ శబ్దార్థౌ** కావ్యమన్నారు ఆలంకారికులు. దోషాలు లేని గుణాలున్న అలంకారాలతో కూడినవయి ఉండాలి. అలాటి శబ్దార్థాల సాహచర్యానికే కావ్యమని నామధేయం. అదే సహృదయావర్జకం.

శబ్దార్థా లున్నప్పుడు శబ్ద చిత్రమూ కావచ్చునది. అర్థ చిత్రమూ కావచ్చు. మరొక మాటలో చెబితే శబ్దాలంకారాలు అర్థాలంకారాలు. యమకానుప్రాసాదులు శబ్దాలంకారాలైతే ఉపమా ఉత్ప్రేక్షాదులు అర్థాలంకారాలు. వందల కొలది ఉన్నాయివి కావ్య ప్రపంచంలో. సంగీతంలో రాగాలలాగా పద్య ప్రపంచంలో ఛందస్సులలాగా ఇవీ అసంఖ్యాకమే. కవి శబ్ద వాచ్యుడైన ప్రతి వాడూ ఒక కథా వస్తువు తీసుకొని కావ్యం రచించాలంటే యథాశక్తిగా ఏవో కొన్ని అలంకారాలు ప్రయోగించవలసిందే. కాని తతిమా కవులందరిదీ ఒక ఎత్తయితే నాచన సోమన ఒక్కడూ ఒక ఎత్తు. సంస్కృత సాహిత్యంలో మురారి లాంటి వాడితడు. ఇద్దరికీ చాలా పోలికలున్నాయి. మచ్చుకు ఒకటి చెబుతాను. వినండి. మురారి అనర్ఘరాఘవం చాలా గొప్ప రచన. అందులో పరశురాముడు తానే మహావీరుడనని గొప్పలు చెప్పుకొంటుంటే లక్ష్మణుడు అతణ్ణి మందలిస్తూ **'పటచ్చరీభూతా తే కీర్తిపతాకా'** అని ఒక మాట విసురుతాడు. అంటే అర్థం. బాబూ నీ కీర్తి పతాక ఇంతకు ముందెప్పుడో

గుడ్డ కుట్టించి ఎగరవేశావేమో. కాని ఇప్పుడా గుడ్డ బాగా పాతబడి చినుగులు కూడా పడిపోయింది. ఇక ఊరుకోమంటాడు. అలాగే సోముడొక చోట **నరపతుల కీర్తి పటములు సిరుగకుండ** కృష్ణస్వామి వారి నుద్ధరించాడని చమత్కారంగా వర్ణిస్తాడు.

సరే దానికేమి గాని సోమనాథుడు మిగతా కవుల లాగే శబ్దాలంకారాలు గాని అర్థాలంకారాలు గాని వాడినా వాటికీ వీటికీ సంబంధం లేదు. ఎంతో నవీనంగా విలక్షణంగా భాసిస్తాయి. అదే మనమిప్పుడు రుచి చూడబోతున్నది. అభ్యర్థితం ప్రథమమని మొదట అర్థాలంకారాలు కొన్ని తడవి చూతాము. కావ్యారంభం లోనే వస్తుందొక పద్యం. పాతాళాధిపుడైన శేషుడే నారాయణుడి మీది ప్రీతితో బలరాముడనే పేరుతో జన్మించిన శంకరుడట. మరి శంకరుడే బలరాముడైతే అతడు కామపాలు డెట్లయ్యాడు – అంధక స్నేహమెలా ఏర్పడిందని ప్రశ్న వచ్చింది సోమునికి. బలరాముడికి కామపాలుడని పేరు. అంధక వంశంలో జన్మించాడు కూడా. కాని శంకరుడు కామపాలుడు కాదు. కాముణ్ణి రక్షించ లేదాయన. శిక్షించాడు. అలాగే అంధక స్నేహం లేదాయనకు. ఈ రెండు లక్షణాలు సరిపోలేదే అని ప్రశ్న రావటం సహజమే. దానికి కవి ఇచ్చిన సమాధానమేమిటో తెలుసా. **అంధకోద్భూత స్నేహము కామపాలతయు తప్పున్** – అవి రెండూ తప్పుతాయి నాకు తెలుసు. **'తప్పు గాకేమి. ప్రఖ్యాతింబొందఁడె పాండురాంగ మహిమన్ హాలా హల స్వీకృతిన్'.** మరి రెండూ లక్షణాలలో ఇద్దరూ సమానమే. అవి ఒకటి పాండురాంగమూ వేరొకటి హాలహల స్వీకారమూ నంటాడు. చిత్రమేమిటంటే బలరాముడూ

తెల్లనివాడే. శివుడూ తెల్లనివాడే. ఇద్దరూ పాండురాంగులే. పోతే హాలాహల మనేది స్వీకరించాడు శివుడు. బలరాముడూ అదే స్వీకరించాడు. ఒకటి హాల అంటే మద్యం. మరొకటి హలం. అంటే నాగలి. చూడండి. ఈ రెండు శబ్దాలూ రెండర్థాలలో ఎంత చక్కగా ఒదిగించాడో కవి. అంతకు ముందు రెండు మాటలూ చూడండి ఒకరికి సరిపోయినా ఒకరి కెలా సరిపోలేదో.

ఇలాటిదే మరొక వర్ణన చూడండి. ఎంత మనోహరమో.

**'పన్నగంబుల రాజు పగవాడు గూడి నీ**
**శయనంబు పయనంబు సంతరింప**
**దుగ్ధవారాశి కూతురు నాలు గూడి నీ**
**శరణంబు చరణంబు సవదరింప**
**తామర పగవాడు దయితుండు గూడి నీ**
**బడిచూపు కుడి చూపు పరిఢవింప**
**చందురు చెలికాడు సయిదోడు గూడినీ**
**యల్లంబు మొల్లంబు నుపచరించ**

ఇది బదరికాశ్రమ వాసులైన తాపసులు కృష్ణస్వామిని చేసిన స్తోత్రం. ఇందులో పగవారు తమవారు అనే తేడా ఒకరిలో ఒకరి కున్నా భగవత్సేవలో నిమగ్న మయినప్పుడా రాగద్వేషాలకు స్వస్తి చెప్పి భక్తి భావంతో ఇద్దరూ ఏకమయి పోవటం విశేషం. ఎవరు వారని అడిగితే చెబుతున్నాడు కవి. ఆదిశేషుడూ గరుత్మంతుడూ ఇద్దరూ స్వామివారికి

Brahmasri Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in

కింకరులే. ఒకరాయనకు శయనమైతే మరొకరు పయన మయ్యారట. క్షీరసాగర కన్యక లక్ష్మి ఆయనకు శరణమైతే ఆ సాగర పత్ని గంగ చరణ మాశ్రయించిందట. మరి తామర పగవాడు చంద్రుడాయన ఎడమ కన్నయితే తామరసాప్తుడు సూర్యుడాయన కుడి కన్నట. ఇక చంద్రుని చెలి కాదు చింతామణి ఆయన వక్షఃస్థల మలంకరిస్తే తోబుట్టు వాయనకు సంపదగా మారింది. అంతా భగవ ద్విభూతే ఈ సృష్టి - తదతిరిక్తంగా ఏదీ లేదనే అద్వైత భావమెంత కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నదో చూడండి ఈ పద్యంలో.

ఊర్వశి నరకాసురుడి సభలోకి వస్తుంటే ఆవిడ సోయగం వర్ణిస్తాడు చూడండి కవి. అది పాతదైనా దాని అందం పాతపడ లేదట. సరికొత్తగా భాసిస్తున్నదట. ఎలాగంటారు. **తొడవు లూడ్చిన నైన తొయ్యలి మెయికాంతి గవుసెన లోనున్న క్రమము దెలుప. మడుగు మాసిననైన మగువ నెమ్మేని సోయగము చూపఱ చిత్త మాఁక గొలుప"** అంటాడు. సొమ్ములు తీసివేసినా శరీరచ్ఛాయ గవుసెనలో నుంచే మెఱుగులు చిమ్ముతున్నదట. కట్టిన పుట్టం మాసిపోయినా శరీరపుకాంతి మాయక పోగా అదే చూపఱుల చిత్తాన్ని ఆకర్షిస్తున్నదట. వేషభాషలక్కర లేనిదే అసలైన అందం. అదే సహజ సౌందర్యమని చెప్పక చెబుతున్నదీ వర్ణన. ఇది **'అకృతక విధిసర్వాంగీణ మా కల్పజాతం - కిమివహి మధురాణాం మండనం నాకృతీనా'** మనే కాళిదాస మహాకవి సౌందర్య వర్ణన నెంతగా గుర్తుకు తెస్తున్నదో సహృదయులకు వేరుగా చెప్పనక్కర లేదు. మరి రుక్మిణీ దేవి మన్మథాంబుధిలో ఎలా తేలుతున్నదో వర్ణిస్తున్నాడు కవి. **'తరుణతమాల**

Brahmasri Vallabhajosyula Srinivasa Rao www.advaitavedanta.in

**పాదప శిఖా శాఖలలాగా** ఉన్నాయా కృష్ణస్వామి బాహువులు. అవే ఒక తెప్పగా చేసుకొని తేలుతున్నదంటాడు.

పోతే బదరికాశ్రమ వాసులైన మహర్షుల వ్యవహారమో. అద్వితీయం.

**'సంయమీశ్వర దత్త సంధ్యార్ఘ్యజల బిందు**
**జాలంబు నక్షత్ర సమితి గెలువ**
**తాపసకృత దేవ తానమస్కృతి హస్త**
**ములు ముకుళిత పద్మముల జయింప**
**పారికాంక్షిహు తాగ్ని బహుధూమపటలంబు**
**దిక్కీర్ణ తిమిరంబు ధిక్కరింప**
**స్నాతకవల్కల క్షాళనోద్ధత కాంతి**
**సాంధ్యరాగ ద్యుతి సంహరింప**

**దైనుకాగమనోన్ముఖ తరళ వాత్సకారవంబును సామగానారవంబుల** పోటీ పడుతున్న సన్నివేశమది. సాయం సమయమది. అది మన కండ్లకు కట్టినట్టు ఎలా వర్ణిస్తాడో చూడండి కవి.

**'వికృతాననంబులు విరళ దంతంబులు నిడుపైన దౌడలు నిక్కుమెడలు**
**దావపావక ఘనశిఖా దగ్ధ తాలసాల సంకాశ మగు పిశాచ ద్వయంబు**

ఈ స్వభావోక్తి – ఔపమ్యం చూడండి. కాలిపోయిన తాటిచెట్ల నెక్కడ చూచినా అవి పిశాచాల లాగే కనిపిస్తాయి మనకంటికి. **తొమ్మండ్రు**

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

**కొడుకులఁ దొలువేలుపులఁజేయఁ బొడ మించు నే దేవు బొడ్డుఁదమ్మి'** అని సాగే పద్యంలో పర్యాయోక్తి ఎంత చక్కగా ఉందో చెప్పలేము. పోతే **'సారసంబున లేవ - నీర సంబునఁజావఁబద్మాసనుడు వీరి పాలఁగనియె- అభ్రంకషంబైన యాల పోతు నితండు త్రుంచినాడీ తండు పెంచినాడు-** హరిహర వర్ణన ఇది. అందులో ఒకరు వృషభాన్ని పెంచితే మరొకరు వృషభాసురుణ్ణి త్రుంచాడట. అలాగే బ్రహ్మదేవుడి లాంటి వాడొకరి నాభి పద్మం నుంచి పైకి లేస్తే మరొకరి చేత శిరశ్ఛేదం పొందవలసి వచ్చిందట. మొత్తాని కిద్దరూ నిగ్రహానుగ్రహ సమర్థులనే భావమెంత చమత్కారంగా బయటపెడుతున్నాయో ఈ పద్యా లిందులో అర్థచిత్రంతోపాటు శబ్ద చిత్ర మెంత పెనవేసుకొని ఉన్నదో సహృదయ హృదయైక వేద్యం.

పౌండ్రకుడి సేన ద్వారక మీద విరుచుకుపడి తే ఎలా ఉందో తెలుసా. **'వల్గదాజానేయ వదన ఫేనము లంటి నేల చుక్కలతోడి నింగి దెగడితే - సన్నద్ధ పాదాత శస్త్ర ప్రభాపంక్తి కరదీప రాజిపైకాలు త్రవ్వుతున్నదట.** అలాటి సేనతో దండెత్తి వచ్చి సాత్యకి తనకెదురు పడితే అంటాడు పౌండ్రకుడు. **'చక్రి పొడమంగ పార్థివ స్థాన మయ్యె - నోరిమీ వంశమందు తాకోర్వఁజాలు వారిఁజూపుము - కుమ్మరావమున రాగి ముంత లేటంగఁ గలవె నీ కింత యేల** - చాలా గంభీరమైన భావమిది. శబ్ద శక్తి మూలధ్వనికి చక్కని ఉదాహరణ కూడా. చక్రి అంటే కృష్ణుడనీ అర్థమే. కుమ్మరి అనీ అర్థమే. పార్థివ స్థానమంటే క్షత్రియులకు నిలయమనీ మట్టికి నెలవనీ కూడా అర్థం. తాకంటే తల పడడం. తాకటమని కూడా

అర్థం. ఇందులో ఎంత లోతున్నదంటే ఒక కృష్ణుడు పుట్టటం వల్ల గదా మీ వంశం క్షత్రియ వంశమయింది. నిజానికి వాడు కృష్ణుడు కాదు. కుమ్మరి. అది క్షత్రియ గాదు. మృత్తిక. దానితో తయారయిన వంశం వంశం కాదు. మట్టిపాత్రలు. తాకితే పగిలిపోతాయి సుమా అని ఎంత లోతైన భావమో చూడండి. ఆ భావ గాంభీర్యాన్ని బయటపెట్టే ఆ శబ్ద ప్రయోగం చూడండి. ఎంత సార్ధకమో.

హంస డిభకుల వేట వర్ణనలో ఒక పద్యమున్నది. ఒక యిట్టి వారి బారిన పడక తప్పించుకు పోతుంటే అది గంతు లేయటమెలా ఉందో వర్ణిస్తాడు కవి. **'నీరముంచిన సొరకాయ నెగసినట్టు'**

**పేరు కొని వైచు తెల్లంటు చీర వోలె-నుంకు చెండు విధంబున నుత్తరించు తముల** **పాకునిక్కెడు క్రియ** దాటిందట ఆ జింక. మరి ఆ హంస డిభకుల చేత పరాభవింపబడి దుర్వాసుడు తోడి మహర్షులతో కలిసి ద్వారకకు వచ్చి కృష్ణుడితో మొరబెడితే కృష్ణుడంటాడు.

**'ఆసలఁద్రంపి వెట్టి హృదయంబను కాగున యోగవాసనా**
**భ్యాసపు నీరు వోసి - పయినాగమ పావకముం దగిల్చి యా**
**యాస విహారమత్కుణ గణైహిక శయ్యకుఁదజ్జలంబు పైఁ**
**బోసిన మీ శరీరమది పొంది యుఁబొందని యట్ల యూఅడున్'**

ఈ రూపకం చూడండి ఎంత రమణీయమో. ఆశలే పిడకలు. హృదయమొక కాగు. అందులో యోగాభ్యాసమే నీరు. దానికాగమమనే నిప్పు క్రింద మండుతూ ఉంది. సంసార క్లేశాలే మత్కుణ గణాలు -

Brahmasri Valluri Srinivasa Rao
www.advaitavedanta.in

నల్లులు. వాటితో కూడిన ఇహ జీవితమే ఒక మంచం. ఆ వేడి వేడి నీరు మంచం మీద పోస్తే నల్లులన్నీ మాడిపోవలసిందే. అప్పుడా మంచం మీద శయనిస్తే ఎంత సుఖంగా నిద్ర పడుతుందో ఊహించండి. అలాటి సుఖమయమైన జీవిత మట దుర్వాసుడి లాంటి జీవన్ముక్తులది. మామూలు లౌకిక విషయాలు కావ్యస్థాయికి తెచ్చి వర్ణించి శభాషనిపించటం మురారి తరువాత సోమనాధునికే దక్కిన విద్య. **'జాతాః పక్వ పలాండు పాండు మధుర చ్ఛాయా కిరస్తారకాః"** అని నక్షత్రాలను వెల్లుల్లి పొరలతో పోలుస్తాడా కవి. **'పీయూష** గంజాగృహమని చంద్రుణ్ణి దేవతల పాలిటి కల్లు దుకాణంతో పోల్చి వర్ణిస్తాడాయన.

**'ఈ కమండలు పంక్తి నెటు చూతు నిట్ల తత్పాప మస్తంబులు పగుల కున్న - ఈ దండనివహంబు నెటు చూతు నిట్ల తదూర్ధ్వ హస్తంబులు తునియకున్న.** ఇలా నడుస్తుందొక పద్యం. మహహర్షుల కమండలాలు పగుల గొట్టాడా హంసుడు. వాడి తలకాయ పగిలితే గాని శాంతి లేదట. దండాలు పగల గొట్టాడు వాడు. వాడి చేతుల నలాగే విరిచేస్తే గాని తృప్తి లేదట దుర్వాసుడికి. ఔపమ్యగర్భితమైన ఈ వాక్చమత్కారం తిలకించండి ఎంత మనోహరమో.

**"తెచ్చెద రెల్లినేడు మముఁదెండని పంపిన యుప్పుడాకినుల్**
**మచ్చరి కంబునం జవుల మర్చుటకై డిభకుండు నీవు నుం**
**జొచ్చిన చోటు సొచ్చి రణశూరుడు శౌరికరాసి ధారచేఁ**
**బచ్చడి సేయగా జముని బానసముంబురుడించు చోటికిన్.**

ఎంత ఘాటుగా ఉందో చూడండీ సాత్యకి అన్న మాట. ఉప్పుకప్పంగా తెమ్మని గదా మీరు మమ్మ పురమాయించారు. తప్పకుండా తెస్తారు. మేముగాదు. శాకినీ డాకినులు. ఎందుకు – ఎక్కడికో తెలుసా. నీవూ నీ తమ్ముడు రేపు యుద్ధ భూమికి వచ్చి అక్కడ మా అన్న ఖడ్గ ధాటికి ముక్కలు చెక్కలై పచ్చడిగా మారితే ఆ పచ్చడిలో కలపటానికి తెస్తాయా పిశాచాలు మా బదులు ఉప్పు.

**'కరటి ఘటా కోటి కట నిర్గళ న్మదా**
**సారంబు తొలుకారు చేరఁబిలున**
**రథనేమి నిర్భిన్న పృథి వీ పరాగంబు**
**నీహారసమయంబు నేర్పు దెగడ**
**సుభట భుజోద్ధత క్షురికా ప్రభా భంగి**
**మండు వేసవి తోడ మాటలాడ**
**తురగ ధట్ట ఖలీన ధుత ఫేన తారకా**
**వళి శరత్కాలంబు వరుసఁజూప**

**పవన చంచల ధ్వజపటపల్లవములు – నవ వసంతంబు గెలువ – సన్నాహ తరళ ఖడ్గ లతికలు శిశిరంపుఁ గడక దెలుప – హంస డిభకుల సేన యేడన గనడచె** హంస డిభకుల సైన్యం రణరంగానికి నడచిపోతుంటే ఒక సంవత్సరమే అలా సాగిపోతున్నదా అనిపిస్తున్నదట. ఆరు ఋతువులు కలిస్తే గదా సంవత్సరం. వర్షర్తువు మొదలుకొని శిశిర ఋతువు వరకూ ఆరు ఋతువులూ సంవత్సరంలో ఎలా కనిపిస్తాయో వారి సైన్యంలో

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

కూడా అలాగే కనిపించేలా చూపుతున్నాడు కవి. జాగ్రత్తగా చూడండి మీకే తెలిసి పోతుందా చమత్కారం.

ఇంకా చూస్తారా వింతలూ విశేషాలూ. **'కడపంగ రాకున్న కాల ఖడ్గము చేత పగలింటి తల నేలఁబడిన యట్లు - పొడవైన యాకాశ భూరుహంబున సంధ్య గోయంగ గొలఁద్రెవ్వి కూలినట్లు - చరమ దిగ్బేతాళ కరమున వరుణుండు కడి వెట్టఁబోల పొట్టనడగి నట్లు'** - అస్తమించి కనపడకుండా పోయిందట సూర్యమండలం. ఇంకేమి చెప్పమంటారు. ఇంతెందుకు **'చెందమ్మి విరులలో జిందు తేనెల వోలె కన్నుల బాష్పాంబు కణాలు - వలుచీకట్లలో వ్రాలు చుక్కలు వోలె వేణీ భరమ్ములో విరులు -** ఇలాంటి వింతలన్నీ ఎన్నైనా చూడవచ్చు ఆయన రచనలో. ఇంకా కావాలా. అయితే మీరొక యుద్ధ భూమికి రండి. చూడవచ్చు. **యంత్రకు డాడించి యవనిఁ ద్రోచిన వ్రాలు బొమ్మల లాంటి రథాలు చూడవచ్చు. నిర్ఘాత హతి చేత నెతి దప్పి కూలిన కుధరాల లాంటి కుంజరాలను** చూడవచ్చు. ఎన్నిచూచినా చూడవచ్చు మీరు. ఒక్క మాట **ఒరసిరినిన్ను తర్కనికషోపల ధారల వన్నెగాన** రని బాణాసురుడు పరమేశ్వరుణ్ణి స్తుతించినట్టు మనమూ ఎంత ఒరసి చూచినా చూడవచ్చు బుద్ధి అనే గీటురాయి మీద సోమనాథుని అలంకారాల కెంత వన్నె ఉన్నదో. కాని అక్కడ ఆ దేవుని వన్నె ఎంతటిదో అంచనా వేయ లేనట్టే ఈ కవీశ్వరుని వన్నె కూడా వెలకట్ట లేము. కొన్ని అలంకారాలైతే అసలు ఫలానా అని పేర్కొనలేము కూడా. పేరులో ఏముంది. వామనుడు చెప్పినట్టు **సౌందర్య మలంకారః** - సౌందర్యముట్టి పడే మాట ఏదైనా అది ఒక అలంకారమే.

Yalamanchi Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

అర్థ చిత్రమయింది. పోతే ఇక శబ్ద చిత్రమెలాంటిదో చూస్తారా సోమునిలో. చూచినంత ఉందది. ఛేకానుప్రాస ఉంది. వృత్త్యను ప్రాస ఉంది. లాట ఉంది. యమకముంది. ముక్త పదగ్రస్తముంది. ఒకటేమిటి. చిత్ర విచిత్రంగా ఉన్నా యలంకారాలు. చూడండి కావాలంటే. స్వయం వరానికి హాజరైన రాజకుమారులలాగా వరుసలో వచ్చి కూచుంటాయి మీ ఎదట. **'నరకుడు యాగంబులకుం - బొరకుడు మీరనుచు ఋత్విజుల నడుచుటయున్ సరకులఁ జూడు టయును వరకుల కన్యకలఁబట్టి'** అక్కడ నరకుడు బొరకుడంటుంటే ఇక్కడ సరకులతో పాటు వరకుల కన్యకలు పరారయి పోతున్నారు. ఛేకాను ప్రాస ఇది.

పోతే **'పన్నగంబుల రాజు పగవాడు గూడి - స్వామివారి శయనంబొకరు సవరిస్తే పయన మొకరు. దుగ్ధ వారాశి కూతురునాలు గూడి ఒకరు శరణమంటే ఒకరు చరణమంటారు. 'హరి చేయించిన యర్ఘ్యపాద్యాద్యుపచారాలకు హరి సమ్మోదించాడట. ఆ హరి కృష్ణుడైతే ఈ హరి దేవేంద్రుడు.** లాట ఇది. ఒకరి లాటొకరికి లేదు. మరి **'కమ్ములఁ దలె లెదు నేనిక కొమ్ములు నెమ్ములును సుభట కోటుల యమ్ముల్'** చూచారా ఎప్పుడైనా - ఈ వృత్తి నాచన నడిగితే చూపలగడు. సత్యభామ విల్లెక్కు పెట్టి బాణాలు కురిపిస్తుంది జాగ్రత్త. దగ్గిరి కెళ్ళకండి. దూరాన్నుంచి చూడండి. **'గనయంబున్ గొనయంబు నెన్నడుముతోఁ గర్ణావతంసంబుతో.** ఒక గనయం వింటి కొప్పు. మరొక గొనయం వింటి నారి. తెలుసా - **చనుదోయింగను దోయి సాయకముతో సంధాన హస్తంబుతోఁ జెనకం జేయుచు నేయుచుండె సతి** - ఎలాగని. **లక్ష్మీ భూత దైతేయ తర్జన**

**గర్జారవ జర్జరాంగ** – వృత్త్యనుప్రాస. '**అరవిందనయన శరముల సరవిందన** అర్థం మారింది. శబ్ద మావృత్తి అయింది. ఇంకొక పద్యం చూడండి. '**అరిఁజూచున్ హరిఁజూచు – చూచుకములందందంద మందారకే సరమాలా మకరంద బిందు లహరీ స్యందంబు లందంబులై తొరగం బయ్యెద కొంగొకింత దొలగం దోడ్తో శరాసారమున్ దరహాసామృత పూరముం గురియుచుం దన్వంగి కేళీగతిన్**' పద్యం పద్యమంతా శబ్దాలంకార భూయిష్ఠమే. అంతేకాదు. శబ్ద చిత్రమే గాక ఆలంకారికులు చెప్పిన శయ్య పాకం – ఇవి రెండూ కూడా అడుగడుగుకూ తొంగి చూచే పద్యమిది. ఇంత ముగ్ధ మోహనమైన పద్య శైలి మరొకటి లేదు. **పూర్వసుపర్వపురాణ గర్వమట.** దాన్ని **మింట మంటలన్** వేచారట. **వీర రసాన ఆత్మచిత్తమున్** దోచారట. ఏమి హొయలు.

పోతే ఈ చమక్కు చూడండి. ఎలా ఉందో. దివిజు ల్తల్లడిలన్ నరకుడు అదితి కుండలా లపహరించి – తన చెవులంబెట్టి కొనంగ రూపగుట చూచాడే గాని ఆ వాసవుడు ఆ తప్పు నీ చెవులంబెట్టి కొనంగ రాని పురి గాసిం బెట్టటం చూడలేదంటుంది వసుంధర వాసుదేవునితో. రెండు చోట్లా చెవులం బెట్టి కొనటమే. అక్కడ ఒక విధంగానైతే ఇక్కడ వేరొక విధంగా. అకుండాలా లసలు అమరారి చెవుల ముందఱఁ గొమరారి వెలుగు తున్నవట. అది తిమిరారి ద్వయంలాగా ఉంటే – ఎత్తి మురారికి చూపిందట ఆవిడ. ఇంతకూ తనయునికి పదిలముగ నా తనయునికి లేదు. వాడి తనయునికైనా ఇమ్మని ప్రాధేయపడుతుంది చిత్రంగా. పాపలను కాపాడ లేక ఖిన్నుడయి వెనుకకు మరలిపోయే పార్థుడెలా ఉన్నాడో

తెలుసా అండీ. **అనుచునను చారియై విప్రుదరుగు దేరఁ దేరగాండివమిడి - యస్మదీయ మహిమ - మహిమదుంగ - మదుంగగు మనసు మాయ - మాయ కన్నుల గ్రమ్మఁ - గ్రమ్మటితి నేను.** ముక్త పద గ్రస్తం. మన మనసునే ఎంతగా గ్రస్తం చేస్తున్నదో చూడండి. **'కదిసితి మంత దంత - కందళిత మానస మానస వాస - ముదిత చమూరువు - ఫలితమూలన మేరువు - ఆసుమేరువు - ఎన్ని మేరువులు - ఎన్ని దంతాలు - ఎన్ని మానసాలనైనా** చూడవచ్చు మీరిక్కడ. మరొక పద్యం చూస్తారా. శబ్దంలో అర్థంలో కూడా ఎంత చిత్రమైనదో లోతైనదో.

**'పరివాదాస్పద వాదమోద మ దిరాపానంబుచే మత్తులై**
**హరిమేలంచు హరుండు మేలనుచు - నాహో కొందఱీ పొందెఱుం**
**గరు - కైలాసనగంబునందు మునులేకత్వంబు పాటించి రా**
**మురవైరింబురవైరిఁ బాపుట మహామోహంబు ద్రోహంబగున్'**

నిజానికి మురవైరిని పురవైరిని పాపట మెంత పాపమో అంత పాపమీ శబ్ద చిత్రాన్ని అర్థ చిత్రాన్ని రెంటిని విడగొట్టటం. ఇక్కడా శయ్యాపాకాలు మిన్ను ముట్టాయి పద్యంలో. తరువాతి పద్యంలో అవి ఇంకా పరాకాష్ఠనే అందుకొన్నాయి. అదేమిటో వినండి.

**'చూడంబోదు గజాపనీత కట ఖర్జూ భూర్జ ఖర్జూర లీ**
**లా డోలా సుఖ లేఖలోక మహికాలంకార హారక్షణ**
**క్రీడా తారకితాంతరాళ తరళ శ్రీకంఠ కంఠ ప్రభా**
**చూడా చంద్రకళా కిలాసము సతీశుద్ధాంత కైలాసమున్'** అర్థ చిత్రం

శబ్ద చిత్రం - శయ్యాపాక పరిపాకం - అన్నీ చెట్టపట్టాలు పట్టుకొని ఆకాశం కూడా దాటి నిజంగా కైలాసానికే తీసుకువెళ్ళతాయి భావుకుడి హృదయాన్ని. అక్కడ **'ఆలవాల వారి హారిత మునిదారికాశ్రమం** చూస్తారా మీశ్రమంతా పోతుంది. ఆ ఆశ్రమ వాసులేమంటారో తెలుసా కృష్ణమూర్తిని చూచి. **నీవారము నీవిచ్చితి నీవారము మాకు. అంటున్నారో లేదో 'దావపావక ఘన శిఖా దగ్ధ తాలసాల సంకాశమగు పిశాచద్వయ'** మెదురవు తున్నది మనకు.

వారిని కూడా వీడ్కొని వచ్చామో లేదో **'అభ్రవిభ్రమ విలాసము మేరు తటీ విలాసమైన** కైలాసము దర్శిస్తాము కృష్ణునితో పాటు మనం కూడా. ఎలా ఉందో తెలుసా దాని శోభ.

**'ఇందుండు హరు మౌళినిందుండు పెద్దయై**
**నెత్తమ్ము నిండు వెన్నెలలు గాయ**
**నీగిరి రాజుపై నీఁగిరి కాబోలు**
**నఖిల దేవతలు నేకార్ణనమున**
**నిచ్చట విహరింప నిచ్చట సంయమీ**
**శ్వరులకు మోక్షంబు సందియంబె**
**యీ నగాగ్రంబున నీన గాడిన యంత**
**శిలనైన మిన్నేఋ సెలవకున్నె'**

బాగా సావధానంగా  చూడండి. ఇందుండు వేరు. ఇందుండు వేరు ఇద్దరూ  ఒకరే ననుకొనేరు. అలాగే ఈగిరి–ఈగిరి ఇచ్చట – ఇచ్చట. ఈన–ఈన, యమక మెంత గమకంగా ఉందో  తెలుస్తుంది మీకే. అక్కడ మూలాల వాల జాతమైన పారిజాతాన్ని చూస్తారా అభిలాషజాత మెల్ల మీకు చేతిలోనికి వస్తుంది. పరమేశ్వరుడే పారిజాతమైతే రాక ఏమవుతుంది. హరిహరులొకరి కొకరు ఎదురుపడితే ఎలా ఉంటారను కొంటారు మీరు. ఒకరు త్రుంచి  ఒకరు పెంచి ఒకరు కాచి ఒకరు త్రోచి ఒకరు తాల్చి ఒకరు వ్రాల్చి ఒకరు మెట్టి ఒకరు సుట్టి నాడు నేడు చూపుతామంటారు మనకు చెబుతామంటారు. వారి వ్యవహారం కావాలంటే పద్మాసనుడే చెబుతాడు. సారసంబున లేవగలడు – ఈరసంబునఁ జావగలడు గనుక. బాణాసురుడూ చెప్పగలడు – గేహ రక్షకూ దేహ శిక్షకూ నోచుకున్నాడు గనుక. అసలు మీరెప్పుడైనా స్వామి  వారి సుదర్శన చక్ర విక్రమాన్ని చూచారా. అవక్రమైన దాని విక్రమ మెలాటిదో అది చూచిన బ్రహ్మ దేవుడు చెప్పగలడు మనకు. '**సంసార క్రియా రక్షణా క్షత శౌర్య క్షపితారి పక్షమది – క్షత జక్షాలిత కేలితా మరసరక్షశ్చక్ర**' మది. ఇదీ కవి దర్శించిన సుదర్శనం.

అసలు ఎడ తెగకుండా  సాగిపోయే ఈ అనుప్రాస చూడండి ఎంత విలాసమొలికిస్తున్నదో '**ఈ రూపంబున సంసృతిం దొఱఁగి మీరే చింతలం జెంతలం జేరం గోరక యూరకుండ నిటు విచ్చేయమంగఁ జేయం గడుం – బారం బేఁదిన వంతయుం గలిగెనే – బాలార్క బింబంబులో నారం గూరిన యంధకార మన నాహా సాహసం బెట్టిదో,**' దానికి దుర్వాసు డిచ్చిన జవాబేమిటంటారు. '**ఒండు తల పోఁతలు లేఁతలు మమ్ము నెమ్మియిన్**

**లాఁతులఁగా దలంపకు నలంపకు చాల నలంగి యుండగన్** - ప్రాసకు ప్రాసే జవాబన్నట్టున్నది. **'నరకాసురప్రాణ నాళోత్తరణ కేళి - రణకేళి వలకేళి. కంస దానవ శిరః కమల కృంతన మేలు తన మేలు చేయి** - ఆ కేళి ఏమిటో ఆచేయి ఏమిటో వెతుక్కోవలసి వస్తున్నదా చిత్ర వ్యూహంలో.

ఈ తమ్ముడి సంగతే ఇలా ఉంటే ఇక అన్నగారి వ్యవహారమేమిటో తెలుసా. రణాంగణంలో ఎవరూ నిలవ జాలరాయన ఎదుట. ఏమి కారణం. **నీలాంబరాడంబరోజ్జ్వల వేషం బయినదది - హలా హల స్థల హల వ్యాపార దోస్సార** మా పరాక్రమం. **ప్రలయాం భోధర సోదరా రవమా మహారవం.** హంస డిభకులు ఉప్పు కప్పం తెమ్మన్నారని దూత వచ్చి చెబితే కృష్ణుడి మాట వింటారా. **కలరా - యాదవులచేఁ గప్పంబు దెప్పింపఁగా గలరా రాజులు గాజులుండొడవు గాఁగల్పించిరా** అని వేళాకోళ మాడుతాడు. వేళా కోళమేమి టసలు. నిజంగా నేను తలుచుకొంటే వారు బ్రతుకుతారా పొమ్మంటాడు. **అరిగరమున నేఁదాల్చిన - నరి గరము నగేంద్ర ధీరుడైనంజెడడే అరిఁదిరమై నన్నడుగుట - యరిది రమైకాభిలాషులగు నృపతులకున్.** అరిది అనే శబ్దం చూడండి. ఇక్కడ నాలుగుసార్లు వచ్చింది. నాలుగర్థాలు దానికి. ఒకటి చక్రం. ఒకటి శత్రువు. ఒకటి కప్పం.ఒకటి అరిది. అనే మాటలో చేరి గిలిగింతలు పెట్టే అరిది. దానితో పాటు కరమనే మాట ఒకటి చేయి. మరొకటి మిక్కిలి. అరిదిరమై అరిది రమైకాభిలాషులని అరిదిరమనే మాటను చమత్కరించి చూపటమెంత చాతుర్యం. ఏ హారమటుతఁబెట్టిన నాహారము దొఱగుఁడొఱగు నాహారంబున్ ఉషారాణి విరహ వేదనలో. ఆహారమేలేని దాని కాహార మెందుకసలు. కవి నడిగితే

చెబుతాడందులో తిరకాసు. అనిరుద్ధుని వెదకబోయిన చారు లెక్కడె క్కడ తిరిగి వచ్చారో తెలుసా అండీ.

**'కూడి గిరులు దరులు c గొల్లంబు పల్లంబు - నరసి మిట్టcబుట్ట నడవిcదడవి - యోపి తొలలు సెలలు - నోలంబు కూలంబు c జూచి క్రంత గ్రుంత - జొచ్చి వచ్చి -'** వచ్చారట. బాణాసురు నితో యుద్ధమెలా సాగిందో తెలుసా కృష్ణ పరమాత్మకు.

**'ద్విరదంబులు నరదంబులు - హరులు నరులు నిక్కు నుక్కు నలవు న్నెలవున్ పురుడున గరుడున కలుకలు - బెరయ నెరయ శౌరి సీరిc బిలుచున్ బెలుచన్.'** అంతా యమకమే. ఇద్దరూ తలపడితే యమకంగాక మరేమిటి. ఇక యుద్ధ సంరంభ మంటారా. **'ధారాస్ఫార కృపాణ బాణ పడవీ ధారహ తిందచ్చ తుర్ధారీ శోణిత ఫాణితద్రవో'** పద్రవంగా సాగిందనుకోండి.

ఇక్కడికి శబ్దార్థాలంకారాల ప్రసంగమయింది. పోతే అలంకార ప్రపంచంలో నుంచి మనమిప్పుడు కావ్యరంగంలో ప్రవేశించ వలసి ఉన్నది. అలంకారాలు కూడా కావ్యానికి చెందినవే గదా అంటారేమో. కావ్యానికి చెందినవేగాని కావ్యం కావవి. అవి నదులైతే కావ్యమొక మహాసాగరం. అవి వ్యష్టి అయితే కావ్యం సమష్టి. **'నదీముఖేనేవ సముద్ర** మావిశత్తన్నాడు మహాకవి. కనుక కావ్యైక దేశమయిన తరువాత అసలు కావ్య స్వరూపాన్ని గ్రహించటం సమంజసం. ఉత్తర హరివంశం హరివంశ పురాణం లోనిదే అయినా కేవలమొక పురాణంగా రచించలేదు సోమకవి. దాన్ని ఒక

Brahmasri Yalamanchili Srinivasa Rao www.advaitavedanta.in

చక్కని ప్రబంధంగా తీర్చిదిద్దాడు. అందులో పూర్వభాగం వదిలేశాడు. ఉత్తరార్ధంలో కూడా రసపోషణకు అవకాశమిచ్చే సన్నివేశాలే తీసుకొన్నాడు. రసమూ సన్నివేశమన్నాను గ్రహించండి. రసాన్ని బట్టి సంవిధానం - సంవిధానాన్ని బట్టి కావ్య నిర్మాణం. అందుకేనేమో సాహిత్య రసపోషణ - సంవిధాన చక్రవర్తి అని ముందుగానే సూచన చేశాడు కవి తన రచనా ప్రణాళికను. ఆరాశ్వాసాలుగా సాగిన ఈ ప్రబంధంలో ప్రథమాశ్వాసంలో నరకాసుర ఘట్టం. ద్వితీయంలో విప్రబాలకుల గొని రావటం - ఘంటా కర్ణ వృత్తాంతం. కృష్ణుని తపశ్చర్య. ఈశ్వర సాక్షాత్కారం. మరి తృతీయా శ్వాస మంతా పౌండ్రక వాసుదేవుని హడావుడి. చతుర్థం హంస డిభకుల ఆగడం వారి అస్తమయం. పోతే పంచమ షష్ఠా శ్వాసాలు రెండూ పరచుకొని ఉంది బాణాసుర కథ. వాడి వధ. అన్నింటిలోనూ తన ఇష్టదైవమైన హరిహరుల లీలలే. వారి సామరస్యమే. ప్రబోధమే.

ఇలాంటి రసవత్తర సన్నివేశాలు పట్టుకొని వాటికి ముందూ వెనుకా కథాంశాలను ప్రకృతి వర్ణనలతో శబ్దార్థ చిత్రణలతో అలంకరించి శుష్కమైన కథా వస్తువును రసార్ద్రంగా మలచి చూపటమే నాచన ప్రతిభ. పురాణాన్ని ప్రబంధంగా మార్చటమే అతని నవీనత. అది ఇంతకు ముందు నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన సాధించినా ఇంత సర్వాంగ సుందరం కాదది. నగరార్ణవ శైలర్తు సూర్యచంద్రోదయాస్తమయ వన విహార జలక్రీడాదులైన అష్టాదశ వర్ణనలూ పట్టుకు వచ్చాడు సోమన. కావ్యానికి సమగ్రత నా పాదించాడు. అంతేకాదు. అడుగడుగుకూ శబ్దార్థ చిత్రణలో కావ్యరసాన్ని ఎవరెస్టు శిఖర మెక్కించాడు. దానితో పాటు పద్య రచనా

గద్య రచనా అనన్యాదృశంగా ప్రబంధ మార్గంలో బిగువు సడలకుండా నడుపుతూ రావటంలో అతనిదే పై చేయి. '**ఇతివృత వశాయాతాం త్యక్త్వా అననుగుణాం స్థితిం. ఉత్ప్రేక్ష్యాప్యంతరా భీష్టర సోచిత కథోన్నయః**' అనే ఆనంద వర్ధనుడి సూత్రానికిది గొప్ప ఉదాహరణమీ ప్రబంధం. సాధ్యమయినంత వరకూ గుణాలంకారాది సామగ్రిని ధారాళంగా కథా సన్నివేశాలకు యథోచితంగా పంచి పెట్టట మింకా కావ్యశోభ నినుమడింప జేసింది.

ప్రబంధ శైలిలోనే నూటికి ఎనభయి తొంభయి వంతులు ఎంతో అందంగా నడుస్తాయి సోమన పద్యాలు. ప్రబంధ వాసనలు క్రొత్త క్రొత్తగా గుబాళిస్తుంటాయే గాని పురాణాల తాలూకు పాత వాసనలు రావు. చూడండి. మీరే నరకాసుర వృత్తాంతమే ఎలా నడుస్తుందో '**తన వీటన్ హరి. అతడంతంతకు వాలి – ధనదాంతః పుర – నిలు నిలుమంచు – గద దట్టించి – ఇటు రా చూతువు చేతిలావు – నృత్త గీతంబులు – ఊర్వశిదోడి తెమ్మనుచు – తొడవు లాడ్చిన – నాకపురంబులో మెఱసి – అవె సుత్రామ రథంబులు – నవ్వుల మాటలో నిజమొ – ఒకనా దూర్వశి – ఏలిక నౌదు – పాపాత్ముండవు – చనిచని కాంచెనంత – నరకుడు యాగంబులకున్ – అదినాయుద్ధమనీయ – మరుణాంభోరుహ – పన్నగంబుల రాజు – హరిచేయించిన – జొరని బిలంబులున్ – లోకాలోక – ఇట మీద క్రీగంటిచూపున – ఇచ్చిన బొంగి – గనయంబున్ – కమలముఖీ – సత్రాజిత్తనయా – తంత్రీవి నోదంబు – అరి జూచున్ – ఏచును పేంద్రునిన్ – మాగువాతిన – దివిజుల్ తల్లడిలన్ – కన్నమోహంబు** – ఇది ప్రథమం.

పోతే ద్వితీయం. అకటకుమారులార - వెడవీడెడు - ఏలయ్య - మేలుం గీడును - అవి యెల్లన్ - తడి యొత్తుచీరతో - నేఁడు ప్రసూతి - ధరణీ దేవుని - ఎఱ సంజ - ఉండు నెడన్ - గాండీవారావ - పోయె బాలుండు - ఓ పార్థ - పిలిచితినన్న- కదిసితిమంత దంత - అపారా వారము - ఆకాశంబు వెలుంగ - పరివాదాస్పద - కంసారాతి - యమునా తరంగ - ఆ రామా తిలకంబు - మఱునాడంధక - శిశుతాకేళి- చూడంబోదు - కోట సింగారించి - శరకోదండ - తండ్రులు మీరు - గద చేతంగొని - హరి దంత ద్విపదంత - వాచంయ మోత్సంగ - పవనవేగ విశీర్ణ - సంయమీశ్వర దత్త - ఆకాశ గంగ - గంగా నిమ్నగ- వికృతానంబులు - పిరిగొనఁదాల్చు - కఱచిన పీనుగున్ - ఓ నారాయణ- గోవిందాయ - ఎక్కడి వాడవన్న - చేతో జాతుడు - తొమ్మండ్రు కొడుకుల పుండరీకములతో - తామర రేకులు - వాసుకిహార - ఇందుండు - ఫాల్గునమాసము - పండ్రెండేడులు - తొలుకాఱు - ఏనికతోలు - కల్హార మకరంద - తరుణ పల్లవ రాగ - లలిత విద్రుమలతా - కుజము కుంజరముచే - అభ్రంకషంబైన - సారసంబున లేవ - యదువంశాంబుధి చంద్ర - హిమత్కూటము . మకరందమాని.

పోతే తృతీయాశ్వాసం. ఇక్కడఁ బౌండ్ర భూపతి - నాచేతి చక్రం. ప్రాలేయాంశు మరీచి - మునినాథా - కలరే - మనమున - ఏనుంగులావు- అనిన నారదుడుబ్బ - గర్జితానేక - కరదీపంబులతోడ - వీరాగ్రేసరుడు - ఈ చందంబున - సామజవారి - ఎవ్వడు రోరి - మిడికెదు - చక్రిపాద మంగ - రెండు బలంబులందు - దృష్టా రాతి -

కుంకుమ హత్తించి- రణసంరంభము - నీవును వాసుదేవుడవు - గగనమున - జూడరివి - మతి నొక్కింతయు - సురగరుడ - దైతేయమదవతీ - సతతంబు న్నుతి యింతు - తనియక - ఎన్నెనా ఉన్నాయి. మరి నాలుగవదో - వేద పురాణ శాస్త్ర పదవిన్ - వరములు గన్న - వెలివాఱును - ప్రబల దంష్ట్రాగ్ర పర్యస్త - నీరముంచిన - కని రికుమారులంత - కావిచీరము సుగు - మిడికెదు పెదవులు - తిరిసిన కూడు - ఎఱుగరు గాక లోకమున - నాల్గుంజెల్లెడి - గురువులు సెప్పరే- కరుణయుంగోపము - చక్రధరుడు- సకలోద్యోగ - దుర్వారోద్గమ - వాకిట నిల్చె - అవసరమైన - ఈ రూపంబున - ఆసలంద్రంపి వెట్టి - అనుటయి భగ భగ - తగునేయింత - ఏంగాదే - ప్రాతల మేము - ఈ కమండలు పంక్తి - ఎద్రించిన కాల పాకమున - దానము ధర్మము - ఇరువది యొక్క మాఱు - కురు వీరాగ్రణి - నరకాసుర ప్రాణ - నిలువం జాలుదురే - వికలవ్యూహ చేసినవాడు - కలుద్రావంబని పూని- అనుడున్ వేడుక - యదుకులాంబుధి - వెలిదమ్ములో - లోపల వెలపల - ఉండుట తప్పు - రాజసూయ కర్త - కలరాయింతకు ముందు- యాదవులుప్పు మోవగ - అరిగరమున - వెదకంబోయిన తీగ - ఈశువరంబు - హరి గదా విహార - కంటే శౌరి - అవిరళ రత్న - ఉరము కౌస్తుభ - ఓరీ బ్రాహ్మణ ధూర్త - నిను రప్పింపక - పిటికివి గాక - నాకీ తమ్ముడు - మా పట్టణమున - ఆలకించెదు. తెచ్చెద రెల్లి- ఓరి దురాత్మ - వినురా సాత్యకి - విడువిడు మంచు - శార్ఙ్గ నందక - వడకు పన్నగరాజు - రథ వేదండ - కరటి ఘటా - ఆ కలన - పూచిన

కింశుకంబు - వసుదేవుండటె - ఖరనారాచ - ముదుకల మాంసము - కనుగొని వీని మేన - పిడికిట బొడిచె - పోటున వ్రేటునన్ - కడపంగ రాకున్న - హరితో - ప్రకటస్యందన - ఏమిర హంస - సరి గాంధర్వము - కడు వేగంబున - నాయెల్లి నీడన - గోపాలా గ్రణి - ఇతరేతర - తల్లీ నిన్ను - చక్రంబు మేదినీ చక్రంబు - సమస్తమూ కనిపిస్తుందిక్కడ.

ఇక పంచమ షష్ఠాశ్వాసాల మాట చెప్పేదేముంది. - కొలువ గనేర నిన్ను - కలగని వారు - ఒరసిరి నిమ్న - గెలిచెంబూర్వ - గాణా పత్యము - ఖురఖలీనాఘాత - నిండార తెగగొని - పండిన సంతసంబు - సహజ విగ్రహుడైన - ఇనసమతేజ - నెయ్యము లేని సంగతియు - వేయి చేతులిచ్చి - హరుడు కుమారుకంటె - ఒకనాడిందుధరుండు - కిసల యంబుల తోడ - సహకారాధి పు - ఒక రామా - సల్లాపనవ సుధా - చెలువ బొమ్మల పెండ్లి - అకటకటా - నేలంగొందఱు నింగిఁ గొందఱు - ఒక దని రుద్ధ - తిరిగి తిమి గాలి కైనన్ - బాలార్కబింబంబు - స్థాణా కల్ప - భయర సమగ్నులన్ - ద్విరదంబులు నరదంబులు - నిస్సాణముల మ్రోత - గదరాజు - రాకా చంద్రికఁదేల్చి - దైతే యారి ఘనంబు - రా దిగుచు నెగుచు - తాటకాస్థైర్యంబు - యంత్రకు డాడించి - అని మొనఁబావకుడైన చతురంభో నిధి - అయంభోజ - నిమ్నంబై - అంచిత రక్త - అరూఢోరగ - ఏమిరబాణ - ఓరీ దానవ ధూర్త - దేవుని చెట్ట - నిస్సాణరావంబు - జలజా క్షుండంత - గంధర్వజయ జయ - మానినీ మంజుల గళిత మదోదక ఇలాటి వర్ణనలతో క్రిక్కిరిసిన ఆశ్వాసాలు. ఇన్ని పద్యాలు దాహరించా మంటే ఇవి కొన్ని కథా వస్తు

Yalamarti Brahmasri www.advaitavedanta.in Rao

సూచకాలు. కొన్ని సంవాద ద్యోతకాలు. కొన్ని వర్ణనాత్మకాలు - ఇంకా ఎన్నెన్ని సందర్భాలైనా కానివ్వండి. మహాకవి ఇది అది అని చూడడు. సాధారణంగా అన్నింటినీ ప్రబంధ చ్ఛాయా చ్ఛాదితంగా నానా వర్ణ చిత్ర చిత్రితంగా మార్చి చూపుతుంటాడు. దాని విశ్వరూపం సూచనా మాత్రంగా ప్రదర్శించాము. మీరు ఇక్కడికి తృప్తి చెందక మీపాటికి మీరు దర్శించండి ఆయా ఘట్టాలు. తెలుస్తుంది.

పద్యాలే ఇంత చిత్ర విచిత్రమైన రీతిలో నడపటమే గాదు. నడుమ నడమ దొర్లించిన గద్య కూడా అంతగా పొంగి పొర్లుతుంటుంది. పద్యం కన్నా అపూర్వంగా కనిపిస్తుందది. ఎన్ని పోకడలు పోతాయో సోముని గద్యలు చెప్పలేము. పద్యమెంత సౌందర్యం తెచ్చిందో అతని గద్య అంత గొప్ప అంద చందాల నల వరించింది. అక్కడక్కడ కొన్ని మచ్చు తునకలు చూపుతా చూడండి.

**'మగలు దిగ విడిచి పోవుట యును మానంబుతోడన ప్రమంది మందిరం బుల నడగి యున్న మగువలందెగువ తోడ వెడలం దిగిచి తెచ్చి - అన్నన్న నీ చెలియ లనని పిడిపించుకొని కన్నీరు దొరగు మొగంబులంబయ్యెద లొత్తు కొని యేడ్చు సుదతులు - సవరని పాపలందడవి తడవి తమ యేలికకుం గాని కగా నీవలయునని కొని పోవచ్చిన ంబైపడి విడువంజాలక పెనంగు తల్లులు'** - కనిపిస్తున్నారా మీకు - **పగుల నడిచిన పట్టెలుం బైపడం దిగిచిన పెట్టెలు - నోడు పటిచిన చిందంబులు నొాఅగం ద్రోచిన దారబందంబులూ** కనిపించాయా.

నంరకుని ఆగడాలివి. మఱి మధుసూదనుడేయు సాయకంబు లెలా ఉన్నాయి. '**మెయిమఱువులు సించియు - కాయంబులు నొంచియు - మర్మంబులు గీఱియు - మహీతలంబులు దూఱియు - ప్రేవులు పెఱికియు పెనుమూకల కుఱికియు - నురంబులు తొలిచియు - చర్మంబు తొలిచియు - నురంబులు గాడియు నరంబులు తోడియు** గందరగోళం చేస్తుంటే దనుజబల మెలా ఉందో తెలుసా. **తునుకలయ్యును తుమురయ్యును మంచయ్యును మడిమంచయ్యును.** అంతేగాదు. **అనువు దప్పి అదవదయై యంతంత నొచ్చి యరవరలై పాఱలేక పలపలనై - వెఱగు పడి వెల వెల్ల** నయిందట.

ఇది చూచారా. వాసుదేవుని రథ మెంత వేగంగా వెళ్లుతున్నదో. '**మదముదిత మాధవ మహిళా మంజుశింజాన మంజరీ కోలాహల హాళహాళిత హంస సందోహ సందిహ్యమాన కుముద దళాళింద కళింద నందనీ సందర్శనం చేస్తూ లాటీ వధూటీ కటక నికట విశంకట తట నటత్సారస సంచయ చంచుపుట విపాటిత కమల ముకుళ పుటకుటీర పటీయః కేసర కడంగ రీయ భ్రమరవి భ్రమ భ్రమణ భాసుర భాగీరథిని** విలోకించారా. అది ఎంతదూరమో దాన్ని చూడాలంటే సమాసమంత దూరంగా మనలను తీసుకెళ్లాలి సుమా. **మనంబు రంజిల్ల మచల్లకంబు మట్టి మ్లేచ్ఛంబు మెట్టి దరదంబు దాటి కాశ్మీరంబు గడచి సైంధవం బను సంధించి నారదంబు పరిభ్రమించి హిమాచలం బెక్కి హేమకూటంబు ద్రొక్కి నిషధనతి క్రమించి'** ఈ దేశాలు చూడండి. వాటి నతిక్రమించారనే

క్రియా పదాలు చూడండి. ఎంత వైవిధ్యమో. ఇంకా చూపమంటారా గద్యలో విశేషం. శ్లేషతో కూడిన ఉపమాలంకారం ప్రయోగిస్తుంటాడు. అది మరీ అందమిస్తుంది. ఉదాహరణకు - బదరికాశ్రమ వర్ణన - అది **వలాహకంబునుంచోలె కరకాస్పదం'** మేఘపరంగా వడగండ్లు - ఆశ్రమ పరంగా కమండలాలు. **'పారావారం బునుంబోలె నమృతో త్పాదన సమర్థంబై'** అమృత మంటే సుధ - అతిథి భుక్త శేషం. **'మహాభారతం బునుంబోలె శత పర్వ సనాథంబై'** శత పర్వమంటే నూఱు పర్వాలు. వెదురు పొదలూ. రెండూ. అంతే కాదు. **'పరి పుష్ట వాజినికరం టబనుకుందగి సంతతాహవ నీయమాన మహిమంబై'** అహవనీయాగ్ని అని ఒకటి. ఆహవమంటే యుద్ధం - దానిలో నీయమాన తీసుకోపోబడుతున్న అని ఒక అర్థం. అంతేకాదు **'బుద్ధ సిద్ధాంత సంశ్రయం బయ్యును అజినవాస స్థితి శోభితం'** బట. రెండింటిలో శ్లేషే. బుద్ధులూ సిద్ధులూ ఉన్నారక్కడ. అయినా జినవాస స్థితి లేదట. అజినమంటే కృష్ణాజిన మని చెప్పుకొంటే విరోధం లేదు. ఇలా నడుస్తుందీ వచనం. ఇదొక భంగిమ వచనంలో.

మరో భంగిమ చూస్తారా. **'కనుగొన్న నన్నగంబు కన్నులకు నందక** మిన్నంది నంది **కృత నాందీ సందానిత వందన మాలా సందోహ విహార బృందా రకసుందరీ హార ఘటిత నటనారంభ - వెండియు వెండియుంబ సిండియు దడం బడు నసుట కుందగి కుంద గిరి మల్లికా కుముద సముదయసదాదితేయ** - ఇలా దీర్ఘంగా సాగుతూ - **దంతావళంబు - గాకుండియు - కటక రవి గ్రహ విహార దానోన్నతంబై'** అని శ్లేషను

కలుపుకొని విరోధాన్ని పరిహరిస్తూ రకరకాల పోకడలు పోతుంది. ఇంకా చూస్తారా. '**కుంతంబులు వడినను పంతంబులు వదలక – ప్రాసంబులు వెడలినను రోసంబులు సడలక – గదలు తొలంగినను నెదలు సలింపక– చాపంబులు విఱిగినను తాపంబులం బొరలక**' ఇలా మహాద్భుతంగా నడుస్తుంది యుద్ధ వర్ణన. హంస డిభకుల వేట వర్ణనా ఇలాగే సాగుతుంది. '**ఇండ్లు దూఱియు నెడదవ్వు వాఱియు పీనుగులలో డాగియు పేరుకొన్న రేగియు పోలేక మరలియు పోటు లేక పొరలియు నంతంత విచ్చియు నతివల మఱుగు సొచ్చియు**' ఇలాటి పోకడా పోగలదు గద్య. ఇలా ఎంతని చూపమంటారు. ఎన్నని ఏకరువు పెట్టమంటారు. ముఖ్యంగా శివ విష్ణుజ్వరాల యుద్ధం – గరుడమయూరాల యుద్ధం – చదివి తీరాలి మీరు. ఇలాటి గద్య వైభవం దాని విశ్వరూపం – ఎక్కడా చూడబోరు మీరు. తిక్కన యుద్ధ వర్ణనలలో ఉంది గాని అదికూడా ఇంత వైచిత్రి చూపదు.

ఇక్కడ ఇంకొక నవీనత చెప్పుకోవాలి సోమనాథునిలో. ఈ మహాకవి కున్నంత భాషా వైదుష్యం అనగూడదు గాని మరి ఏ తెలుగు కవికీ లేదని చాటవలసి వస్తుంది. వ్యాకరణ శాస్త్రం నిఘంటు శాస్త్రం రెండూ అగస్త్యుడిలాగా ఆ పోశనం పట్టాడా అనిపిస్తుంది. అది పద్యాలలో వాటికన్నా ఆయన గద్యాలలో బ్రహ్మాండంగా కనిపిస్తుంది. కొన్ని సంస్కృతాంధ్ర పదాలకైతే అసలెంతటి పండితుడైనా అర్థం చెప్పగలడో లేడో నని సందేహం. మూల మూలల దాగి ఉన్న మాటల నెన్నింటినో చెవులు పట్టి ఈడ్చుకు వచ్చి కూచోబెడతాడు తన రచనా ప్రాంగణంలో.

దుర్వర్ణ మంటాడు వెండిని. ద్యుమ్న మంటారు బంగారాన్ని. రమా అంటాడు బూడిదను. ఇవి చాలా తక్కువ. ఓపిక లేక నేనుదాహరించటం లేదు గాని తీరిక చేసుకొని చూడగలిగితే మీకెన్నైనా కంటబడతాయి. ఇందుకే సకల భాషా భూషణు డయ్యాడేమో సోముడు.

ఇంకొక విశేషమేమంటే సకల భాషా అనేదానికి భాషా సమష్టే గాక ఆయా సందర్భాలకు తగిన పరిభాష వాడటంలో నైపుణ్యం కూడా కావచ్చు. అలాటి పరిభాషా ప్రయోగాలెక్కడంటే అక్కడ దర్శన మిస్తాయి మనకు. సాంఖ్యయోగ మీమాంసా వేదాంత శాస్త్ర వాఙ్మయమంతటిలో బాగా అభినివేశ మున్నవాడు సోమనాథుడు. అర్జునుడికి బోధించినప్పుడు– శివుడు కృష్ణుని ప్రశంసించినపుడూ – సాంఖ్య మత రహస్యాలెన్నో బయట పడతాయి. 'ప్రకృతి సంజ్ఞాకము కారణమనే పద్యం దగ్గరి నుంచీ అని వినుతించి అనే పద్యం వరకూ అంతా సాంఖ్యమే యోగమే. అందులో మరలా వేదాంత గంధమే. అందులో భగవద్విభూతి వర్ణించాడు. మధుసూదనాది నామ నిర్వచనం చేశాడు. మరి తెలుగు సంస్కృత భాషలు రెండింటిలోనూ రచన సాగించాడు మహాకవి. మరీ మీమాంసా జ్ఞాన మంటారా. ఎంతైనా ఉంది అందులోనూ ప్రవేశం **'వాచం యమోత్సంగ అనే పద్యంలో తొంగి చూస్తుందది 'అది నాయుద్ధమనీయ వస్త్ర'మని** బదిరికాశ్రమ మహర్షులు మొర బెడతారే అందులోనూ కనిపిస్తుంది. అక్కడ వాడిన పదజాలం కూడా కర్మమీమాంసా శాస్త్ర సంబంధి పరిభాషే.

పోతే రాజుల కోటలు వాటి పరికరాలు ఎంతగానో పరిచయం కవికి. కోట సింగారించి అనే పద్యంలో కొట్ట వచ్చినట్టు కనిపిస్తుందది పారిభాషిక పదజాలంతో సహా. ఇక ద్యూత క్రీడా పరిభాష అంటారా అందులోనే చాలా లోతైన జ్ఞానం సోమనకు. సత్యభామా కృష్ణులాడిన జూద వర్ణన అద్వితీయ మతి రమణీయం. **'జోగిణి గొసరి'** అనే పద్యం మొదలు కొని **'నిష్కము మొదలెక్కన్'** అనే పద్యం వరకు సాగిన ఆ వర్ణనలో వాడినవి తెలుగు మాటలే అయినా పాతిక భాగమైనా మనకర్థ మవుతుందో లేదో. అంత సాంకేతిక భాష అదంతా. ఇక రాజుల వేట అంటారా. హంస డిభకుల వేట పద్యంలో గద్యంలో కూడా వాయించి పారేశాడు కవి. ఛందో వ్యాకరణాది జ్ఞానమంటారా అదీ అనన్యా దృశమే. **'ఎద్రిచిన కాలపాకమున'** అనే పద్యంలో ఎద్రుచు – విద్రుచు – పద్రుచు – చిద్రుప అని నాలుగు చిత్రమైన ప్రయోగాలు వస్తాయి. అక్కడ ద్ర–ద్రి అనే మాట ప్రాసస్థానంలోనే ఉన్నది. అది సంయుక్తమైనా పూర్వాక్షరం గురువుగా మారదు. అది లఘువే. చిన్నయ సూరి లాంటి వాడే నాచన సోముని జూచి దానికోసం ఒక సూత్రమే వ్రాయవలసి వచ్చింది. ఇలాటి పద ప్రయోగం తెలుగు కావ్యాలలో మరెక్కడా కనపడదు. అదీ ఒకే పద్యంలో. అంతే కాదు. అరసున్న ఉన్న పదాలు మొదటి పాదం ప్రాసగా వాడితే కడపటి పాదం వరకూ నాలుగు పాదాలలో అలాటి మాటలే వాడుతాడు. అలాగే బండిరా ఉన్న మాట మొదటి పాదంలో వస్తే నాలుగు పాదాలలో అదే రావాలి. ఇలాటి నియమం నాచన పాటించినట్టు మరే కవీ – ఆఖరుకు నన్నయ తిక్కనాదులు కూడా – నూటికి నూరు పాళ్లూ పాటించారని చెప్పలేము. ఇక నిఘంటు

జ్ఞానమంటారా ఆకాశమంటుతుంది. అమరం విశ్వం ధనంజయాది కోశాలన్నీ తిరగేస్తే గాని ఆయన వాడిన సంస్కృత పదాల కర్థం తెలియదు. ఆంధ్రనామాది కోశాలన్నీ తిరగేస్తే గాని ఆయన వాడిన తెలుగు పదాల కర్థం తెలియదు. ఆంధ్ర నామాది కోశాలన్నీ తిరగేసినా తెలుస్తుందో లేదో తెలుగు మాటలకు కొన్నిటి కర్థాలు. పుస్తకమంతా చదివి చూడండి. మీరేగ్రహించ గలరు. హాస్తిక - వాత్సక - ధైనుక - సాదినిషాది రధి - రథకట్యా - ఇలాటి పదాలు విచ్చల విడిగా ప్రయోగించట మాయనకే చెల్లు - మరి పేరణం ప్రేంకణం ఇలాటి నాట్య భంగిమలలోని విశేషాలు - మురళీ సుడాల వల్గితాది పక్షి గమన విశేషాలు తెలిసినవాడాయనే. యుద్ధ వర్ణనలోని పలు పోకడలూ - పెక్కు ప్రహరణ విశేషాలూ ఆయన ఖజానాలోనే దొరికే సొత్తులు.

పోతే శ్రీకృష్ణుడు నందుని పలకరిస్తూ అడిగిన ప్రశ్నలు చూడండి.

**'పసిగ్రేపుఁ బెనుచునే పాడి మొల్లం బెట్టు**

**మెకము దాటదు గదామేపు గలదె**

**తొడకాలి తఱుపుల విడుతురా తొడి తొడి**

**జిన్నెల దఱి వట్టు జాడగలదె**

**వెలికల్ల వైతురా వేల్పుల కుడుపుచో**

**కదుపులో నేపోతు గడవంబాఱు**

**సలగ పన్నులు గొన్ని జట్టి చూపరు గదా**

**బెదరిన నిలు కూత బెట్ట గలదె'**

**పల్లెవైచు వారెవ్వరు మల్లరాల - లంపుగల తొఱ్ఱులను గూయు లావు గలదె. యేర్వు దాటులలోఁ దొఱగెఱుగ బడునె - పరికరము కోడెలమ్మెడు పాటి గలదె.** ఇది గొల్లలు తమలో తామాడుకొనే మాటలు. బ్రహ్మకర్థం కాదిది. విస్తుపోయి వినవలసిందే ఈ మాటలు మనం. ఎంత లోకజ్ఞత ఉండాలో చూడండి కవికి. రవిగాననిచో కవి గాంచునే గదా అన్నట్టు అన్ని మూల మూలలూ అన్ని ఎత్తులూ లోతులూ తెలిసి ఉండాలి కవికి. లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణాత్తని ఊరక చెప్పారా ఆలంకారికులు. అది నాచన పట్ల వర్తించినట్లు మరెక్కడా వర్తించదు. సరిగా దండి బాణుడు ఇలాంటి సంస్కృత కవులు గుర్తుకు వస్తారు సోముని రచన చూస్తుంటే. **ఇట్టిక నూడినవాడో యొట్టిడు కొన్నాడొ** అనే పద్యంలో మొదటి మాట చూడండి. ఇట్టిక బట్టీ నిప్పు పెట్టి వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళి పోతారు. అలాగే యముడు యుద్ధంలో ఓడిపోయి వెన్నిచ్చి పారిపోయాడట. ఇలాటి వెన్నో వందలు సోమన రచనలో. ఒక యుద్ధమేమిటి. గదా యుద్ధమేమిటి. అందులో వేటలేమిటి. జంతువులు పక్షుల యుద్ధాలేమిటి - బ్రాహ్మణుల యజ్ఞ యాగాద్యనుష్ఠానా లేమిటి. అన్నీ అన్నే. ఒకరితో ఒకరు తలపడి పోరుతుంటే చమురు చల్లిన మంటలట ప్రత్తి తాల్చిన వడువట. నిమ్మపండు నలచి నట్టట. పాదరసంబు మర్దించు చందమట. బోళంబు విఱుచునట్టట- ఏమంటున్నాడో తెలియదు. ఇలాటి వెవరికి వారు చదువుకొని ఆనందించవలసిందే.

లోకజ్ఞత అన్నందు కాయన వాడిన తెలుగు సామెతలు కుప్పతెప్పలు. సామెతలతో పాటు తెలుగు నానుళ్ళు జాతీయతా నుడికారాలు ఏవైనా

చెప్పుకోండి. సమృద్ధిగా దొరుకుతాయి రచనలో. చిల్కవోయినంబంజర మేమిసేయ - ఎన్నడో జవ్వన మమ్ముకొన్న - చొరని బిలంబులు - తిరుగని త్రోవలు - కాలుని కందించె - నోచిన వారి సొమ్ములు - వగపు చిత్తరువో కళవళము కరువొ - కన్నమోహము - లేబరముకాదె బిడ్డలు లేని బ్రతుకు - పాతెడు బండ్లకు కాళ్ళుజాపటం - మాయ కన్నులఁ గ్రమ్మ - కన్నులు నమ్మలేవు. చెవులకు పండువు - కడుపు చల్లని - నగుబాటు తెచ్చుట - మయి మయింబోవుట - తగవే కలుకుట్లును చంకఁ బొత్తముల్ - మీరలిగిన నలిగితిరి. పోకలఁబోవు - ఓరలువో నాడుట - మంట లోమిడుత బీరము సూపుట - విశ్వామిత్ర సృష్టి - చట్రాతిపై పోకలు - గుజగుజలు పోవుట. బిరుదు మాట లెచటఁజదివితో - కుమ్మరావమున రాగి ముంతలు - వెలితి చావు - లజ్జకండ - ఏపాటు పడకపోరాదు - మంటల మలచిన రూపు - పతిగల నేతినం గొలుచు పాతలుకుంగలదే - వరుగుతో దాగరయు నెండవలసినట్లు - తవుడు దిని చచ్చువానికి విషము పెట్టువాడు వెట్టివాడు. దాగం బోయి తలారివాని యెదురం దాగంగ - వేరు మొదలుచూచి చెట్టె ఉంగుట - ముంజేతి కంకణమున కద్ద మేటికి - నాలుక ముల్లు విఱుచుట - కొఱవిందల బరికి కొనుట. ధరయింగలాల పుట్ట - మద్దులు మునింగి పాఱ - వెంపళ్ళ తమకెంత బంటి - కమలజుని పేర దాపటి కాల బొమ్మ - నోరి చొరవ వారి జెటిచె - బోగుబడి పెద్దతికము - పెట్ట బీరము - పిడుగు వ్రేసిన తల టొప్పియాగునే - దువ్వఁజూచి నక్క యొడలు గాల్చుకొన్నవడవున - వెదకం బోయిన తీగ కాలఁదవులుట - ఇది న్నోరే - ఎవ్వరి కెవ్వర

**య్యెదరు. - చేతో జాతుడు నీవునే మవుదురో- గాడిద కుం బులితోలు గప్పుట - నీ సొమ్ము నీ కిచ్చెద. పులిగోల వ్రేసినట్లు - తనకు తగరంబు చఱచు టెంతటి భరంబు ఇరుసెవి యెఱుగ కయుండ - తల యెత్త రోత - బెండులు మునింగి గుండులు దేలుట - నేల తలగాళ్ళు నిలవమి - కన్నుండ కంటిపాపం గొన్నట్లు నాటినీ వకద- చేవయు నాటిదే గదా. కొఱుక మెత్తనొకో- చేయార బట్టుట. నాలుక వెతికి కొను - చావునకు తన్నికొనున్ - పండిన సంతసంబు - ఉన్నయునికి వెలుగు చేన్మేసిన - గాచు వారెలెందు గలరె. నిప్పుఁజెదలంటునే - బయల నెత్తిన దివ్వె - అఱచేతి మానికము. మోమెత్తి చూడ - నవ్వక నవ్వు - ఊరుమెచ్చ బెండిలి. అద్దములోని నీడ - తన్నిన పఱపు పయింబడిన యట్లు - అల్లిందామరయుంబోలె - నడుమఁ బెట్టిన పూరిగాలు - తాల్మి మిను మిను కనగా - ఎదిరి కిన్మడుచు వాడు.** ఎన్నని చెప్పమంటారు. ఈ విషయంలో తిక్కనే తిక్కన సోమనే సోమన. గురు శిష్యులిద్దరూ పోటీ పడతారు. ఒకానొక చోట శిష్యుడే పయి చేయేమో. కాకుంటే **నీతొడిగిన బాణమున్ వెనుక తూణము సందున నున్న ప్రాణమున్ - తచ్ఛరీర పుంజి ద్రుపలు చేరు తత్సుతుల చేతుల కాకకు లంబు వాతులన్ - పాపట పైనడి దంబు బెట్టిదన్ -** అని ఇలా కళాత్మకంగా తెలుగు నుడికార మెవరు చూపగలరు.

అన్నీ అయిన తరువాత ఇప్పుడొక ప్రశ్న రావచ్చు మీకు. ఇంతవరకూ చూపిన గుణాలన్నీ చాలావరకు మిగతా కవులందరిలో కొంచెమో గొప్పో మనం చూస్తూనే ఉంటాము గదా. ఇవి నాచనకే గల నవీన గుణాలని

Vallamaraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

ఎలా చెప్పగలరు. నిజమే. కాని ఒక్క విషయం మరచిపోతున్నారు మీరు. నాచనకు తరువాత వచ్చిన వారు పోతనగాని శ్రీనాధుడు గాని మిగతా ప్రబంధకవులుగాని. అతనికి పూర్వం లేరు. అతనికి పూర్వమున్న వారిద్దరే. నన్నయ - తిక్కన. మహా అయితే ఎఱ్ఱన. ఆయన కూడా సమకాలికుడే సోమనకు. కాని ఆ ముగ్గురిలో లేని గుణాలే మేము సోమన కున్నాయని చెబుతూ వచ్చింది. ఇక తతిమా కవులంటారా. నాచన తరువాతి వారు గనుక నాచన భుక్త శేషం గనుక అప్పటికే పాతబడి పోయినవవి. కాబట్టి నవీనత అనే గుణం నాచనకే చెప్పవలసి ఉంది. అంతేకాదు. మరొక రహస్యమేమంటే పోతనతో సహా మిగతా ప్రబంధ కవులందరూ చాలావరకూ సోమనను ఆదర్శంగా పెట్టుకొని ఆయన ననుకరించినట్టే కనిపిస్తుంది. ఇది వారి రచనలే మనకు పట్టి ఇస్తాయి. చూడండి.

పోతన వంటి మహానుభావుడే కొన్ని విషయాలలో సోముని అనుసరిస్తూ వచ్చాడు. నరకాసుర ఘట్టంలో కొన్ని పద్యాలు సోముని పద్యాలకు ప్రతిబింబాలే. **అరిఁజూచున్ హరిఁజూచు** అనే పద్యంలాగే నడుస్తుంది. **పరుఁజూచున్ వరుఁజూచు** అనే పోతన గారి పద్యం. **'సత్రా జిత్త నయా'** అనే పద్య భావమే కనిపిస్తుంది **'జ్యావల్లీ ధ్వని'** అనే పోతన పద్యంలో. మరి **తంత్రీని నాదంబు తడవు సైపని వ్రేళ్ళ లస్తకం బితియించు లావు కలిమి** అనే పద్యం వరవడిగా పెట్టుకొని రచించినదే **వీణ చక్కగ**

బట్ట వెరవెఱుం గని కొమ్మ అనే పద్యం. ఇలా పద్య రచనలోనే గాక యమకానుప్రాసాది శబ్దాలంకారాలు తఱచుగా ప్రయోగించే అభిలాష పోతనకు రేకెత్తించింది కూడా నాచనే. **'కైలాసము న భ్రవి భ్రమ కిలాసము మేరు తటీ విలాసమున్' 'చక్రంబు మేది నీ చక్రంబు - రత్నంబు కామినీ రత్నంబు - ద్విరదంబులు నరదంబులు కరులు హరులు - ఈ రూపే కలలోపలం గలిసె నన్నేరూపు నంజేరు నాకీరూపు - కలగన్న చందమో మది కలగుటొ - భయరసమగ్ను లంబ్రధనభగ్నుల - దుర్భర దైన్యభుగ్నులన్- వలగ్నుల నగ్నుల - ప్రాణుండు బాణుండనన్ - హరిదంత ద్విపదంత- కదిసి తిమంత నంత** - ఇలాటి పద్యాలు చదువుతుంటే పోతన గుర్తు రావటం లేదా మీకు.

ఇక శ్రీనాధుడైతే అతని సీస పద్యాల నడక వాటి తూగు అంతటికీ స్ఫూర్తినిచ్చింది సోమనాధుడే. **'దైతేయమదవతీ - విరుల నెత్తాకి వీడుకోలు సల్లాప నవసుధా సారంబు'** ఒక పాదం సంస్కృతం - మరొక పాదం తెలుగులో నడపటం కూడా అక్కడి నుంచి అప్పు తెచ్చుకొన్నదే, **'లలిత నూతన లతాలంకారముల మెచ్చి - మొగమిచ్చు లేమావిమోక అని సోముడంటే - వికటపాటల జటామ కుటి కాభారంబు - కఱకైన జుంజురు నెఱులు**గాగ అంటాడు శ్రీనాధుడు. ఆఖరుకు పదాలు పదాలే. **వేద పురాణ శాస్త్ర పదవిందిరుగన్** అని సోముడంటే **వేద పురాణ శాస్త్ర పదవీ నవనీయసి**

అని అంటాడు శ్రీనాధుడు. ఒక్కొక్కప్పుడు పద్యాల ఎత్తుగడ కూడా అనుకరిస్తాడు **'ఒకనాడిందుధరుండు పార్వతియు లీలో ద్యాన కేళీ సరిత్తని** సోమనాధుడు పద్యం ప్రారంభిస్తే అలాగే వంత పలుకుతాడు శ్రీనాధుడు. **ఒకనాడింద్రతనూభవుందు గిరి కూటోత్సంగ భాగంబునన్** అని. **తల్లీ నిన్ను – ఉల్లంబార** అని సోమన పద్య పాదమెత్తితే అలాగే ఎత్తుతాడు పోతన **తల్లీనిన్ను దలంచి నాయుల్లం బందు** అని. **తల్లీ యిన్ని దినాలకేనియు –** నని శ్రీనాధుడు. ఇలా ఎన్నో ఉన్నాయి బింబ ప్రతిబింబ రచనలు.

పోతే భట్టుమూర్తి కూడా ఎంతో ఋణపడి ఉన్నాడు. అంతో ఇంతో పింగళి సూరన కూడా. ఏ విషయంలో. సభంగా భంగ శ్లేష కవిత్వంలో. **అరిగరమున నేఁ దాల్చిన అరిగరము – అరిదిరమై నన్నడు గుట అరిది రమైకా ఖిలాషులగు 'ఇందుండు హరుపౌళి నిందుండు 'ఇచ్చట విహరింప నిచ్చట** – ఇలాంటి శబ్దాల విరుపులూ – విరుపులలో చూడదగ్గ మెఱుపులూ– ఇవన్నీ వసుచరిత్రలోనే గాక మూర్తి కవి హరిశ్చంద్ర నలోపాఖ్యానంలో సూరన కళాపూర్ణోదయంలోనే గాక రాఘవ పాండవీయంలో కూడా కనిపిస్తాయి. వాటికి స్ఫూర్తినిచ్చింది సోమనాధుడే. **హరి తేజము హరి కాంతియు – హరి విభవము – హరి భయంకరా కృతి – హరి వేగిరము – హరి విక్రమంబును – హరియను పేరిటికి లక్ష్మి నాపాదింపన్** – ఎన్ని హరులను ఎన్ని గుణాలలో చూపాడో చూడండి

**సోమన.** ఇలాటి చమత్కారాలు భూషణ సూరనాది శ్లేష కవులందరూ అనుకరించి చూపుతూ వచ్చారు. **నరకాసుర ప్రాణ నాళోత్త రణకేళి** లాంటి విలాసంగా నడిచే సీస పద్యాలు ఎన్నో కనిపిస్తాయి భట్టుమూర్తిలో. అంతేకాదు. అచ్చతెనుగు కవులకు కూడా మార్గదర్శకుడు సోమనాథుడు. **'తొలుకారు మెఱుగులతోటలో నాటెడు రాయంచ కొదమతో రాయుజాలి' ఏనికతోలు పచ్చడము నెమ్మల గుబ్బ సరంబులాంటి** తెలుగు పద్యాలకు శ్రీకారం చుట్టిన వాడు సోమన అయితే ఆ శ్రీకారాన్ని మంగళాంతంగా ముగించినవారు అచ్చ తెలుగు కవుల నుంచి చేమకూర లాంటి కవులెంతో మంది.

ఇంకా దేవుడు మేలు చేస్తే ప్రబంధ కవులందరికీ పద్య రచనలో సంస్కృత దీర్ఘ సమాస రచనలో - సంస్కృతాంధ్ర పద సమ్మేళనంలో - ప్రకృతి వర్ణనలలో - ఎన్నింటిలోనో ఇదీ మార్గమని చూపిన వాడు సోమన. అది వారి వారి రచనలు ఏమాత్రం గమనించినా మనకర్థ మవుతుంది. తుదకు నిరోష్ఠ్య నిర్వచన రూపంగా ఒక వ్రతం పెట్టుకొని వ్రాసే పద్యాలకు కూడా తరువాతి వారికి దారి చూపుతూ వచ్చాడు. అల్లసాని వారికైతే ఎంతో స్ఫూర్తి నిచ్చిన అంశాలున్నాయి అతని వర్ణనలలో. **'వెడద కప్పెర బీఱ నరములు - నెట్టెముగ చుట్టిన ప్రేవులు - గూని వీపులు - మిడి గ్రుడ్లు'** - ఇలాటి వికార రూపాలు ఎన్నో పట్టుకు పోయాడు మనుచరిత్రలోకి. సుర గరుడ యక్ష విద్యాధర గంధర్వులను కూడా హరి

వంశం నుంచే తీసుకుపోయాడు. ఆఖరుకు నింగికి దాటిన **యిట్టి నాలుగు కాళ్ళ ద్రెవ్వ నొక్కమ్మున** వేయటం కూడా నాచన దగ్గరే నేర్చుకొన్నాడు.

ఆఖరుకు శతక కవులకు కూడా ఒక విధంగా మార్గదర్శకుడే సోమన. ఎలాగంటే శతకాలన్నింటిలో చివరి పాదం ఒక మాట పునః పునః ఆవృత్త మవుతుంటుంది. అది వారి వారి ఇష్ట దైవతాన్ని సంబోధిస్తూ చెప్పే మాట. దాశరథీ కరుణాపయోనిధీ - కృష్ణా - కాళహస్తీశ్వరా - భాస్కరా - సుమతీ - ఇలా వారి పేర్లూ మన పేర్లు కూడా సంబోధించి చెప్పే మాటలు కనిపిస్తాయి. వీటికి శ్రీకారం చుట్టిన వాడు నాచనేనా అనిపిస్తుంది. బాణాసురుడు ఈశ్వరుణ్ణి చేసే ప్రార్థన దీనికి తార్కాణం. **'కొలువగ నేరనిన్ను - నిలువగ దయ్య నాహృదయ నీరజ కర్ణికపై మహేశ్వరా - మలగ గదే త్రికోణ మణి మండప దీపికవై మహేశ్వరా'. 'నెరసిరిగాని నిన్నె ఱుగ నేరరు నావశమే మహేశ్వరా!** అని ఇలా మూడు పద్యాలలో వరుసగా చివర మాట మహేశ్వరా' అని ప్రయోగించటం చూడండి. దీనికే మకుటమని పేరు. ఇది శతకాలకు చాలా ముఖ్యం. అలాగే **వాసన లేని పూవు బుధవర్గము లేని పురంబు** - ఇలాటి శతకాల బాణీకి కూడా మూలభూతమైన రచన కనిపిస్తుంది సోమునిలో. **నెయ్యము లేని సంగతియు నిక్కము లేని వచో విలాసమున్ వియ్యము లేని వైభవము విందుల సందడి లేని ముంగిలిన్.** ఇలాటి పద్యం పోకడ చూస్తే మీకే తెలుస్తుంది.

చివర కొక్క వ్యర్థ పదం లేకుండా 56 దేశాల పేర్లూ ఒకే ఒక సీస పద్యంలో పొదిగి చూపగల సామర్థ్యం సోమనదే. **పాంచాల పాండ్యబర్బర** అనే సీసం చదవండి మీకే తెలుస్తుంది. పోతన అలాటి పద్యమే వ్రాశాడు గాని 26 దేశాల పేర్ల కన్నా ఎక్కువ ఇమడ్చ లేకపోయాడు. ఐంద్రజాలిక వినోదం బో అన్నట్టు అది సోమన ఇంద్రజాలం.

ఇలాంటి ప్రౌఢ కవిని ఎన్నో విషయాలలో అనుకరించి కూడా ఆయన పేరు శ్రీనాథుడు గాని పెద్దన గాని మిగతా ప్రబంధకవులు గాని స్మరించక పోవట మన్యాయం. భట్టుమూర్తి శ్లేషకోసమైనా స్మరించాడు పాపం. **సోముడు భాస్కరుండు వెలయింపన్** అని. కాని మహానుభావుడు పోతన పేరు పెట్టి స్మరించక పోయినా **తిక్కనాది కవులని** ఆది అనే మాటలోనూ– **ఇతర పూర్వకవి జన సంభావనంబు గావించి** అనటంలో సోమనాథుని మనసులో పెట్టుకొనే ఉంటాడు సందేహం లేదు. ఏది ఏమైతే నేమి. ఒకరు మెచ్చినా మెచ్చక పోయినా సోమనాథుని నైపుణ్యం నైపుణ్యమే. అందులో అతని నవీనత. ఎప్పటికీ నవీనతే.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# పోతనామాత్యుని - సహజ పాండిత్యము

సోమనాథుడు ప్రక్కకు తప్పుకొన్నాడో లేదో వెంటనే ప్రవేశిస్తున్నాడొక పాత్ర రంగస్థలం మీదికి. ఆ విగ్రహాన్ని చూడగానే ఆనాటి యశోదాదేవి ఏమోగాని ఈనాడు ఆంధ్ర ప్రజానీకమంతా కలయో వైష్ణవ మాయయోనని మహాశ్చర్యంతో గుడ్లప్పగించి చూడక తప్పదు. అది అప్పుడీశ్వర ముఖస్థమై కనిపించిన ప్రపంచమైతే ఇప్పుడు మనందరికీ ఈ కవీశ్వరుని ముఖస్థమై కనిపించే వాఙ్మయ ప్రపంచం. ఇంతకూ ఎవరా కవీశ్వరుడని అడుగుతారేమో. ఎవరోగాదు. తెనుగు వారందరికీ చిరస్మరణీయుడైన బమ్మెర పోతనామాత్యుడు. సహజ పాండిత్య సంపన్నుడు.

పాండిత్యం లేని కవి ఎవడైనా ఉంటాడా. అంతో ఇంతో ప్రతి కవికీ ఉంటుంది పాండిత్యం. ప్రతిభా వ్యుత్పత్తీ రెండూ ఉండాలని గదా చెబుతారు కావ్యమీమాంసకులు కవులందరికీ. వ్యుత్పత్తి అంటే పాండిత్యమే. మరలాంటప్పుడు పోతన నొక్కడినే సహజ పాండిత్య అని పేర్కొనట మేమిటి. ఇది పోతనే తగిలించుకొన్నాడా ఈ బిరుదు - లేక మిగతా కవులు గానీ

పాఠకలోకంగానీ ఇచ్చిందా. ఏదైనా కావచ్చు. మొత్తం మీద మిగతా ఎవరికీ లేని బిరుదు సంపాదించాడీ మహాకవి. ఏమంత గొప్పదా ఆయన పాండిత్యమని ఆశ్చర్యపోతున్నారా. ఆశ్చర్యమే నిజంగా. ఎవరికీ లేని గుణ మొకరిలో కనిపించినప్పు డాశ్చర్యం గాదేమిటి.

పాండిత్యమంటే మీరూ నేనూ అనుకొన్నదే గాదు. ఇంకొకటి కూడా ఉంది దాని కర్థం. **'పండా ఆత్మ విషయా బుద్ధిః సా యేషాం తే పండితాః'** - పండ అని ఒక మాట ఉంది సంస్కృతంలో. దాని కర్థం ఆత్మజ్ఞానం. అది ఎవడి కుంటే వాడు పండితుడన్నారు శంకర భగవత్పాదులు. పండితస్య భావః కర్మ వా పాండిత్యం. అలాటి పండితుడి లక్షణం గాని చర్యగాని - దానికి పాండిత్యమని పేరు. అయితే వేదాంత పాండిత్యమేనా కవితా పాండిత్య మక్కర లేదా. అక్కరలేదని గాదు. ఆ మాటకు వస్తే కవి అన్నా వేదవేద్యుడైన పరమాత్మే. కారణం కవి అనే మాటకు క్రాంత దర్శి ద్రష్ట అని అర్థం. దేశ కాలావధుల నతిక్రమించి చూడగలవాడే కవి అంటే. అది పూర్తిగా ఉన్నవాడు సర్వజ్ఞుడైన ఈశ్వరుడైతే ఆ ఈశ్వరాంశతో జన్మించిన మానవుడు కూడా కవే.

కాగా అలాటి దృష్టే నడుపుతుంది మానవుడి జీవితాన్ని. మొదట మనస్సును పిమ్మట శరీరాన్ని. ఈశ్వర ప్రేరితమైన ఆ మనస్సు ఆయా శాస్త్రాలనూ కళలనూ చక్కగా అవగాహన చేసుకోగలుగుతుంది. అది వాడి భౌతిక జీవితాన్ని కూడా అదే పంథాలో నడుపుతూ పోతుంది. ఇందులో ఆ ఈశ్వర జ్ఞానమనేది మొదటి పాండిత్యమైతే దాని వెలుగులో నడిచిన

దంతా మనమనుకొనే రెండవ పాండిత్యం. అది సహజంగా మొదట సిద్ధించినప్పుడే ఇది అప్రయత్నంగా వాడి కలవడుతుంది. ఇదుగో ఇలాటి భావంతోనే మనం పోతానామాత్యునిది సహజ పాండిత్యమని వర్ణించటం. దీని కుపోద్బలకంగా ఆయన గారి నోట వచ్చిన మాటే **'పలికించెడి వాడు రామభద్రుండట'** అనే మాట. దివ్యమైన మాట ఇది. ఎంతో భావగర్భితమైన మాట. నేను గాదీ భాగవతం రచిస్తున్నది. ఈశ్వరుడే నానోట పలికిస్తే నేను వ్రాస్తున్నా నన్నాడే అది ఒక్కటి చాలు ఆయన కీశ్వర స్పృహ ఎంత గాఢంగా ఉన్నదో మనమర్థం చేసుకోటానికి.

ఇది ఆయన కున్న ఈశ్వర పాండిత్యమైతే ఆ పాండిత్య బలంతో ఆయన అనే మాట ఏమిటో తెలుసా. **'కొందఱకు తెనుగు గుణమగు కొందఱకును సంస్కృతంబు గుణమగు - రెండుం గొందఱకు గుణంబగు నేనందఱ మెప్పింతు కృతుల నయ్యై యెడలన్'** తెలుగు వారేమిటి సంస్కృతం వారేమిటి పండితులేమిటి పామరులేమిటి. అందరూ మెచ్చవలసిందే నారచన అని చాటగలిగాడే ఇది ఆ పాండిత్యబలంతో సాధించిన కవితా పాండిత్యం. అంతే కాదు. ఇంకొక చమత్కార మేమంటే ఒక పక్క ఐశ్వరమైన పాండిత్య మాయన వినయ సంపద పైకి చాటుతుంటే ఇంకొక ప్రక్కదాని ఆసరాతో అబ్బిన కవితా పాండిత్య మొకానొక ఔద్ధత్యం కూడా చాటుమాటుగా బయట పెడుతుంటుంది. భాగవత రచన కుపక్రమిస్తూ మొదట్లోనే ఒక మాట అంటాడాయన. **'ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విన్ పురాణా వళుల్ - తెనుగుం జేయుచు మత్పురా కృత శుభాధిక్యంబు తానెట్టిదో - తెనుగుంజేయరు మున్ను భాగవతమున్'** ఇదీ

ఆయన మాట. ఇంతకు పూర్వమే నన్నయ తిక్కనల లాంటి మహాకవులు సంస్కృత పురాణేతిహాసాలు తెలుగులో అనువదిస్తూ వచ్చారు. ఎలాగో వారి చూపు భాగవతం మీద పడలేదు. పడి ఉంటే వారికే బుద్ధి పుట్టి దీన్ని కూడా అనువదించేవారేమో. అలా జరిగితే నాకా భాగ్యం దక్కేది కాదు గదా – అని వారి పట్ల ఎంతో గౌరవమూ వినయమూ ప్రకటించినట్లు కనిపిస్తుంది. ఇది పయి మాట అయితే ఇక్కడ తన పాండిత్యం మీద ఉన్న ఆత్మ విశ్వాసం కూడా లోతుగా మనకు స్ఫురిస్తూనే ఉంది. అదేమిటో తెలుసా. **మత్పురాకృత శుభాధిక్య**మనే మాట. శుభమంటే పుణ్యం. అది అనేక జన్మల నుంచీ పోగయి ఉండాలి మనకు. నన్నయాది కవుల కది ఉంటే ఉండవచ్చు. కాని అధికంగా లేదు. అంతకన్నా శుభాధిక్యం నాకే ఉంది సుమా. అందుకే వారు భారతాది రచనల వరకే ఆగిపోయారు. అధికమైన శుభం లేనందు మూలాన భాగవతం లాంటి మహాపురాణం జోలికి రాలేకపోయారనే భావం కూడా నిగూఢంగా ఉందీ మాటలో.

అయితే ఒక మాట. అంత గొప్ప ఆత్మ విశ్వాసమున్నా పోతన తన పాండిత్యమంతా ఇంత అని గొప్పలు చెప్పుకోవాలని గాదాయన ఉద్దేశం. ఒక పక్క అనన్యాదృశమైన ప్రజ్ఞాపాటవం తనకుందని తనలో తనకు నమ్మకముండి కూడా అది కేవలం తనకు భగవద్దత్తమైన ప్రసాదంగా భావించట మాయన గొప్ప. అంతకన్నా దాన్ని మరలా భగవదంకితం చేసి తన జన్మ సార్థకం చేసుకోవాలను కోటమింకా గొప్ప. అందుకే **'దీనిం దెనింగించి నా జననంబున్ సఫలంబుఁజేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్'** అని చాటగలిగాడు. దీనిమూలంగా మనకసలైన కావ్య

ప్రయోజనమేమిటో కూడా తేటపడుతున్నది - **కావ్యం యశసే అర్థకృతే వ్యవహార విదే శివేతరక్షతయే సద్యః పర నిర్వృతయే - కాంతా సమ్మితతయో పదేశయుజే** ఇది మమ్మటుడనే ఆలంకారికుడు చేసిన సిద్ధాంతం. కావ్యమనే దానికి 6 ప్రయోజనా లున్నాయట. ఒకటి యశస్సు - రెండు ధనం - మూడు లోక వ్యవహారం - నాలుగు శివేతరక్షతి - అయిదు సద్యః పరనిర్వృతి - ఆరు ఉపదేశం. వీటిలో మొదటి మూడూ అలా ఉంచి చివరి మూడూ చాలా సారభూతమైనవి నా దృష్టిలో. ఎలాగంటే శివం కానిదేదో అది శివేతరం. శివంగాని దేమిటి శవం. అంటే మృత్యువు. దాని క్షతి - అంటే మృత్యుంజయత్వం. మోక్షం. అది ఎలా లభిస్తుంది. ఉపదేశం వల్ల. సద్గురూపదేశం వల్ల బ్రహ్మజ్ఞానం లభిస్తే తన్నిమిత్తంగా మరణాన్ని జయించి అమృతరూపమైన మోక్షాన్ని పడయవచ్చు. దానివల్ల కలిగే లాభమేమిటి. **సద్యః పరనిర్వృతి. నిర్వృతి.** అంటే ఆనందం. పర నిర్వృతి అన్నాడు కాబట్టి లౌకికమైన ఆనందం కాదు. బ్రహ్మానందం. అలాటి ఆనందం కలగాలంటే ఆ ఆచార్యోపదేశం స్వానుభవానికి రావాలి. వస్తే దాని వల్ల శివేతరమైన సంసార బంధం తొలగిపోవాలి.

అయితే మిగతా మూడు ప్రయోజనాలో. వాటి కోసం వేరే ప్రయత్న మక్కర లేదు. అప్రయత్నంగానే లభిస్తాయవి మానవుడికి. హస్తి పాదంలో మిగతా జంతువుల పాదాల గుర్తులు ఇమిడి పోయినట్టీ మూడింటిలోనే కలిసి వస్తాయి. అంటే వేదాంతోపదేశం కాంతా సమ్మితంగా అందిస్తే అది లౌకికమైన రసానుభూతిని కూడా ప్రసాదిస్తుంది. అప్పుడది ఉభయ తారక మవుతుంది. అలా కాక కేవల విషయానందం కోసమే అయితే

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అది తన్మాత్ర పర్యవసితమై జీవిత పరమార్థానికి దారితీయదు. ఇదిగో ఇలాటి పారమార్థికమైన ప్రయోజనాన్ని మనసులో ఉంచుకొనే పోతనా మాత్యుడా మాట అన్నది. ఏమాట. **నా జననంబున్ సఫలంబుఁజేసెద పునర్జన్మంబు లేకుండగన్** - అన్నమాట. భాగవత రచనోద్యోగానికి ప్రయోజనం నాకిక మరలా జన్మ అనేది రహితమయి పోవటమే. అలా రహితమై పోవాలంటే ఆత్మజ్ఞాన మపరోక్షంగా సిద్ధించాలి. అది శివేతర క్షతి కావించి పర నిర్వృతిని ప్రసాదిస్తుంది. సరిగా ఇలాటి మాటే అన్నాడు పూర్వం కాళిదాస మహాకవి శాకుంతలంలో. అక్కడ దుష్యంతుడు కశ్యప ప్రజాపతితో అన్నాడని పేరేగాని తన మనసులోని మాటే దుష్యంతుడి నోట పలికించాడు కాళిదాసు. **'మమాపిచ క్షపయతు నీలలోహితః పునర్భవం పరిగత శక్తి రాత్మ భూః'** అని భరత వాక్య వ్యాజంతో కాళిదాసన్న మాట. శక్తిసహితుడైన ఆ పరమశివుడు నాకిక పునర్జన్మ అనేది లేకుండా జేయుగాక. అది ఎంతగా మనసుకు పట్టిందో పోతరాజు కదేతనకూ అన్వయించుకొని చెప్పాడు.

అప్పటి కిరువురి మనసులో ఉన్నదీ ఒకటే. ఒక ఉత్తమమైన కావ్య సృష్టి చేస్తున్నామంటే తద్వారా మేమాసించింది శివేతరమైన ఈ సంసార బంధం తప్పించుకొని మోక్షపదవి నందుకోటమే. ప్రధాన ఫలమదైతే దాని కానుషంగికంగా లౌకికమైన రసాస్వాదం లభించినా కాదనం. అయితే అది ఆనుషంగికం మాత్రమే. కావ్యతాత్పర్యం కాదు అని ఆ మహాకవుల హృదయం. అలాటి మహోన్నతమైన ఆశయ ముంటేనే కవి మహాకవి అనిపించుకొంటాడని మహా మాహేశ్వరులు ఆనంద వర్ధనాదులైన

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

ఆలంకారికుల మాట. **'అతఏవాస్మిన్నతి విచిత్ర కవి పరంపరా వాహిని సంసారే వాల్మీకి కాళిదాస ప్రభృతయః ద్విత్రాః పంచషావా మహాకవయ ఇది గణ్యంతే'** అందరూ మహాకవులుగారీ కవితా ప్రపంచంలో. వాల్మీకి కాళిదాస ప్రభృతులే ఇద్దరో ముగ్గురో వేళ్ళ మీద లెక్కపెట్ట వచ్చునంటారు. అలాటి వారి జాబితాలో చేరుతాడు మన ఆంధ్ర మహాకవి పోతనామాత్యుడు కూడా. నారద మహర్షి మీద నెపం పెట్టి ఆయన లోకానికి చాటిన సత్యమేమిటో తెలుసా. **'హరినామస్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ సురుచి భ్రాజితమైన మానస సరః స్ఫూర్తిన్ వెలుంగొందు – శ్రీహరినామ స్తుతి లేని కావ్యము విచిత్రార్థాన్వితం బయ్యు శ్రీకరమై యుండదయోగ్య దుర్మలినవ త్కాకోల గర్తాకృతిన్ –'** మహాకవి అయిన వాడి దర్జాకు తగిన మాట ఎలా ఉండాలో అలా ఉందీ మాట.

అలాంటప్పుడీ కవులందరూ వేదాంత గ్రంథాలే వ్రాయరాదా వ్రాసి లోకానికి తత్త్వ ప్రబోధం చేయరాదా – కావ్యాల జోలికి పోవటం దేనికని మరలా భ్రాంతి పడరాదు మనం. కాంతాసమ్మిత మనే మాట మరచిపోకండి మీరు. శాస్త్రం ప్రభు సమ్మితమైతే పురాణేతిహాసాలు మిత్ర సమ్మితాలు. మొదటిది శాస్త్రమైతే ఇది శాస్త్రమే గాక కళాంశాన్ని కూడా కలుపుకొన్నది. అంతకన్నా కావ్యమైతే అది కాంతా సమ్మిత మన్నారు. ఎంత శాస్త్రమో అంత కావ్యకళ కూడా ఉట్టిపడే రచన. కళ గనుక రసజ్ఞుల హృదయాలను రసభావాది సామగ్రితో రంజింపజేస్తూ అక్కడి కాగక తద్వారా వారికి జీవిత పరమార్థాన్ని ప్రధానంగా బోధిస్తుంది. కాళిదాసాదులలాగే చేశారు. ఆ బాటలోనే నడుస్తూ వచ్చాడీ మహాకవి కూడా. అందుకేనేమో **'భాగవత**

**పురాణ ఫలరసాస్వాదన పదవిగనుడు రసిక భావ విదులని'** కూడా తనలో దాగి ఉన్న కళా హృదయాన్ని కూడా ధ్వనింప జేశాడు. అందుకే **'శ్రీమహా భాగవత కథా సుధారస ప్రయోగి'** అని శుకయోగిని కీర్తించాడు కూడా. అంటే ఏమని అర్థం. కేవల భాగవత కథే గాదు. అది సుధారసంతో ఆర్ద్రం చేసి ప్రయోగించినప్పుడే ఆనందం. అపేక్షిత ఫలప్రదాయకం. అలాటి రస ప్రయోగ సామర్థ్యం తన కలవరుచుకోటానికే బాణ మయూర కాళిదాస భారవి మాఘులనే సంస్కృత మహాకవులనూ నన్నయ తిక్కనలనే ఆంధ్ర మహాకవులనూ ముఖ్యంగా ఆశ్రయించాడు. అందులోనూ మహాకావ్య కరణ కలా విలాసుడంటాడు కాళిదాసును. గొప్ప రసవంతమైన కావ్యం వ్రాయాలంటే కాళిదాసే కావాలట. 'కతిపయ శ్లోక సమ్మోదిత సూరుమయూరుం గొనియాడి. మంచి ప్రౌఢమైన భావ బంధురమైన పద్యరచనకు మయూరుణ్ణే పట్టుకోవాలి. మృదుమధుర వచన వర్గ పల్లవిత స్థాణుణునకు బాణునకుం బ్రణమిల్లి' అద్భుతమైన చిత్రవిచిత్రమైన గద్యం నడపాలంటే బాణకవే శరణ్యమని ఆయన నమ్మకం. అలాగే వారి గుణాలు పుణికి పుచ్చుకున్నాడు కూడా తన రచనలో. కనుకనే జటిలమైన సంస్కృత భాగవతం కన్నా పోతన తెనుగు భాగవతమే మిన్నగా రసవంతంగా ఉన్నదని పండిత పామరులందరి చేతా పేరు తెచ్చుకొన్నదాయన రచన.

ఇంతకూ సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతమని ఈ మహాకవి తన ఆశ్వాసాంత గద్యలో పేర్కొన్నాడంటే ఏదో మామూలూగా ఎంతో కొంత పాండిత్యమున్న వాడని గాదు మనమర్థం చేసుకోవలసింది. వ్యాస వాల్మీకి కాళిదాస మాఘ భారవుల రచనా గుణ విశేషాలను ప్రశంసించటం

వల్ల పురాణేతిహాస పంచకావ్య నాటక వాఙ్మయాన్ని బాగా మథించిన వాడని – భట్టబాణాదులను కీర్తించటం మూలాన పద్య ప్రబంధాలనే గాక ప్రౌఢమైన కాదంబరీ హర్ష చరితాది గద్య ప్రబంధాల సంస్కారమెంతో ఉన్నవాడనీ సాహిత్యపరంగా ఆయనకు గల పాండిత్యమూ – అంతేగాక శ్రీధరాది వ్యాఖ్యాతల వ్యాఖ్యాన రహస్యాల నెంతో తడవి చూచి – వేదాంత శాస్త్ర సంస్కారమెంతో ఆర్జించిన వాడని శాస్త్రపరంగా ఆయనకు గల పాండిత్యమూ – ఏమాత్రం భాగవత గ్రంథాన్ని లోతుకు దిగి చూచినా తద్జ్ఞులైన వారి కర్థం గాక పోదు. ఎంత సర్వతోముఖమైన ప్రజ్ఞ ఉన్నా అది తనకెంతో సహజంగా ఉన్నట్టు భాసింప జేయగల చాతుర్యమలవడిన మహానుభావుడు గనుక సహజ పాండిత్యమని పేరు వచ్చింది. అదీ ఆయనలో ఉన్న అసాధారణమైన విశేషం. ఇది భాగవతం ప్రతి కథలో ప్రతి సన్నివేశంలో ప్రతి పాత్రలో ప్రతి వర్ణనలో ప్రతిభావంలో ప్రతి పద్యంలో ప్రతి గద్యంలో ప్రతి శబ్దంలో ప్రతి రచనా భంగిమలో పదహారు కళలతో కానవస్తుంది మనకు. ఎంతో ప్రయత్నంతో భావన చేసి ఎన్నో హంగులతో ఎంతో చిత్రవిచిత్రంగా ఎంతోమంది కవులు తీర్చిదిద్దిన రచనల కన్నా ఎన్నో రెట్లు సురుచిరంగా సర్వాంగ సుందరంగా అతి సహజంగా ప్రవహిస్తూ భగవానుడి విశ్వరూపాన్నే చూస్తున్న దివ్యానుభూతి నిస్తుందాయన కవితా విశ్వరూపం. ఇంతకన్నా ఏమీ చెప్పలేము. **మహాశ్చర్యంబు చింతింపగన్** అన్నట్టు మహాశ్చర్యమే అప్పటికీ ఇప్పటికీ.

అసలు భాగవత పురాణం సంస్కృతంలో వేదవ్యాసుడే వ్రాశాడా లేక ఓపదేవుడనే ఒక మేధావంతుడు వ్రాసి ఆయన పేరు పెట్టాడా లేక

ఒకానొక కాలంలో ఒకానొక మహాజ్ఞానీ మహాభక్తుడూ అయిన వ్యక్తి మరెవరైనా వ్రాసి అది వ్యాసప్రోక్తంగా చెలామణి అయిందా - ఈ వాదోపవాదాలు మన కనవసరం. నన్నడిగితే వ్యాసుడని భావించినా ప్రమాదం లేదు. ఆ వ్యాసుడు భారత కర్త అయిన వ్యాసుడే కానక్కర లేదు. వేదశాస్త్ర పురాణాది వాఙ్మయ పరమార్ధ మేమిటో వ్యాసం చేసి అందంగా చక్కగా వివరించి తన రచనల ద్వారా లోకానికి బోధించిన వాడెవడైనా అతడు వ్యాసుడే ననుకోండి. తప్పేముంది. బహుశా పోతన కూడా అలాంటి అతిలోక ప్రజ్ఞాశాలి అయిన ఒక మహర్షినే వ్యాసుడని భావించి ఉంటాడు. ఈ వ్యాసుణ్ణి ఆ వ్యాసుణ్ణి అభిన్నంగా కూడ భావించి ఉంటాడు. మొత్తం మీద అలాటి వ్యాసప్రోక్తమైన శ్రీమద్భాగవతాన్ని తెనిగించి తెనుగు వారి కందివ్వాలని గొప్ప సంకల్ప మాయనకు కలిగిందంటే అది మనందరి పురాకృత సుకృత ఫలం. ఈ భాగవత రచన ఒక్కటే గాదు. దీని కుపక్రమించే ముందాయన గారు మరి రెండు రచనలు చేసినట్టు కనిపిస్తున్నది. ఒకటి భోగినీ దండకం. ఇది సర్వజ్ఞ సింగభూపాలుడి శృంగార చర్యా వర్ణనం. మరొకటి వీరభద్ర విజయమనే కావ్యం. అప్పటికాయన గారు కూడా శ్రీనాధుని లాగా మొదట ఒక శృంగార పురుషుడే. అది దాటి కొంత వయసు వచ్చి రచించినదయి ఉంటుంది వీరభద్ర విజయం. పేరే చెబుతున్నది మనకిది శివభక్తి ప్రబోధకమైన రచన అని. వాస్తవానికి పోతన శైవుడే. ఆయన పితృ పితామహులందరూ శైవమతావలంబులే. ముఖ్యంగా దుర్గాదేవీ ఉపాసకులు. ఇప్పటికీ పోతన నివాస గ్రామమైన బమ్మెరలో నివసించే వారు చాలావరకు శైవులే. వీర

శైవులైనా కావచ్చు. ఆ మతాభిమానంతోనే వీరభద్ర విజయం రచించి ఉంటాడు మొదట.

ఇలా శృంగారం భక్తి అనే రెండు కక్ష్యాంతరాలూ దాటి క్రమంగా వార్ధక్యం వచ్చేసరికి బాగా పరిణతి చెందింది పోతన గారి దృష్టి. అది ఒక కేవల మాధ్యాత్మికమైన జ్ఞాన దృష్టే. అందులోనూ అద్వైతజ్ఞానం. అద్వైతం గనుకనే మడిగట్టుకొని కూచున్నది గాదది. శృంగార భావాలూ భక్తి భావాలూ అన్నింటినీ కలుపుకొన్న జ్ఞానమే అద్వైత జ్ఞానం. కనుకనే భాగవత రచనలో అవి కూడా అక్కడక్కడ చోటు చేసుకున్నాయి. అయితే శృంగారం శృంగారంగా భక్తి భక్తిగా కాదు. జ్ఞానాత్మకంగా. అద్వైత జ్ఞాన సాగరంలో పడుతూ లేస్తూ పోయే తరంగాలవి. అంచేత పోతన మనస్తత్త్వ మర్ధం చేసుకోవాలంటే అద్వైత జ్ఞానం మనకూ బాగా ఒంటబట్టి ఉండాలి. లేకుంటే గల్లంతే. చూడండి. అసలు గ్రంథారంభంలో ఆయన చేసిన దేవతా స్తుతిలోనే తెలిసిపోతుం దాయన అద్వైత దృష్టి ఎలాంటిదో. శ్రీకైవల్య పదంబు అనే మొట్టమొదటి పద్యమే చెబుతుంది మనకు. కైవల్యమే కావాలట. మరేదీ గాదు. దానికి మార్గం చింతనమే. కర్మగాదు ఉపాసన గాదు. యోగాభ్యాసాదులు కావంటాడు. మరి ధ్యేయమైన పదార్థమేమిటని అడిగితే వర్ణిస్తున్నాడు. లోకరక్షైకారంభకుడూ. భక్తపాలన కళాసంరంభకుడూ దానవోద్రేకస్తంభకుడూ నానాకంజాతభవాండ కుంభకుడూ అయిన ఒకానొక డింభకుడంటాడు. ఇదేమిటీ ఇది సగుణం గదా. అద్వైతమెలా అయింది. చెబుతున్నాడు. వినండి. కేళిలోల విలసద్దృగ్జాల సంభూత మిదంతా. వాస్తవం కాదు. తన్మాయా విలాస

జనితమైన ఆభాస. అప్పటికి వస్తువు నిర్గుణమైతే దాని ఆభాస సగుణం. స్వరూప విభూత్యాత్మకంగా ఉన్నదొకే ఒక తత్త్వం. అదే చింతించాలి. అలాగే భావించాలి మనం. అప్పుడే కైవల్యమనే ఫలం లభిస్తుంది. చూడండి. ఎంత అద్వైత భావమో ఇది.

పోతే అక్కడి కాగాడా. సగుణమనే సరికి దాని విభూతి ఎలాటిదో బయటపెట్టాలని ఆయా దేవతా మూర్తులనన్నిటినీ కీర్తిస్తూ వచ్చాడు. ఎవరెవరిని. వాలిన భక్తి మ్రొక్కెద అని శివుణ్ణి - ఆతత సేవ జేసెద అని బ్రహ్మ దేవుణ్ణి. ఇక్కడికి త్రిమూర్తులు ముగ్గురూ కలిసి వచ్చారు. వీరు ప్రధాన దేవతలంటా డాయన. పోతే మిగతా వారెవరు. ఆదర మొప్ప - క్షోణితలంబునన్ అనే పద్యాలతో విఘ్నేశ్వర సరస్వతులను కీర్తించాడు. అందులో సరస్వతి తన రచనకు బాగా ఉపయోగపడాలి కాబట్టి బ్రాహ్మీ దయంభో నిధీ అని భారతీ అని మరల మరలా కీర్తించాడు. పోతే ముగ్గురు మూర్తులకూ ముగ్గురు భార్యలున్నారు గదా శక్తి స్వరూపిణులు. వారిలో సరస్వతి అయింది. ఇక పార్వతీ లక్ష్మీ మిగిలిపోయారు. కనుక అమ్మలఁ గన్న యమ్మ అని పార్వతినీ - హరికింబట్టపుదేవి అని లక్ష్మీదేవిని స్తుతించాడు. అందులో దుర్గమాయమ్మ అని ఆవిడే ముగురమ్మల మూలపుటమ్మ అని పేర్కొనటం గమనించండి. అదే మాయా శక్తి. కాగా కేళిలోల విలసద్దృగ్జాల సంపన్నుడైన డింభకుడెవడో కాదు. శివతత్త్వం. శివశక్తులన్నప్పుడది నిర్గుణమైన స్వరూపం. అదే మూర్తిత్రయంగా శక్తి త్రయంగా సగుణమై భాసిస్తున్నదని కవి హృదయం.

ఇది స్పష్టంగానే వివరిస్తాడు తరువాత ఒక పద్యంలో.

**'పరమపూరుషుఁడొక్కఁడాద్యుడు పాలనోద్భవ సంహృతుల్**

**సారిదిఁజేయ ముకుంద పద్మజ శూలిసంజ్ఞలఁ బ్రాకృత**

**స్ఫురిత సత్త్వరజస్తమంబులఁ బొందు'** – సత్త్వర జస్తమస్సు లనేవి ప్రకృతి గుణాలు. వాటి మూలంగా సగుణమయి కనిపిస్తున్నది నిర్గుణమైన తత్త్వం. ఆ నిర్గుణమైన తత్త్వమే పరమ పురుషుడు. వాడు బ్రహ్మకాదు. విష్ణువు కాదు. శివుడూ కాదు. మూడింటికీ మూలభూతమైనది. అసలైన భగవత్త్వరూపమది. దాని తత్త్వాన్ని బోధించటానికే ఆవిర్భ వించిందసలీ భాగవత పురాణం. భాగవత కథా నాయకు డసలదే. అంతేగాని మనమందరమూ భావించే విష్ణువు కాదు. లేదా ఆయన దశావతారాలూ కావు. మరి అలాంటప్పుడీ త్రిమూర్తులలో ఒకడైన ఈ విష్ణువుకే ప్రాధాన్యమెలా వచ్చింది భాగవతంలో. ఈ ప్రశ్నకు సమాధానమా మహాకవే ఇస్తున్నాడు వినండి. **'అందు శుభస్థితుల్ హరి చరాచర కోటి కిచ్చు ననంత సత్త్వ నిరూఢుడై'.** ముగ్గురు మూర్తులూ ఒకటే అయినా వారి వారి ప్రవృత్తిని బట్టి తేడా వస్తుంటుంది. బ్రహ్మరుద్రులు సృష్టి ఒకరూ లయ మొకరూ చేసి అక్కడికి తమ డ్యూటీ ముగించుకొని కూచుంటారు. కాని విష్ణువలా కూచోటానికి లేదు. ఆ యనస్థితి కారుదు కాబట్టి ప్రపంచం సృష్టి అయి లయమయ్యే దాకా దాని బాగోగులు చూడవలసిన బాధ్యత ఉందాయనకు. సత్త్వ గుణ ప్రధానుడు కాబట్టి చరాచర కోటిని పరిపాలించా లాయన. అది ఎలా సాధ్యం. ప్రపంచ స్థితికి సహకరించే శిష్టులను

రక్షించాలి. దానికి ప్రతి బంధం కలిగించే దుష్టులను శిక్షించాలి. అందుకోసం లోకంలో ఏదో ఒక రూపంలో అవతరించాలి. అప్పుడే ఆ కర్తవ్యం నెరవేర్చగలడు. కనుకనే భాగవత కథలో ఆయా సన్నివేశాలూ అందులో ఆయా పాత్రల వ్యవహారం - ఇదంతా విష్ణుముఖంగానే జరుగుతున్నట్టు చూస్తుంటాము మనం. మత్స్య కూర్మాద్యవతారాలన్నీ అందుకోసమే. ప్రహ్లాదాంబరీషాది భక్తుల చరిత్రలన్నీ నడుస్తున్నదా వెలుగులోనే.

అంచేత త్రిమూర్తులలో ఏమాత్రమూ తేడా చూడగూడదు మనం. ముఖ్యంగా శివకేశవుల కసలే చూడరాదు. చూస్తే మహాపాపం. అసలు ఒకే ఒక బ్రహ్మతత్త్వం తాలూకు ఆభాసలేనని గదా పేర్కొన్నా మాయా దేవతా మూర్తులన్నిటినీ. అలాంటప్పుడిక శివకేశవుల మాట చెప్పేదేముంది. ఇంత గొప్ప అద్వైత దృష్టి ఉన్నవాడు గనుకనే పోతరాజు మొదట మొదట శృంగారానికీ శివభక్తికీ దాసోహమని జీవితం గడపినా వయసు మళ్ళిన తరువాత అద్వైత జ్ఞానం బాగా ఒంటబట్టి త్రిమూర్తులనేమిటి- లక్ష్మీ సరస్వతీ పార్వతులనేమిటి - విఘ్నేశ్వరాదులనేమిటి. అందరినీ సమానంగా కీర్తిస్తూ వచ్చాడు భాగవతంలో. అంతేకాదు. హరిహరా భేదాన్ని ప్రత్యేకంగా వర్ణించాడు **'చేతులారంగ శివుని పూజింపఁడేని- నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువడేని - కలుగనేటికి తల్లుల కడుపుచేటు'** వారిద్దరినీ కీర్తించాక ఎవడైనా భేద దృష్టితో చూచాడంటే వాడు పాపిష్ఠుడు. అలాటి వాడు మానవుడై పుట్టి ఏమి ప్రయోజనం - భూమికి భారమని శాపం పెట్టాడు. అంతేగాక ఇలాటి అభేద భావాన్ని పనిగట్టుకొని మరలా

మనకు గుర్తు చేస్తాడు భాగవత మధ్యంలో ఒకచోట. అది బాలకృష్ణుణ్ణి వర్ణించే ఘట్టంలో ఉంది. మూలంలో లేదలాంటి పద్యం. అయినా స్వతంత్రంగా వ్రాసిపెట్టాడు. అదేమిటంటే-

**తనువున నంటిన ధరణి పరాగంబు**
**పూసిన నెతి భూతి పూతగాగ**
**ముందఱ వెలుగొందు ముక్తాలలామంబు -**
**తొగల సంగడి కాని తునుక గాగ**
**ఫాలభాగంబు పైఁబరగు కావిరి బొట్టు -**
**కాముని గాల్చిన కన్నుగాగ**
**కంఠమాలికలోని ఘన నీలరత్నంబు-**
**కమనీయమగు మెడకప్పు గాగ**
**హారవల్లులురగ హారవల్లులు గాగ-**
**బాలలీలఁ బ్రౌఢ బాలకుండు**
**శివుని పగిది నొప్పె శివునికిఁ దనకును -**
**వేఱు లేమిదెలుప వెలసినట్లు -**

చూచారా ఈ పద్యం. పద్యభావ మర్థమయిందా. కృష్ణ వర్ణనలో శివుణ్ణి తెచ్చి పెట్టి తమ కిద్దరికీ భేదం లేదని కృష్ణుడే మనకు చెబుతున్నాడంటాడు. భాగవతానికి కృష్ణ కథ అని పేరు. అప్పటికిది కృష్ణ కథా శివకథా. ఇద్దరికీ తేడా లేదన్నప్పు డెవరికథ అయినా కావచ్చునని

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

కవి హృదయం. పోతన కాలంలో వీరశైవులని కొందరు వీరవైష్ణవులని కొందరు రెండు వర్గాలుగా చీలిపోయి ఒకరితో ఒకరు తగాదా పడుతుంటే వారిని కూడా మనసులో పెట్టుకొని భంగ్యంతరంగా ఇద్దరినీ చీవాట్లు పెడుతున్నాడా అని తోస్తుంది నాకు. సరిగా తిక్కనగారు కూడా ఇలాగే తన కాలంలో వారిని మందలించ వలసి వచ్చింది. అందుకే ఆయన హరిహర నాథుడని ఒక క్రొత్త దేవుణ్ణి కల్పించుకొని విష్ణురూపాయ నమశ్శివాయ అని అభేద భావనతో ధ్యానిస్తూ వచ్చాడు. అదే లోకానికి బోధిస్తూ వచ్చాడు. ఆ సమస్యే తనకూ ఎదురై అలాగే పరిష్కరిస్తూ వచ్చాడు పోతన కూడా. అందుకేనేమో తిక్కన సోమయాజిని కీర్తించేటపుడు **'హరిహర చరణారవింద వందనాభిలాషిం దిక్క మనీషిన్ భూషించి'** అని పేర్కొంటాడు. హరిహరాద్వైతమే గుర్తు వచ్చిందాయ నను స్మరించేటపుడు. అయితే అలాంటప్పుడాయన కూడా ఆ దేవుడికే అంకిత మెందు కీయలేదు భాగవతం. చెప్పాంగదా సమాధానం. స్థితి కర్త అయిన విష్ణుదేవుడికి సంబంధించిన వ్యవహారమే ఇక్కడ వర్ణనీయ విషయం కాబట్టి తదనుగుణంగా ఆయనకే ఇవ్వవలసి వచ్చిందని. ఇది సూచించటానికే అసలు మొదట ప్రార్థనా పద్యంలో భక్తపాలనమనీ దానవోద్రేక స్తంభనమనీ తద్వారా లోకరక్షైకారంభమనీ ఉదాహరించటమా మహాకవి.

సరే. ఇంతకూ ఇంత గొప్ప సర్వ సమభావన ఆయన కున్నదంటే దానికి మూలకారణ మాయన కలవడిన అద్వైత దృష్టి. అది ఆయనకు సహజమైన పాండిత్యం. అద్వైత పరంగా దీనికర్థం చెబితే వ్యవహారం ద్వారా పరమార్థాన్ని గుర్తించి మరలా ఆ పారమార్థికమైన దృష్టితో

Yallamraju Srinivasa Rao
www.advaitaveda.in

వ్యవహారాన్ని చూచి – ఈ వ్యవహారమంతా పరమార్ధవి భూతే దాని ఛాయే అంతకన్నా ఏమీ కాదని అనన్య భావనతో నిర్లిప్తంగా ప్రతి ఒక్కటీ భావిస్తూ పోవటం. ఇది ప్రతి చిన్న విషయంలో దాఖలా అవుతుంది మనకాయన రచనలో. దేవతా మూర్తులన్నీ ఒకే ఒక అమూర్తమైన బ్రహ్మతత్త్వం తాలూకు విభూతి అని సమరస భావంతో చూచినట్టే కవి శబ్దవాచ్యులైన ప్రతి ఒక్కరినీ ఎక్కువ తక్కువ భావం లేకుండా సర్వులనూ సమానంగా భావించి గౌరవించాడు. తన కవితకు స్ఫూర్తినిచ్చే పురాణ కవులు వ్యాస వాల్మీకులను కాళిదాస భారవి మాఘులనే పంచకావ్య కర్తలనూ బాణ మయూరులనే విలక్షణ గద్య పద్య నిర్మాతలనూ అలాగే నన్నయ తిక్కనల నాంధ్ర మహాకవులనూ మొదట స్మరించి తరువాత ఏమన్నాడో తెలుసా. **'మఱియు నితర పూర్వకవి జన సంభావనంబు గావించి వర్తమాన కవులకుం బ్రియంబు పలికి – భావి కవుల బహూకరించి'** అని పేర్కొంటాడు. ఇలాటి మాట ఎక్కడైనా విన్నారా మీరు. తిక్కన దగ్గరి నుంచి ప్రబంధ కవులెవరిలోనూ చూడలేమీ గొప్ప మాట. ప్రతి ఒక్కడూ తనకు నచ్చిన ఏ కొంతమంది కవులనో నెత్తిన పెట్టుకొని మిగతావారిని త్రోసిపుచ్చిన వాడే. ప్రతివాడూ సుకవులని కొందరిని పేర్కొని మిగతా వారిని కుకవులని నిందించిన వాడే. తుదకు తిక్కన కూడా చేశాడా పని. అలా కాక భూత భవిష్యద్వర్త మానకవుల నందరినీ కవులుగానే భావించి వారందరికీ ఎక్కడ లేని మర్యాద నిచ్చి మాటాడిన వాడు పోతన ఒక్కడే. ఎంత గొప్ప విశాలమైన హృదయముండాలా మహానుభావుడికి.

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

ఇలాటి సమరస దృష్టి ముందు పేర్కొన్నట్టు భాగవతం ప్రతిపదం – ప్రతి పద్యం – ప్రతి గద్యం. ప్రతి వాక్యం – ప్రతి అలంకారం – ప్రతి వర్ణనా ప్రతి పాత్ర జీవితం – ప్రతి సన్నివేశం – లోనూ విశ్వతో ముఖంగా పరుచుకొని కనిపిస్తుంది. **'సరసింబాసిన వేయికాలువల యోజన్'** ఆయనగారే సూచించారీ సత్యాన్ని మనకు. అసలు భాగవతం 12 స్కంధాల గ్రంథమైతే 12 స్కంధాలూ పోతనగారు వ్రాయలేదు. వ్రాయలేదంటే అసలే వ్రాయలేదని కాదు. తప్పకుండా వ్రాసి ఉంటాడు. కాని మన దురదృష్టం కొద్దీ అందులో నాలుగు స్కంధాలాయన రచించినవి లుప్తమయి పోయాయి. అది మనకిప్పు డుపలబ్ధం కావటం లేదు. మనకుపలబ్ధ మయినవి నాలుగూ ఆయన రచన కాదు. ఆయనకు శిష్యులూ శిష్యప్రాయులూ అయిన ముగ్గురు కవులు రచించి ఆ ఖాళీని భర్తీ చేసిన రచనలవి. అందులో పంచమస్కంధం పూరించినవాడు గంగయ అయితే షష్ఠస్కంధం పూరించిన వాడు సింగయ కవి. పోతే 11, 12 చివరి రెండు స్కంధాలు భర్తీ చేసినవాడు ఆయన ప్రియశిష్యుడనని చెప్పుకొన్న వెలిగందలనారయ. వారూ కవులే భక్తులే. భాషా సాహిత్య జ్ఞానం బాగా ఉన్నవారే. సందేహం లేదు. పైగా పోతన మీది గౌరవంతో ఆయనగారంకిత మిచ్చిన శ్రీరామచంద్రునికే వీరూ అంకితమిస్తూ వచ్చారు కూడా. అయితే గురవుగారి బాణీ వేరు. వీరి బాణీ వేరు. గురువుగారి కున్న అద్వైత విజ్ఞాన బలం వీరికంతగా ఉన్నట్టు కనిపించదు. చివర చివర అది బాగా బయటపడుతుంది. **'అహమేవ పరం బ్రహ్మ బ్రహ్మాహం పరమం మత'**మని ఇలా సర్వాత్మ భావాన్ని మూలకారుడు బోధిస్తే **'మాధవ లోక**

**నివాససౌఖ్యముల్'** అని సాలోక్య సామీప్యాది రూపమైన మోక్షమే భాగవత పరమార్ధంగా భావించి అలా సమాప్తం చేస్తాడు వెలిగందల నారయ. పోతనే వ్రాసి ఉంటే అలా ముగించేవాడు కాదు గ్రంధాన్ని. సరే దానికేమి. ఎవరి దృష్టి వారిదనుకోండి.

ఏతావతా 12లో 8 స్కంధాల రచనే దక్కింది మనకు పోతన మహాకవి రచన. అయితేనేమి. ఎనిమిదీ ఎనిమిది దిగ్గజాలు. ఎనిమిది ఐశ్వర్యాలు. ఎనిమిది సిద్ధులు. పదం మొదలు ప్రబంధం వరకూ ప్రతి అంశంలో మహాకవి అద్వైత విజ్ఞాన విశ్వరూపమే చూడవచ్చు మనం. ఆయన రాముడికే అంకిత మిచ్చినా గ్రంథంలో పద్యాంతాలు రాముణ్ణి కాదు కృష్ణుణ్ణే వర్ణిస్తాయి. ఆయన వృద్ధగంగా తీరంలో కూచొని ధ్యానించిందసలు రాజశేఖరుడైన ఈశ్వరుణ్ణే అయినా ఆ రాజశేఖరుడెవడో గాదు – రామచంద్రుడు గానే ఎదట సాక్షాత్కరించాడు. రాజశేఖరుడనే మాట చూడండి. ఎంత చమత్కారంగా ప్రయోగించాడో. రాజశేఖరుడంటే చంద్రశేఖరుడైన ఈశ్వరుడూ కావచ్చు. రాజకుల శేఖరుడైన శ్రీరాముడూ కావచ్చు. మహాకవికున్న శివకేశవా భేదోపాసన చూడండి ఆపదంలో కూడా ఎలా తొంగిచూస్తున్నదో.

ఇలాంటి సమరస భావ సంపన్నుడు గనుకనే ఆయనకొక్కడికే ఉంది భాగవతం లాంటి మహాపురాణాన్ని రచించే అర్హత. భాగవతానికి సాత్వత పురాణమని మరి ఒక పేరు. సత్త్వ గుణోపేతులైన మహాభక్తుల చరిత్ర చెబుతుంది గనుక సాత్వత పురాణమన్నారా. కావచ్చు. అంతేగాక అలాటి

భక్తుల వృత్తాంతం వర్ణించాలంటే ఆ కవి కూడా అలాటివాడే అయి ఉండాలి. కనుకనే **భాగవతము తెలిసి పలుకుట కష్టంబు శూలికైన తమ్మిచూలికైన** అని పేర్కొంటాడు పోతన. శూలి తమ్మిచూలి అనే మాటల కర్థం రజస్తమస్సులని. అవి ఉన్నవాడు పట్టుకోలేడు భాగవత హృదయం. మరెవడు. సత్త్వశుద్ధి ఉన్నవాడు - ఎలా కలుగుతుందా సత్త్వ శుద్ధి. **విబుధజనుల వలన విన్నంత కన్నంత తెలియ వచ్చినంత.** వినాలి కనాలి తెలియాలట. వినటమంటే శ్రవణం - కనటమంటే మననం. తెలియటమంటే నిదిధ్యాస. ఇవి మూడూ విబుధులైన పెద్దల అనుగ్రహం వల్ల అలవరుచుకొని నేనీ రచన కుపక్రమించా నంటాడు. ఎంత వినయమో చూడండి కవికి. అప్పటికి సాత్వతుడెవడు. పోతనామాత్యుడే. సత్త్వం కూడా ఆ మాటకు వస్తే ప్రకృతి గుణమే. దాన్ని కూడా దాటిపోతే వాడు గుణాతీతుడైన పరమ హంస. పారమ హంస్య సంహిత భాగవతమంటే. కాబట్టి దాని హృదయ మున్న దున్నట్టు గ్రహించాలన్నా ఆవిష్కరించాలన్నా సాత్వతుడే గాక గుణాతీతుడైన పరమహంస కూడా కావాలి కవి. కనుకనే **పలికించెడు వాడు రామభద్రుండట** అని వ్యంగ్యంగా తనకున్న ఆ యోగ్యత కూడా ధ్వనింపజేశాడు. పలికేది తానే అయినా ఆ పలుకు తన సత్త్వగుణంలో నుంచి కూడా కాదు. తదతీతమైన అంతరాత్మలో నుంచి వెలువడుతున్న దని భావం. అప్పుడే ఆ మాటకు విలువ. అది ఏమిటో ఎలాంటిదో ఇంతకుముందే సూచన చేశాను సహజ పాండిత్యమనే మాటకర్థం చెబుతూ. పరమార్థం పరమార్థంగా వ్యవహారం వ్యవహారంగా చూడటం కాదు సహజ

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

పాండిత్యం. అది కేవల మసహజమైనది. మరి సహజమేమిటంటే పారమార్థిక దృష్టితో వ్యవహారాన్ని చూచి దాన్ని కూడా పారమార్థిక స్థాయితో మేళవించ గలగటమే. అప్పుడంతా పారమార్థికమే. అసలైన పాండిత్యం. సహజం కూడా అదే. ఇది అలవడిన మహాకవి ఒక్క పోతనామాత్యుడే వాఙ్మయంలో.

ఇది ఆయన భాగవత రచనలో అడుగడుగునా తార్కాణ మవుతుందని పేర్కొన్నాము. అది ఎలాగో ఇప్పుడు స్థాలీపులాకంగా పరిశీలించి చూతాము. మొదట ఒక శమీక వృత్తాంతమే తీసుకొని చూడండి. తన కంఠంలో చచ్చిన పామును వేసి పోయాడు పరీక్షిత్తని తెలుసు. అందుకు కోపించి తన కొడుకాయనకు శాపమిచ్చాడని తెలుసు. అయితే సర్పాన్ని మెడలో వేసినా అది అపరాధం కాదట. తొందరపడి కొడుకాయనను శపించటమే అపరాధమంటాడు. ఏమంటాడో తెలుసా.

**భారత వంశజుం బరమభాగవతున్ హయమేధ యాజి నా**
**చారపరున్ మహానయ విశారదు రాజకులైకభూషణున్**
**నీరము గోరి నేడు మననేలకు వచ్చిన యర్థి - భక్తి స**
**త్కారముసేసి పంపఁజనుఁగాక - శపింపఁగ నీకు ధర్మమే -**

పరీక్షిత్తు గుణాల నెంతగా ప్రశంసిస్తాడో చూడండా మహర్షి. పరమ భాగవతుడట. ఆచార పరుడట. అయితే చచ్చిన పాము నెందుకు వేశాడు మెడలో. అది దైవికం. **'బెట్టిద మగు శాపమునకది దట్టపు ద్రోహంబు'** గాదట. అంతేగాక **'పరమ భాగవతులు తారొడబడరు మాఱుసేయగ'**

అని కూడా అంటాడు. నీవే గాదు ఆయన కూడా నీకు శాపమివ్వ గలడు తెలుసా. అయినా పరమ భాగవతుడు గనుక దాని కొడిగట్టడని చెబుతాడు. ఎంత సానుభూతిగా అర్థం చేసుకొంటాడో. ఎంత మర్యాద ఇస్తాడో చూడండి ఆ మహర్షి. ఇదీ సమ దర్శనమంటే. పోతే ఇలాటి దర్శనమున్న వాడు గనుకనే పరీక్షిత్తు కూడా **'ఏటికి పాప సాహసము లీక్రియఁజేసితి** అని పశ్చాత్తాపం చెంది **'దైవయోగమున్ దాటగరాద'**ని దానికి సమాధానం చెప్పుకోటమింకా గొప్ప. అంతేకాదు. **'దండశూక శవము తండ్రి పైవైచిన బోలియఁదిట్ట కేల పోవు సుతుడు'** అని తనకు తనే సంజాయిషీ చెప్పుకొని **'దామోదర పదభక్తిం గామాదుల గెల్చినాడు గావున భూమీ శు డలుగ డయ్యెను సామర్థ్యము గలిగి'** అని ముగిస్తాడు కవి. అది అన్నిటి కన్నా అద్భుతమైనది. శమీకుడూ పరీక్షిత్తూ గాదు. వారి శమదమాది గుణ సంపత్తిని అలా చాటి చెప్పిన మహాకవి సత్త్వగుణ సంపత్తి ఎలాటిదో గమనించండి ఈ సన్నివేశంలో. అసలా పద్యరచన చూడండి తత్తద్భావాను గుణంగా ఎలాసాగిందో. శమీక పరీక్షిత్తు లిద్దరూ కల్పించిన సమదర్శన వాతావరణంలో విషమమైన శృంగి రాజస భావ మసలు మనకు కనపడనే కనపడదు.

పోతే అశ్వత్థామ వృత్తాంత మొకటుంది. వాడు పాండవుల పుత్త్రులను రాత్రికి రాత్రి వచ్చి వధించాడు. పాండవులు వాణ్ణి పట్టుకు వచ్చి ద్రౌపది ఎదుట నిలిపారు. అప్పటికే వాడు సిగ్గుతో తలదించుకొన్నాడు. అప్పుడతణ్ణి చూచి సుస్వభావయగు ద్రౌపది ఇలా అన్నదంటాడు కవి.

**పరగన్ మా మగవార లందఱును మున్ బాణప్రయోగోప సం**

**హరణా ద్యాయుధ విద్య లన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం**

**చిరిపుత్త్రాకృతి నున్న ద్రోణుఁడవు- నీ చిత్తంబులో లేశముం**

**గరుణా సంగము లేక శిష్యసుతులన్ ఖండింపఁగాఁ బాడియే**

ఇందులో పుత్త్రా కృతినున్న ద్రోణుడవు - శిష్యసుతులను ఖండించటమనే మాటలు చూడండి ఎంత హృదయ విదారకమే. పోతనే అనగల డిలాటి మాటలు. అంతేకాదు. **భూసురుడవు బుద్ధి దయాభాసురుడవు - వీరభటాగ్రేసరుడవయి** కూడా శిశు మారణం చేస్తావా. ఇంతకన్నా ఆసురకృత్య మున్నదా తంత్రీ అంటుంది. అంతే కాదు. **పిన్నపాపల నిద్రాసక్తుల సంహరింప నకటా నీ చేతులెట్లాడెనో** అనట మింకా ఎంత కరుణాస్పదం. అంతే కాదు.

**అక్కట పుత్త్ర శోక జనితా కులభార విషణ్ణ చిత్తనై**

**పొక్కుచునున్న భంగి నిమఁబోరఁ గిరీటి నిబద్ధుఁ జేసి నేఁ**

**డిక్కడి కీడ్చి తెచ్చుట సహింపనిదై భవదీయ మాత - నేఁ**

**డెక్కడ నిట్టి శోకమున నేత్రియ నేడ్చుచుఁ బొక్కు చున్నదో -**

అని తన మాతృహృదయాన్ని బయటపెట్టే మాటలెంత సహజ రమణీయమో చూడండి.

అంతే గాక వెంటనే కృష్ణార్జునులను చూచి -

ద్రోణునితో శిక్షింబడక ద్రోణ కుటుంబిని యున్నదింట - న
క్షీణ తనూజ శోక వివశీకృతనై విలపించు భంగి - నీ
ద్రౌణిఁదెరల్చి తెచ్చుటకు దైన్యము నొందుచు నెంత పొక్కునో -
ప్రాణ వియుక్తుడైన నతి పాపము బ్రాహ్మణ హింస మానరే -

ద్రౌపదికెంత సమదర్శనమో చూడండి. పారమార్థిక దృష్టితో వ్యవహారాన్ని అర్థం చేసుకోటమే సమదర్శనం. అదే సహజ పాండిత్యమని పేర్కొన్నాము. పోతన తనకున్న ఆ పాండిత్యాన్నే తన పాత్రలందరికీ పంచి పెట్టాడా అనిపిస్తుంది. లేకుంటే ద్రౌపది ఇలాటి మాట ఎప్పుడైనా ఆడటం చూచామా. భారతంలో ద్రౌపది వేరు. భాగవతంలో వేరు. అది తిక్కన తీర్చిన పాత్ర అయితే ఇది పోతన తీర్చి దిద్దిన పాత్ర. అక్కడ కోపావేశంలో ఒళ్ళు తెలియక తనకు తానే వెట్టిదాన్ని అని చెప్పుకొన్నది ద్రౌపది - ఇక్కడ అశ్వత్థామను చంపుతాడనే భయంతో భీముడి కడ్డం నిలుచొని భీముడి చేతనే వెట్టి దనిపించుకుంటుంది. చూడండి ఎంత వారా ఉందో పాత్రలో. **ఆత్మౌ పమ్యేన సర్వత్ర సమం పశ్యతియోఽ ర్జున సుఖం యదివా దుఃఖం** అన్నాడు భగవానుడు. సుఖదుఃఖాలు తనకైనా పరులకైనా సమానమే. అది సర్వత్ర సమస్వరూపమైన భగవత్తత్వాన్ని గుర్తించిన వాడికే కలుగుతుంది. కనుకనే ద్రౌపది మాటకు కృష్ణభగవానుడే చకితుడై అలాగే వాణ్ణి విడిచిపెట్టండని భీమార్జునుల కాదేశిస్తాడు. తాను గీతలో అన్నమాటే తాను పాటిస్తాడు. అక్కడ శమీక వృత్తాంతంలో శృంగి రాజసచర్య ఎలా కానరాదో ఇక్కడ ద్రౌపదీ వృత్తాంతంలో అశ్వత్థామ తామస చర్యా అలాగే కనపడకుండా చేశాడు మహాకవి.

ఇలాటి నిర్లిప్తమైన దృష్టి ఎవరికి లేకపోయినా వారికది అలవడే లాగా చూస్తాడు పోతన – అది సహజంగా ఉన్న మరొక పాత్రమూలంగా. విదురు డెలాటివాడో ధృతరాష్ట్రు డెలాటివాడో మనకందరికీ తెలుసు. హస్తిమశకాంతర మిద్దరికీ. ఒకరిది సమదృష్టి – ఒకరిది విషమ దృష్టి. బిడ్డ లందరినీ పోగొట్టుకొని వార్ధక్యం మీద బడ్డా భ్రాంతి వదలని ధృతరాష్ట్రుని ఎలా హెచ్చరిస్తాడో చూడండి విదురుడు. '**పుట్టంధుండవు పెద్దవాడవు మహా భోగంబులా లేవు. నీ చుట్టా లెల్లరు పోయిరి – నీ పట్టెల్లం జెడిపోయె దుస్సహజరా భారమ్ము పైగ్రమ్మె – కట్టాదాయల పంచనుండ దగవే కౌరవ్య వంశాగ్రణీ – కనియె దవో బిడ్డలనిక మనియెదవో తొంటికంటె బిడ్డలకు బుద్ధి సెప్పని గ్రుడ్డికి పిండంబు వండుకొని పొండిదెపై బడ్డాడని భీముండొాఅ గొడ్డెము లాడంగ కూడు గుడిచెద వధిపా. నిరుపాయం బైనకాలంబు వచ్చె నుపాంతంబున మాఱు దీనికి మదింజిం తింపుమని**" హెచ్చరిస్తాడు. ఎంత లోకసహజమిది. ఎంత మనసుకు పట్టే మాటలు. ఎంత వైరాగ్యమందించే సందేశం. మీరే గమనించాలి.

ఇంకొక గొప్ప ఘట్టం చూపుతాను చూడండి. కృష్ణ నిర్యాణానంతరం పాండవులు పడిన నిర్వేదమది. అర్జునుడు స్వయంగా ఆ వార్త మోసుకు వచ్చాడు హస్తినాపురికి. ధర్మజుడికే వినిపిస్తాడది. తాము బ్రతికి ఉండగానే తమ సర్వస్వమని భావించే కృష్ణ పరమాత్మ మరణించట మనేది అత్యాశ్చర్యం కలిగించటమే గాక వారది జీర్ణించుకో లేకపోయారు. జీవుడుండగానే దేవుడు పోవటమేమిటి. అది సర్వజ్ఞుడైన దేవుడికే తెలుసు నా రహస్యం. అది వారు గాదు మనలో మనం చెప్పుకోవలసిన రహస్యం.

దేవుడైనా ఒక విగ్రహ రూపంలో అవతరిస్తే ఆ రూపంగా మరణించక తప్పదు. నామరూప రహితంగా ఎప్పుడూ ఉంటుందది. దానికి మరణం లేదు. అలాగే జీవుడు కూడా శరీరమే తాననుకొంటే మరణిస్తాడు. అది నేను కాను నేను కేవలం జ్ఞాన విగ్రహమనుకొంటే మాత్రం చావడు. బ్రతికే ఉంటాడు. ఈ మర్మం తన మరణం ద్వారా సూచించాడు పరమాత్మ వారికి. లేకుంటే శరీరంగానే ఎప్పటికీ ఆయన ఉంటాడని కలగంటూ ఉండేవారు. ఇది అర్జునాదులు కూడా గ్రహించక పోలేదు. భారతం కాదు గదా ఇది. భాగవతమాయె. భారతంలో వారు కేవలం ధర్మజ్ఞులే గాని తత్త్వజ్ఞులు కారు. ఇక్కడ తత్త్వజ్ఞానం కూడా అలవడింది వారికి. కాదు పోతనగారా పాండిత్యాన్ని వారి కలవరించారు.

యాదవపురి నుంచి ఎంతో ఖేదంతో తిరిగి వస్తా డర్జునుడు. వచ్చీ రాగానే కన్నీరు మున్నీరుగా అగ్రజుని పాదాల కభిషేకం చేశాడు. ఏమి జరిగిందోనని హడలిపోయి ధర్మజు డడుగుతాడు. ఆయనకూ భయమే. తమ ఆపద్బాంధవుడు కృష్ణుని గూర్చి ఏమి చెబుతాడోనని. అందుకే అడుగుతాడు **సుధర్మా మధ్య పీఠంబు నందున్నాడా బలభద్రు గూడి సుఖియై యుత్సాహియై ద్వారకన్ - కన్నీరెన్నడు దేవు తండ్రి చెపుమా కళ్యాణమే చక్రికిన్'** అని. దానికి తగినట్టే **'మన సారధి మన సచివుడు మన విభుడు గురుడు దేవర - మనలను దిగనాడి చనియె'** నని ఆయన మరణ వార్త బయటపెడతాడు. అలా పెట్టి ఆ వెంటనే ఆయనతో తమకున్న పరిచయాలూ అనుబంధాలూ అంతకు ముందు మొదటి నుంచీ జరిగిన సంఘటనలూ ఎన్నో తలచుకొని తలచుకొని దురపిల్లుతాడు. అలా బాధపడి

**'నా చెంతన్ బోయలు మూగి పట్టుకొన - నా సీమంతినీ సంఘమున్ విడిపింపన్ లేక భ్రాంతిన్ భామిని భంగినుంటి** - 'కారణం మచ్చేతో **ధీశుడు చక్రిలేమి'** - అంచేతనే ఒక్కసారిగా **'ఆ తేరా రధి కుండు నాహ యములా యస్త్రాసనం బాశరవ్రాతంబు'** - అదంతా **'భసిత క్షిప్తాజ్య మాయావి మాయాతంత్రోషర భూమి బీజముల మర్యాదన్ తుది వ్యర్ధంబు లైపోయె'** నంటాడు. అంటే అప్పటికి క్రమంగా జ్ఞానోదయ మయిందర్జునుడి కి తాను అంతవరకూ సాధించిందంతా జీవితంలో తన ప్రయోజకత్వం కాదు అంతా దైవకృతమేనని. **పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేద మాయాత్తని** శాస్త్రం. జీవితంలో జరిగినదంతా నెమరు వేసుకొని చూస్తేగాని వైరాగ్యమనేది కలగదు మానవుడికి. అది అర్జునుడికి కృష్ణుడున్నంత వరకూ కలగలేదు. ఆయన వల్ల ఎంత భగవద్గీత విన్నా కలగనిది ఏదీ వినకుండానే ఆయన కనపడకుండా పోయేసరి కుదయించింది. ఇది అనిత్యమని తెలిసినప్పుడే నిత్యమేదా అనే ఆత్మజ్ఞాన మంకురించేది. అలాటి దృఢమైన జ్ఞాన ముదయించి అనే మాటలు వస్తున్నాయాతని నోట. ఏమని.

**'యదువీరుల్ మునినాథు శాపమునఁగాలా ధీనులై యందఱున్**
**మదిరాపాన వివర్ధమాన మదసమ్మర్ధోగ్ర రోషాంధులై**
**కదనంబు ల్తమలోన ముష్టి హతులం గావించి నీతైరిన**
**ష్టదశం జిక్కిరి నల్గురే గు రచటన్ సర్వం సహా వల్లభా'**
**'భూతములకు జన్మ మరణ పోషణములు**
**నిర్ణీతముగఁ జేయు చుండును. భూతమయుం డీశ్వరుండు**
**భూత శరణ్యా' బలములు గల మీనంబులు -**
**బల విరహిత మీనములను భక్షించు క్రియన్**

**బలవంతులైన యదువులు -**

**బలరహితుల జంపి రహిత భావముల నృపా'**

**'బలహీనాంగులకున్ బలాధికులకున్ బ్రత్యర్థి భావోద్యమంబులు**

**గల్పించి వినాశమున్ నెఱపియీ భూభారముంబాపి ని**

**శ్చల వృత్తిం గృత కార్యుఁడై చనియె నా సర్వేశ్వరుం డచ్యుతుం**

**డలఘుండేమని చెప్పుదున్ భగవదీయాయత్త ముర్వీశ్వరా'**

అని తెగేసి చెబుతాడు చివరకు. నిదానంగా కలిగినా జీవితంలో చివర కెలాటి గొప్ప వైరాగ్య విజ్ఞానాలు కలిగాయో చూడండి అర్జునుడికి. అర్జునుడికే అలాటి భావముదయిస్తే ఇక ధర్మరాజు కేర్పడటంలో ఆశ్చర్యమేముంది. ఈ ఘట్టం చదువుతుంటే మనం భారతకాలంలో ఉన్నామా భాగవత కాలంలో ఉన్నామా - సందేహం కలుగుతుంది.

ఎందుకంటే భారత పాత్రలు కారీ పాండవులు. భాగవత పాత్రలు. వారు లౌకికులైతే వీరు లౌకికులుగా కనపడరు మనకు. పోతనగారు వీరిని తాత్త్వికములుగా తీర్చి చూపుతారు. ఆ తరువాత ధర్మజాదులు మనకిక కనపడరు. తీవ్ర జ్ఞాన వైరాగ్య సంపన్నులయి మహా ప్రస్థానం వెళ్ళిపోతారు. ఇదంతా ఆయాపాత్రలకు సంక్రమించిన పోతన మహాకవి సహజ సాత్త్విక ప్రభావం - సమదర్శన స్వభావం.

ఇలాగే ఉద్ధవ విదుర సంవాదం - విదురమైత్రేయ సంవాదం కూడా గమనించ దగిన సన్నివేశాలు. ఉద్ధవుడెక్కడ. విదురుడెక్కడ. ఒకరికొకరికి సంబంధమే లేదు. భారతంలో వారొకచోట కలుసుకొన్న సందర్భమే లేదు. భాగవతంలో మాత్రమలా కాదు. వారు కలుసుకోక తప్పదు.

భగవద్భక్తులంతా ఒక జాతి పోతన దృష్టిలో. వారెక్కడో ఎప్పుడో కలిసి తీరవలసిందే - భగవత్సంబంధి అయిన గోష్ఠి ఇరువురి మధ్యా జరిగి తీరవలసిందే. లేకుంటే విదురుడు హస్తినాపుర నివాసం వదిలేసి తీర్థయాత్ర సేవించటమేమిటి. తన్నిమిత్తంగా ఎక్కడో ఉద్ధవుడిలాంటి మహనీయుణ్ణి కలవటమేమిటి - పైగా యాదవుల వినాశమెలా జరిగిందని అడగటమేమిటి. ఆయనగారు కృష్ణ నిర్యాణంతో సహా ఈయనకు చెప్పటమేమిటి. ఈయన కౌరవుల దుష్టవర్తన భరించలేక విరక్తుడై తీర్థాటనం చేయటమేమిటి. ఆయనను కలవటమేమిటి. కౌరవ వంశ క్షయం కూడా అప్పుడే విదురుడికి తెలియటమేమిటి. తరువాత ఉద్ధవుడి సలహా తీసుకొని మైత్రేయ మహామునిని దర్శించి తత్త్వోపదేశం పొంది అవధూత అయి వెళ్ళిపోవట మేమిటి. ఏమిటిదంతా. ప్రపంచం తాలూకు అనిత్యత్వం బాగా ఒంటపడితే గాని వైరాగ్యమూ తద్వారా మహాత్ముల వల్ల జ్ఞానోపదేశమూ అందుకొని మానవుడు తరించలేడని ఈ పాత్రల జీవితాల ద్వారా పోతన మనందరికీ చూపే జీవిత పరమార్థం.

జయ విజయుల వృత్తాంతం కూడా చాలా చిత్రంగా వర్ణిస్తాడు కవి. వారు వైకుంఠ ద్వారపాలకులు. విష్ణుభక్తులు. సనక సనందనాదులు భగవద్దర్శనానికి వస్తే నివారిస్తారు. వారు దానికి కోపించి శాపమిస్తారు వారికి. ఇంతవరకూ మనకందరికీ తెలిసిందే. వారు తప్పు చేశారు. వీరు శాపమిచ్చారు. స్వామి దాని కామోదించాడని మాత్రమే తెలిసింది మనకు. కాని పోతనకంత కన్నా ఎక్కువగా తెలుసు దాని ఆంతర్యం. అదేమిటో తెలుసా. విషయమంతా తెలిసి శ్రీవారే బయటికి వస్తాడు.

వారు చేసిన అపరాధానికి నేను శిక్షార్హుణ్ణి నన్ను మన్నించండని వేడుకొంటాడు. అందుకు మహర్షు లాందోళన చెంది మేము నిరపరాధులూ నిర్మలాంతః కరణులైన వారి ననవసరంగా శపించా మనిపిస్తే మమ్మలనే మన్నించమని ప్రార్థిస్తారు. మీ తప్పేముంది లెండి. మీరు శపించటం సమంజసమే. ఎటు వచ్చీ వారు భూలోకంలో జనించినా అడుగడుగునా నా దృష్టి నాకర్షించే అకృత్యాలు చేస్తూ తుదకు నాతోనే యుద్ధం చేసి నాముఖం మీదనే దృష్టి నిలిపి నాచేత హతులై చివరకు నన్నే చేరుతారు. మీరు కంగారు పడకండని వారిని సాగనంపుతాడు.

అంతవరకూ నోరు మెదపకుండా వారిరువురి సంభాషణ ఆలకిస్తూ ఊరక నిలబడి చూస్తున్నారు మౌనంగా జయ విజయులు. సనకాది మహర్షుల కంటే నిజమైన విష్ణుభక్తులు వారు. ఎందుకంటే సనకాదులు తొందర పడి మొదట శపించినప్పు డొక్కటే మాట అన్నారు వారు. **"లోభ మోహముల్ గైకొని పుట్టుచోట నవకంజ దళాక్షుని నామ విస్మృతిం బైకొన కుండ జేయుండిదే** మీరు మాకు చేయువలసిన ఉపకారమని మాత్రమంటారు. ఆ తరువాత స్వామివారు తమ్మనుగ్రహించి వైకుంఠం నుంచి పంపేవరకూ ఒక్కమాట మాటాడలేదు. ఎలాగూ మహర్షులు తాము తొందర పడ్డందుకు పశ్చాత్తాప పడతారనీ స్వామివారు తమ నిత్యసన్నిధిలో ఉండి సేవిస్తున్న తమ అచంచల భక్తికి తగిన మంచి కానుకనే ప్రసాదిస్తారనీ బాగా తెలుసు వారికి. అందుకే గమనించి చూస్తున్నారు. దానికి తగినట్టే స్వామి తన పాటికి తాను బయటికి రావటమూ జరిగింది. మహర్షులు తమ పాటికి తాము పశ్చాత్తాపం చెందటమూ జరిగింది.

అంతేగాక వారిని వీడు కొలిపే వరకూ ఏమీ మాటాడక స్వామి ఆ తరువాత వారిని చూచి మీరేమీ బాధపడకండి **'అసుర యోనుల యందని వారితులై జనన మంద వలసెను - నే దుర్వార బలాఢ్యుడ నయ్యును వారింపగ నోప విప్రవచనము నెందున్' మద్విపక్షులరై మీమది నెపుడు నన్నె తలచుచు వదలక నాచేత జచ్చి వచ్చెద రిటకున్'** పొండని వారి ననునయించి పంపుతాడు.

చూచారా. పోతన గారి సత్త్వగుణ సంపత్తి. ముగ్గురికీ మూడు విధాల పంచి పెట్టిడా సంపద. స్వామి వారెలాగూ సత్త్వగుణాఢ్యుడే. పాము చావకుండా కఱ్ఱ విఱగకుండా ప్రవర్తించాడు. సనకాదుల దగ్గర సనకాదుల మాట. జయ విజయుల దగ్గర జయ విజయుల మాట. అక్కడ రాజస మభినయిస్తాడు. ఇక్కడ సాత్త్వికం చూపుతాడు. పోతే సనకాదులు తొందరపడి శపించి మరలా ఎవరూ అనకముందే తమకు తామే భయపడి తమ అపరాధానికి తమ్ములనే శిక్షించమని స్వామి ఎదుట మెత్తబడి మాటాడుతారు. మరి జయవిజయులో. మహర్షులు చెప్పినట్టు అనపరాధులే. నిర్మలాంతఃకరణులే. సర్వధర్మాన్ పరిత్యజ్య అన్నట్టు తమ డ్యూటీ తాము చేశారు. దాని ఫలితం స్వామివారి దివ్య చిత్తానికే అప్పజెప్పారు. ఇదీ చివరకు పోతన గారి పరిష్కారం. ఒక్క పోతనామాత్యుడే చేయగల డిలాటి ఫీటు. అది కూడా లోటు లేని ఫీటు. నిజంలో నిర్మలాంతః కరణుడీ మహాకవే. అదే ఆ ద్వారపాలకులలో ప్రతిఫలించి కనిపిస్తున్న దాయనకు బహుశా.

Brahmasri Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in

త్రిగుణాలలో సత్త్వగుణం విష్ణుదేవుడి సొమ్మని గదా ముందుగానే బయటపెట్టాడు పోతన. సత్త్వగుణమనేది నిర్మలమూ అనామయమూ ప్రకాశకమూ అని భగవానుడు స్వయంగానే చాటి చెప్పాడు కూడా. అది విక్షేపరూపమైన రజస్సునూ ఆవరణ రూపమైన తమస్సునూ రెండింటినీ అదుపులో పెట్టుకొని విజృంభించగలదు. అప్పుడది శుద్ధ సత్త్వం. స్వామివారి యందిలాటి సమత్వాన్ని ఎంతగా దర్శించాడో గాని మహాకవి దానికి తగినట్టే ఆ కథానాయకుడి కథనంతా అలాగే చివరిదాకా నడుపుతూ పోతాడు. అలా నడపాలంటే తనకు కూడా సమదర్శన మనే గుణం సహజంగానే ఉండాలాయనకు. కనుకనే మూలవిరాట్టులోనే గాక తదీయావతారాలను వర్ణించేటపుడు సైతమిది అద్భుతంగా తొంగి చూస్తుంటుంది.

చూడండి. పాలకడలి మథిస్తున్నారు దేవదానవులు - ఎందుకు. అమృతం కోసం. అలా మథిస్తుంటే అందులో ఎన్నో విలువైన పదార్థాలు జన్మిస్తూ వచ్చాయి. చివరకు లక్ష్మీ దేవే సాక్షాత్తూ ఆవిర్భవించింది. బ్రహ్మాండంగా ఉందావిడ సౌందర్యం. ఆవిడ రాజసమంత కన్నా గొప్పగా ఉంది. **'భావించి యొక మాటు బ్రహ్మాండమంతయు నాటల బొమ్మరిల్లని తలంచు'** ఇలాంటిదీ ఆమె రాజసం. మరి సౌందర్యమా - **ఆ కన్నులునా చన్నులు నా కురులా పిరుదు నడుము'** చెప్పనలవి గాదు. అది చూచి వేల్పులందరూ చీకాకుపడి శిలాప్రతిమలలాగా నిలబడి పోయారట **'శ్రీహరి దక్కన్'** అంటాడు కవి. పోతే ఆవిడ మనసులో **'ఐదువనై యుండ**

**నలనడదొకచోట నొకచోట సవతితో నోర్వరా'** దని అందరినీ త్రోసిపుచ్చి' **అమర ముత్తైదువనై యుండ వచ్చును - వరుసకు సవతులెవ్వరును లేరు శృంగార చందన శీతలుండు - కలగడెన్నడు శుద్ధకారుణ్య మయమూర్తి'** అని తనకే వరుని కివ్వవలసిన బిరుదులన్నీ ఇచ్చి స్వయంగా వచ్చి పుష్పదామం మెడలో వైచి పూజించిందట స్వామివారిని. **'తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే సశాంతి మాప్నోతి'** అని తానే గదా సెలవిచ్చాడు లోకానికి.

అంతేకాదు. ఆమె ఎంత త్రిలోక సుందరి అయినా అంతకన్నా నా సౌందర్యమేమీ తక్కువది గాదు. అంతకన్నా అద్భుతంగా ప్రదర్శించ గలనన్నట్టు తరువాత మోహినీ రూపంలో సాక్షాత్కరి స్తాడాయన. ఆ జగదేక సుందరినీ ఈ జగదేక సుందరుణ్ణీ ఇరువురినీ ఎక్కడికక్కడ ఒకరిని మించి ఒకరిని అద్భుతంగా వర్ణిస్తాడు కవి. అంతేగాక **'పాలిండ్ల పైనున్న పయ్యెద సడలించు - సడలించి మెల్లన చక్కనొత్తు తళుకు తళ్కున గండ ఫలకంబు నొలయించు - నొలయించి కెంగేల నుజ్జగించు'** అని అమ్మగారి కంటే అయ్యగారి హావభావాలు ఇంకా ఎక్కువగా చూపుతాడు. అది చూచి రాక్షసులామె వెంటబడి **ఔగదే లావణ్య మౌఁగదే మాధుర్య మౌఁగదే సతి నవయౌవన నొంగి ఎట నుండి వచ్చితి దేమిచ్చగించెద'**వని ప్రాధేయ పడ్డట్టు వర్ణించట మింకా హాస్యరస బంధురం.

ఇదంతా ఒక ఎత్తు. ఆ మోహనాంగి వారితో అన్న మాటలు వింటే అవి ఎంత నర్మగర్భితమో చూడండి.

**'సుందరులగు పురుషులఁగని - పొందెడు నాయందు నిజము పుట్టునె మీకున్ పలుకులు మధురస ధారలు - సెలుములు సాలావృకములు సెలువల నమ్ముటలు వేద సిద్ధాంతములే'** అని రెండు సుభాషితాలు ప్రవచిస్తుంది. ఇది రాక్షసులకే గాదు. అక్కడే తన వక్షఃస్థలంలో నివసిస్తున్న శ్రీకాంతకు కూడా మనసుకు తగిలే మాటలే. జగన్నాటక సూత్రధారి గదా. అందుకే ఎందులోనూ పడిపోడు పరమాత్మ. రాగద్వేషాది ద్వంద్వాల కతీతుడు. అలాటి గుణాతీతత్వం పరమాత్మకెలా ఉందో అదే తనకూ అంతో ఇంతో సహజంగానే సంక్రమించింది పోతనగారికి. దానికనుగుణంగానే సాగుతూ వచ్చిందీ వర్ణన కూడా. భక్తి శృంగార హాస్య రసాలను మూడింటినీ మేళవిస్తూ వాటి కతీతమైన జ్ఞాన వైరాగ్యాలను మనకెలా ధ్వనింప జేశాడో చూడండి.

అంతా విష్ణుమాయ. త్రిమూర్తులలో మాయావి శ్రీమహావిష్ణువే. మాయాశక్తిని తానధీనం చేసుకొని లోకులందరినీ దాని కధీనం చేస్తుంటాడు. అది గుర్తించిన వారి నభినందిస్తాడు. గుర్తించ లేని వారిని గుర్తింపజేస్తాడు. మొత్తాని కజ్ఞులనూ ప్రాజ్ఞులనూ ఎవ్వరినీ ఉపేక్షించడు. దూరం చేయడు. అది ఒక లీల. ఒక ఖేల. మహాభక్తుడూ మహాజ్ఞానీ అయిన పోతనగారి కి బాగా తెలుసు. కేళి లోల విలసద్దృగ్జాలమని అన్నాడంటే ఇదంతా మనసులో ఉండే అన్నాడు. అప్పటికి భక్తపాలన కళా సంరంభమూ దానవోద్రేక స్తంభనమూ - దుష్ట శిక్షణా శిష్ట రక్షణా - ఇవి రెండూ కేవలం ఆ జగన్నాటక సూత్రధారి నాటక ప్రయోగమే నన్న మాట.

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

ఇది మనకు రెండు ఘట్టాలలో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. మొదటిది గజేంద్ర మోక్షణం. రెండవది బలిచక్రవర్తి శిక్షణం. మోక్షణానికి ముందు శిక్షణా ఉంది. శిక్షణానికి వెనుక మోక్షణా ఉంది. రెండూ మౌనంగా చేసేవాడు పరమాత్మ అయితే ఆయన మౌనోపదేశ మందుకొని మాటలలో చాటాడు మహాకవి. అది వ్యంగ్యం. ఇది గుణీభూత వ్యంగ్యం. గజేంద్రుణ్ణి రక్షించటానికి సంరంభం చూపాడు విష్ణువు. ఆ భక్తపాలన కళా సంరంభ మెలాంటిదో కవితా కళాత్మకంగా ప్రదర్శిస్తున్నాడు పోతన. సంరంభ మంటే అచ్చ తెలుగులో చెబితే హడావుడి. తొందరపాటు. అంతవరకూ గజేంద్రుడంతగా మొరపెడుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు కూచున్న శ్రీహరికా తొందరపాటేమిటి. హడావుడేమిటి. ఆ హడావుడిలో **'సిరికిం జెప్పడు - శంఖచక్రయుగముం జేదోయి సంధింపడు'** అమ్మవారితో అంతవరకూ విలాసంగా జూదమాడే వాడా మెతో ఒక్క మాటా అనలేదు. శంఖచక్రాదు లేవీ చేతికి తీసుకోలేదు. వైనతేయుణ్ణీ మరచిపోయాడు. నారదాది మహర్షు లెవరినీ పలకరించడు. ఒకటే పరుగు, ఎక్కడికో ఏమోనని వారంతా తన వెంట పరుగెత్తి వస్తారు. **'తన వెంటన్ సిరి లచ్చి వెంట నవరోధవ్రాత ముందాని వెన్కను పక్షీంద్రుడు'** ఒకటేమిటి పరివారమంతా హడావుడిగా పరుగుదీస్తారు. ఆకాశంలో గుమిగూడి చూచే దేవతలంతా హడలిపోయి **'నమోనారాయణాయ నమో నారాయణాయ'** అని ఒకటే కేకలు అరుపులు. మరి లక్ష్మీదేవి తబ్బిబ్బుతో అడుగు ముందుకు పడక **'అడిగెదనని కడువడిఁ జను - నడిగిన దను మగుడనుడు వడని నడ యుడుగున్'** అంతా గందరగోళమే. స్వామివారికీ ఆయన దేవేరికీ పరివారానికీ ముక్కోటి

దేవతలకూ ఆఖరుకా గందరగోళాన్ని వర్ణించే తన పద్యరచనకూ అన్నింటికీ పంచి పెట్టి నింపాదిగా నిలుచొని చూస్తున్నాడు స్థిత ప్రజ్ఞుడిలాగా మహాకవి. ఏమిటిది - ఎందుకిది. భక్తపాలన కళా సంరంభమని గదండీ కావ్యారంభంలోనే వర్ణించాడు పోతరాజు. మరి ఆ సంరంభ మెలాటిదో చూపకపోతే ఎలాగా. అందుకే చూపాడలా.

భక్తపాలన కళాసంరంభ మెలాటిదో చూపాను గదా. ఇక దానవో ద్రేకస్తంభన మనేది ఎలా ఉంటుందో చూపుతాను చూడండంటాడు మహాకవి. అది మొదటిదైతే ఇది రెండవది. అది గజేంద్రుడి విషయమైతే ఇది బలిచక్రవర్తి వృత్తాంతం. గజేంద్రుడు కర్మచాలక గజేంద్రుడయ్యాడు గాని అసలాయన ఇంద్ర ద్యుమ్నుడనే మహారాజు. గొప్ప విష్ణుభక్తుడు. అయితే సగుణోపాసకుడే గాని నిర్గుణ జ్ఞాన సంపన్నుడు కాడు. అది చాలా పెద్ద కొఱత భగవానుడికి. ఎలాగా ఈ మనిషిని ఉపాసన నుంచి తప్పించి జ్ఞానిగా మార్చడమని మధనపడి ఉంటాడు బహుశా. అందుకే అగస్త్యుడికి ప్రేరణ కల్పించి అతని దగ్గరికి పంపి మర్యాద చేయలేదని కోపం తెప్పించి ఆ రాజుకు శాపమిప్పించాడు. ఏమని - **'మూఢ లుబ్ధ కరీంద్రోత్తమ యోనిఁబుట్టు'** మని. చూచారా ఈ మాటలలో మర్మం. మూఢుడట లుబ్ధుడట ఆరాజు. మహాభక్తు డాయన. మూఢుడెలా అవుతాడు. మూఢుడే భగవత్తత్త్వ జ్ఞానం లేదు కాబట్టి. లుబ్ధుడెలా అయ్యాడు. లుబ్ధుడే దాన్నే సగుణరూపంగా చూచి అదే దగ్గర పెట్టుకోవాలని ఆశపడుతున్నాడు కాబట్టి. అలాటి సంకుచిత భావం హరించటానికే ఈశాపం. శాపమొక వ్యాజం. లేకుంటే గజేంద్ర ఉత్తమ యోనిలో పుట్టమని శపిస్తాడా ఎవడైనా.

అంటే మామూలు గజం కాదు. అందులో ఇంద్ర శ్రేష్ఠమైనది. అందులో కూడా ఉత్తమ ఉత్తమాధికారి అని భావం.

ఇలా ఉత్తమాధికారి ఎప్పుడవుతాడు. గజేంద్రుణ్ణనే అహంకారంతో కన్నుగానక కొంతకాలం బ్రతికితే. అలాగే బ్రతికాడు. **'నానానేక పయోధముల్గొలుప'** నాకేమి పొమ్మని. పోతే **'సంశిథిలంబై మిథ్యామనో రథమింకేటి'** కని చేతులెత్తి జ్ఞానోదయమై మరలా నిర్గుణతత్త్వం వైపు మొగ్గ చూపాడని గ్రహించినప్పుడే అహంకారానికి ప్రతీక అయిన గజ శరీరం నుంచి మోక్షం కల్పించాలని – ఇక ఏమాత్రమూ ఆలస్యం పనికిరాదని బయలుదేరాడు వైకుంఠం నుంచి. అదీ ఆ సంరంభం. అక్కడ ఒకమాట అంటాడు కూడా మహాలక్ష్మితో. మహాలక్ష్మితో విష్ణువు గాదు. ఆ ముసుగులో దాగి ఉన్న పోతనామాత్యుడు మనతో. ఏమని. **'కర్మతంత్రుడగుచు కమలాక్షుఁ గొల్చుచు – నుభయ నియతవృత్తి నుండెనేని జెడును గర్మమెల్ల శిథిలమై – మెల్లన – ప్రబలమగుచు విష్ణు భక్తి పెరుగు'** – కేవలం స్వామిని కొలిచే భక్తి కాదు. కేవల కర్మ మార్గానుసరణమూ కాదు. ఉభయమూ ఏకకాలంలో పాటిస్తూ పోవాలి. అదే అద్వైత జ్ఞానం. పారమార్థిక దృష్టితో వ్యావహారికాన్ని ఆచరిస్తూ పోవటం. దీనికి సమదర్శనమని పేరు. అది లేదు మొదట ఇంద్రద్యుమ్న జన్మలో ఆ మానవుడికి. అది నేర్పటానికే గజేంద్ర జన్మ తెప్పించాడు పరమాత్మ. బాగా అతని కది అలవడిందని నమ్మకం కలిగిందో లేదో ఇక భక్తపాలన కళా సంరంభం చూపాడక్కడ.

Yalamanchili Brahmasri Srinivasa Rao
www.advaitavedantam

పోతే బలిచక్రవర్తి విషయంలో అలాటి సంరంభ మక్కర లేదు. ఇతడు ఇంద్రద్యుమ్నుడి లాగా సాత్త్వికుడు కాడు. రాజసుడు. కనుక దాన్ని ముందు దమనం చేయాలి. అదే ఉద్రేక స్తంభనం. అందుకే చాపకింది నీళ్లలాగా నింపాదిగా చేస్తూ వచ్చాడు భగవానుడు. కాకపోయినా రావణ కుంభకర్ణుల లాంటి వాడూ హిరణ్యాక్ష హిరణ్యకశిపుల లాటి వాడూ కాడు బలి. వచ్చీ పోయి విభీషణుడి లాగా సత్త్వగుణ సంపన్నుడే. ప్రహ్లాదుడి మనుమడు గదా. ఆమాత్రం వంశలక్షణ మతనికి సంక్రమించకుండా పోతుందా. అయితే అది తాత్కాలికంగా మరుగు పడిపోయింది రజో గుణంతో. అంచేత శిక్షార్హుడయ్యాడు. అది కూడా రాజసమైన స్వభావాన్ని అణగద్రొక్కటమే పరమాత్మ చేసింది. బలిని పాతాళానికి త్రొక్కి వేశాడంటే అర్థమది. అసలు బలిని మొదట చూచినప్పుడే అతని మంచి చెడ్డలు రెండూ సూచన చేస్తాడాయన. **'ఇతడే దానవ చక్రవర్తి సురలోకేంద్రాగ్ని కాలాది దిక్పతి గర్వాపనయ ప్రవర్తి'** అని అతనిలో ఉన్న అహంభావాన్నీ బయటపెట్టాడు. **'గతలోభ స్ఫూర్తి - నానా మఖ వ్రత దాన ప్రవణానువర్తి - సత్యకరుణా ధర్మోల్లసన్మూర్తి'** అని ఆయన సాత్త్విక గుణ సంపదనూ ఎంతగానో మెచ్చుకొంటాడు. **'సమోహం సర్వభూతేషు'** అన్న వాడు గదా భగవానుడంటే. అలాటి సమదర్శనుడైన పరమాత్మకు వీడు అయిన వాడు వీడు కాని వాడని తేడా ఏముంటుంది. అయితే ఎవడెప్పుడు పొగరున బడితే వాడి పొగరు వదలించి సన్మార్గానికి మరలించటమే ఆయన చేసే దుష్ట శిక్షణ. దుష్ట స్వభావ శిక్షణ అని అర్థం. అలా శిక్షిస్తే అంతర్గతంగా ఉన్న సాత్త్విక స్వభావం బయట పడుతుంది. భగవదనుగ్రహానికి పాత్రు

డవుతాడు మానవుడు. ఇలాటి ఈశ్వర సంకల్పాన్ని గుర్తించి వర్ణించా డంటే పోతన గారి కెంత ఉండాలా గొప్ప సమదర్శనం. అదే ఆయన గారి సహజ పాండిత్యం.

వామనుడుగా వచ్చి మాటాడుతూ మాటాడుతూనే త్రివిక్రమావతారం ధరించాడు మహావిష్ణువు. అది అలా జరుగుతుందని చాలావరకు తెలుసు బలిచక్రవర్తికి. ఆ యిరువురూ చేసిన సంభాషణలోనే అది సవసవగా ధ్వనిస్తూనే ఉంది. **'వడుగా యెవ్వరి వాడ వెవ్వడవు సంవాస స్థలం బెయ్య'**దని ప్రశ్నించటంలో ఆ వచ్చినవాడు ఎవరితోనూ సంగం లేక సర్వవ్యాపకుడైన పరమాత్మ అని ధ్వనించటం లేదా. అంతేకాదు. **'పరచేలంబులొ మాడలో - ధరణీ ఖండమో కాకయేమడిగెదో'** - ధరణి అడుగుతావని పేరేగాని అది గాదు ఆనెపంగా మరేదో ఉంది నీ ఉద్దేశం. మూడడుగులు చాలా స్వల్పం - అది నీవడగటమేమిటి నేనివ్వటమేమిటి. ఇచ్చినా నీవీ అల్పంతో తృప్తిపడవు నాకు తెలుసు అని కూడా స్వామివారి హృదయం తెలిసిన వాడిలాగా మాటాడుతాడు. మరి భక్తుడే ఇలా మాటాడితే భగవానుడేమి తక్కువ. **ఇది నాకు నెలవని యేరీతి పలుకుదు - నొకచో టనక యెందు నుండ నేర్తు - తృప్తింజెందని మనుజుడు సప్తద్వీపముల నైనఁ జిక్కంబడునే'** అని చాలా అమాయికత్వం నటిస్తూ జవాబిస్తాడు.

కులగురువైన శుక్రాచార్యు డిదంతా గ్రహించి తన్ను హెచ్చరిస్తే బలిచక్రవర్తి అంటాడాయనతో. **ఎన్నడుంబరు వేడ బోడట యే కలుండట కన్నవారన్న దమ్ములు నైన లేరట'** అలాటి ఈ చిన్ని పాపడు నన్ను చేతులొగ్గి

అడిగితే కాదని త్రోసిపుచ్చ మనసొప్ప లేదు మహానుభావా! ఒకవేళ నీవన్నట్టీ యన శ్రీమహావిష్ణువే అయితే మరీ మంచిది. **'ఆదిన్ శ్రీసతి కొప్పుపై తనువుపై - నూత్న మర్యాదం జెందు కరంబు క్రిందయి నాకరంబు మీదయితే** అది నాకు గౌరవమే గదా అంటాడు - చూడండి ఇందులో కొంచెం రాజసం తొంగి చూస్తున్నది. గురువు గారు చివరకు తన్ను శపించినా తొణకలేదు. అందులో సత్త్వగుణం స్ఫురిస్తున్నది. తుదకు **'విప్రాయ విష్ణు రూపాయ'** అని ధారపోస్తాడు పాదత్రయ సమ్మితమైన ధరిత్రిని. **'కమలనాభు నెఱిగి కాలంబు దేశంబు నెఱిగి శుక్రుమాట లెఱిగి నాశమెఱిగి'** ఇలా దానం చేశాడంటే ఎంత గొప్పవాడో ఆ బలి అని పోతనగారే ఆశ్చర్యపోతాడు.

సరే ఆ తరువాత స్వామి ఆయనను వరుణపాశ బద్ధుణ్ణి చేయటం. బలి ధర్మపత్ని వింధ్యావళీ - సాక్షాత్తూ అతని తాత ప్రహ్లాదుడూ వచ్చి సిఫారసు చేయటం - చేస్తే స్వామి వారొక్కటే మాట అంటాడు. నాకు తెలుసు లేవోయి మీరు చెప్పనక్కర లేదు. నేనెవరి ననుగ్రహించాలను కొంటే వారి గృహక్షేత్ర విత్త విభవాదులన్నీ హరించి వాణ్ణి పరిశుద్ధుణ్ణి చేసి నా అనుగ్రహానికి పాత్రుణ్ణి చేస్తాను సుమా. ఇతడు మొదట ఎలా ప్రవర్తించినా చివర కితనిలో ఉన్న రాజస తామసాలు నశించి సత్త్వగుణ సంపన్నుడని పించుకొన్నాడు. అది ఇతని మాటలలోనే గుర్తించవచ్చు. నామరొక భక్తుడు పోతనామాత్య నడగండి. ఆయన ఏమని వర్ణిస్తున్నాడో **చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు - ధనము లస్థిరములు - తనువతి**

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

**చంచల - ఈ కపట సంసారంబు నిక్కంబుగా దలచున్ మూఢుడు సత్యదానకరుణా ధర్మాది నిర్ముక్తుడై'** అని ఆ పాత్ర నోటనే అనిపిస్తున్నాడు చూచారా. నేను మొదట ఆ దానవచక్రవర్తిని చూచినప్పుడే భావాలు నాకు స్ఫురించాయో ఆ భావాలే మరలా పరమార్శిస్తున్నాడు చూచారా మహాకవి. ఇలాటి క్రాంత దర్శులైన కవులంటే నాకెంతో ఇష్టమంటాడు పరమాత్మ. అందుకే బలిని పాతాళాని కణగదొక్కాడని మాటేగాని తాను కూడా ఆయనతో పాటే పోయి ఆయన గారి ద్వారపాలకుడి పోస్టు సంపాదించుకొని స్తంభకుడు గాక మరలా భక్తపాలన కళా సంరంభకు డనిపించుకున్నాడు దేవదేవుడు.

ఎంత మనోజ్ఞంగా ఎంత ప్రజ్ఞాపారమితంగా నడిపాడో చూడండి ఈ వామన బలి వృత్తాంతం పోతరాజు. దేవతలు గదా పరమాత్మ కాప్తులు. దానవులు కారని గదా మన అంచనా. మన అంచనా తప్పనిపిస్తుంది ఇలాంటి ఘట్టాలు చదువుతుంటే. అనిపించటం కాదు. అనిపించేలా చేస్తాడు మహాకవి పోతానామత్యుడు. ఒక్క బలి చక్రవర్తి విషయమే గాదు. భగవాను డెక్కడెక్కడ ఏయే రాక్షసుల కెదురుపడి వారు తన్ను నిష్ఠురాలాడినా ఆ నిష్ఠురోక్తులలో ఈ నిజాన్నే దూరాన నిలబడి చూస్తూ పోతన గారిలాగే ధ్వనింపజేస్తాడు మనకు. హిరణ్యాక్షుడు మరణించినప్పుడు అతని అనుజుడైన హిరణ్యకశిపుని చేత ఏమి పలికిస్తున్నాడో చూడండి మహాకవి. అతడు విప్రచిత్తి మొదలైన దానవులను జూచి **'నాకుందమ్ముడు మీకు నెచ్చెలి'** హిరణ్యాక్షు డతణ్ణి వైకుంఠుడు వధించి పోయెనట. ఆ వైకుంఠు డెవరో తెలుసా మీకు. **'వనముల నుండు జొచ్చుముని వర్గములోపల - సంజనన**

మెఱుంగ లెవ్వరును జాడ యొకింతయు లేదు - వీని నొక్కకీలున మనమెల్లలోఁబడక లోబడ బట్టు కొనంగ వచ్చునే అగమ్యగోచరమైన భగవత్తత్వాన్ని ఎంత నిగూఢంగా వర్ణిస్తున్నాడో చూడండి ఆ దానవుడు అంతేగాదు.

భుజశక్తి నాతోడఁబోరాడ శంకించి
మున్నీట మునిఁగిన మునుగుఁగాక
అలయించి పెనఁగునా యచల సంభ్రమమున
కెరగి వెన్నిచ్చిన నిచ్చుగాక
జగడంబు సైపక సౌకర్య కాంక్షియై
యిల క్రిందనీఁగి నణీగుగాక
క్రోధించి యటుగాక కొంత పౌరుషమున
హరిభంగి నడరిన నడఁరుఁగాక

చూచారా వాడి వాక్చమత్కృతి. సముద్రంలో దూకినా యుద్ధం చేయలేక వెన్ను చూపినా అనటంలో మత్స్య కూర్మావతారాలు తొంగి చూస్తున్నాయి. అందులోనూ అచల సంరంభం - వెన్నివ్వటం అనే మాట లెంత భావగర్భితాలో చెప్పలేము. మరి సౌకర్య కాంక్షి అంటే సుకరత్వమనీ సూకరాకృతి అనీ సూచిస్తున్నాడు. కొంత పౌరుష మనటంలో నృసింహావతారం గుర్తురావటం లేదా మనకు.

హిరణ్యాక్షుడేమో గాని హిరణ్యకశిపుడు తక్కువ వాడు గాదు. వాడు తమోగుణంతో పుడితే వీడు రజోగుణంతో జన్మించినవాడు గదా. ఆమాత్రం

మాటకారితనం లేకపోతే ఎలాగా. అంతేగాదు. శాస్త్రజ్ఞానం కూడా బాగా ఉన్నవాడు. ఏ శాస్త్రాలు. మిగతావన్నీ అలా ఉంచి - అధ్యాత్మ శాస్త్రంలో కూడా ఆరితేరినవాడు. లేకుంటే తమ్ముడి మరణాన్ని తలచి అంతఃపుర కాంత లేడుస్తూ కూచుంటే వారిని సంబోధించి అతడిలా వారికి బోధ చేయగలడా.

**నీరాగార నివిష్ట పాంథుల క్రియన్ నిత్యంబు సంసార సం**
**చారు ల్వత్తురు - కూడి విత్తురు - సదాసంగంబులే దొక్కచో**
**శూరుల్వోయెడి త్రోవఁబో యెను భవత్పూనుండు తల్లీ మహా**
**శూరుండాతడు - తద్వియో గమునకున్ శోకింప నీకేటికిన్**

అని తన తల్లి దితికి వైరాగ్యోపదేశం చేస్తాడు. అంతేనా.

**సర్వజ్ఞుఁడీశుండు సర్వాత్ముదవ్యయుం**
**దమలుండు సత్యుడనంతు దాధ్య**
**దాత్మరూపంబున నశ్రాంతమును దన**
**మాయా ప్రవర్తన మహిమ వలన**
**గుణములఁ గల్పించి గుణ సంగమంబున**
**లింగ శరీరంబు లీలఁదాల్చి**
**కంపిత జలములోఁ గదలెడు క్రియఁదోఁచు**
**పాదపంబుల భంగి భ్రామ్యమాణ**

**చక్షువుల ధరిత్రి చలితయై కానంగఁ బడిన భంగి వికలభావరహితు డాత్మమయుడు కంపితాంతరంగంబునఁ గదలినట్లతో చు గదల కుండు.**

అని పరమాత్మ సగుణ నిర్గుణ రూపాలు రెండూ తెలిసిన మహాజ్ఞానిలాగా అభివర్ణిస్తూ ఆ సందర్భంలో ప్రేత బంధు యమసంవాదమనే ఇతిహాసం కూడా దాని కుపోద్బలకంగా పేర్కొంటాడు. చాలా దూరమీ కథ ఏకరువు పెట్టి చివరకొక బంగారంలాంటి మాట అంటాడు. **'పరులెవ్వరు తామెవ్వరు - పరికింపఁగ నేక మగుట భావింపరు త-త్పరమజ్ఞాన ము లేమిని - పరులును నేమనుచుఁదోచుఁ బ్రాణుల కెల్లన్'** - ఎంత జ్ఞాని అయి ఉండాలి. ఇలాటి సుభాషితం అతని నోట పలకాలంటే. అద్వైత వేదాంత జ్ఞానమంతా ఉట్టిపడుతున్న మాటలివి. కాకపోయినా హిరణ్యాక్షుడెవడు. జయ విజయులలో ఒక్కడైన జయుడు గదా. అతడెవడు. వైకుంఠ ద్వార పాలకుడే గదా. నిరంతరం భగవత్సాన్నిధ్యంలో నివసించే ఆ భాగవతుడికి భగవత్తత్త్వం తెలియకపోవట మేమిటి. తెలుసు. అన్ని అవతారాలలో స్వామివారి కెలా సమగ్రమైన ఎఱుక సడల కుండా ఉంటుందో అలాటి ఎఱుకే ఉంటుందా దౌవారికుడికి కూడా. **'యోమా మజ మనా దించవేత్తి'** అని ఆయన గారే గదా తన భక్తులకు టైటిలిచ్చాడు. అయితే చమత్కార మేమంటే అవతారాలలో స్వామి ఎలా బయటపడి కనిపించడో అలాగే ఈ గోస్వాములు కూడా కనిపించరు. పైకి కనిపించకున్నా వారి మాటల్లో చేష్టల్లో అది మనకు వ్యంగ్యంగా స్ఫురిస్తూనే ఉంటుంది. అలా స్ఫురింప

జేయక పోతే సహజ పాండిత్య సంపన్నుడైన మహాకవి మన సొప్పుకోదు. బయటపెడితే ఆయన కానందం.

ఇంతెందుకు. ప్రహ్లాదుణ్ణి ఎన్నో బాధలు పెడుతూ వచ్చాడు గదా. ఏ ప్రయోగం చేసినా వాడు చావకుండా బ్రతుకుతూ వచ్చేసరికి గ్రహించాడు హిరణ్యకశిపుడు – వీడేదో దైవాంశ సంభూతుడని. స్పష్టంగా అంటాడు కూడా. ఏమని. వీడు మహాప్రభావ సంపన్నుడు వీనికెందును భయంబు లేదు. వీనితోడి విరోధంబునం దనకు మృత్యువు సిద్ధించునని నిర్ణయించాడట. ఎంత భవిష్యత్తు తెలుసో చూడండా దానవుడికి అంత తెలిసిన వాడెందుకా బాలుణ్ణి హింసించటం. తెలుసు గనుకనే. అలా వాణ్ణి నానా బాధలు పెడితేగాని స్వామి వారవ తరించరు. తన్ను చివరకు కడతేర్చడని వాడి ఆశయం. అందుకేనేమో నరసింహస్వామి అవతరించినపుడా విగ్రహాన్ని చూస్తూ విస్తుపోయి **'నరమూర్తిగాదు కేవల హరిమూర్తి యుఁగాదు – మానవాకారము కేసరి యాకారము నున్నది – హరి మాయా రచితమగు యథార్థము సూడన్'** నరసింహ అనే ఆకారాన్ని చూచి భయపడ లేదతడు. ఇది తన స్వామి మాయా శక్తి కల్పితమని గ్రహించాడు. ఎందుకంటే పైపైన చూచేవారి కెవరికీ తెలియదు దాని తత్త్వం యథార్థమైన భగవత్స్వరూపం గుర్తించిన వాడు గనుకనే తెలుసు నతనికి.

సరే కానీ ఏదైతే అది అవుతుంది. **'చక్రి శిక్షింపగ వచ్చినాడు హరిచే మృతి యుంచుఁద లంతు** నని జరగబోయే విషయం కూడా స్పష్టంగా తెలిసి మాటాడుతాడు. అసలు తనకు కావలసింది కూడా అదే.

స్వామివారితో పోరి ఆయన ముఖారవిందం చూస్తూ మరణించి మరణానంతరం మరలా స్వామి సన్నిధి చేరటమే గదా వరంగా ఆయన తమకిచ్చాడు. ఆ ఉత్సాహంతోనే తానీ దానవ శరీరాన్ని ధరించి వచ్చాడు లోకంలోకి. ఇక తెలియక పోవట మేమిటి. భగవంతుడికీ తెలుసు. భక్తుడికీ తెలుసు. వైరమనేది ఒక మిష అనీ తెలుసు ఇరువురికీ.

ఈ వైర భక్తుడే శిశుపాలుడనే మరొక వైర భక్తుడుగా జన్మించాడు. వాడి వ్యవహారం కూడా ఇదే వరస. పైకి వైరం లోపల భక్తి భావం. రాజసూయ యాగ సన్నివేశంలో కనిపిస్తుందా పాత్ర మనకు. ఎవడో గాడీ శిశుపాలుడు. హిరణ్యకశిపు డంటే పరాయివాడు గాని ఇతడు సాక్షాత్తూ కృష్ణుని మేనల్లుడే. మేనత్త సాత్వతి కుమారుడు. బంధువర్గంలోని వాడే. కాని వైర భక్తుడు గదా. అందుకోసం సాధిస్తూ వచ్చా డాయనను మొదటినుంచీ. నూరు తప్పుల వరకు సహిస్తానని ఆ తరువాత చెప్పలేనని అత్తకు ముందుగానే రాయితీ ఇచ్చాడు పరమాత్మ. అది బాగా గుర్తున్నది వాడికి. అందుకే ఆ నూరు తప్పులూ ఎప్పుడు ముగుస్తాయా అని ఎప్పటికప్పుడు లెక్కపెట్టు కుంటాడు. అది భక్తుడికే కాదు. భగవానుడికీ లెక్కే. చివరకు రాజసూయంలో కలిశా రిద్దరూ. ఆపాటికే ఎనభయ్యే తొంభయ్యో అయి ఉంటాయి తిట్టి పోయటాలు. అవి ఏమో మన చెవికి రాలేదు గాని చెవులలో పడ్డ ఆ పది పదిహేను తిట్లు చూద్దామెలాంటివో. అది కూడా పోతనగారు చూపితే చూడవలసిందే. వినిపిస్తే వినవలసిన వాళ్లమే. ఏమిటా తిట్లు.

Vallabhaneni Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

ఇంతమంది **పరతత్త్వవేదులూ విగత పాపులూ యోగీంద్రులూ** కూచొని ఉండగా వివేక రహితులై ఈ గోపాల బాలునా మీరు పూజించ వలసింది. ఎవడీ బాలుడు –

**గురుదేవ శూన్యుండు కులగోత్రరహితుండు**

**తలిదండ్రు లెవ్వరో తడవఁగాన**

**మప్పులబొరలెడు నాది మధ్యావసా**

**నంబులం దరయ మానంబు లేదు**

**బహురూపియై పెక్కుభంగుల వర్తించు**

**వాని వర్తనములు వరుస లేవు**

**పరికింప విగత సంబంధుండు తలపోయ**

**మా నిమిత్తంబున మాని యయ్యె –**

నిజమే వాడన్న మాట. పరతత్త్వ వేదులెవరో యోగీంద్రులెవరో గ్రహించఁగలిగినాడు వాడు. అలాటి వాడి మాట పేలవంగా ఉంటుందా. పరతత్త్వ వేదినే గ్రహించినవాడు పరతత్త్వాన్ని గ్రహించలేడా. అందుకే ఆ పరతత్త్వమెలా ఉంటుందో నిందా వ్యాజంతో బయటపెడుతున్నాడు. భగవత్తత్త్వానికి గురువేమిటి గోత్రమేమిటి – తల్లిదండ్రులెవరు. అనాది మధ్యలయుడైన వాడికి మానమేమిటి. అంటే ఇంత అని కొలత. ఒక రూపమంటూ లేకున్నా ఉన్నవన్నీ ఆయన రూపాలే. ఎవరితోనూ సాంగత్యం లేనివాడికి వాని వరుసలెలా చెప్పగలము. మా అంటే లక్ష్మి మాయ అని కూడా అర్థమే. తన్ని మిత్తంగా మాని పరమాత్మ. లేకుంటే అమానే అప్రమేయుడని భావం.

అక్కడి కూరకున్నాడా లేదు. **'జారుఁడు జన్మావధి యును - చోరుఁడు ముప్పోకలాడు'** - జారత్వ మాయన చేసిన ప్రపంచ సృష్టికి సూచకం. చోరత్వం ప్రపంచ లయానికి సంకేతం. ముప్పోకలు త్రిగుణాత్మకమైన ప్రపంచ స్థితికి ద్యోతకం. ఎంత గంభీరమైన భావ మిమిడి ఉందో చూడండీ మాటలలో. ఇలాటి అర్థాంతర స్ఫోరకమైన పదవాక్య రచన చేయటంలో మహాకవి కెంత సరదా ఉందో అదీ గమనించండి.

శిశుపాలుడి విషయమయిందా. ఇక సాక్షాత్తూ తన బావమరిది అయిన రుక్మి తన్ను గూర్చి అనే మాటలు వినండి. ఎంత ఘాటుగా ఉంటాయో. అయిన వాడయినా వాడు కూడా జరాసంధ శిశుపాలాదుల ముఠాకు చెందినవాడే గదా. కనుక అలాగే మాటాడాలి వాడు మాటాడినా. ఏమంటాడు వాడు. తన చెల్లెలు రుక్మిణిని బలాత్కరించి తీసుకెళ్లు తున్నాడనే కోపంతో ఏమంటాడంటే.

**మాసరి వాడవా మా పాపఁగొని పోవ**

**నేపాటి గలవాడ వేది వంశ**

**మెందు జన్మించితి వెక్కడఁ బెరిగితి**

**వెయ్యది నడవడి యెవ్వడెఱుఁగు**

**మానహీనుడ వీవు మర్యాదలును లేవు**

**మాయఁగైకొని గాని మలయరావు**

**కొమ్మనిమ్ము నీవు గుణరహితుండవు.**

చూచారా ఈ మాటలు. వారి మాటల లాంటివి గావు. అంతకన్నా కొంత విలక్షణం. కారణం వీడాయనకు బావమఱిది. చెల్లెలినిచ్చి చేసేటప్పుడు వాని వరసలూ గుణగణాలూ అన్నీ చూడవలసినవాడు. అది లేని వాడికెలా ఇవ్వటం కనుక అలాటి వరుని కుండవలసిన లక్షణాలే ఇక్కడ ఏకరువు పెడుతున్నాడు. అయినా వరలక్షణాలేవీ లౌకికంగా లేకపోయినా పారమార్థికంగా చూస్తే అవే వర లక్షణాలు - వరణీయమైన గుణాలు, ఏమిటవి. మనతో సరికా డాయన పరమాత్మ. ఏపాటి ఎంత అని ప్రశ్న లేదు. ప్రమాణాని కతీతుడు. పుట్టటం పెరగటం ప్రవర్తన ఏవీ లేని తత్త్వమది. గుణరహితుడు గదా. ఎలా ఉంటుందే గుణం గానీ. ఇదీ ఆంతర్యం.

పోతే కాలయవను డని ఒకడున్నాడు. వాడూ రాక్షసుడే. వాడూ ఇలాగే మాట్లాడుతాడు. పైగా నారదుడు వాణ్ణి రెచ్చగొడతాడు కూడా. నారదుడి ప్రచోదన విని వాడడుగుతాడు.

**'ఏమీనారద నీవు చెప్పిన నరుండే రూపు వాడెంత వాడేమేరన్ విహరించు నెవ్వడు సఖుండెందుండు'** నని. దానికా మహర్షి -

**'నీల జీమూత సన్నిభ శరీరము వాడు**

**తామరసాభ నేత్రముల వాడు**

**పూర్ణేందు బింబంబు బోలెడు**

**మోమువాడున్నత దీర్ఘబాహువుల వాడు.**

**తెలిసి యేవేళలందైనఁ దిరుగువాడు -**

**పట్టనేర్చినగాని లోఁబడనివాడు.**

చూడండి చిత్రం. వాడడగట మెలా ఉంది. ఈయన చెప్పట మెలా ఉంది. రెండూ సరిపోయాయి. నారదుని మాటలన్నీ మనసులో ఉన్నట్టున్నాయా దానవుడికి. నగరానికి చుట్టూ కాపుపెట్టి కూచున్నాడు. అడపొడ లేదు. కొంత కాలానికి కృష్ణుడు మెల్లగా దొంగచాటుగా నక్కుతూ నక్కుతూ నగరి దాటి వెళ్లి పోతున్నాడు - అది కనిపెట్టి వీడు.

**కరిసంఘంబులు లేవు రావుతురగౌ ఘంబుల్ రథవ్రాతముల్**

**పరి సర్పింపవు - రారు శూరులు - ధనుర్బాణాసి ముఖ్యాయుధో**

**త్కరముంబట్టడు - ఒక్కరుండదె నిర్గమించె** - ఎవడబ్బా వీడని ఆలోచిస్తుండగా - ఆ మహానుభావుడు వాణ్ణి ఏడిపించటానికి

**'వనజాతాక్షుడు సింహమధ్యుడు రమావక్షుండు శ్రీవత్సలాం**

**ఛను డంభోధర దేహుడిందుముఖు'డైన** వేషంతో

కనిపిస్తాడు. కనిపించేసరి **'కీతఁడా ముని సూచించిన వీరుఁడే'**నని పోల్చుకొన్నాడటవాడు. పోల్చుకొని వెంటబడతాడు. పడేకొద్దీ పరుగెత్తుతూ పోతాడు కృష్ణుడు. వాడాయన సదలిస్తూ అంటాడిలా

**'బలిమిన్ మాధవ నేడు నిన్ను భువన ప్రఖ్యాతిగా బట్టుదున్**

**జలముల్ సొచ్చిన భూమి క్రిందఁ జనినన్ -శైలంబు పైనెక్కినన్**

**బలిదండన్ వసియించినన్ వికృత రూపంబుం బ్రవేశించినన్**

**జలధిందాటిన నగ్రజన్మ హలికాశ్వాటా కృతుల్ దాల్చినన్'**

చూచారా - వాడి మాటల్లోనే స్వామివారి దశావతారాలన్నీ ఎలా దొర్లి పోతున్నాయో. పైగా అంటాడు వాడు **'ఎక్కడ నెవ్వారలకుం జిక్కవనుచు**

**నారదుండు సెప్పెను - నాకుం జిక్కితి వెక్కడcబో యెదు నిక్కముగా నిద్రcబుత్తు నిన్నీకొండన్'** అంటాడు. పరమాత్మను చిక్కించుకోవాలని ఎంతాశో చూడండి వాడికి. ఆయన ఆభాసను చూచి అసలైన తత్త్వమదేనని భ్రాంతి పడుతున్నాడు. కనుకనే తాను అజ్ఞానంతో నిద్రపోతూ ఆయనను నిద్ర పుచ్చుతా నంటాడు. సాహిత్యంలో రసానికీ రసాభాసకూ ఉండే తేడా ఏమిటో అలాంటిదీ రాజసతామసుల చూపులో తేడా. అయినా తమాషా ఏమంటే ఆ భాసలోనే వస్తుతత్త్వం దాగి ఉంటుందనే రహస్యం గుర్తించినవాడు పోతనామాత్యుడు. కనుకనే ఇలాటి మాటల్లో తాత్త్వికమైన భావాలనిమిడ్చి వ్రాయగలదు. మన కందీయగలడు.

ఇదంతా అయిన తరువాత ఇక కంసుని వృత్తాంతం కొంత తడవి చూడాలి మనం. ఇంకా చెల్లెలు దేవకి కృష్ణుని ప్రసవించనే లేదు. నానాటికీ ఆవిడ గర్భం పెరుగుతూ పోవటం చూస్తే వాడి కష్టమ గర్భం వల్ల తనకు చావు తప్పదనే మరణ భయం కూడా పెరుగుతూ పోతున్నది. ఇదీ ఒక విధమైన భక్తే. అదే సూచిస్తున్నాడు మహాకవి. **'వైరాను బంధనంబున నన్యాను సంధానంబు మఱచా'**డట వాడు. ఎంత ధ్యాన నిష్ఠో చూడండి. దానితో

**'తిరుగుచుంcగుడుచుచుc ద్రావుచు - నరుగుచుc గూర్చుండి లేచు చనవరతంబున్ - హరిcదలcచి తలcచి జగమూ - హరి మయమని చూచెcగం సుcడాఅని యలుకన్'** - ప్రపంచమంతా విష్ణు మయంగా కనిపిస్తున్నదట వాడికి. అలా కనిపిస్తే ఎంత భాగ్యం.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

**'శ్రవణరంధ్రముల నేశబ్దంబు వినఁబడె - నది హరి పలుకని యాలకించు నక్షి మార్గమున నెయ్యది సూడఁబడె నది - హరి మూర్తిగానోపు నంచుజూచు'** చూచారా సరిగా ఇది ప్రహ్లాద చరిత్రలో ఆ మహాభక్తుని వర్ణించిన భావాలకు సజాతీయంగా భాసించటం లేదూ - ఎటు వచ్చీ అది అనులోమ మైతే ఇది ప్రతిలోమ భక్తి.

అసలా మాటకు వస్తే ఇదంతా పోతనగారి స్వీయచరిత్ర. సమదర్శనుఁడైన ఆయన దృష్టి కంతా సమానమే. **'నిర్దోషంహి సమంబ్రహ్మ'** అసలు పరమాత్మకే సమమని పేరు. **'సమోహం సర్వ భూతేషు'** అని ఆయనగారే చాటి చెప్పాడు. దేవత లెక్కడున్నారు. దానవు లెక్కడున్నారు. ఉన్నదంతా మానవులే. వారిలోనే సాత్త్వికులు దేవతలు. రాజసులు మానవులు. తామసులు రాక్షసులు. ఈ తేడాలు కూడా ఏ మాత్రమూ తేడా లేని ఈశ్వరుడి సృష్టే. సముడైన ఆయన వల్లనే ఈ గుణ వైషమ్య మేర్పడింది. అది కూడా ఆయనే సెలవిచ్చాడు - **'యే చైవసాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చయే - మత్త ఏవేతి తాన్విద్ధి - నత్వహం తేషు తేమయి'** గుణత్రయమంతా నావల్లనే ఏర్పడింది. అయితే నేనందులో లేను - అవే నాలో ఉంటాయి. ఈ రహస్యం గుర్తించినవాడే అనన్య భక్తుడూ - జ్ఞానీ అని చాటుతాడు. ఈ చాటింపు చెవిలో పడి దాని కనుగుణమైన సమదృష్టి అలవడిన సహజ పాండిత్య సంపన్నుడు కాబట్టి పోతన మహాకవి ఆదృష్టితోనే తన పాత్రల నన్నింటినీ సృష్టించి

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

వారందరికీ ఆ దృష్టినే సమంగా పంచిపెట్టాడా అనిపిస్తుంది. ఏ దృష్టితో చూచేవాడి కాదృష్టికి తగినట్టే కనిపిస్తుంది దృశ్యం. అనన్యాదృశమైన దృష్టి పోతనది. అందుకే అందరి ఎడలా సానుభూతి ఆ మహాకవికి.

ఇదంతా మనసులో పెట్టుకొనేనేమో నారదుని నోరు పెట్టుకొని మాటాడు తాడొక చోట ఆ మహనీయుడు. ఏమనో తెలుసా. **'కామోత్కంఠత గోపికల్ భయమునన్ కంసుడు వైర క్రియాసామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్ - సంబంధులై వృష్ణులున్ - ప్రేమన్ మీరలు భక్తి మేము - అని** అందరినీ భగవద్భక్తుల జాబితాలో చేర్చి అందరూ ఒకటే సుమా - మహా అయితే కామం వైరం - సంబంధం ప్రేమ భక్తి అని మార్గ భేదమే గాని గమ్యంలో భేదం లేదు. మాకు కావలసిందొకటే షరతు. అదేదో గాదు. **ఉద్దామ ధ్యాన గరిష్ఠత.** తీవ్రమైన ఏకాగ్రమైన అనన్యమైన దృష్టి. అది ఒక్కటి ఉంటే చాలు. సత్త్వర జస్తమో గుణ భేదం చూడనక్కర లేదు. అందరూ ఎప్పటికో ఒకప్పటికి పరమాత్మ అనుగ్రహానికి పాత్రులేనని ఆయనగారి గొప్ప ఆధ్యాత్మిక సందేశం లోకానికి. దానికి భాగవత పాత్రలూ వారి వృత్తాంతమూ ఒక అపదేశం Pretext మాత్రమే. ధ్వని ప్రధానమైన మహాకావ్య మిలాగే నడుస్తుంది మరి. అందుకే హరిని స్తుతిసేయు కావ్యానికి - అది లేని కావ్యానికి ఉన్న తేడా ఎంతో అద్భుతంగా పేర్కొన్నాడాయన కావ్యారంభంలోనే.

మనమింత వరకూ ప్రతిలోమంగా ప్రయాణం చేస్తూ వచ్చాము. పోతే ఇప్పుడు సాత్త్వతులైన భక్తుల భక్తి భావమెలాంటిదో అనులోమంగా

Yellamraju Srinivasa Rao www.advaitavedanta.in

కూడా ఒకటి రెండు సందర్భాలు చూపవలసి ఉంది. అప్పుడే మన మహాకవి సమదర్శన యాత్ర ఎలాంటి సమగ్రమైనదో సంతృప్తి నిస్తుంది మనకు రాజసతామసులైన హిరణ్యాదుల దైవభక్తే ఇలాంటిదైతే ఇక సహజ సాత్త్వికులైన అక్రూరాదుల విషయం చెప్పటం దేనికి. కైముతిక న్యాయంతో చూస్తే అది ఇంకా గొప్పది.

మొదట అక్రూరుణ్ణే తీసుకొని చూతాము. క్రూరుడు కాని వాడ క్రూరుడు. క్రూరుడు కాని వాడని ఎవడైనా పేరు పెట్టుకుంటాడా. ఇలాటి పేర్లు చిత్రంగా ఉంటాయి. అవిధవా అని ఒక పేరుంది. విధవ కాని దవిధవ. అంటే మగనాలు. పుణ్యస్త్రీ. ఇదే తెలుగులో అయిదువ లేదా ముత్తయిదువ అయింది. పరోక్షం కానిది అపరోక్షం అంటే ప్రత్యక్షమని అర్థం. అలాగే అక్రూరుడంటే సౌమ్య స్వభావుడని అర్థం. కృష్ణుడి మాట అలా ఉంచి కంసుడే అంటాడాయనతో - ఏమనో తెలుసా. '**అక్రూరత్వము తోడ నీవు మనఁగా నక్రూర నామంబు నిర్వ క్రత్వంబునఁజెల్లె - మైత్రి సలుపన్ వచ్చున్ నినుంజేరి - నిర్వ్యాక్రోశుండవు**' అని. అతి క్రూర స్వభావులైన కంసాదుల చేతనే భేషని పించుకొన్న పెద్దమనిషి ఆయన. ఇక సర్వజ్ఞుడైన కృష్ణుడి ప్రశంసలందు కోటంలో ఆశ్చర్యమేముంది. ఏమంటాడు కృష్ణుడు. '**బంధుండవు సద్యోహిత సంధుండవు వానిఁ జూడ జనకుండవు కృపాసింధుండ - వెల్ల గుణముల నలనుండవు గావని**' కితాబిస్తాడు.

చిత్రమేమంటే అక్కడ కంసుడు రామకృష్ణులను పట్టి తెమ్మని ఆయనను పురమాయిస్తే ఇక్కడ కృష్ణుడు హస్తినకు పోయి కౌరవులకు

Vallamsri Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

పాండవులతో సంధి చేసుకొని బాగుపడమని చెప్పి రమ్మని నియోగిస్తాడు. రెండింటినీ కాదనకుండా అంగీకరిస్తా డాయన. మంచి చెడ్డలు రెండూ సమదృష్టితో చూడటమే మహాత్ముల లక్షణం. రెంటికీ కర్తలం మనం గాదు. పరమాత్మే. కర్తా భోక్తా కూడా ఆయనే – మనమేదీ హేయమని గాని ఉపాదేయమని గాని చూడరాదు – అంతా పరమేశ్వర లీల అని భావించి ఉదాసీనంగా నిర్లిప్తంగా వ్యవహరించటమే మన పని – అనే గొప్ప సమభావనకు సంకేతమే అక్రూర పాత్ర. కనుకనే కంసుడా జ్ఞాపిస్తే జంకకుండా ఒకమాట అంటాడు. **'పంపిన బోవు వాడనె నృపాలక మానవు లెన్నఁదమ్ము నూహింపరు దైవయోగముల నించుక గానరు – ఈశ్వరేచ్ఛ దప్పింపగ రాదని'** చక్కగా జవాబిస్తాడు.

కాగా ఇక్కడ సాక్షాత్తూ పరమాత్మే ఒక మంచి పనికి నియోగిస్తే కాదనగలడా. ఒక్క మాట కూడా మాటాడక బయలుదేరి హస్తినాపురికి వెళ్లుతాడు. అక్కడ కుంతీదేవిని విదురుని అందరినీ ముందుగా కలుసు కొంటాడు. వారందరూ తమ గోడు వెళ్లబోసుకుంటే అదంతా విని ఆ తరువాత అందరి సమక్షంలో ధృతరాష్ట్రుని చూచి ఇలా అంటాడు. **'అవనీశ పాండవులందు నీనందనులందు సమానుండవగుట బుద్ధి – సమభావన చేసితివేని కీర్తియున్ శ్రేయము గల్గు'** –

**నిందం బొందకు మయ్య యాతనువుతా నిద్రాకళా దృష్టమౌ**
**సందోహంబు విధంబు నిల్వదు సుమీ జాత్యంధతం బొందియున్**
**మంద ప్రజ్ఞత లేలచేసెదవు – సమ్యగ్ జ్ఞాన చక్షుండవై**
**సందేహింపక యిమ్ము పాండవులకున్ సర్వంసహా భాగమున్'**

ఎంత గొప్ప సందేశమిది. సమభావన అనే మాట ఎలా పలుకు తున్నదో చూడండి ఆ పరమ భాగవతుని నోట. ఆ భావన ఉన్నవాడు గనుకనే బయటివారే మనుకొంటారో ఏమోనని కూడా సంకోచించడు. నిర్భయంగా కుండ బద్దలు గొట్టి నట్టు మాటాడుతాడు. ఇంతకుముందు కంసునితో కూడ అలాగే మాటాడాడు. ఇక్కడ కౌరవ సభలోనూ అలాగే మాటాడాడు.

అసలీ సంసారమంతా ఒక స్వప్నంగా భావించే భాగవతుడి కంతా సమానమే. ఇది కృష్ణునితోడి తెచ్చేటప్పుడు గోపికలు తన్ను నిష్ఠుర మాడినా లెక్క చేయని సమాన భావన. కృష్ణలీలను సాక్షాత్తూగా చూచినప్పుడది ఇంకా గట్టి పడ్డ దక్రూరుడికి. రథంలోనూ యమునలోనూ ఒకే మారు ఆ విగ్రహాన్ని చూడగానే మతిపోయింది ఆయనకు. వెంటనే భగవద్విభూతి అని గుర్తించి అంటాడిలా

**కలలంబోలెడు పుత్త్ర మిత్రవని తాగారాది సంయో గముల్**

**జలవాంఛారతి నెండ మావులకు కాంక్షల్ సేయు చందంబునం**

**దలతున్ సత్యములంచు - మూఢుడ వృథా తత్త్వజ్ఞుడ**'నని

ఇదే ధృతరాష్ట్రుడితో కూడా అంటాడు 'నిద్రా కళాదృష్ట మీ ప్రపంచమని.

ఇలాటి ఒక ఉదాత్తమైన పాత్రను సృష్టించాలంటే పోతన గారికెంత ఉదాత్తమైన మనస్తత్త్వముండాలి. సర్వసమభావన అనేది పరావర జ్ఞానమున్న మహాకవికే సహజ లక్షణం. మరెవరికీ గాదు. ఇలాటి దృష్టితోనే

మరొక పాత్రను కూడా సృష్టించి చూపాడది ఉద్ధవుడి పాత్ర. కృష్ణుడే కితాబిచ్చా డాయనకు **'వృద్ధ వచోవర్ణనీయుడని అమర గురు సముడని!** అక్రూరుడి హోదా ఎలాటిదో అదే హోదా ఈయనది. గోపకాంతల చెంతకు పంపుతాడ తనిని. త్వరలోనే వస్తాడు కృష్ణుడు - బాధపడకండని సందేశ మందజేయమంటాడు. అక్రూరుడి లాగే మారు మాట మాటాడక రాయబారం బయలుదేరు తాడితడూ. నందు డాయనను చూడగానే కౌగిలించుకొని **'మా పాలిటికి కృష్ణుడీ తడను చున్** మన్నించి పూజించాడట. మమ్ములనూ మా గోపికా జనాన్నీ స్మరిస్తున్నాడా ఎన్నడు వస్తాడా వెన్నుడని అడుగుతాడు. తలిదండ్రులైన మిమ్ము తప్పక వచ్చి చూస్తాడు - **'బలరామకృష్ణులు మర్త్యులే వసుమతీ భారంబు వారింపఁ బుట్టినాడు హరి'** అని తన పరావర జ్ఞానం కూడా సూచిస్తాడు. నిజాని కంతవాడే ఉద్ధవుడు. అంతేకాదు. **రాజీవాక్షుడు సుందరాస్యుడు పీతాంబరుడైన** అతణ్ణి చూచి మరునాడు గోపికలంతా కృష్ణుడే వచ్చాడని భ్రమపడతారు కూడా. తరువాత పోల్చుకొని భ్రమర గీతా వ్యాజంతో చాలా నిష్ఠురా లాడతారు. దూరంగా ఉంటే ప్రేమ పెరుగుతుందని గమనిద్దామనే కృష్ణుడు వెంటనే రాలేదు గాని మిమ్మెప్పటికీ ఉపేక్షించడని ఓదారుస్తాడు వారిని. పరమాత్ముని గుణ గణా లద్భుతంగా వర్ణించి చెబుతాడు.

మరలా మధురకు వచ్చి కృష్ణుడికి జరిగినదంతా చెప్పి అతడు పిలుచుకొనిపోతే కుబ్జా గృహానికి వెళ్లి దాన్ని చూచి అక్రూరుడి వద్ద కుజని అతణ్ణి హస్తినకు రాయబారం పంపుతాడు. ఉద్ధవుడు మధ్యలో ఏమీ

మాటాడడు. మాటాడితే భగవత్తత్వాన్ని గురించే. చేస్తే భగవదా దేశపాలనమే. మౌనంగా ఉంటాడు ఉంటే - మాటాడుతాడు ఆడవలసి వస్తే. ఎంత సంయమనం - ఎంత సమదర్శనం. ఇదంతా పోతన భావనే. ఆయన వ్యక్తిత్వమే ఆయా పాత్రల రూపంగా దర్శన మిస్తున్నది. స్థాలీపులాక న్యాయంగా ఇరువురి విషయం పేర్కొన్నాము. పోతే ప్రహ్లాదుడేమి గజేంద్రుడేమి - కుచేలుడేమి - అంబరీషుడేమి - ఎవరు తక్కువ ఎవరు ఎక్కువ. భక్తి జ్ఞాన వైరాగ్యాల త్రివేణీ సంగమమే వారి వారి జీవితాలన్నీ. వివరిస్తూ పోతే మరొక భాగవతం వ్రాయవలసి వస్తుంది నేను. ఇందులో ఏ పాత్రా ఎవరినీ నొప్పించదు. తప్పు పట్టదు. పరిస్థితులను కూలించినా ప్రతికూలించినా సమానమే వారికి. గజేంద్రుడు మొదట విష్ణు భక్తుడే గదా. తరువాత కేవలం నిర్గుణ జ్ఞాని గానే మారాడు. అప్పుడతనికి మకరం కనపడదు. తోడి గజయూథం కనపడదు. అసలు లోకమే కనపడదు. తనకు మోక్షం మకరం నుంచి గాదు. గజ శరీరం నుంచి అని అతని ఆరాటం - అభ్యర్థనం. అహం పోతే మమ పోక ఏమవుతుంది. దానికి కావలసింది సమ్యగ్దర్శన మనే సుదర్శనం. ప్రహ్లాదుడైతే **తన యందు నిఖిల భూతములందు నొక భంగి సమహితత్వంబున జరుగు వాడు - పగవారైన సురేంద్రులున్ సభలలో ప్రహ్లాద సంకాశులన్ సుగుణోపేతుల నెందు మే మెఱుగ మంచున్** 'కీర్తించే వారట - అలాటి వాడికి తండ్రి మీద గాని గురువు మీదగాని ఎవరి మీద గాని విషమమైన భావమెలా ఉంటుంది.

తుదకు తన్ను హింసించే రాక్షసులమీద కూడా లేదది. ఇక అంబరీషుడో. సుదర్శనమే సాక్షాత్తూ ఇల్లడ పెట్టాడు మహావిష్ణు మతని వద్ద. దుర్వాసుడంత హడావుడి చేసినా అది తన చేతిలో ఉన్నా ప్రయోగించ లేదు. అదే స్వయంగా అతని వెంటబడ్డది. మరలా అతడు వచ్చి బ్రతిమాలితే దాన్ని తాను బ్రతిమాలి ఉపశమింప జేస్తాడు. మరి కుచేలుడి దింకా గడుసుతనం. ఉన్నదానితోనే తృప్తి. లేనిదాని కాప్తి లేదు. ఆఖరుకు పరమాత్మను చూద్దామని కూడా అభిలాష లేదు. **'జ్ఞానీ త్వాత్మైవ మేమత'** మని భగవానుడే చాటినప్పుడు జ్ఞాని ఆయనను చూచేదేమిటి. చూచినా నిర్లిప్తంగా చూచాడే గాని లౌకికమైన ప్రయోజనం కోసం గాదు. అలౌకికమైన అనుభూతి కోసం. అలౌకికంగా బ్రతకగలిగితే చాలు మానవుడు. లౌకికమైన పదార్థాలన్నీ వాటి పాటికవే లభిస్తాయి. **'తద్వత్కామాయం ప్రవిశంతి'** అని గదా భగవద్వాణి. అలాగే జరిగింది మహాజ్ఞాని అతని విషయంలో.

ఇంతకూ మహాజ్ఞానీ మహా భాగవతుడూ ఎవరో గాదు. పోతరాజే. సహజ సుందరమైన ఆయన స్వభావమే భాగవత పాత్రలందరిలో పరుచుకొని కనిపిస్తుంది. ఒక పాత్ర లేమిటి సన్నివేశా లేమిటి. ఆయా సందర్భాలలో దొరలిన పద్యాలేమిటి - గద్యలేమిటి - మాటలేమిటి - మాటలలో గుప్తమైన అర్థాలేమిటి. అలంకారా లేమిటి. అన్నింటిలో ఆయన కాయనే సాటి.

అసలు భాగవత కథలంటే కథలు గావు. సన్నివేశాలంటే సన్నివేశాలు గావు. అద్భుతం పరమాద్భుతం ప్రతి ఒక్కటీ. ముఖ్యంగా కృష్ణ నిర్యాణ

ఘట్టమేమిటి - కలిపురుషుడి ఆగడమేమిటి - దక్షయజ్ఞ విధ్వంసమేమిటి - ధ్రువోపాఖ్యానం - పృధూపాఖ్యాన మేమిటి - జడభరత వృత్తాంత మేమిటి - మరి ప్రహ్లాద చరిత్ర - క్షీరసాగర మధనం - గజేంద్ర మోక్షణం - వామన చరిత్ర - రామాయణ కథ - గంగావతరణం - అంబరీషుని వృత్తాంతం - నరకాసుర వధ - బాణాసుర కథ - కుచేలోపాఖ్యానం - అన్నీ అన్నే. అపరంజి బంగారం. అన్నిటినీ మించి అతిలోక మైనదసలు దశమ స్కంధం. అది పూర్వోత్తరాలుగా విభక్తమయి రెండు పాయలుగా ప్రవహించే భాగీరథి లాంటిది. భాగీరథిలాగే స్వచ్ఛమైనదీ పవిత్రమైనదీ పరమాస్వాద్య మైనదీ. ఒక మనోహరమైన స్వానుభవైక వేద్యమైన దివ్యమైన స్వప్న ప్రపంచం లాంటిదది. అసలైన భాగవత మదే నిజానికి. ఈ సన్నివేశా లన్నిటిలో ఆలంకారికు లేకరువు పెట్టిన నవరసాలూ త్రయస్త్రిం శద్భావాలూ నిశ్శేషమై పోయాయి మహాకవి రచనలో. అంతేకాదు. భౌతికమైన ఈ ప్రపంచమెంతో అంతగా ప్రదర్శించి చూపాడు కవి ఒక వైజ్ఞానిక ప్రపంచాన్ని మనకు. ఒక గొప్ప ఐంద్రజాలికుడు ప్రదర్శించే ఇంద్రజాల విద్యే అది. అందులో కథలేమిటి పాత్రలేమిటి వారి పరస్పర సంవాద మేమిటి - గద్యమేమిటి పద్యమేమిటి అన్నీ అపూర్వమే. అతి లోకమే. అది కూడా ప్రతి ఒక్కటీ అప్రయత్నంగా అతిసజహంగా అనితర సాధ్యంగా నడుపుతూ పోతాడు కవి. కవికులాదృష్టా ధ్వగమనాధ్వ నీనుడాయన. ఎంత ప్రజ్ఞావంతులైన మహాకవులకు కూడా అంతుపట్టని ప్రౌఢరచన అది.

నారదుడు తన పూర్వజన్మ వృత్తాంతం చెప్పటం చూడండి ఎంత భక్తి భావ ప్రబోధకమో. పైగా ఎవరికీ గాదు వేదవ్యాసుడికి ఏకరువు

Yalamanchili Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

పెడుతున్నాడు. ఎప్పుడోగాదు. ఆయన ఏదీ తోచక ఖిన్నుడై ఉన్నప్పుడు. తన జీవిత మెన్ని ఒడుదుడుకుల పాలయినదో చివరకు భగవద్భక్తి ఎలా అలవడిందో చెప్పి ఆయన కుపశమనం కలిగించట మెంతైనా సహజం. మరి అశ్వత్థామ ఆగడం వల్ల ద్రౌపది ఎంతో వేదన చెందినా ఆమె అతనితో చేసిన సంభాషణ ఎంత హుందాగా ఉందో చెప్పలేము. కరుణరస గర్భితమైన ఆవిడ సుకుమారమైన మందలింపు ఎంత హృదయ విదారకమో చూడండి. **'పరగన్ మా మగవార లందఱును మున్ బాణ ప్రయోగోప సంహరణాద్యాయు ధవిద్య లన్నియును ద్రోణాచార్యుచే నభ్యసించిరి - పుత్రాకృతి నున్న ద్రోణుడవు - శిష్యసుతులన్ ఖండింపఁగా బాడియే. భూసురుడవు బుద్ధిదయా భాసురుడవు - శిశు మారణ మాసురకృత్యంబు ధర్మమగునే తండ్రీ - భద్రాకారుల చిన్ని పాపల నిద్రాసక్తుల సంహరింప నకటానీ చేతులెట్లాడెనో. నిను పోర కిరీటి నిబద్ధుఁజేసి నేడిక్కడి కీడ్చి తెచ్చుట సహింపనిదై భవదీయమాత నేడెక్కడ నిట్టి శోకమున నేక్రియనేడ్చుచుఁ బొక్కుచున్నదో'** ఎన్ని హావభావాలు - ఎంత మాతృ హృదయం - ఎంత సానుభూతి - కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నదో. భావానుగుణమైన పద్యరచన చూడండి. ఎంత సహజ సుందరమో. హృదయంగమమో.

మరి భీష్ముడు చేసిన శ్రీకృష్ణ స్తవమెంత ఉదార గంభీర మనోజ్ఞమో. తిలకించండి. '**త్రిజగన్మోహన నీలకాంతి మొదలు ఒక సూర్యుండనే**' పద్యం వరకూ సాగిన ఆ పద్యాలు పద్యాలా. భక్తిరస బంధుర ఖాద్యాలు. కృష్ణుడంతః పురకాంతలను పలకరించట మెంత సరస సుకుమారం - **తిలకమేటికి**

**లేదు తిలకినీ తిలకమ - పువ్వులు తుఱుమవా పువ్వుబోడి -** పద్యమన్నందుకు గుర్తు వస్తున్నది - ఉత్తర గర్భంలోని శిశువు బాణాగ్ని జ్వాలలు చుట్టు ముడితే ఏమంటాడో తెలుసా. **'రాడా చూడ సమస్త భూతములలో రాజిల్లువా డిచ్చటన్ లేడా - నతత్రాత మున్ కాడా.** ఆ బాలుడి బరవసా ఈశ్వర శరణాగతీ పద్యంలోని ఎత్తుగడ - రాడా లేడా ఈడా అనే విసురులూ ఎంత ధైర్యమిస్తున్నదో మనబోటి పాఠకులకే. పోతే విదుర మైత్రేయ సంవాదంలో రాని విషయమంటూ లేదు. స్థాలీపులాకంగా తడవి నా రామకృష్ణావతరాల విషయం గాని మరేది గాని సరికొత్తగా కనిపిస్తుంది. యజ్ఞవరాహ వర్ణన అద్భుతం. అతి సహజం. ఓజోగుణ భూయిష్ఠం - **'కఠిన సటాచ్ఛటోత్కట' జాత వాత నిర్ధూత జీమూత సంఘాతముగను - క్షుర నిభ సునిశిత ఖురపుటాహతచల త్ఫణిరాజ దిగ్గజ ప్రచయముగను'** కనిపించే ఆ మూర్తిని చూస్తే దశదిశలూ వ్యాపించి కండ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. అది చూచి బ్రహ్మాదులు చేసిన స్తోత్ర మతిలోకం.

ప్రహ్లాద చరిత్ర నుంచీ మరీ ఊపందుకొన్నది పోతన కవిత్వం. అది ఎంత అలౌకికమో అంతలౌకికం - ఎంత ఉజ్జ్వలమో అంత సహజం. ఎంత శ్రేయస్కరమో అంత ప్రేయస్కరం. ఇదమి త్థమని చెప్పలేము. అసలు తండ్రి కొడుకుల సంవాదమే సహజమూ ఉదాత్తమూ. రెండు పట్టాల మీద నడచింది చివరదాక. ప్రహ్లాదుడు తనతోడి బాలురకు చేసిన వేదాంతోపన్యాసం శ్రుతి స్మృతి పురాణేతి హాసాదులన్నీ మథించి తీసిన నవనీతం - చిరస్మరణీయం. శాస్త్ర శ్రవణాలసులైన సుకుమార బుద్ధులకది

చాలా లఘు మార్గం జీవిత గమ్యానికి – ఇక పద్యాలంటారా. మంగళ వాద్యాలు. పునః పున రాస్వాద్యాలు. **'పానీయంబులు ద్రావుచుంగుడుచున్'** ఎప్పుడూ హరిచింతనలో ఎలా ఉండాలో **'పశ్యన్ శృణ్వన్'** కన్నా సరళంగా చెబుతుంది పద్యం. **అంధేం దూదయముల్ మహా బధిర శంఖాఘ్మానముల్'** హరిభక్తి వర్జితుల జీవితాలంటుంటే కొరడాతో కొట్టి లేపినట్టే మనలను. **'ఎల్ల శరీరధారులకు ఇల్లను చీకటి నూతిలోపలన్ ద్రెళ్లక'** అని బోధిస్తుంటే జ్ఞాన వైరాగ్యాలు మూర్తీభవించిన ముత్యాల మూట. మరి 'మందార మకరంద మాధుర్యంలో తేలుతూ పోతే ఎంత రసపారవశ్యమో. **'కమలాక్షు నర్చించు కరములే కరములు'** – **కంజాక్షునకుఁగాని** కాయ మదీ ఒక కాయమేనా అని అడుగుతుంటే ఎంత సిగ్గుపడాలో మనం. **'సంసార జీమూత సంఘుంబు విచ్చునే చక్రి దాస్య ప్రభంజనము లేక'** అని జీవిత సమస్యకిక ఏదీ గాదు ఒక్క ఆధ్యాత్మ జ్ఞానమే సుమా పరిష్కారమనే సూచన చూడండి ఈనాటి శాస్త్రజ్ఞులు గుర్తించ వలసిన సత్యం. అంతేనా. **'అచ్చపుఁ జీకటింబడి గృహవ్రతులై విషయ ప్రవిష్టులై'** హరి ప్రబోధం మరచారు మానవులు. మరి శాస్త్రజ్ఞులో – **కానని వాని నూతగొని కానని వాడు విశిష్ట వస్తువుంగానని'** వారిలాగా చదువుంది గదా మాకని విఱ్ఱవీగ వచ్చు మీరు – ఏమి చదువది – **శోధింపంబడె సర్వశాస్త్రములు** మేమూ చేశాము పరిశోధన మీరేగాదు. కాని **చదువులలో మర్మం** పట్టుకొన్నాము మేము. మీరు ఫలరసం ఒలకబోసి దాని తొక్క నమలి చాలా గొప్ప రసాస్వాదం చేశామని సంతోషిస్తున్నారని మేధావంతుల నందరినీ చీవాట్లు పెట్టే మాట లెంత ఘాటైన మాటలు.

చివరకా తండ్రి కొడుకులు తెగబడి మాటాడేమాట లెంత తీవ్రమైనా ఎంత సహజమో ఎంత వారి వారి పాత్రలకు తగినట్టుంటాయో చూడండి. **'నాతోడం బ్రతి భాషలాడెదు జగన్నాథుండ - నాకంటె నీ భూతశ్రేణికి రాజులేఁ డొకడు - సంపూర్ణ ప్రభావుండ మద్భ్రాతం జంపిన మున్నే వెదకితింబల్మారు - నారాయణుండే తద్విశ్వములోన వేడు మతివాడెందుండురా దుర్మతీ** - అని తండ్రి ఔద్ధత్యానికి తగినట్టు తండ్రి మాటాడితే - వాడు ఎంత శాంతంగా జవాబిస్తాడో చూడండి - **'కలఁ డంభోధి గలండు గాలిఁ గలఁడా కాశం బునం గుంభినిం గలఁడగ్నిన్ దిశలంబగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్ - కలఁడీశుండు కలండు తండ్రి వెదకంగా నేల యీయా యెడన్'** చూచారా. వెదకాను నాకెపుడూ కనపడలేదంటే - ఎక్కడ బడితే అక్కడే ఉన్నాడే వెదకటం దేనికని వీడంటాడు. పైగా వెదకి చూస్తే **'ఇందు గలఁడందు లేడని సందేహము లేదు'** సర్వత్రా ఉన్నాడని కూడా చెబుతాడు వెదకా వేగాని చూడలేదు నీవు. చూడగలిగితే వెదక వలసిన పనే లేదు. చూపుకు కనిపించక పోతే గదా వెదక వలసిందని మరొక ఎత్తి పొడుపు.

చివరకు వీడూ వాడూ తప్పించుకొని ఇది పరమాత్మకే పరీక్ష అయింది. కనపడటమా. మానటమా. కనపడితే అది జ్ఞేయమైన అనాత్మే గాని ఆత్మ స్వరూపం గాదు. కనపడకుంటే అసలది ఎక్కడా లేదు పొమ్మంటాడు వాడు. ఎలాగా. నిర్గుణమే గాక సగుణాన్ని కూడా దాని విభూతిగా అర్థం చేసుకోగలడు ప్రహ్లాదుడు. హిరణ్యుడు సగుణమే గాని నిర్గుణంగా గ్రహించలేడు. కాగా ఇద్దరికీ రాజీ కుదిరేది సగుణమైన

రూపమని ఆలోచించి నృసింహ రూపంలో ప్రత్యక్ష మయ్యా డాయన. ఎంత సహజ సుందరంగా ఉందో చూడండీ సన్నివేశం.

మరి ఆ నృసింహావతార మావిర్భవించే ఘట్టాన్ని వర్ణిస్తాడు మహాకవి. అద్భుతం. పరమాద్భుతం. శరీరం గగుర్పొడుస్తుంది చదువుతుంటే – 'ఇట్లు **దానవేంద్రుడు పరిగృహ్యమాణవైరుండును వైరానుబంధ జాజ్జ్వల్యమాన రోషాన లుండును రోషానలజంఘ న్యమాన విజ్ఞాన వినయుండును వినయ గాంభీర్య ధైర్య జేగీయ మాన హృదయుండును విస్రంభంబున హుంకరించి బాలుని ధిక్కరించి హరినిందు 'జూపుమని ప్రశస్తంబగు హస్తంబున సభా మండప స్తంభంబు వ్రేసిన – వ్రేటు తోడన దశ దిశలను మిడుం గుఱులు సెదరంజిటిలి పెటిలి పడి బంభజ్య మానంబగు నమ్మాహాస్తంభంబు వలన ప్రళయవేళా సంభూత సప్తస్కంధ బంధుర సమీరణ సంఘటిత ఘోర జో ఘుష్యమాణ మహా వలాహక వర్గ నిర్గత నిబిడ నిష్ఠుర దుస్సహ నిర్ఘాత సంఘ నిర్ఘోష నికాశంబు లైన ఛట ఛ్ఛట స్ఫట స్ఫట ధ్వని ప్రముఖ భయంకరారావ'**– ఇలా నడుస్తూ పోతుందా గద్య.

పద్యమెంతో గద్య అంతే పోతనకు. పద్య రచనలో ఆయన కంఠోక్తిగా చెప్పలేదు గాని భోజ మహారాజు రామాయణ చంపువు ననుకరించా డాయన – ఎందుకంటే యమకాను ప్రాసాది శబ్దాలంకారాలు కుప్ప తెప్ప లక్కడా ఇక్కడా. అంతేకాదు. శయ్యాపాక రీత్యాదులైన కావ్య గుణాలన్నీ అతి సహజ మిద్దరిలో. పోతే గద్య నిర్మాణ మున్నదే ఇందులోనూ భోజుణ్ణి కొంత ఆదర్శంగానే పెట్టుకొన్నప్పటికీ ఆయన గారి మనసులో

మాయ కుండా నిలిచి ఉన్న మూర్తి భట్టబాణుని మూర్తి. బాణుడి కాదంబరి నాపోశనం పట్టాడు పోతన. అందుకేనేమో **'మృదు మధుర వచన వర్గ పల్లవిత స్థాణునకు బాణునకుం బ్రణమిల్లి'** అని కావ్యారంభంలోనే ప్రశంసించాడు మహాకవిని. వచనానికి బాణుడే అందె వేసిన చేయి అని తెలుసాయనకు. అతని వచనానికి స్థాణువులే పల్లవిస్తాయట. అంటే మ్రోళ్ళు చిగిరిస్తాయని అర్థం. అంతేగాదు. మరొక అర్థం కూడా స్ఫురించేలాగా శ్లేష ప్రయోగించాడా పోతన అని తోస్తుంది నాకు. బాణుడంటే బాణాసురుడనీ అర్థమే. ఆ బాణాసురుడు గద్య పద్యాలలో స్తోత్రం చేసి స్థాణు అంటే ఈశ్వరుడి మనస్సునే పల్లవిత రంజింప జేశాడు గదా. ఎంత లోతైన మాటో చూడండి పోతనగారిది.

ఇలాటి గద్య నృసింహావతార ఘట్టంలోనే గాదు. గంగావతరణ ఘట్టంలో కూడా అద్భుతంగా సాగింది. **'ఇట్లమ్మహానదీ ప్రవాహంబు పురారాతి జటాజూట రంధ్రంబు వలన వెలువడి'** అని ప్రారంభమవుతుందా గద్య. ఇక ఆ ప్రవాహం సాగి వస్తూ ఉంటే **'అగ్గలంబైన బుగ్గలును బుగ్గల సంగడంబునం బారిజాత కుసుమస్తబకంబులం దెగడు వెలినురువులను వెలినురువుల చెంగట** 'నంటూ ముక్తపద గ్రస్తంగా త్రొక్కిస లాడుతూ అది మరలా **'అధ్వగ వేదనా శమనంబై శమన దండంబు జాడ నిమ్నోన్నత సమవృత్తంబై వృత్త శాస్త్రంబు విధంబున వడి గలిగి'** ఇలా శ్లేషాలంకారాను ప్రాణనం కూడా చెంది ఎంతో దూరమదే ఫక్కీలో చక్కగా నడిచి చివరకు **'మానిని యన లోతు సూపక గరితయన సడి చప్పుడు లేక ముగుదయన బయలు పడక పతివ్రత యన నిట్టట్టు చనక తల్లియన**

**నెవ్విధమైన లోఁగొనుచు'** ప్రవహించిందని ఆయన దానికీ దీనికీ ముడిపెట్టి వర్ణిస్తుంటే ఎంత లోకవృత్త మెంత మానవ మనస్తత్వం ఆప్రవాహ వ్యాజంతో జోడించి కన కందరికీ ఒక గొప్ప సందేశమిస్తున్నాడో చెప్పనలవి గాదు.

ఇలాగే ఆశ్చర్యం గొలిపే గద్య మరొకటి మనకు గజేంద్రోపాఖ్యానంలో దర్శనమిస్తుంది. గజయూధం తిరిగే అరణ్యాన్నీ అందులోని మృగ సంతతినీ వర్ణిస్తున్నాడు కవి. మనమెవరమూ చక్కగా ఏ అరణ్యానికీ ఒంటరిగా వెళ్లి చూడనక్కర లేదు. టీవీలో ఆయా పుణ్యక్షేత్రాలు చూస్తుంటే అక్కడికి వెళ్లి చూచిన దానికంటే ఎంత మనోరంజకంగా ఉంటుందో అలాగే ఒక సినిమాలాగా కండ్ల ముందు దర్శన మిస్తుంది. **'అది మతియును మాతులుంగ లవంగ లుంగ చూత కేతకీ భల్లా తకామ్రాతక సరళ పనస వకుళ వంజుళ వటకుటజ కుంద కురవక కురంటక కోవిదార ఖర్జూర నారికేళ సిందు వార చందన పిచుమంద మందారజంబూ జంబీర** ఈ మహావృక్షాలన్నీ ఎప్పుడు చూచాడో మహాకవి. నేటి వృక్ష శాస్త్రజ్ఞులకు కూడా తెలిసి ఉండవీ చెట్ల పేర్లు. చెట్లేనా వాటి పరిసరాల్లో తిరిగే పక్షులో. **కలహంస కారండవ జలకుక్కుట చక్రవాక బక బలాక కోయష్టికాది జలవిహంగమాలట.** ఇక మృగాలో **గంధ గజగవయ గండ భేరుండ ఖడ్గ కంఠీరవ శరభ శార్దూల శశచమర శల్య భల్లసా రంగ సాలావృక వరాహ'** ఇలాంటి వెన్నో. అన్నీ కలిపి చెప్పమంటారా చెబుతా నొకే ఒక పద్యంలో గుర్తుంచుకోమంటాడు మళ్లీ. **'ఖిల్లీ భిల్ల లులాయక భల్లుక ఫణి ఖడ్గ గవయ వలిముఖ చమరీ ఝిల్లి హరి శరభ కరికిటి - మల్లాద్భుత కాక ఘూకమయమగు నడవిన్'** గద్యపద్యాలు రెండూ ఒక్కసారిగా గుక్క

తిప్పుకోకుండా చదువుతూపోతే అరణ్యమంతా బ్రహ్మాండంగా దర్శనమిచ్చి నిద్రలో కూడా దాని ఫోటో కనపడి తీరుతుంది మనకు.

ఇలాంటి గద్య భాగాలెన్నో ఉన్నాయి భాగవతంలో. అన్నీ చూపలేము గదా. ఏదో రెండు మూడు మచ్చు కుదాహరించాము. ఇంకా మనోహరమైనవీ చిత్ర విచిత్రమైనవీ చాలా ఉన్నాయి. అవి సహృదయులైన వారు తమకు తామే చూచుకోవచ్చు. మరి గద్యమే ఇలా సహజంగా నడిస్తే ఇక పద్యాల విషయమేమని చెప్పాలి మనం. ముందు చెప్పినట్టు అవి పద్యాలు కావు రసవత్ఖాద్యాలు. ఆయా సన్నివేశాల తీరును బట్టి ఆయా పద్యాల శైలి. సన్నివేశాలంటారా ఒక్కొక్కటీ ఒక్కొక్క ప్రబంధం. ఒక్కొక్క ఖండకావ్యమను కోవచ్చు. అందలి పాత్రలు వారి మనోభావాలు వారి మాటలు ఎలా నడుస్తున్నాయో అలాగే నడుస్తాయా పద్యాలు కూడా. చూడండి మీరే. చిత్ర విచిత్రమైన వాటి పోకడ లెలాంటివో.

'**ఉద్రేకంబున వారు శస్త్రధరులై - యుద్ధావనిన్ లేరు - కించి ద్ద్రోహంబును నీకు జేయరు - నిద్రాసక్తుల సంహరింప నకటా నీచేతులెట్లాడెనో**' అని ఒక ఆడకూతురి ఆవేదన జాలిని చూపే శైలి ఇది. **అవ్యుడు కాడు వీడు శిశుహంత దురాత్మకు డాతతాయి హంతవ్యుడు.** ఒక ధీరోద్ధతుడైన వీరుడి కచ్చెను చూపే శైలి ఇది. **రాడా చూడ సమస్త భూతములలో రాజిల్లువా డిచ్చటన్ లేడా**' ఒక ఆడుదానికి ఆపద్బాంధవుడైన ఈశ్వరుడి విషయంలో విశ్వాసమూ బరవసా ఇది. '**శ్రీకృష్ణాయదు భూషణా నరసఖా శృంగార రత్నాకరా - లోకద్రోహి నరేంద్ర వంశ దహనా నీకున్ మ్రొక్కెదఁ ద్రుంపవే భవలతల్ నిత్యాను కంపానిధీ**' ఒక భక్తురాలి శరణాగతిని చూపే ధోరణి ఇది.

మన సారధి మన సచివుడు

మన వియ్యము మనసఖుండు మన బాంధవుడున్

మన విభుఁడు గురుఁడు దేవర

మనలను దిగనాడి చనియె మనుజాధీశా

ఇభజి ద్వీర్య మఖాభిషిక్త మగు నీ యిల్లాలి ధమ్మిల్లమున్

సభలో శాత్రవు లీడ్చినన్ ముడువకా చంద్రాస్య దుఃఖింపగా

నభయం బిచ్చి ప్రతిజ్ఞ చేసి భవదీయారాతి కాంతా శిరో

జభర శ్రీల హరింపఁడే విధవలై సౌభాగ్యము ల్వీడఁగన్

కాంతారంబున నొంటిఁ దోడుకొని రాగాఁ జూచి గోవిందు శుద్ధాంత స్త్రీలఁబదారు వేల - నాచెంతన్ బోయలు మూఁగి పట్టుకొన నాసీమంతినీ సంఘమున్ భ్రాంతిన్ భామిని భంగి నుంటి విడిపింపన్ లేక ధాత్రీశ్వరా - ఒక మానవుడు తనకు పరమాప్తుడైన వ్యక్తిని పోగొట్టుకొని పరితపించే భావాలను బయటపెట్టే రీతి ఇది.

త్రిజగన్మోహన నీలకాంతి తనువు ద్దీపింప - హయరింఖా ముఖ ధూళి ధూసర - తనకున్ భృత్యుడు వీని గాచుట మహాధర్మంబు కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి' - ఒక మహాభక్తుడి భగవన్మహిమాను వర్ణనమిది.

'హరి చూచిన సిరిచూడదు -

సిరి చూచిన హరియు జూడ సిగ్గునఁబొరయున్

హరియును సిరియును దమలో

సరిచూపులఁజూడ మరుఁడు సందడి సేసెన్ -

వధూవరుల శృంగార లజ్జాభిలాషాది భావాలనెంతో ముద్దుగా వర్ణించే పద్యమిది.

**కరిఁ దిగుచు మకరిసరసికిఁ**

**గరిదరికిని మకరి దిగుచుఁగరకరి బెరయన్**

**కరికి మకరి మకరికిఁగరి**

**భరమనుచును నతల కుతల భటులరదువడన్**

కరి మకరా లొకదాని నొకటి ఇటూ అటూ లాగుతూ పోరాడే దృశ్యాన్ని చూడండెంత అద్భుతంగా సహజంగా కండ్లకు కట్టిస్తున్నదో పద్యం. ర అనే అక్షర మెన్ని మార్లు ఆ వృత్తి అవుతున్నదో ఆ పెనుగులాట చూపటానికి.

**ఓ కమలాప్త యో వరద యో ప్రతి పక్ష విపక్ష దూర కుయ్యోకవి యోగి వంద్య సుగుణోత్తమ యో శరణాగతమరా నోకహ యోమునీశ్వర మనోహర యోవిమల ప్రభావ రా వే కరుణింపవే తలఁపవే శరణార్థిని నన్నుఁగావవే** - ఇక్కడ ఓ ఓ అనే మాట ఎంత తరుచు వినిపిస్తున్నదో చూడండి. తొండం పైకెత్తి ఓ ఓ అని గజేంద్రుడు మొఱ పెడుతున్నట్టే ఉన్నది. మరలా రావే కరుణింపవే అనటంలో ఏవే అనే మాట దగ్గరకు పిలుస్తున్నట్టే చూపుతున్నది పద్యం. మరి **లావొక్కింతయు లేదు'** అనే పద్యమో. ఎక్కడికక్కడ శిధిల బంధంతో నడుస్తూ గజేంద్రుడి శరీర బల శైధిల్యాన్ని మనసుకు తెస్తున్నది.

పోతే ఆ మొఱ విన్నాడో లేదో ఇక భక్త పాలన కోసం భగవంతుడు పడ్డ సంరంభమింతా అంతా గాదు. అది చూపే పద్యాలూ అలా

హడావుడిగానే నడుస్తాయి. **'సిరికిం జెప్పడు శంఖచక్ర యుగముం జేదోయి సంధింపడు. తన వెంటన్ సిరి లచ్చి వెంటనే నవరోధ వ్రాతమున్'** ఎవరికీ నిలుపూ నిదానం లేదు - పరుగే పరుగు. అది చూపే పద్యాలూ పరుగే. మరి ఆ సందర్భంలో లక్ష్మీదేవి పడ్డ మల్ల గుల్లా లెలాంటివో ఈ పద్యాన్ని అడిగితే చెబుతుంది.

**'అడిగెదనని కడువడిఁజను**
**నడిగిన దనుమగుడ నుడువఁడని నడయుడుగున్**
**వడివడి ఁజిడి ముడి తడఁబడ**
**నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడునెడలన్.**

ఏమి పద్యమిది. ఎంత హృద్యం. ఆవిడ ఆయన్ను అడుగుదామని ముందుకూ వెనక్కూ ఊగిసలాడు తున్నట్టే ఆడుతున్నది పద్య రచనకూడా. అందులో విరుపులు. ఆ విరుపులను చూపే డకార బాహుళ్యం. డిడు అని వినిపిస్తుంటే మాటి మాటికీ ఆవిడ గుండె దడ కూడా వినిపిస్తుంటుంది మనకు.

ఇక వామన చరిత్రలో **ఇది నాకు నెలవని యే రీతి పలుకుదు'** అనే స్వామివారి మాటల్లో ఎంత మామూలు ప్రసంగం. ఆ ప్రసంగంలో ఎంత వ్యంగ్యం. అదీ ఇదీ ఎంత సహజంగా అల్లుకుపోయి ఎంత సహజ సుందరంగా భాసిస్తున్నదీ మీకు మీరే సాక్షి. అదే పనిగా ద్వ్యర్థి కావ్యాలు వ్రాసిన మహాకవులు కూడా నేర్చుకోవాలి ఈ సహజమైన శ్లేష. అంతకన్నా గొప్ప రచన వామనుడు త్రివిక్రముడై భూనభోంతరాలు వ్యాపించే ఘట్టాన్ని వర్ణించే పద్య రచన. **'ఇంతింతై వటుడింతయై మఱియు దానింతై నభో**

Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in Brahmasri

**వీధిపై నంతై'** అని తడిపొడి తేలిక తెలుగు మాటల్లో వర్ణిస్తున్నా మహాకవి - ఎంత పొడుగాటి విగ్రహాన్ని చూపుతున్నాడో చూడండి. ఇక సంస్కృత పదాల్లోనే చూపమంటారా అని అడుగుతాడు మనలను **'రవిబింబంబుప మింపఁ బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై - శ్రవణాలంకృతియై గళా భరణమై సౌవర్ణ కేయూరమై'** అనే పద్యం చదవటానికే భయం. ఆ భయానక రమణీయమైన విగ్రహాన్ని చూచి జీర్ణం చేసుకోగలమా అని. శబ్దార్థాలంకారాలు రెండూ ముడిపడ్డ పద్యమిది.

శబ్దాలంకార మంటే గుర్తొచ్చింది. పోతన పద్య శైలిలో ఎంత వైవిధ్యమో అంత వైచిత్రి ఆయన శబ్దాలంకార ప్రయోగంలో కూడా కనిపిస్తుంది. **'అలంకృతీనాం శక్తావ ప్యానురూప్యేణ యోజన'** మంటారు ఆలంకారికులు. నాకు సామర్థ్యముంది గదా అని అలంకారాలు కుప్పించ వద్దంటారు. అయినా అపృథ గ్యత్న సాధ్యమైతే ఫరవాలేదని కూడా వారి మాటే. అయినా పదే పదే చెవిన పడుతుంటే బోరు కొడుతుంది. కాని చిత్రమేమంటే ఎంత శబ్ద చిత్రాన్ని ఎంత తరుచుగా ప్రదర్శించి కూడా విసుగు పుట్టించదు పోతన మహాకవి. ఇది ఆ ఒక్క మహానుభావుడికే చెల్లింది. **'సురలోక సముద్ధరణము - నిరత శ్రీకరణ మఖిల నిగమాంతాలంకరణము - భవ సంహరణము - హరి చరణము నీటఁ గడిగె నను రోత్తముడున్'** - ఇలాంటివి కుప్ప తెప్పలు భాగవతం నిండా. అసలు రామ చరిత్ర అయితే అంతా శబ్దాలంకార మయమే. అంతా రామమయ మనేది జ్ఞప్తికి వచ్చి అలా రచించాడా అనిపిస్తుంది ఆ కవి భాగవతుడు. అసలు కావ్యారంభంలో ప్రార్థనా పద్యాలే చూడండి. **'వాలిన**

**భక్తి మ్రొక్కెద నవారిత తాండవ కేళికిన్ దయా శాలికి శూలికిన్ శిఖరిజా ముఖ పద్మ మయూఖ మాలికిన్' శారద నీరదేందు – అమ్మలఁగన్న యమ్మ** – ఒకటా. పరశ్శతం పరస్సహస్ర మిలాంటి పద్యాలు భాగవతంలో.

ఇక పోతే భాగవతంలో అన్నీ ఒక ఎత్తయితే దశమ స్కంధ మొక్కటీ ఒక ఎత్తు. అసలు భాగవతమంటే దశమ స్కంధమన్నా తప్పు లేదు. కృష్ణ కథామృతంబని ఆయనే గదా సూచించారు స్వయంగానే. ఏమి పద్యాలవి. ఏమి వర్ణనలు. **'బాలుండెక్కడ బండి యెక్కడ నభో భాగంబుపై బెంపఱన్ – కాలందన్నుట ఎక్కడ'** అంటుంటే గోపకులతో పాటు మనమూ విస్తుపోయి చూడాలా దృశ్యం. **'బాలుండీతడు కొండ దొడ్డది మహాభారంబు సైరింపఁగాఁజాలండో' యని దీని క్రింద నిలువన్ శంకింపగా బోకుడంటుంటే** మనమూ నిశ్శంకంగా పోయి దానిక్రింద నిలుచోవచ్చు. మరి **అమ్మా మన్నుదినంగ నే శిశువునో యాకొంటినో వెఱ్ఱినో'** అని ఆ మహా డింభకుడంటుంటే నిజంగా అతడు గాదు మనమే వెఱ్ఱివాళ్ళ మనిపిస్తుంది – **'కలయో వైష్ణవ మాయయో'** అని యశోదకుఁ గాదాశ్చర్యం. కని ఆవిడకైతే విని మనకెంత ఆశ్చర్యమో చెప్పలేను. అసలా బృందావనమూ తోటలూ దొడ్లూ– ఆ సైకత స్థలాలూ ఆ వెన్నెల జల్లులూ – అందులో ఆ ఋతువుల రాకపోకలూ – అందులో గోపికలతో బాలకృష్ణుని విహారాలూ – రాస క్రీడలూ జలక్రీడలూ – ఎప్పటి కప్పుడాయన కనుమరుగై పోవటమూ – వారాయనను వెతుకుతూ పోవటమూ – అంతా ఒక దివ్యమైన స్వప్న ప్రపంచం. జాగ్రదవస్థలో గాదు. మన ఈ భౌతిక ప్రపంచంలో గాదు. నిజంగా వారితో పాటు మనమూ ఆ స్వప్న జగత్తులో ఏ నంద నోద్యానంలోనో తిరుగుతున్న గొప్ప అనుభూతిని ప్రసాదిస్తుంది.

'శ్రవణో దంచిత కర్ణికారకముతో స్వర్ణా భ చేలంబుతో నవతంసాయిత కేకి పింఛకముతో నంభోజదామంబుతో స్వవశుండై మధురాధరామృతముచే వంశంబు పూరించుచున్ ఉవిదా మాధవుఁడాల వెంట వన మందొప్పారెడిం జూచితే అని గోపిక గోపికతోఁగాదు. గోపికలందరూ కలిసి కూడా కాదు. ఆ మిషతో మహాకవి మన అందరి దృష్టినీ ఆ స్వప్న జగత్తు వైపు మళ్ళించి చూడమని చేసే ప్రబోధమిది. 'నల్లనివాడు పద్మనయనం బులవాడు - మీ పొదల మాటున లేడుగ దమ్మ - లవంగలుంగనా రంగము లారమీ కడకు రాడు గదా - మాని నీ మన్మధు మన్మధు ఁగానరే సలిలితో దాత్త వత్సకము లార - అదెనంద నందను దంతర్హితుండయ్యె పాటలీతరులార పట్టరమ్మ' ఇలాటివి చదువుతూంటే చేతనా చేతన భేదం నశించి అంతా కృష్ణమయమై కనిపిస్తుంది ప్రకృతి. ఎవరికి గోపికలకా, మనకూ.

'కొమ్మకుఁబువ్వులు కోసి నాడిక్కడ - మొనసి పాదాగ్రంబు మోపినాడు ఇంతికి కెమ్మోవి యిచ్చినా డిక్కడ - వెలఁది నిక్కిన గతి విశదమయ్యె ఒకతె వెంటఁదగుల నుండక యేగినాడడడుగు మీద తరుణి యడుగు లమరె. ఈ పొదరింటనే యిందాకఁ గృష్ణుండు నాతోడ మన్మథ నటన మాడె' ప్రేమలో ఉన్మాద మంటారు దీన్ని. ప్రకృతి అంతా తమ ప్రియుడుగానే దర్శించటం రహస్య వాదమైతే Mysticism అందులో పరమాత్మను వెతుకుతూ పోవట మాత్మారామ స్థితి Monism. పోతే గోపికా గీతలు భ్రమర గీతలు రాసక్రీడలు అన్నీ అన్నే. స్వసంవేద్యమే స్వయమాస్వాద్యమే. అనుభవైక వేద్యమే. అసలెక్కడ ఏ పద్యం వ్రాసినా

గద్యం వ్రాసినా మాట మాటాడినా అదంతా ఎవడో కూచొని ప్రయత్న పూర్వకంగా వ్రాసినట్టుండదు. సహజంగా సరళంగా మనోహరంగా దొర్లుతూ పోతుంది. **శారద నీరదేందు** అని సమాస బంధురంగా వ్రాసినా అదే. **'తల్లీ నిన్నుఁదలంచి'** అని పొడి మాటలలో వ్రాసినా అదే సహజత్వం. అందుకే సహజ పాండిత్య అనే మాట ఆయన కే సార్ధకమయింది. ఇంతెందుకు. **పాంచాలీ కబరీ వికర్షణ** – జుట్టు పట్టుకొని లాగుతూనే ఉన్నట్టున్నది పద్యం. **కల్పించెన్ చేయించెన్** అంటుంటే నీదేముంది అంతా నాదే గదా కర్తృత్వమని చెప్పినట్టే ఉంది. మరి **కారే రాజులో.** ఎంత విసురు. **అంధేందూ దయంలో** ఎంత నిర్లక్ష్యం. **కంజాక్షునకు గాని** – ఎంత తీసివేయటం. **కమలాక్షు నర్చించు** ఎంత ఖరాఖండితం – ఏ పద్యం చదవండి. ఆలోచించండి. ఎన్నెన్ని భావాలు మనసులో మెదులుతాయో – అవి ఎంత సహజంగా పురికొల్పుతాయో. మరెక్కడా కనబోము – వినబోము. జీవకళ ఉట్టిపడే శైలి పోతన శైలి. అనితర సాధ్యమది. **'సత్రాజిత్తనయా కరాంత ర ధనుర్జ్యా రావ మైరావతీ'** అని నాచన సోముడెంతో గొప్పగా వర్ణిస్తే వర్ణించవచ్చు. కాని అదే భావం **'జ్యావల్లీ ధ్వని గర్జితంబుగ సుర ల్సారంగ యూధంబుగా – ఆవిల్లింద్ర శరాసనంబుగ సరోజా క్షుండు మేఘంబుగా'** అని పోతన వర్ణిస్తుంటే ఆ షాపులో ఏమి బేరమాడుతారీ షాపుకు రండి మీకు కావలసిన మేలు సరకులెన్నో ఉన్నాయి చూపుతామని – పిలిచినట్టుంటుంది మనలను. పలికించెడు వాడు రామభద్రుండట గదా. మరి ఆమాత్రం సరకు సరఫరా చేయలేడా.

నిజంగా పోతన్న గారు తెలుగుల పుణ్యపేటే. ఎంతో పుణ్యం చేసుకొన్నాము తెలుగువాళ్ళం మనమంతా. అలాంటి దైవాంశ సంభూతుడు రచించిన భాగవత మహాపురాణం మన చేతికి వచ్చింది. మనం చూడ గలుగుతున్నాం. ఎంత మహాభాగ్యమో అది. ఇంతటి మహాయోగం మనకు పట్టిందంటే అది సంపూర్ణంగా అనుభవించగలమా అబ్బా - తెలిసి పలుకుట కష్టంబని అన్నాడంటే ఆయనకు గాదు కష్టమది. మనకు. ఒక శ్రీమంతుడూ వదాన్యుడూ అయిన వాడింటికి భోజనానికి పిలిచారు వెళ్లామే అనుకొండి. రుచిగా శుచిగా వండి వడ్డించారెన్నో పదార్థాలు. అవి పప్పులూ కూరలూ పచ్చళ్లే గావు. చిత్ర విచిత్రమైన మధుర ఫలరస పాయ సాదులేగావు. అపూపాలే గావు - ఎన్నో ఇష్టమైన పదార్థాలన్నీ వడ్డించారు. ఏదీ పారేయటానికి లేదు. తినటానికి లేదు. ఎన్నని తింటాం. ఎంతని తింటాం. కడుపుకు పట్టినంత వరకూ తింటాము. తృప్తి పడతాము. అయినా మిగతావన్నీ వదలి పెట్టి పోవలసి వస్తున్నదే అని అసంతృప్తి కూడా చెందక తప్పదు. అలాంటి దోలాందోళన ఒక పోతన మహాకవి రచనలోనే రజజ్ఞులందరూ చెందవలసి వస్తుంది. ఇది అతిశయోక్తి గాదు. అతి సహజోక్తి. సహజ పాండిత్య సంపన్నుడైన మహాకవి మాట అంతా సహజమే గదా. అందులో అసహజమైన ప్రసంగమెలా దొర్లుతుంది. ఒక్కమాటలో చెబితే ఈ ప్రపంచ తత్త్వమెలా విదితమూ అవిదితమో అలాగే ఈ కవి కావ్య ప్రపంచం కూడా విదితా విదితమే మనకు.